# కథా కౌముది

## 2018 - Part 2





శ్రీ కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



కౌముది ప్రచురణలు - 203

కౌముది మాసపత్రికలో

2018 జూలై నుంచి డిసెంబర్ 2018

వరకూ

వచ్చిన కథలు

| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | భూమి పొమ్మంటోంది | తాటిపాముల మృత్యుంజయుడు | 4 |
| 2 | అవయవాలు మొలిచిన మనిషి | ఎమ్వీ రామిరెడ్డి | 8 |
| 3 | అమ్మ | ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ | 15 |
| 4 | చిగురించిన జ్ఞాపకం | మణివడ్లమాని | 19 |
| 5 | మార్గదర్శి | మంథా భానుమతి | 24 |
| 6 | వెన్నెల బాసలు | శ్రీనిధి యెల్లాల | 29 |
| 7 | పుష్పక విమానం | రవి కొప్పరపు | 36 |
| 8 | పాత్ర నిండుగా నది | డా. గరిమెళ్ల నారాయణ | 40 |
| 9 | నిన్నా– నేడూ | డా.సుభద్ర వేదుల | 45 |
| 10 | గంగిగోవు | ఆర్. శర్మ దంతుర్తి | 49 |
| 11 | అవగతం | పాలగుమ్మి రామకృష్ణారావు | 54 |
| 12 | ఏడడుగులు | స్వాతీ శ్రీపాద | 58 |
| 13 | బాధ్యత | మనస్విని | 61 |
| 14 | ఆఖరు ఫైలు | దేగల అనితాసూరి | 63 |
| 15 | యథా..తథా.. | పాలపర్తి జ్యోతిష్మతి | 66 |
| 16 | పెళ్ళి రాత్రికి అనగా.. | డా.చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి | 68 |
| 17 | ఒక్కరోజు | వసుంధర | 71 |
| 18 | ఇంగ్లీష్ టీచర్ | డా.పేరం ఇందిరాదేవి | 77 |
| 19 | బ్రహ్మ తేజస్సు | అన్నాపంతుల జగన్నాథ రావు | 84 |
| 20 | నెక్స్ట్ | యమున చింతపల్లి | 89 |
| 21 | మానస సాగర మథనం | డా. యండమూరి సత్య కమలేంద్రనాథ్ | 93 |
| 22 | కల | విద్యార్థి | 99 |
| 23 | పువ్వులు | పోడూరి వెంకటరమణ శర్మ | 105 |
| 24 | కథ కంచికి అమ్మాయి యింటికి | కొండగుంట వెంకటేష్ | 110 |
| 25 | ఊరంతా సందడి | ఉదయలక్ష్మి ముప్పలనేని | 115 |

# భూమి పొమ్మంటోంది    తాటిపాముల మృత్యుంజయుడు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ధం బిర్యానీ, పిజ్జా, బర్గర్ల రెస్టారెంట్లు వీధివీధినా తెరుస్తుంటే, ఫిజియోథెరపీ డాక్టర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు సందుసందునా వెలుస్తున్న రోజులివి. ఇరవై ఏళ్లకే నడుం నొప్పులు, ముప్పైఏళ్లకే షుగరు వ్యాధులు ఒంట్లో ప్రవేశిస్తున్నాయి. అలాంటి వ్యాధుల బారిన పడతానేమో అన్న భయంతో మొదట ఇష్టం లేకున్నా శని, ఆదివారాలు హైద్రాబాదులోని నెక్లెస్ రోడ్డు పక్కనున్న ఫుట్ పాత్ పై పరిగెత్తడం మొదలెట్టాను. నెక్లెస్ రోడ్డుకు ఒక చివర లుంబిని పార్కు ఉంటే మరోచివర ఎంటీ ఆర్ గార్డెన్ ఉన్నాయి. నడిచేదారిపై అక్కడక్కడా సిమెంట్ బెంచీలు వేసిఉన్నాయి.

మనిషి ఒక పని చెయ్యాలంటే కనీసం ఒక ప్రేరణ ఉండాలి. వ్యాధుల భయం నన్ను షూ లేసులు కట్టుకొని ఇంట్లోనుండి బయటకు తరిమితే, పరుగుతో అలసిపోయి సేద తీర్చుకొంటున్నప్పుడు నాకు కంపేనీ ఇచ్చే ఆ మనిషి మరో ప్రేరణ. దాదాపు గంటసేపుగా  సాగే వ్యాయమంలో నేను ఒక నిర్ణీత స్థలంలో సేద తీర్చుకోటానికి కొంతసేపు ఆగుతాను. సిమెంట్ బెంచీకి ఒక పక్క నేను కూర్చుంటే అతను ఇంకో పక్క కూర్చొని ఉంటాడు. అతనితో కనీసం పది నిమిషాలు మాట్లాడుతాను. మాట్లాడిన ప్రతిసారీ అతని మాటల్లో ఒక కొత్త కోణం ఆవిష్కరింపబడుతుంది.

అతని పేరు ఓబులేసు. ఓబులేసు ఆకాశహర్మ్యాల మధ్యలో పూరిగుడిసెలా ఉంటాడు. మిలమిల మెరిసిపోతున్న నియాన్ లైట్ల మధ్యలో దీపపు ప్రమిదలా అగుపడుతాడు. ఖరీదైన పేయింటింగ్సు మధ్యలో తెల్లకాగితంపై గీసిన పెన్సిల్ బొమ్మలా ఉంటాడు. వెరసి నవీనకాలపు ఆభివృద్ధితో పెళపెళలాడుతున్న నెక్లెస్ రోడ్డు, అక్కడి పరిసరాలకు అతను సరిపోడని ఇట్టే చెప్పవచ్చు. ఓబులేసు పంచెను మోకాళ్ల పైకి కట్టుకొని గోచీ బిగిస్తాడు. మట్టి కొట్టుకుపోయిన తెల్లలాల్చి చేతులను పైకి మడుస్తాడు. కండువాను చెవులపైగా చుట్టుకొని తలపాగా ధరిస్తాడు. నెరసిన గడ్డంతోను, మాసిపోయిన చర్మంతో దర్శనమిస్తాడు. ఎప్పుడూ అతడు ఎదో ఆలోచిస్తున్నవాడిలా గాలిలోకి చూస్తుంటాడు.అప్పుడప్పుడు దృష్టినిమరలుస్తూ పరిసరాలని గమనిస్తాడు. దూరంగా ఉన్న దేనినో పరిశీలిస్తున్నట్టుగా చూపు నిలుపుతాడు. వచ్చిపోయే మనుషులపై కొన్ని క్షణాలు దృష్టి సారిస్తాడు గూడా.

నా బాల్యం పదేళ్ల వరకు ఊళ్లోనే గడిచింది. అటు తర్వాత, పిల్లల చదువులకోసం అమ్మానాన్నలు పట్నానికి వచ్చారు. ఊరివాళ్లతో పరిచయం అంత కొత్తకాదు, మరీ పాత కాదు. వింతగా అగుపించే ఓబులేసుతో మాట్లాడడం మొదలెట్టాను.  మొదట కొన్ని రోజులు నేను అతనిని పట్టించుకోలేదు. కాని, నేను వెళ్లిన ప్రతిసారి ఠంచనుగా అతను అక్కడే కూర్చుని దర్శ్నమిస్తాడు. కుతూహలం పట్టలేక ఒక రోజు మాట్లాడం మొదలెట్టాను.

పరిచయాల తర్వాత 'హైద్రాబాదులో ఏం చేస్తుంటావు?' అడిగాను

అతను నా దిక్కు ఓ జీవంలేని చూపు విసిరాడు. 'ఏం చెయ్యట్లే' నిర్లక్ష్యంగా అన్నాడు.

'ఊళ్లో భూములున్నాయా? వ్యవసాయం చేస్తున్నవా?'

'పిచ్చోడివా?' అన్నట్టుగా నా దిక్కు చూసాడు. ఓ క్షణం నేను అగౌరవంగా ఫీలయ్యాను.

'భూమి ఉంది గాని సాగు చెయ్యట్లే. అయినా ఇప్పుడు ఊళ్లో ఏవుందని? బీడు తప్ప'. ఆ మాట అంటున్నప్పుడు అతనిలో నిర్లిప్తత చోటుచేసుకొన్నది.

నేను పల్లె మొహం చూడక ఎన్నేళ్లయిందో. ఇంగ్లీషు మీడియం చదువులు. పోటీ పరీక్షల పరుగులు, ఐటీ జాబుతో వచ్చే కారు, అపార్టుమెంటు హంగులు, పిల్లల్ని ఇంటర్నేషనల్ స్కూల్లో చేర్పించడంలాంటి షోకులతో పూర్తిగా మునిగితేలుతున్నాను.

'మీరంతా వెక్కిరిస్తున్నట్టుగా ఎర్రబస్సు ఎక్కి వచ్చినోళ్లం. ప్రతిరోజు పొద్దున పొట్టచేత పట్టుకొని ఎక్కడ కూలిపని దొరుకుతుందా అని అడ్డామీదకు చేరుకుంటాం. హైటెక్ సిటీలో మీ అభివృద్ధికి పనికొచ్చే బిల్డింగులు కట్టుతాం. పంటచేను కాపలా కాయాల్సిన మా బతుకులు మీ అపార్టుమెంట్ల ముందు కాపాలా కుక్కలు అయ్యాయి ' అంటున్న అతని మాటలు ఒళ్లంతా సూదుల్లా పొడిచాయి.

వెంటనే నాకు మా అపార్టుమెంటులో ఉండే వాచ్ మెన్ గుర్తుకొచ్చాడు. సన్నకారు రైతు. నీటికొరకు పొలంలో మూడుసార్లు బావి వేయించి విఫలం చెందాడు. వేరే ఆశ, సహాయం లేక భార్య పిల్లల్తో పట్నం చేరుకొన్నాడు. భార్య కొన్ని అపార్టుమెట్లలో పాచిపని చేస్తుంది. బేసుమెంట్లో ఒ చిన్న గదిలో ఇద్దరు చిన్నపిల్లలతో కాపురం. అలాగే, మనమంతా చాతి విరుస్తూ గొప్పగా చెప్పుకొంటున్న హైద్రాబాద్ విమానాశ్రయం ఊళ్ల తరలి వచ్చిన వెలాది కుటుంబాల వల్లే సాధ్యమయింది.

ఇంకో రోజు మా మాటల్లో సినిమాలు గురించి దొర్లాయి.

'సినిమాలు చూస్తావా?'

'ఆ, అప్పుడప్పుడు మా వూరి మండలం సినిమా హాల్లో'

'ఈ మధ్య ఏం సినిమా చూసావు?'

'ఏ సినిమా చూస్తే ఏముంది? మా జీవితాలకి ఏం సంబంధం లేదుగా. మాకు ఆ సినిమాలన్ని వింతగా అనిపిస్తాయి. సినిమాలో అన్నీ ఇంగ్లీషు మాటలే. చివరకు సినిమా పేర్లు కూడా తెలుగులో వేస్తే ఒట్టు. కాఫీలు తాగడాలు, కార్లలో తిరగడం, కురచ బట్టలు వేసుకోవడం, క్లబ్బుల్లో తాగడం, విదేశాల్లో పాటలు పాడుకోవడం. ఇవేగా మీరు తీసే సినిమాలు. వీటిల్లో ఏ విషయాన్ని మా జీవితాలకి అన్వయించుకోవాలి? పచ్చని పొలాలు, పిల్లకాలువలు, మా కట్టుభొట్టు, ఆచారవ్యవహారాలు మీకెప్పుడు ఆనాయని సినిమాల్లో పెట్టుకోడానికి. ఎదో నవ్వులాటకి, పేరు గొప్పకి తప్పిస్తే.'

అలా మాట్లాడుతున్నప్పుడు నా చూపులు పక్కనే ఉన్న పీవీ ఆర్ థియేటర్ల దిక్కు అప్రయత్నంగా మళ్లాయి.

'మీదేమో మల్టిప్లెక్స్ సంస్కృతి. మేమేమో సి సెంటర్ల ప్రేక్షకులం. మా పిల్లలు అభిమాన సంఘాలు పెట్టాలి. మొదటిరోజు మొదటి ఆట టికెట్టు కొరకు ప్రాణాలు ఇవ్వాలి. మీరు తీసే సినిమాలకు మాకు ఏమాత్రం సంబంధం లేకున్నా మేం మాత్రం సిలిమా విజయవంతం చేయాటనికి కృషి చేయాలి '. అలా అంటున్నప్పుడు అలసట అతని ముఖంలో కనిపించ లేదు కాని, చూడగలిగే కనులకు అతని చూపుల్లో తప్పక కనిపిస్తుంది.

ఓబులేసు ఎంతవరకు చదువుకున్నాడో తెలియదు కాని ఏ విషయం పైన అయినా అతను వెలిబుచ్చే అభిప్రాయాలు ముక్కుసూటిగా, నిష్కర్షగా ఉంటాయి. ఇంటికెళ్లినా సాయంత్రం అప్పుడప్పుడూ గంభీరమైన అతని ముఖం నాకు గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఆఫీసులో కూర్చుని పని చేస్తున్నా లోతైన అతని కళ్లు నన్ను అనుసరిస్తున్నట్టుగా అనిపుస్తుంది.

మరోరోజు అతనితో మాట్లాడుతున్నపుడు ప్రజా సంఘాల నాయకులు, ఇతర సాంస్కృతిక, సేవా సంస్థలు రైతుల సమస్యలపై అవగాహన కల్పించడం, పల్లె జీవితాల ఎగుడుదిగుడులను ప్రజాదృష్టీకి తేవడం మా మాటల్లో దొర్లాయి.

'మా పల్లెలు, మా జీవితాలు, మా సమస్యలు మీకు కథలు, కవితలు రాసుకోడానికి పనికొస్తున్నాయి. పాటలు కట్టి స్టేజీలెక్కి పాడుకోటానికి బాగుంటాయి. పండుగ సంబురాలు చేసుకోటానికి, సభలు, సత్కారాల్లో శాలువలు కప్పుకోటానికి, బిరుదులు ప్రదానం చేసుకోటానికి పనికి వస్తాయి. అంతేగాని మాకుగాని, మా పల్లెలకు గాని ఒరిగిందేమి లేదు ' అని పుల్ల విరిచినట్లు మాట్లాడాడు.

ఐదేళ్ల మా అబ్బాయి చదువుతున్న కాన్వెంట్ స్కూలు పిల్లలను రాబోయో 'ఛాలెంజింగ్ వరల్డు ' కు తయారు చేస్తున్నామని డబ్బా కొట్టుకుంటూ, ఎక్కడ లేని ఫీజులు వసులు చేస్తున్నప్పుడు, మన దేశానికి జీవనాధారమైన రైతును పట్టించుకునే నాథుడే లేడంటే నమ్మశక్యం కావడం లేదు.

'ఇవన్నీ మాట్లాడుకోవడం అనవసరం. ఏం జరగబోతుందో తెలుస్తునే ఉందిగా. కొంతకాలానికి మాబోటి రైతులు పల్లేల్లో ఒక్కడు మిగలడు. మా తరంతోనే రైతు జాతి అంతరిస్తుంది. ఈ కట్టు, బొట్టు, వేషధారణ, పద్ధతులు ఇవేమి ఉండవు. పుఇస్తకాల్లో రాసుకున్న చరిత్రగానే మిగిలిపోతుంది.' అంటూన్న అతని ముఖంలోనికి చూడటానికి భయం వేసింది. అయినా ధైర్యం తెచ్చుకొని చూసాను. మరి, ఆ లోతైన కళ్ల వెనకాల జరుగుతున్న అల్లకల్లోలం మాత్రం వినిపించలేదు, కనిపించలేదు. అదే, ఓబులేసుతో వచ్చిన ఇబ్బంది. చాలా అర్ధవంతంగా మాట్లాడుతాడు గాని, ముఖంలో భావాలేమి చూపడు.

శక్తిని కూడగట్టుకొని నెమ్మదిగా లేచాను. అతని వంక చూడకుండా నెమ్మదిగా అక్కడినుంచి నడిచాను. కారులో ఇంటికి చేరాను. మా అబ్బాయి నాకోసమే చూస్తున్నట్టున్నాడు. నన్ను చూడగానే సంతోషంతో 'డాడీ, నిన్న మేము స్కూలునుండి శిల్పారామం టూర్ కు వెళ్లాం కదా. మా టీచర్ ఆ ఫోటోలను అమ్మకు పంపించింది చూడు ' అను చూపెడుతూ తనకు తెలిసింది చెప్పడం మొదలెట్టాడు. వాటిల్లో గ్రామీణ జీవనానికి సంబంధించిన ఫోటోలు కొన్ని ఉన్నాయి.

అందంగా కట్టిన గుడిసెల్లో కమ్మరి వాళ్ళు ఇనుముముట్లు పనిచేస్తున్నట్టు, కుమ్మర్లు మట్టితో కుండలు చేస్తున్నట్లు, ఇంటిముందు పశువులు, ఆ ఇళ్లలో ఉండే మనుషుల బొమ్మలు అందంగా తయారు చేసి నిలెబెట్టారు. వాటి గురించి మా అబ్బాయి ఎంతో సంతోషంగా చెప్పుకుపోతున్నాడు. ఆ వృత్తుల్లని ఇప్పుడు వూళ్లలో దాదాపుగా అంతరించిపోయినవే.

వెంటనే, చివరగా ఓబులేసు మాటలు గుర్తుకు వచ్చాయి. అంటే కొన్నేళ్లకి ఓబులేసు బొమ్మ, అతని ఇల్లు, మిగతా సామాన్లు ఇక్కడ చోతుచేసుకుంటాయన్న మాట. అది తల్చుకోగానే వెన్ను జలదరించింది. ఏమీ మాట్లాడకుండా లేచి బెడ్ రూంలోకి వెళ్లుతున్న నా వెనకాల 'డాడీ, డాడీ' అంటూ వచ్చాడు. ఆ పిలుపు పట్టించుకోకుండా నేను తలుపు వేసుకున్నాను.

★★★

మా ఆఫీసులోని మూడో అంతస్తులో ధారళంగా మీటింగు కొనసాగుతోంది. గాజుగోడలతో నిర్మించిన విశాలమైన గదిలో తళతళలాడుతున్న పెద్ద టేబుల్, దాని చుట్టు ముప్పై వరకు మెత్తని కుర్చీలు వేసి ఉన్నాయి. అమెరికానుండి వీడియో కాంఫరెన్సులో బిజినెస్ టీం మెంబర్సు రాభోయే ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్నారు. మేమంతా వేడి కాఫీలి తాగుతూ, బిస్కట్లు తింటూ శ్రద్ధగా వింటున్నాము.

"మన కంపెనీకు ఈ ప్రాజెక్ట్ చాలా ప్రతిష్ఠాత్మకమైనది. కాబట్టి సరైన ప్రణాలికతో పనిచేస్తూ, బడ్జెట్ దాటకుండా, డేట్స్ మిస్సవకుండా దీక్షతో పనిచేసి ఆర్నెల్లలో మన ప్రాడక్టును మొదట ఇండియాలో లాంచ్ చేయాలి. అక్కడి తొలిదశలోని జయాపజయాలను బేరీజు వేసుకొని మన ప్రాడక్ట్ ని మిగతా ఆసియా దేశాల్లో విడుదల చేయవచ్చు. మొదటగా ఇండియాను ఎందుకు ఎన్నుకున్నామంటే ఇండియాలో మధ్యతరగతి కుటుంబాల సంఖ్య

మరియు వారి వార్షిక ఆదాయం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఇందుకు కారణం టెక్నాలజీ డెవలప్మెంటే. ఇంటర్నెట్ ఒళ్లో, అరచేతిలో ఉండేసరికి ముఖ్యంగా యువత ఖర్చుపెట్టే విధానంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. కాబట్టి, ఈ విషయంలో మన కాంపిటీటర్సు తేలుసుకొని తేరుకొనేలోగా మనం ఈ మార్కెట్ ను ముఖ్యంగా మొదట నాలుగు పెద్ద పట్టణాల్లో ఆక్రమించుకోవాలి..." చెబుతున్నాడు అటువైపు నుండి బిజినెస్ వైస్ ప్రెసిడెంట్.

'మళ్లీ భారతదేశాన్ని టార్గెట్ చేస్తూ, యువతని ఆకర్షిస్తూ మరో ప్రాజెక్ట్ మొదలవబోతున్నది. అవును, ఎవరి జేబులో డబ్బులుంటే, వారిపైనే అన్ని బిజినెస్ ప్రయోగాలు. డబ్బులేని పేదవాని గురించి, ఊళ్లో ఉండే రైతుల గురించి ఎవరు పట్టించుకొంటారు...'. నా ఆలోచనలు పరిపరివిధాలుగా సాగుతున్నాయి. తల దిమ్మ తిరుగుతున్నది.

"ఎవరికైనా, ఏవైనా ప్రశ్నలున్నాయా?" అడుగ్తున్నది బిజినెస్ టీం.

"మరి ఓబులేసో?" నా నోట్లోంచి ప్రయత్నంగా ప్రశ్న వెలువడింది. తెలుగులో అడిగిన ప్రశ్న అమెరికా వాడికి అర్థం కాలేదు. నాతో పాటు కూర్చున్న కొందరు పెళ్ళున నవ్వారు. మరికొందరు విస్మయంగా చూసారు.

"ఫణీంద్ర, నువ్వేం మాట్లడుతున్నావో నీకు తెలుసా?" మా టీం లీడర్ అడిగాడు.

"అవును, తెలిసే అడుగుతున్నాను. మరి, నా ఓబులేసు మాటేంటీ?' మళ్లీ అదే ప్రశ్న సునాయాసంగా అడిగాను. నా మాట మీద నాకు వశం తప్పింది.

"జోక్స్ కు ఇది సమయం కాదు. ఇది చాలా సీరియస్ ప్రాజెక్ట్" అన్నాడు లీడ్.

"హూ కేర్స్ అబౌట్ దిస్ ప్రాజెక్ట్" చేతిలోని పేపర్స్ ను అప్రయత్నంగా గాల్లోకి విసిరాను.

"నీ ప్రవర్తన నీ ఉద్యోగానికే ముప్పు కావచ్చు" అంటూ నెమ్మదిగా హెచ్చరించాడు.

"ఎగైన్, ఐ డోంట్ కేర్ మై జాబ్. విదేశాల వాళ్లకు మన రైతుల గురించి ఎలాఘు అవగాహన లేదు. అలాగే మనం, మన ప్రభుత్వాలు పట్టించుకోకుండా ఉంటే ఓబులేసులాంటి రైతుల గతి ఏంటి? వాళ్లు ఈ భూమి

మీదనుండి అంతరించి పోవల్సిందేనా?"

అందరూ నన్ను పిచ్చివానిలా చూస్తుంటే విసురుగా మీటింగ్ హాల్లోంచి బయటకు నడిచాను.

ఉన్న పళంగా ఓబులేసును చూడాలనిపించింది. కారును నెక్లెస్ రోడ్డు వైపు నడిపించాను. ఓబులేసు కూర్చునే బెంచి ఖాళీగా ఉంది. చుట్టూ చూసాను. దూరంగా అతను ఎవరితో మాట్లాడుతూ కనిపించాడు. గబగబా అటు దిక్కు నడిచాను.

"అయ్యా, మీ ఇంట్లో ఏదైనా పని ఉందా? చేసి పెడతాను" ఎవరినో అడుగుతున్నాడు. ఆ వ్యక్తి దగ్గరనుండి జవాబు రాలేదు.

"సారూ, అన్నం తిని చాలా రోజులైంది. ఆకలేస్తొంది. కొద్దిగా ధర్మ చెయ్యండి" ఇంకెవరినో అభ్యర్థిస్తున్నాడు.

'ఓబులేసుకు ఈ స్థితి రావడమేంటి? వరి అన్నం పండించే చేతులు చివరికి బిచ్చమెత్తుకుంటున్నాయా? ఇతరుల ముందు చేయిసాచి అడుక్కోవటం చాలా హీనస్థితి. మరి అలాంటి స్థియికి చేరుకున్నాడా?'. నాకు కడుపులో తిప్పినట్టయింది. భళ్లున వాంతి చేసుకోబోయాను.

★★★

ఒక్కసారిగా నిద్రలోంచి మెలకువ వచ్చింది. చటుక్కున మంచంలోంచి లేచి కూరుచున్నాను. నుదిటిపైన, మెడపైన చెమటలు పోసాయి. అరచేతులు చల్లగా ఉన్నాయి. ఒంట్లో సన్నని వణుకు ప్రారంభమైంది. 'అంటే, ఇప్పటి దాకా ఆ మీటీంగ్లో గొడవ, ఓబులేసు బిచ్చమెత్తుకోవడం' అంతా కల్పన అన్న మాట. నిజం కానందుకు సంతోషమేసింది. హాయిగా ఊపిరి పీల్చుకొన్నాను. ఉన్న ఫళంగా ఓబులేసు దగ్గరకు వెళ్లాలనిపించింది.

ఐదు నిమిషాల్లో తయారై షూ లేసైనా సరిగ్గా కట్టుకోకుండా బయటకు వెడుతుంటే 'ఉదయపు నడకకు ఎప్పుడు లేని అంత తొందరేంటీ? కాఫీ తాగెళ్లొచ్చుగా?' ప్రియసఖి అడుగుతున్న ప్రశ్నకు జవాబివ్వకుండా నెక్లెస్ రోడ్డు చేరుకున్నాను.

ఆశ్చర్యం! ఓబులేసు కూర్చునే సిమెంట్ బెంచీ ఖాళీగా ఉంది. క్రమం తప్పకుండా రోజు అక్కడ కూర్చునే వాడు ఈ రోజు ఎందుకో రాలేదు. ఒళ్లంతా అశక్తత ఆవరిస్తుంటే నేను ఆ బెంచీపై చతికిలపడ్డాను.

'ఓబులేసు ఇంకొద్ది సేపట్లో వస్తాడులే' అన్న ఆశ ఒకవైపు, 'ఏమయ్యిందో ఏమో? అసలు రాడేమో?' అన్న భయం మరోవైపు, ఈ రెండు ఆలోచనల మధ్యలో నా మనసు గిలగిలలాడింది.

***

# అవయవాలు మొలిచిన మనిషి

ఎమ్వీ రామిరెడ్డి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

1

సాయంత్రం అయిదున్నర... కంప్యూటర్లతో కుస్తీపట్టి అలసిపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సుమారు రెండొందల మంది ఆ హాల్లో సమావేశమయ్యారు.

శాలిని ఆహ్వానించగానే, శేఖర్ కుడిచేత్తో మైక్ అందుకుని, తన గతంలోకి ప్రయాణం ప్రారంభించాడు.

2

పక్కటెముకల దగ్గరెక్కడో కార్చిచ్చు మొదలై, అది మెల్లగా తొడ గుండా ప్రయాణించి, కుడి మోకాలి వద్ద కేంద్రీకృతమైంది. మెడనరాల దగ్గర రగిలిన మరో జ్వాల జరజరా పాకి ఎడమ భుజంలో పాగా వేసింది.

నిర్జీవ దేహానిక్కూడా నొప్పి తెలిసొచ్చే మంట. శవానికి సైతం స్పృహ తెప్పించే సెగ.

అగ్నిశిఖలు అటూ ఇటూ తచ్చాడి, ఆఖరికి, కోమాలోకి వెళ్లిన మెదడు కణాలను సైతం నిద్ర లేపాయి.

శేఖర్‌కు మెలకువ వచ్చింది.

ఎవరో గొడ్డలితో నరికినట్లు... కుడికాలు మండుతోంది. కత్తితో ఖండించినట్లు... ఎడమచేయి పోటెత్తుతోంది.

అతికష్టం మీద కళ్లు తెరిచాడు. తానెక్కడున్నాడో అర్థం కాలేదు. కళ్లు మూసుకుని, ఆలోచనా శక్తిని కూడదీసుకున్నాడు. మెదడు మెల్లగా పని చేయడం మొదలుపెట్టింది.

తననెవరో తోస్తున్నారు. నిప్పుల్లోకి. సుడిగుండంలోకి. పాతాళంలోకి. దబ్బున పడిన శబ్దం.

తోసినవాడి మొహం అస్పష్టంగా మస్తిష్కపు తెరపై కదలాడుతోంది.

కళ్లు విప్పి, చుట్టూ చూశాడు. తెల్లటిగూళ్లు. నిండా ముసుగులు కప్పుకొని పడుకున్న మనుషుల్లా.

నాసికా గ్రంథులకూ జీవం వచ్చింది. ఏదో దుర్గంధం. భరించలేని దుర్వాసన.

శక్తిని కూడదీసుకునేందుకు ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. మళ్లీ ప్రయత్నించాడు. ఈసారి గురుత్వాకర్షణను నడుం వద్ద కేంద్రీకరించి, అతికష్టం మీద కూర్చోగలిగాడు. ఎడమచేయి వేలాడుతోంది.

ఎడమకాలిని మంచం మీంచి కిందికి వేలాడేశాడు. కుడికాలు మొండికేసింది. కుడిచేతిని మోకాలి కింద దూర్చి, కట్టెపుల్లను జరిపినట్లుగా కుడికాలిని కూడా కిందికి వేలాడేశాడు.

లేచి నిలబడబోయి, కుప్పకూలాడు. విశ్వప్రయత్నంతో మళ్లీ నిలబడ్డాడు. ఒక కాలిని ఈడ్చుకుంటూ ఒక్కో అడుగూ ముందుకేశాడు. అటూ ఇటూ మంచాలు. వాటిమీద తెల్లటి మూటలు. వాటి మధ్య నుంచి కుంటుతూ కూలుతూ ఆ హాలు నుంచి బయటకు నడిచాడు.

మరో హాలు వెలిసింది. రెండువైపులా మంచాలు. వాటిమీద అక్కడక్కడా మనుషులు. వాడిపోయిన కాడల్లా, వడలిపోయిన కాయల్లా. అదో ఆసుపత్రి అని అర్థమైంది.

గోడ గడియారం వైపు చూశాడు. ఉదయం ఏడు దాటుతోంది. నడిచొచ్చిన దారివంక చూశాడు. నెత్తురోడిన అడుగుజాడలు భయం గొల్పుతున్నాయి.

ఖాళీగా ఉన్న మంచం మీద కూలబడ్డాడు. కడుపులో అలజడి. నొప్పిని మించిన శోష. కళ్లు తిరుగుతున్నాయి.

ఆకలి దహించివేస్తోంది. కడుపులో ఏదో ఒకటి పడితే తప్ప ప్రాణం నిలిచేలా లేదు.

కీచుమంటూ శబ్దం. ఆ వెనకే అవతలి ద్వారం నుంచి ఓ బండిని తోసుకుంటూ వార్డుబాయ్ హాల్లోకి వచ్చాడు. ఉపాహారంతో కూడిన పళ్లేలు ఒక్కొక్కరికీ అందిస్తూ ముందుకు నడుస్తున్నాడు. చివరి మంచం మీదున్న శేఖర్ తక్కున లేచి కూచున్నాడు. బాయ్ దగ్గరకు రాగానే ఏదో అడగబోయాడు. మాట పెగల్లేదు. గొంతు సవరించుకుని ఒక్కో మాటా కూడగట్టుకుంటూ ''అన్నా, నాకూ ఇవ్వవా'' అన్నాడు.

బాయ్ ప్రశ్నార్థకంగా చూశాడు. ''ఎవర్నువ్వు? ఎప్పుడు జాయినింగు? కేస్ షీటేదీ? రాత్రి కూడా లేవుగదా?''

శేఖర్‌కు వివరణ ఇచ్చే ఓపిక లేదు. జేబులో చెయ్యి పెట్టబోయి, విఫలమయ్యాడు.

''అన్నా, నా ప్యాంటుజేబులో పర్సుంది. కాస్త తీసిపెట్టవూ'' అభ్యర్థించాడు.

బాయ్ ఓ క్షణం అనుమానంగా చూసి, శేఖర్ జేబులో చెయ్యి పెట్టి, పర్సు బయటికి తీశాడు.

''అందులో యాభై నోటుంది, తీసుకో. నాకు రెండు ఇడ్లీ ఇచ్చి పుణ్యం కట్టుకో''.

బాయ్ నోటును తన జేబులోనూ, పర్సును శేఖర్ జేబులోనూ పెట్టాడు. ఇడ్లీ పళ్లేన్ని మంచంమీద ఉంచి, బండిని తోసుకుంటూ నిష్క్రమించాడు. బ్రష్ చేసుకోవాలన్న స్పృహ లీలగానైనా అతన్ని తాకలేని స్థితిలో, కుడిచేత్తో ఇడ్లీలు ఆవురావురుమంటూ తిన్నాడు. ప్రాణం తిరిగొచ్చినట్లయింది.

చేతినెలా కడుక్కోవాలా అని ఆలోచిస్తుండగా, ఇద్దరు నర్సులు హడావుడిగా వచ్చారు.

''ఏయ్, ఎవర్నువ్వు?'' చిరాగ్గా చూస్తూ అడిగిందొక నర్సు. పిచ్చిచూపులు చూశాడు శేఖర్.

''ఇతను... ఇతన్ని మొన్న మార్...'' మాట పూర్తి కాకముందే కెవ్వుమని అరిచింది మరో నర్సు.

మళ్లీ స్పృహ కోల్పోతున్న శేఖర్‌కు వాళ్ల మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

''మేరీ... ఏమైంది... ఎందుకలా వణికిపోతున్నావ్?''

''యాక్సిడెంట్ కేస్... డెత్ కన్ఫర్మ్... ఇతన్ని నిన్న రాత్రి... రాత్రి... మార్చురీలో పెట్టాం...''

+++++++++++

శేఖర్‌కు స్పృహ వచ్చేసరికి బెడ్‌మీద ఉన్నాడు. శరీరంలోకి సెలైన్ ఎక్కుతోంది.

కుడికాలికీ, ఎడమచేతికీ సిమెంటు కట్లు ఉన్నాయి. ఆ రెండు అవయవాలూ కొలిమిలో కాలిపోతున్నట్లు... భరించలేని బాధ. 'సందేహం లేదు, నరకమంటే ఇదే!' అనుకున్నాడు.

బండిని తోసుకుంటూ వచ్చిన బాయ్ అన్నం పళ్లేన్ని మంచం పక్కన పెట్టి, శేఖర్‌కు దగ్గరగా వచ్చి, ''అన్నా, ఈడ నీకు సక్కంగ వైజ్జెం జెయ్యరు. నా మాటిని ప్రైవేటు దవాఖానకు బొయ్యి సూపిచ్చుకో'' అన్నాడు.

తండ్రి ఫోన్ నంబరు ఇచ్చి, సమాచారం అందించమని అభ్యర్థించాడు శేఖర్.

''భైటికెల్లి జేస్తాలే'' అంటూ వెళ్లిపోయాడు బాయ్.

శేఖర్ భారంగా కళ్లు మూసుకున్నాడు.

తననెవరో తోస్తున్నారు. నిప్పుల్లోకి. ఎవరో కాదు. ఆప్తుడే. ఒకే గదిలో నివశించే స్నేహితుడే. రాజేంద్ర!

ఆరోజు జరిగిన సంఘటన మనసుతెర మీద ప్రత్యక్షమవుతోంది...

శాలిని వచ్చేసరికి రాజేంద్ర రైసుమిల్లులో పనికెళ్లిపోయాడు. తను వంట చేస్తున్నాడు.

''అర్జెంటుగా రాజేంద్రను కలవాలి. ఈరోజు అటో ఇటో తేల్చుకుంటాను'' శాలిని.

"నా మాట వినండి మేడమ్. మీరు చదువుకున్నారు. వాడు రైసుమిల్లులో డ్రైవర్. బాధ్యత గుర్తెరగని మనిషి" నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు తను.

"అతన్ని మర్చిపోలేకపోతున్నాను. నాకతను కావాలి" ఏడుస్తోంది.

"పదండి వెళ్దాం" తలుపులు మూసి, శాలినిని వెంటబెట్టుకుని బయల్దేరాడు.

గొర్రెలకాపరి అయిన తండ్రి తాహతును దృష్టిలో ఉంచుకుని, పదో తరగతి తర్వాత ఐటీఐలో చేరాడు తను. జిల్లా కేంద్రంలో మారుమూలన ఓ గది తీసుకుని, చదువు మీద దృష్టి సారించాడు.

టీకొట్టు దగ్గర పరిచయమైన రాజేంద్ర మెల్లగా తన గదిలో మకాం వేశాడు. వయసులో పెద్దవాడైనప్పటికీ, అల్లరిచిల్లరగా తిరుగుతున్న రాజేంద్రను ఒప్పించి, ఓ రైసుమిల్లులో డ్రైవరుగా పనికి కుదిర్చాడు తను.

నెలనెలా జీతం వస్తుండటంతో రాజేంద్ర నిలదొక్కుకున్నాడు. అందంపై శ్రద్ధ పెరిగింది. అమ్మాయిలపై మోజు పెరిగింది. ఆ దిశగా చేసిన ప్రయత్నాల్లో భాగంగా శాలిని స్నేహం దొరికింది.

'సరదాగా వల వేస్తే, సీరియస్‌గా వెంటపడుతోందిరా. వదిలించుకోవాలి' అనేవాడు రాజేంద్ర.

'తప్పన్నా. ఆమె చాలా మంచిది. బాగా చదువుకుంది. ఉద్యోగం సంపాదించుకోగలదు. ఇద్దరూ హాయిగా బతకొచ్చు' హితబోధ చేసేవాడు తను.

'నీ మొహం. నీకు తెలియదులే' కొట్టిపారేసేవాడు రాజేంద్ర.

నాలుగేళ్లు పెద్దదైన శాలిని అంటే తనకు అభిమానం. స్నేహితుడి గురించి చెడుగా చెప్పడానికి మొహమాటం. కానీ, ఆమె తేల్చుకోవడానికి సిద్ధమైందని తెలిసి, నిజం చెప్పాలని ప్రయత్నించాడు. ఆమె వినలేదు.

రైసుమిల్లు దగ్గరైంది. పక్కనే ఉన్న బిల్డింగులోని మొదటి అంతస్తులో ఆఫీసు. డ్యూటీ మీద బయటికి వెళ్లకపోతే, ఆఫీసు పక్కనున్న రూములో దొరుకుతాడు రాజేంద్ర. మొదటి అంతస్తుకు చేరుకుని, దగ్గరగా మూసి ఉన్న ఆ రూము తలుపుల్ని తాకబోతుండగా "శేఖర్. నువ్వు బయటే ఉండు" అందామె.

శేఖర్ వెనక్కి నడిచి, పిట్టగోడ మీద కూచున్నాడు. తలుపులు తోసుకుని, ఆమె లోపలికి వెళ్లడం కనిపిస్తూనే ఉంది. గోడ మీంచి వెనక్కి చూశాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రెండు కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. పైకి చూశాడు. చేతికందేంత ఎత్తులో కరెంటు స్తంభాల వైర్లు.

రెండు నిమిషాలు గడిచాయో లేదో, శాలిని ఏడుస్తూ బయటికొచ్చింది. "వాడు... వాడు... రోగ్... బాస్టర్డ్... నాకొద్దు..." కళ్లు తుడుచుకుంటూ మెట్లమీంచి కిందికెళ్లిపోయింది.

ఏం జరిగిందో తనకు అర్థం కాకముందే, రాజేంద్ర చొక్కా తొడుక్కుంటూ బయటికొచ్చాడు. ఎద్దులా బుస కొడుతూ... వస్తూనే శేఖర్‌పై దాడి చేశాడు.

"ఏం బే, ఈడ నా ఇష్టమొచ్చినట్లుంట. నాకు నచ్చిన దాంతో కులుకుతుంట. వచ్చేస్తావా... ఏడకి బడితే ఆడికి దాన్ని తీసుకుని వచ్చేస్తావా..." అదుపు తప్పిన ఆవేశంతో శేఖర్‌ను గట్టిగా తోశాడు.

క్షణంలో వందో వంతు... మెదడులో ట్రాన్స్‌ఫార్మర్ కదిలింది. పిట్టగోడ మీంచి వెనక్కి పడకుండా నిభాయించుకోవడానికి ఎడమచేతిని పైకెత్తి, అందిన ఆధారాన్ని దొరకబుచ్చుకున్నాడు. ఆ ఆధారం విద్యుత్తీగ.

ఆ షాక్‌కు ఎగిరి కింద పడ్డాడు. అంతే, ఆ తర్వాత తనకు తెలివొచ్చేసరికి 'తెల్లమూటల' మధ్య పడి ఉన్నాడు.

+++++++++++

రెండు గంటల్లోపే శేఖర్ తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. కొడుకుని చూసి కుమిలి కుమిలి ఏడ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్యం అందించారు.

శేఖర్ తండ్రిని పిలిచి "అక్కడ అడ్డదిడ్డంగా కట్లు వేశారు. అసలది వైద్యమే కాదు. అంతకన్నా మేం వాళ్లను నిందించలేం. ఇప్పటికైనా వాస్తవ పరిస్థితి మీకు తెలియాలి..." అన్నారు డాక్టర్లు.

"సెప్పండయ్యా" అడిగాడు తండ్రి, కన్నీటిని పంటిబిగువున అదిమిపెడుతూ.

"మీ అబ్బాయికి ఎడమచేతిని చంకల్లో దాకా... కుడికాలిని మోకాలి దాకా తీసెయ్యాలి. పెద్దపెద్ద ఆపరేషన్లు అవసరం. డబ్బు చాలా ఖర్చవుతుంది..."

"అయ్యా, పానం సంగతి సెప్పండి. ఆడు మా కళ్లముందు ఊపిరి పీలుస్తా ఉంటే అదే సాలు..."

"ప్రాణాలకేం ప్రమాదం లేదు పెద్దాయనా" భరోసా ఇచ్చారు.

"ఎంత కర్సయినా పర్లేదు సామీ. ఆపరేసన్లు మొదులుబెట్టండి" రెండు చేతులూ జోడించి చెప్పాడు.

సొంతిల్లు అమ్మేశాడు. గొర్రెల్ని సంతలో తెగనమ్మాడు.

వైద్యులు సవాలుగా తీసుకుని రెండు రోజులపాటు ఆపరేషన్లలో తలమునకలయ్యారు.

ఒంటినిండా తెల్లటి కట్లుతో వారం రోజులపాటు ఐసీయూలో ఉండి, ప్రత్యేక గదికి చేరుకున్నాడు శేఖర్.

మూడు నెలలు ఆస్పత్రిలో ఉండాలన్నారు. మరో మూడు నెలలు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

రెండు నెలలు గడిచేసరికే ఒళ్లంతా పుళ్లు పడ్డాయి.

పొలం పనులు తప్ప, పడకేసిన వారికి సేవలెలా చెయ్యాలో తెలియని శేఖర్ తల్లికి అదో శిక్షగా మారింది.

కదలని క్షణాలు, శరీరం నిండా పరుచుకున్న గాయాలతో అతనికి జీవితం మీద విరక్తి మొదలైంది.

ఆ సమయంలో ఓరోజు ఆకాశం నుంచి జారిపడిన పూలమొక్కలా ఆస్పత్రికి వచ్చింది శాలిని.

"సారీ శేఖర్. అంతా నా వల్లనే. నువ్వు చనిపోయావని చెప్పారు. థాంక్ గాడ్. బతికున్నావు" కన్నీటి పర్యంతమైంది. శేఖర్‌లో సరికొత్త ఉత్సాహం.

"అసలు... ఆరోజు... నేను పడిపోయాక ఏం జరిగింది?" ప్రపంచంతో మాట్లాడి చాలా కాలమైనట్లు తన గొంతు తనకే కొత్తగా అనిపించింది.

"నీ కేక వినిపించి నేను పైకి పరుగెత్తుకొచ్చాను. రాజేంద్ర క్షణాల్లో మాయమయ్యాడు. నువ్వసలు ప్రాణంతో ఉన్నావో లేదో తెలియదు. మిల్లు కార్మికుల సాయంతో ప్రభుత్వాసుపత్రికి చేర్చాను. నాలుగైదు గంటల తర్వాత నువ్వు చనిపోయావని చెప్పారు. పోలీసులొచ్చారు. ఒక్కసారి చూస్తానని బతిమాలినా ఒప్పుకోలేదు. మీ అమ్మానాన్నలకు కబురు చేస్తామన్నారు. అప్పటికే మా అమ్మ చాలాసార్లు ఫోన్జేసింది, మందులు కావాలని. నేను ఇంటికెళ్లిపోయాను..."

"పర్లేదు. ఇప్పుడు నాక్కాస్త ధైర్యం కావాలి. మీరిస్తారా..."

"తప్పకుండా. నువ్వు మామూలు మనిషివయ్యేదాకా నేనుంటా..." భరోసా ఇచ్చిందామె.

ఆ గది కిటికీలోంచి చొచ్చుకువచ్చిన గాలి రోగనిరోధకశక్తిని వీచింది. సూర్యకిరణాలు నులివెచ్చగా తాకాయి. పూలతోటలోంచి వచ్చే పరిమళాలు కొత్త సువాసనలు వెదజల్లాయి.

కర్ర సాయంతో నడవడం సాధన చేశాడు.

ఇంటికి చేరుకున్నా, అప్పుడప్పుడూ శాలిని వచ్చి వెళుతోంది. ధైర్యం చెబుతోంది. ఉత్సాహపరుస్తోంది.

ఓరోజు మరింత ఆనందంగా వచ్చింది. తనవెంట వచ్చిన ఓ స్వచ్ఛందసంస్థ నిర్వాహకుడు శేఖర్‌కు జైపూర్ కొయ్యకాలిని అమర్చాడు. మొదట్లో నడుస్తుంటే మోకాళ్ల దగ్గర మంటలు రాజుకునేవి. పంటిబిగువున ఆ బాధ భరిస్తూ నడవడం మొదలు పెట్టాడు.

మరో మూడు నెలలు గడిచాయి.

శేఖర్ నడవగలుగుతున్నాడు. కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం, బట్టలు తొడుక్కోవడం, అన్నం తినడం... అన్నీ సొంతంగా చేసుకోగలుగుతున్నాడు.

"నాకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. రేపే వెళ్తున్నా" స్వీట్‌బాక్సుతో వచ్చి మరీ చెప్పింది శాలిని.

"కంగ్రాట్స్" నవ్వుతూ స్వీటు అందుకున్న అతని మొహంలో దిగులు పరుచుకుంది.

"ఎందుకలా ఢీలా పడ్డావ్? నీతోనే ఉండిపోనా?" నవ్వుతూ అడిగిందామె.

"ఛఛ, అపార్థం చేసుకోకండి. నా దిగులంతా నాన్న గురించే".

"ఏమైంది ఆయనకు?"

"భారమైంది. నేనూ పదో పరకో సంపాదించగలిగితే..."

"అర్థమైంది. నీకు హార్డ్‌వేర్ అంటే చాలా ఇష్టం కదా?"

"అవును" అతని మొహం విప్పారింది.

"అయితే పద" అప్పటికప్పుడు శేఖర్ని తీసుకుని జిల్లాకేంద్రానికి వెళ్లింది. తన పెదనాన్న కొడుకు నడుపుతున్న సెల్‌ఫోన్ షాపులో అతన్ని ఉద్యోగానికి కుదిర్చింది.

ఆమెకు సెల్యూట్ చేశాడు. శాలిని అతనికి దగ్గరగా వచ్చి, నుదుటిపై ముద్దుపెట్టి, చకచకా వెళ్లిపోయింది.

ఎనిమిది నెలలు గడిచాక లోన్ తీసుకుని, తనే సొంతంగా షాపు తెరిచాడు. ఆత్మవిశ్వాసం కుదురుకుంది. ఒంటిచేత్తో సైకిలు తొక్కడం బాగా అలవాటైంది. సాయంత్రం వేళల్లో పరిగెత్తడం మొదలు పెట్టాడు. క్రమంగా అదో వ్యసనంలా మారింది. తను సైకిలు తొక్కుతున్న ఫొటోలు, పరిగెత్తుతున్న దృశ్యాలు ఫేస్‌బుక్‌లో పెట్టేవాడు. ఎన్నో లైక్‌లు వచ్చేవి. అలా పరిచయమైన ఓ మలయాళీ ఓరోజు ఫోన్ చేశాడు.

"వచ్చే ఆదివారం హైదరాబాదులో 10కె రన్ ఉంది. పార్టిసిపేట్ చేస్తావా?"

అతను కూడా తనలాంటి బాధితుడే. ఇప్పుడు రన్నర్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

"ష్యూర్".

ఆరోజు ప్రముఖుల సమక్షంలో 10కె రన్ జరిగింది. అందరి కన్నా చివరగా లక్ష్యం చేరిన శేఖర్ ఆనందంతో గంతులు వేస్తున్నాడు. రెండు కాళ్లకూ షూలూ, జీన్స్‌ప్యాంటు వేసుకుని దుక్కలా ఉన్న శేఖర్ అలా ఎందుకు ఎగురుతున్నాడో అర్థం కాక అక్కడ చేరిన కొందరు తల గోక్కున్నారు.

ఎగిరీ ఎగిరీ, కింద చతికిలబడిన అతన్ని ఓ పెద్దాయన సమీపించి "అందరికన్నా వెనకొచ్చి, ఎందుకలా ఎగిరిపడుతున్నావ్?" అన్నాడు.

శేఖర్ ఆయన వంక అదోలా చూసి, కుడికాలివైపు ప్యాంటును మోకాళ్ల దాకా పైకి లాగాడు.

ప్రోస్థటిక్ లెగ్స్ అమ్మే షాపు ఓనర్ అయిన ఆ పెద్దాయన శేఖర్ తొడుక్కున్న చెక్కకాలిని చూసి ఆశ్చర్యపడలేదు. పరిగెత్తడం వల్ల అది ఒరుసుకుని, విపరీతంగా కారిన రక్తం చూసి, షాకయ్యాడు.

"మొదటి సారా?" అడిగాడాయన.

"అవును. అందుకే ఇంత ఆనందం" బాధను కప్పెట్టిన నవ్వు మొహంతో బదులిచ్చాడు శేఖర్.

ప్రాథమిక వైద్యం అందించాక, ఆయన శేఖర్‌ని వెంట తీసుకెళ్లాడు.

షాపులో కూర్చోబెట్టి, ఎన్నో ప్రశ్నలు వేశాడు. శేఖర్ ఆత్మవిశ్వాసంతో జవాబిచ్చాడు.

"జైపూర్ లెగ్ బరువెక్కువ. మన్నిక తక్కువ. సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఇప్పుడందరూ ప్రోస్థటిక్ లెగ్స్ వాడుతున్నారు. నీకది ఫ్రీగా ఇస్తా. మా షాపు తరఫున మార్కెటింగ్‌లో ఉద్యోగమిస్తా. ఇష్టమేనా?"

అప్పటికే షాపు నష్టాల్లో నడుస్తుండటంతో ఆయనిచ్చిన అవకాశం బంగారు బాతుగుడ్డులా కనిపించింది.

షాపును అమ్మేసి, లోన్ చాలావరకు తీర్చేసి, హైదరాబాదు చేరుకున్నాడు. అమీర్‌పేటలో రూము తీసుకున్నాడు. ప్రోస్థటిక్ లెగ్ చాలా తేలిగ్గా, సొంత కాలున్నంత సౌకర్యంగా ఉండటంతో సైక్లింగ్‌ను సీరియస్‌గా తీసుకున్నాడు. డబ్బు కూడబెట్టుకుని, 'రన్నింగ్ బ్లేడ్' కొనుక్కుని పరుగు సాధనను ముమ్మరం చేశాడు.

చాలా కాలం తర్వాత ఆరోజు రాత్రి శాలినికి ఫోన్ చేశాడు.

+++++++++++

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు మొదలయ్యాయి.

అన్ని అవయవాలూ సరిగా ఉన్నవారితో పోటీ పడుతున్నాడు శేఖర్.

కాళ్ల దగ్గర బ్రేక్ ఉండేలా ప్రత్యేకంగా తయారు చేయించుకున్న సైకిల్‌ను... ఒంటిచేత్తో కంట్రోల్ చేసుకుంటూ... శక్తినంతా కూడదీసుకుని తొక్కుతున్నాడు.

స్టేడియంలో కూర్చున్న శాలిని ఉత్కంఠగా చూస్తోంది.

ఒక్కో రౌండు పూర్తవుతోంది. మొదట్లో ముందంజలో ఉన్న శేఖర్ క్రమంగా వెనకబడిపోతున్నాడు.

శాలినికి ఏడుపు తన్నుకొస్తోంది.

చివరి రౌండు. ఒక్కసారిగా పుంజుకున్నాడు శేఖర్. చూస్తుండగానే రివ్వున దూసుకొచ్చి, రెండో స్థానంలో నిలిచాడు. శాలిని కేరింతలు కొట్టింది. పరుగు పరుగున స్టేడియంలోకి వచ్చి, కౌగిలించుకుంది.

"అసలు నీ లక్ష్యం ఏమిటి?" సాయంత్రం వేళ స్టేడియం మైదానంలో ఓ మూలన కూర్చుని, అతని మొహంలోకి చూస్తూ అడిగింది శాలిని. శేఖర్ సమాధానం చెప్పలేదు. నవ్వాడు.

హైదరాబాదులో ఇప్పుడు ఇద్దరూ ఒకే రూములో ఉంటున్నారు. వంట చేసుకుంటున్నారు.

"పోనీ, నేను చెప్పనా?" కళ్లు గుండ్రంగా తిప్పుతూ అడిగిందామె. కళ్లతోనే అంగీకరించాడు తను.

"పారాలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలి".

"అవును... ఈ డొక్కు సైకిల్‌తో!" పెద్దగా నవ్వాడు తను.

"కెరోలీ టాకాక్స్ హంగేరీ అనే వ్యక్తి మిలిటరీలో పని చేసేవాడు. షూటింగ్‌లో అతను దిట్ట. ప్రపంచంలోనే అత్యుత్తమ షూటర్‌గా గుర్తింపు పొందాలనీ, 1940 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాలనీ అతని కల..."

ఆమె దేని గురించి చెబుతుందో అర్థం కాక ఆసక్తిగా చూస్తుండిపోయాడు. ఆమె కొనసాగించింది.

"దురదృష్టవశాత్తు ఓ ప్రమాదంలో కుడిచేతిని పోగొట్టుకున్నాడు. అతని మిత్రులంతా సానుభూతి చూపించారు. అతనూ కుంగిపోయాడు. కానీ ఓ మిత్రుడు ఓదార్చాడు. ధైర్యం చెప్పాడు. 'నువ్వు కోల్పోయింది చేతులు కాదు, చెయ్యి' అన్నాడు. ఆ మాటల మధ్య మిళితమైన అంతరార్థాన్ని గ్రహించిన కెరోలీ మరుసటి ఏడాది జాతీయస్థాయిలో జరిగిన పోటీలకు హాజరై ఎడమచేత్తో పతకం సాధించాడు. ఇనుమడించిన ఉత్సాహంతో 1940 ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యాడు. దురదృష్టం రెండో ప్రపంచయుద్ధం రూపంలో వెంటాడింది. ఆ క్రీడాసంబరం రద్దయింది. మరో నాలుగేళ్లు ఓపిగ్గా ఎదురు చూశాడు. ఏవో కారణాల వల్ల 1944 ఒలింపిక్స్ కూడా జరగలేదు. పన్నెండేళ్లపాటు లక్ష్యం మీద మనసు లగ్నం చేసి ఉంచడం ఎంత కష్టమో బహుశా ఈ ప్రపంచంలో కెరోలీకి మాత్రమే తెలుసు. కాబట్టే 1948 ఒలింపిక్స్‌లో 38 ఏళ్ల వయసులో స్వర్ణం సాధించాడు. మరో నాలుగేళ్ల తర్వాత కూడా తనే ప్రపంచ విజేతగా నిలిచాడు..."

అబ్బురంగా చూశాడు శేఖర్.

"అందుకే, రేపు నువ్వు మా ఆఫీసుకొస్తున్నావు".

"ఎందుకు?" అయోమయంగా అడిగాడు.

ఆమె జవాబివ్వలేదు.

3

"కట్ చేస్తే... నేను మీ ముందున్నాను. నా జీవితం మీకు స్ఫూర్తినిస్తుందో లేదో తెలియదుగానీ, మీ మధ్య కూర్చున్న శాలిని మేడమ్ నాకో చుక్కాని. దారి చూపారు. ధైర్యమిచ్చారు. ఇప్పుడు నా ముందు రెండే లక్ష్యాలు. సైక్లింగ్ అండ్ రన్నింగ్. రాబోయే పారాలింపిక్స్‌లో ఈ రెంటిలో మన దేశం తరఫున పతకాలు సాధించడమే నా ధ్యేయం. మనకు కనిపించని అవయవాలుంటాయి. వాటిని మనమే మొలిపించుకోవాలి..." అని ఆగాడు శేఖర్.

గంటసేపు ఆవరించిన గంభీర నిశ్శబ్దం బద్దలైంది. చప్పట్లు ప్రతిధ్వనించాయి.

4

"గాడ్! ఎలా జరిగింది" ఆందోళనగా అడిగింది శాలిని.

"కారు ఢీకొట్టింది. నడిపే కుర్రాడు తాగి ఉన్నాడు. ఫ్లై ఓవర్ దిగాక, స్పీడ్ కంట్రోల్ కాక పక్కరోడ్డు మార్జిన్‌లో వెళ్తున్న శేఖర్‌ను ఢీకొట్టేశాడు. బాగా దెబ్బలు తగిలాయి.." తోటి సైక్లిస్టు ఫోన్‌తో శాలిని హడావుడిగా కారులో ఆస్పత్రికి బయల్దేరింది. కారు వేగంతో ఆమె ఆలోచనలు పోటీ పడుతున్నాయి.

నెల రోజుల్లో నేషనల్ లెవల్ సైక్లింగ్ పోటీలు. ఆరోజు శేఖర్ ప్రసంగం విన్న తమ ఆఫీసు వాళ్లంతా సంభ్రమాశ్చర్యాల నుంచి తేరుకుని, అతనికి యథాశక్తి ఆర్థికసాయం ప్రకటించారు. ఆ మీటింగుకు హాజరైన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ హెడ్ ఏకంగా పారాలింపిక్స్‌కు కంపెనీ తరఫున స్పాన్సర్ చేస్తామన్నారు.

ఆ సహకారంతో అన్ని హంగులతో కూడిన లేటెస్ట్ మోడల్ సైకిల్ కొన్నరోజు శేఖర్ ఆనందానికి అవధుల్లేవు. హెల్మెట్, గాగుల్స్, జీపీఎస్ మీటర్, బూట్లు, గ్లౌజులు... అన్నీ కొత్తవే.

విపరీతమైన సాధన మొదలుపెట్టాడు. తను కోచ్‌ను కూడా కుదిర్చింది.

అప్పటికే రెండొందలు, అయిదొందల కిలోమీటర్ల నాన్‌స్టాప్ సైక్లింగ్ ఫీట్లు విజయవంతంగా పూర్తిచేసి వార్తల్లోకెక్కాడు శేఖర్. నేషనల్ లెవల్ పోటీలకు ఎంపికయ్యాడు.

ఇంతలోనే ఈ ఉపద్రవం!

కారు పార్క్‌చేసి, హడావుడిగా ఆస్పత్రిలోకి చేరుకుంది. అప్పటికే శేఖర్‌కు ఆపరేషన్ మొదలైంది.

నాలుగు గంటల సుదీర్ఘ ఎదురుచూపు తర్వాత ఐసీయూలోకి అనుమతించారు.

మత్తులో ఉన్న శేఖర్ నిస్సహాయంగా పడి ఉన్నాడు. ఈసారి కుడికాలు!

శాలినికి దు:ఖం వరదలా పొంగుకొచ్చింది. శేఖర్‌ను ఆ స్థితిలో చూసి పొగిలి పొగిలి ఏడ్చింది.

మూడోరోజు రూముకు మార్చారు. క్రమంగా కోలుకున్నాడు శేఖర్. పది రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు.

అతనిలో మునుపటి ఆత్మవిశ్వాసం మాయమైంది. ఎప్పుడు చూసినా ఏదో లోకంలో ఉన్నట్లుండేవాడు.

శాలిని బలవంతం మీద రెండు ప్రోస్థటిక్ లెగ్స్‌తో మళ్లీ ప్రాక్టీస్ ప్రారంభించాడు గానీ ఉత్సాహం లేదు.

మరో పదిరోజుల్లో పోటీలు.

ఆరోజు శేఖర్ దిగులుగా కూచొని కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు.

శాలిని టీకప్పులతో వచ్చింది.

"మరియప్పన్ తంగవేలు పేరు విన్నావా?" ఓ కప్పు శేఖర్‌కు అందిస్తూ అడిగింది.

అనాసక్తంగా చూశాడు శాలిని వైపు.

"తమిళనాడులో ఓ మారుమూల గ్రామంలో పుట్టాడు. నిరుపేద కుటుంబం. పిల్లల్ని తండ్రి గాలికొదిలి పారిపోతే, బాధ్యత భుజాలకెత్తుకుంది తల్లి. రోజూ కూలికి వెళ్లి పిల్లలకు పిడికెడన్నం పెట్టేది. నలుగురు పిల్లల్లో ఒకడైన తంగవేలు అయిదేళ్ల వయసులో ఇంటిబయట

ఆడుకుంటుంటే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. కుడికాలి పాదం చితికిపోయింది. కర్రసాయంతో నడిచే తంగవేలు కుంగిపోయాడు. తల్లి ప్రోత్సాహంతో క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. పాదం లేకపోయినా పాదరసంలా పరిగెత్తుతున్న ఆ కుర్రాణ్ని డ్రిల్లు మాస్టారు ప్రోత్సహించాడు..."

శేఖర్ అప్రయత్నంగా మనసు కేంద్రీకరించాడు. శాలిని కొనసాగించింది.

"సేలంలో క్రీడాశిక్షణ శిబిరంలో చేరుద్దామని తల్లికి సలహా ఇచ్చాడు. ఆటల సంగతి ఎలా ఉన్నా కొడుక్కి ముప్పూటలా ముద్ద దొరికుతుందన్న ఆశతో ఆమె ఒప్పుకొంది. అక్కడ తంగవేలు రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. కఠోర సాధన చేశాడు. కాలికి గాయాలైనా, పాదం రక్తమోడుతున్నా లెక్క చెయ్యలేదు. అవయవాలన్నీ చక్కగా ఉన్న అథ్లెట్లతో పోటీపడ్డాడు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయికి ఎదిగాడు. ఇరవై ఏళ్లు వచ్చేనాటికే హైజంప్‌లో ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలిచాడు. మొన్న రియోలో జరిగిన పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి, దేశానికే వన్నె తెచ్చాడు..."
శేఖర్ మొహంలో కొత్త కాంతి.

5

శేఖర్ తన లగేజీ బ్యాగుతో కారు దిగాడు. హైదరాబాదులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి వెళ్లబోతుండగా "శేఖర్..." ఆర్తిగా పిలిచింది శాలిని.

ఏమిటన్నట్లు చూశాడు శేఖర్. అతన్ని తేరిపార చూసిందామె.

ఆ యువకుడు జీన్స్‌ప్యాంటుతో ధీమాగా నిలబడి ఉంది కృత్రిమకాళ్ల మీదనన్న విషయం ఎవ్వరూ గుర్తించే అవకాశం లేదు. పంజాబ్‌లో జరగబోతున్న నేషనల్ లెవల్ సైక్లింగ్ పోటీల్లో జనరల్ కేటగిరీలో పోటీ పడటానికి వెళుతున్న యోధుడన్న విషయాన్నీ ఎవ్వరూ గుర్తించలేరు.

కోల్పోయిన ఎడమచెయ్యి మాత్రమే... మనిషికి దిష్టిచుక్కలా!

"మేడమ్... పిలిచారు..?"

"ఏం లేదు శేఖర్"

"ఉంది. మీరు మర్చిపోయారు. నేను గుర్తు చెయ్యనా?" అంటూ ఆమె నుదుటి మీద ముద్దుపెట్టి, నవ్వుతూ సాగిపోయాడు వడివడిగా. ఆమె ఆ వైపే చూస్తూండిపోయింది.

విజయంతో అతను తిరిగొచ్చేదాకా ఆ చూపులు అక్కడే గడ్డ కట్టుకుపోతాయన్న విషయాన్ని ఆమె గుర్తించే స్థితిలో లేదు.

(నల్గొండ జిల్లాకు చెందిన సైక్లిస్టు శేఖర్ జీవితం ఆధారంగా)

## అమ్మ

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

అది ఊరికి దూరంగా ఉన్న బంజరు భూమి.నిజానికి దానిని భూమి అనడం  కన్నా చిట్టడవి అనడం న్యాయం. ఎక్కడ చూసినా ముళ్ళ చెట్లు, పిచ్చి మొక్కలు, దట్టంగా అల్లుకున్న రకరకాల తీగలు, పొదలు.  సరిగ్గా చెప్పాలంటే అది  మనుషులు ఉండదగ్గ, ఉండే స్థలం కాదు.  బహుశా ఇంకా అది ఎవరి దృష్టిలో  పడలేదు కాబోలు బంజరు భూమిగానే మిగిలి పోయింది.

కానీ ఊరిలో  ఎక్కడా  ఉండే స్తోమత లేక, ఉన్న ఇళ్ళకు అద్దె ఇచ్చుకోలేక, అక్కడ గుడిసెలు  వేసుకుని నివసిస్తున్నాయి కొన్ని కుటుంబాలు.అక్కడ ఉన్న అందరూ కూలి, నాలి చేసుకునే బతికే వారు,  వారి కుటుంబాలు. .కాకపోతే ఎక్కువ కుటుంబాలు తమ శక్తికి మించింది అయినా

తమ పిల్లలని చదివిస్తున్నాయి. తమ కంటే తమ పిల్లలు ఉన్నత స్థితిలో ఉండాలనుకోవడం సహజం కదా.చిన్న పెద్దా కలిసి ఒక ఏభయ్ మంది వరకూ ఉంటారు అక్కడ.

ఆ రోజు ఉదయం కూడా ఎప్పడి లాగే తెల్లారింది. అక్కడి మనుసులు తమ తమ పనులలో నిమగ్నం అయి ఉన్నారు. ఉదయం పది గంటలు అయ్యింది. చదువుకునే పిల్లలు స్కూళ్ళకి వెళ్ళారు. తక్కిన వాళ్ళలో పెద్ద పిల్లలు పొలాల గట్ల మీద ఆడుకోడానికి వెళితే, మరీ చిన్న పిల్లలు ఇళ్ళలో ఉండి పోయారు. మగవారు అందరూ, ఆడవారిలో కొంత మంది పనులకి బయటకి వెళిపోతే ,ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు వంట ప్రయత్నం లో ఉన్నారు. వాళ్ళ జీవితాలలో ఇంచుమించు రోజూ అలాగే ప్రారంభం అవుతుంది.

కానీ ఆరోజు అసలు ఎవరూ ఊహించని ,అనుకోని సంఘటన జరిగింది.అది వాళ్ళ జీవితాలను చిన్నాభిన్నం చేసింది.ఒక్కసారిగా ఒక గుడిసెలో పెద్ద అగ్ని కీల లేచింది.బలంగా గాలి వీస్తూ ఉండడం వలన క్షణాలలో అగ్ని అన్ని గుడిసెలను ఆక్రమించుకుంది. అంతటా హాహాకారాలు మొదలు అయ్యాయి.ఇంట్లో ఉన్న వాళ్ళు కంగారుగా, ముందుగా పసిపిల్లలను,ముసలి వాళ్ళను ఇళ్ళ లోంచి బయటకు తీసుకువచ్చారు.తరువాత ముఖ్యమైన సామానులను తీసుకు వచ్చే ప్రయత్నం చేసారు. కానీ భయకరంగా ఎగసిపడ్డ అగ్ని జ్వాలలు వాళ్ళకి సామానులు తీసుకునే అవకాశం ఇవ్వలేదు.అంతలో జరిగిన విషాదం గురించి తెలిసి, పనికి వెళ్ళిన వాళ్ళు పరుగు పరుగున అక్కడకు చేరుకున్నారు.వాళ్ళలో కొంత మంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసారు. కానీ వాళ్ళకి నీరు దరిదాపుల్లో లభించలేదు.నిజానికి వాళ్ళ చుట్ట పక్కల ఉన్న నీటివసతులు వాళ్ళకి తాగడానికే సరిపోవు!!?? అయినా ఉన్న కొంచం నీటితో ఏదో విధంగా మంటలను అదుపు చేయాలనీ ప్రయత్నించారు. వాళ్ళ ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. చూస్తుండగానే అన్ని గుడిసెలు పరశురామ ప్రీతి అయిపోయాయి. అక్కడ బతుకుతున్న వాళ్ళ దుఃఖానికి అంతు లేకుండా పోయింది. దాదాపు అందరూ కట్టుబట్టలతో మిగిలారు. ఆడవాళ్ళ రోదనలు మిన్ను ముట్ట సాగాయి.పిల్లలు గోలగా అరుస్తూ ఉంటే,మగవాళ్ళు విషణ్ణ వదనాలతో నిలబడి ఉన్నారు.

అంతలో ఫైర్ ఇంజిన్ వచ్చింది.పూర్తిగా బూడిద అయిన ప్రదేశం మీద నీళ్ళు జల్లింది .నిజానికి ఫైర్ సర్వీస్ వాళ్ళు వచ్చేసరికే జరగాల్సింది అంతా జరిగిపోయింది.

విషాదం జరిగిన గంటలోపే పత్రికల వాళ్ళు,టీ వీ వాళ్ళు అక్కడకి చేరుకుని'అసలు ప్రమాదం ఎలా జరిగింది !!??ఎప్పుడు ఎవరు ముందుగా చూసారు !!?? మంటలను ఆర్పే ప్రయత్నం ఎలా చేసారు !!??' లాంటి ప్రశ్నలతో అక్కడ వారిని ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రారంభించారు. ఎవరికి తోచిన సమాధానాలు వాళ్ళు చెప్పారు.నిజానికి కారణాలు ఎవ్వరికీ తెలియదు.ఎవరు ఏమి చెప్పినా ,ఏమి వివరించినా కేవలం ఊహే!!??

కొద్ది సేపటికి వివిధ రాజకీయ పక్షాల నాయకులూ అక్కడకు చేరుకున్నారు.

'ఇంతటి భారి అగ్ని ప్రమాదం జరిగి అన్ని కోల్పోయిన వారికీ మా సానుభూతి. జరిగిన దానికి విచారిస్తున్నాం అని' ఒకరంటే

'ఈ పేదల నష్టాన్ని పూరించడం లో నా వంతు కృషి చేస్తా 'అని ఒకరు అన్నారు.

'బాధితుల ని పూర్తిగా ఆదుకునే వరకు నేను నిద్ర పోను' అని ఒకరు ప్రగల్భాలు పలికారు.

ఇంకొక ఆయన 'జరిగిన విషాదాన్ని చూస్తుంటే నా గుండె తరుక్కు పోతోంది.నాకు కన్నీళ్ళు ఆగటం లేదు' అంటూ కళ్ళు కండువాతో తుడుచుకున్నాడు.పొగ వల్ల తన కళ్ళు మండి ,నీళ్ళు వచ్చాయి అన్న సంగతి ఎవరైనా గ్రహిస్తారేమోనని చుట్టూ పక్కల చూస్తూ ఆ మాటలు అన్నాడు.కానీ ఎవరు అవి పట్టించుకునే స్థితిలో లేరు.ఒకరిద్దరు అసలు విషయం గ్రహించినా నవ్వుకుని ఊరుకున్నారు.

మెల్లగా అక్కడ వాతావరం మరోరకంగా వేడి ఎక్కడం మొదలు పెట్టింది. వివిధ రాజకీయ నాయకుల మధ్య వాగ్వివాదాలు మొదలయ్యాయి .దానికి కొందరు పత్రికల వాళ్ళు, టీవీల వాళ్ళు నెయ్యి ,సమిధలు వేయసాగారు.క్రమంగా అసలు విషయం దారి మళ్ళింది. పెద్ద గందర గోళం ప్రారంభం అయ్యింది.

అప్పుడు జరుగుతున్నదంతా ఛానల్ వాళ్ళకి ,పత్రికల వాళ్ళకి మంచి ఆహారం లభించినట్లయింది.

ప్రమాదం జరిగి చాలా సేపయ్యింది. వచ్చిన వాళ్ళు ఎవరి గొడవలో వాళ్ళు మునిగిపోయారు.

బాధితులు అక్కడకు వచ్చిన వాళ్ళ వైపు ఆశగా ,నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయారు.

కొంత సేపటికి ఒక నాయకుడు 'రెండు రోజులలో మీ గుడిసెలు కట్టిస్తాం' అంటూ ప్రకటించాడు.

'నష్ట పోయిన ప్రతి కుటుంబానికి లక్ష చొప్పున పరిహారం ఇప్పించే బాధ్యత నాది 'అని ఇంకొక నాయకుడు బిగ్గర గా అరిచాడు.

'ప్రతి కుటుంబానికి బస్తా బియ్యం,వంట సామానులు అందించే పూచీ నాది'ఇంకొక నాయకుని హామీ.

'ఇంటికొక ఉద్యోగం వచ్చే వరకూ పోరాడుతాను!!' అంటూ ఇంకొక నాయకుడు తన పోరాట ప్రతిమ వెల్లడించాడు.

ఏ ఒక్కరూ తమ హామీలను నిజంగా నిలుపుకోక్కర్లేదని వాళ్ళకి తెలుసు!!??ఫ్రీగా చేసే ఎన్ని వాగ్దానాలు అయినా చెయ్యవచ్చు కదా!!??

ఒక్క మాటలో చెప్పాలంటే భాధితుల గురించి అంత వరకు నిజంగా పట్టించుకున్న నాధుడు ఒక్కడూ లేడు!!??

కొంత సేపటికి నాయకుల హడావిడి తగ్గింది.

అప్పుడు హడావిడిగా స్వచ్ఛంద సంస్థల వాళ్ళు రంగ ప్రవేశం చేసారు.

పోటా పోటీగా బాధితుల మీద ప్రశ్నల వర్షం కురిపించారు.అప్పడికి అవే అవే పది సార్లు చెప్పిన బాధితులకి విసుగు,కోపం,అసహనం కలిగాయి.అసలే ఇల్లు,సర్వస్వం కోల్పోయి బాధ పడుతుంటే ఈ ప్రశ్నల పరంపరలు ఏమిటా అని తలలు పట్టుకు కూచున్నారు.

కానీ వచ్చిన వాళ్ళు ఏది అయినా సహాయం చెయ్యక పోతారా అని ఆశగా,ఓపికగా అన్నిటి ప్రశ్నలకి సమాధానం ఇవ్వసాగారు.

'మేము మీ పిల్లలకు జీవితాంతం స్కూల్ ఫీజులు భరిస్తాం.వాళ్ళకి ఉచిత ట్యూషన్ సదుపాయాలు కలగాజేస్తాం.'ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాగ్దానం.

'మీ ఇళ్ళల్లో ఆడవారికి వృత్తి నైపుణ్యం లో ట్రైనింగ్ ఇప్పిస్తాము.వాళ్ళు ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా తర్ఫీదు ఇస్తాం.ఇంటి దగ్గరే కూచుని డబ్బు సంపాదించుకునే మార్గం ఏర్పాటు చేస్తాం.స్త్రీలను అన్ని విధాలా స్వతంత్రులు అయ్యేలా చూస్తాం .'హామీల వర్షం గుప్పించింది మరొక స్వచ్ఛంద సంస్థ.

'ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరూ ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేస్తాం .రాత్రి పాఠశాల,వయోజిన విద్య కల్పిస్తాం.అక్షరాస్యతతో లోక జ్ఞానం మెరుగు పడుతుంది .సంపాదించే శక్తి పెరుగుతుంది.మీలో ప్రతి ఒక్కరూ మంచి విద్యవంతులయ్యేలా చూస్తాం 'మరొక స్వచ్ఛంద సంస్థ హామీ.

విచిత్రం ఏమిటంటే ఎన్నో రకాల సహాయాలు అందిస్తానన్న స్వచ్ఛంద సంస్థలలో ఏవి నిజంగా సేవ చేస్తాయో,వేటికి గుర్తింపు ఉందో ఆ భగవంతునికే ఎరుక!!??

అలా రక రకాల వ్యక్తుల హామీలతో నిజంగా ఆ క్షణంలోనే అవి పొందినంత సంతోషం లో మునిగి పోయారు అగ్ని ప్రమాద బాధితులు.

మెల్లిగా మధ్యాహ్నం అయ్యింది.వచ్చిన వాళ్ళు ఎక్కడ వాళ్ళు అక్కడకు వెళ్ళిపోయారు.

ఇక మిగిలింది ఆ ప్రాంతం వాళ్ళు.

ఒక్కక్కొరు తాము ఏమి కోల్పోయారో చెప్పుకోవడం ప్రారంభించారు. ఒక కుటుంబం తమ కూతురు పెళ్లి కోసం పైసా పైసా కూడబెట్టి దాచుకున్న డబ్బు అంతా బూడిద అయి పోయిందని బోరుమంది.

ఇంకొక కుటుంబం తమ కొడుకుకి ఫీజు కట్టడానికి ఇంట్లో పెట్టిన డబ్బు,అంతకు ముందు రోజే కొనుక్కున్న పుస్తకాలు చూస్తుండగానే మసి అయిపోయాయని బావురుమంది.

ఇంకొక కుటుంబానిది మరీ దీన గాధ. ముసలిది అయిన యజమాని తల్లికి వైద్యం చేయిద్దామని ,అప్పు చేసి తెచ్చిన న డబ్బు,అలాగే ఆవిడికి ఒకరు దయతో చేయించి ఇచ్చిన కృత్రిమ కాలు అగ్నికి ఆహుతి అయ్యిపోయాయి.ఇప్పుడు ఆ ముసలావిడ ఎలా నడుస్తుంది!?ఎలా బతుకుతుంది??

ఇలా ఒకరికి ఒకరు తమ దీన గాధలు చెప్పుకుంటూ, కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటూ,ఒకరిని ఒకరు ఓదార్చుకుంటూ కూచుని ఉన్నారు.

చిత్రం ఏమిటంటే అంతదాకా హామీలు గుప్పించిన ఎవ్వరూ ఆ విషయాలు అడగక పోవడం, చర్చించకపోవడం.వాళ్ళు వచ్చిన ప్రయోజనం వేరు !!??

అంతలో అటుగా ఓ ముసలి స్త్రీ నడుచుకుంటూ వచ్చింది.అసహ్యకరమైన బట్టలతో,మురికి ఓడుతూ ఉంది.ఆమె వేషధారణ ఆమె బిచ్చకత్తె అని చెప్పకనే చెపుతోంది.

ఆమెని చూసేసరికి అక్కడి వాళ్ళంతా చిరాకు పడ్డారు. అక్కడ ఉన్న వాళ్ళు తాము సర్వం కోల్పోయి ఉంటే, ఆ సమయంలో అడుక్కోడానికి ఆమె ఎలా వచ్చింది, అని అందరూ కోపం,అసహ్యం మిళితమైన భావం తో ఆమెను చూడసాగారు.

అదేమీ పట్టనట్టు ఆమె వాళ్ళకు బాగా దగ్గరగా వెళ్ళింది.

"అయ్యో ఇళ్ళు కాలి పోయినట్లున్నాయే!!??"అని అడిగింది ఆమె.

అక్కడ ఉన్న ఒక వ్యక్తికి నషాళం అంటి పోయిందేమోగాని 'అబ్బే లేదు !!సరదాగా దీపావళి జరుపుకున్నాం' అన్నాడు విపరీతమైన కోపంతో.

"అదేమిటి బాబూ అలాగన్నావు!!??.....నా పేరు పార్వతి ...... నేను పెద్ద దానినే .కానీ అంత గుడ్డి దానిని ,తెలివి తక్కువదానిని కాదు." అంది శాంతంగా.

"ఇక్కడ నీ పేరు, అడ్రెస్స్ ఎవరకీ అక్కర్లేదు . నా పేరు వీరబాబు ....అయితే ఏమిటట!!??" అంటూ కోపంగా ప్రశ్నించాడు వీరబాబు అనే అతను.

"అంత కోపం ఎందుకు బాబూ..."ఏదో చెప్పబోయింది పార్వతి.

"చాలు వెళ్ళవమ్మా ...అడుక్కోడానికి సమయం సందర్భం ఉండక్కర్లేదా!!??" కోపంగా అరిచాడు వీరబాబు.

"అయ్యో బాబూ ...నేను అడుక్కునే దాన్నే కాదనను ......కానీ ఇప్పుడు మీ దగ్గరికి అడుక్కోడానికి రాలేదు.." అంది పార్వతి.

"ఓహో!! విందు చెయ్యడానికి వచ్చావా !!?? విసిగించక పో....పొద్దున్నుంచి వచ్చే వాళ్ళు ,వెళ్ళేవాళ్ళతో విసిగిపోయి ఉన్నాం." అంటూ తన చూపుడు వేలితో పొమ్మన్నట్టు సంజ్ఞ చేసాడు.

"చూడు బాబు ....."అంటూ ఏదో చెప్పబోతున్న పార్వతిని చెయ్యిపట్టుకుని లాక్కు వెళ్ళబోతున్న వీరబాబుని అక్కడ కుటుంబాలలోని ఒక వయస్సు మళ్ళిన స్త్రీ వారించింది.

"అమ్మా...నీకన్నా నా మీద దయ కలిగింది......అమ్మా నేను ఇక్కడ అడుక్కోడానికి రాలేదు."అంది పార్వతి ఆ పెద్దామెని ఉద్దేశించి .

"మరెందుకు వచ్చినట్టు!!??"వీరబాబు స్వరం లో కోపం తగ్గలేదు.

"వీరూ..."పెద్దావిడ అతనిని సముదాయించడానికి ప్రయత్నించింది.

"నీకు తెలీదు పెద్దమ్మా .ఇటువంటి వాళ్ళు ఈ హడావిడిలో వీలు చూసుకుని చేతికి అందినది పట్టుకుపోతారు."అన్నాడు వీరబాబు.

"బాబూ...మరీ అంత అన్యాయంగా మాట్లాడకు.....నేను అడుక్కునే దాన్నే కావచ్చు కానీ దొంగను కాదు....అమ్మా నీతో ఒక నిమషం మాట్లాడవచ్చా !!??"అంది పార్వతి ఆ పెద్దామె వైపు తిరిగి.

వీరబాబు ఏదో అనబోతే పెద్దామె వారించింది.

"చూడమ్మా .. ....మా పరిస్థితి చూసావు కదా ...ఇప్పుడు మేమే అడుక్కునే వాళ్ళలా అయిపోయాం...." అంది ఆ కుటుంబాలలో పెద్దమ్మ .

"అమ్మా .నేను అడుక్కోడానికి రాలేదు. చేతనైన సహాయం చేద్దామని వచ్చాను." అంది పార్వతి నెమ్మదిగా .

"ఏమిటి!!?? ...నువ్వు...సహాయం ..చేయడానికి వచ్చావా!!??" ప్రతి మాట వత్తుతూ పలికాడు వీరబాబు.

"ఉదయం నుంచి చాలా మంది వచ్చి మమ్మల్ని ఊదరగొట్టి వెళ్ళారు. ఇక ఇప్పుడు నువ్వు వచ్చావు ఏదో గొప్ప సహాయం చెయ్యడానికి!!?? " అన్నాడు వీరబాబు వ్యంగంగా.

"అవును బాబూ.... నువ్వు అన్నట్టుగా పెద్ద సహాయం ఏమీ చెయ్యలేను గాని నాకు తోచింది ,నేను చెయ్యగలిగింది చేద్దామనుకుంటున్నాను........ .ఈ కార్తీక మాసమంతా నేను ఉండే గుడి కి జనం బాగా వచ్చారు......ప్రజలలో ధర్మ గుణం ఎక్కువ అయ్యిందో ఏమో.." అంటూ నవ్వింది పార్వతి.

మరల చెప్ప సాగింది పార్వతి "నా దగ్గర అయిదు వేల రూపాయల వరకు ఉన్నాయి " అంటూ తన దగ్గర ఉన్న సంచి లోంచి వందల నోట్లు బయటకు తీసింది.

"మాములుగా చిల్లరకి ఎక్కువ డబ్బులిస్తారు కదా. అలాగా కొంచెం ఎక్కువ వచ్చింది.. పరిస్థితి చూస్తే మీరు ఎవ్వరూ తినడానికి కూడా ఏమి మిగల్చలేదు ఆ అగ్ని దేవుడు. నువ్వు అయితే కుర్రాడివి రెండు రోజులు తినక పోయినా ఉండ గలవు .పాపం పెద్ద వాళ్ళు,పిల్లలు తినకుండా ఉండలేరు కదా ....మీరు అందరూ ఈ పూటకి భోజనం చేయడానికి ఈ డబ్బులు సరిపోతాయికదా. ఈ డబ్బు ఉంచు. మీ అమ్మ ఇచ్చింది అనుకో. .ఇది ఖర్చు అయిపోయిన తరువాత మీ బాధలేవో మీరు పడుదురు గాని ."అంటూ తన దగ్గర ఉన్న డబ్బు అంతా వీర బాబు చేతిలో పెట్టింది.

ఆ క్షణంలో వీరబాబు ముఖం లో ఎన్నో తెలియని భావాలూ ప్రవేశించాయి.అయితే ఆశ్చర్యం అన్నింటిని అధిగమించింది.

'ఉదయం నుంచి వచ్చిన వాళ్ళంతా శుష్క ప్రియాలు చెప్పి , శూన్య హస్తాలు చూపించారు. వాళ్ళు ఎప్పుడో ఏదో ఒరగ పెడతామని చెప్పారు.ప్రస్తుత పరిస్థితి అర్థం చేసుకున్నవారు ఒకరూ లేరు.తమకు వెంటనే కావలిసింది ఎవరూ పట్టించుకోలేదు. తమకు ప్రస్తుత అవసరం ఆకలి తీర్చుకోవడం ..... అమ్మ రూపం లో ఉన్న ఈ దేవత అందరి కడుపు నింపడానికి వచ్చింది. తల్లికంటే పిల్లల ఆకలి ఎవరికీ తెలుస్తుంది !? ఛీ! అటువంటి దేవత గురించి ఎంత నీచంగా ఊహించుకున్నాను.' అనుకున్నాడు వీరబాబు.

"అదేమిటి నువ్వు...మాకు ఇవ్వడం..అది కాక ఉన్నదంతా మాకు ఇచ్చేస్తే.........!!??" అర్ధోక్తిలో ఆగిపోయాడు వీరబాబు.

"అయ్యో నాదేముంది బాబూ ...గుడిలో పది రూపాయిలు రాకపోవు...... అయినా ఏ క్షణం లోనన్నా రాలి పోయే ఈ పండుటాకుకు అ దేవుడే రక్ష. వస్తాను బాబూ ......వస్తానమ్మా" అంది పార్వతి.

"అమ్మా ..."అంటూ కళ్ళల్లో కృతజ్ఞతతో నిండిన అశ్రువులు తో ఆ అన్నపూర్ణ కి ,జగజ్జననికి, అమ్మల గన్నఅమ్మకి నమస్కరించాడు వీరబాబు.అతనితో ఎన్నో చేతులు కలిసాయి

❦❦❦

# చిగురించిన జ్ఞాపకం — మణివడ్లమాని

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

మనుషులు కాలగర్భంలో కలిసిపోయిన వారి గుర్తులు జ్ఞాపకాలు కొన్నైయైనా మిగులుతాయి. కొంతకాలానికి ఆ జ్ఞాపకాలు కూడా మరుగున పడిపోతాయి. కానీ ఈ మధ్యన ఓ జ్ఞాపకం నివురును తొలగించుకొని బయటకు వచ్చింది. ఎలా మర్చిపోయవంటూ కేకలు వేసింది. చిత్రంగా అది ఎక్కడ వచ్చింది అంటే ఈ మధ్య పిల్లల్ని తీసుకుని నార్త్ఇండియా టూర్ వెళ్ళినప్పుడు. ఆగ్రా,మధుర,బృందావనం వెళ్ళాము. ఆ బృందావన వీధులలో తిరుగుతూ ఉంటె జ్ఞాపకం వచ్చింది. నిజానికి ఆ జ్ఞాపకానికి ఆ ఊరుకి పొంతన లేదు. అయితేనేం మర్చిపోయిన జ్ఞాపకానికి అక్కడ జ్ఞాపకం వచ్చింది.

★★

టూర్ నుంచి వచ్చాకా ఓ ఆది వారం రోజున సందడి అంతా మా ఇంట్లోనే. మా పెద్ద తమ్ముడి పిల్లలు శ్రుతి,కృతి చెల్లెలి పిల్లలు, సౌమ్య,వంశీ నా పిల్లలు,దివ్య,కావ్య వెరసి అర డజను మంది. ఇల్లంతా పీకి పందిరివేస్తున్నారు.

గోల గోల చేస్తున్న పిల్లలకి చెప్పాను.

"ఈ రోజు మీకు ఒక అసైన్‌మెంట్ ఇస్తాను అది చెయ్యాలని."

"ఏమిటేమిటి" అంటూ ఎగిరారు

"పాత ఆల్బమ్స్ అన్ని తీసి స్కాన్ చేసి పెట్టండి అన్ని కంప్యూటర్ లో సేవ్ అయ్యి ఉంటాయి.సరేనా?

"సరే సరే" అంటూ చెప్పగానే బుద్ధిమంతులా పని మొదలు పెట్టేసారు.

పైన అటక మీదున్న సూట్కేసు కిందకి దింపారు. "అబ్బ ఎన్ని ఆల్బమ్స్!" అంది చిన్న మేనకోడలు కృతి.

దానికి ప్రతీది ఆశ్చర్యమే!

ఆ పోటో లు చూస్తూ తెగ నవ్వుకుంటున్నారు.పిల్లలు.

అబ్బో "అక్కా! మమ్మిని చూడు ఆ రెండు జడలు,ఆ లంగా వోణిలో యెంత గమ్మత్తుగా ఉందొ, అని కావ్య కామెంట్,

"మమ్మీ ఏంటాఆ పొడుగు బొట్టు హహహ," అని దివ్య మొహం చిరాకుగా పెట్టింది.

"అయ్యా,ఇక్కడ చిన్నత్తని చూడు, ఎటో చూస్తోంది"

"ఇది తాత గారు కదా, భలే యంగ్ గా ఉన్నారు, తాజమహల్ దగ్గర కదా "

"నేను చూడలేదు తాతగారిని , నేనూ చూడలేదు నేను చూడలేదు అని దివ్య,సౌమ్య తప్ప మిగతావాళ్ళు అనుకుంటున్నారు

ఇక ,ప్రతి ఫోటో గురుంచి ఏదో ఒకటి మాట్లాడుతూ విరగ బడి నవ్వుతున్నారు.

"పెద్దత్తా అప్పుడు నువ్వు ఎంత సన్నగా ఉన్నావో," శ్రుతి కామెంట్

"మమ్మి పిన్ని పెళ్ళికి నేను రాలేదా? అని నా చిన్నకూతురి కొంటె ప్రశ్న

"అప్పుడు నువ్వు మీ మమ్మీ బొజ్జలో ఉన్నావు" అని కృతి కిసుక్కున నవ్వింది.

"అమ్మా! ఇది అన్ని పెద్ద మాటలు మాట్లాడుతోంది" అని నా పెద్దకూతురు దివ్య కంప్లైంట్ చేసింది.

"అబ్బబ్బ దెబ్బలాడు కోకుండా పని చేయండి" అని కసిరాను. అప్పటికి కాస్త ఊరుకొని మళ్ళి ఏదో ఒకటి లొడ లొడ వాగుతూనే ఉన్నారు.

ఫోటోలు చూస్తున్న చిన్న మేన కోడలు కృతి ఒక ఫోటో తీసి చూపిస్తూ ఈవిడ "వీళ్ళు ఉన్నారేంటి? అని అడిగింది."నేను అందుకొని చూసాను.

అది మా మా నాన్నమ్మ, చిన్నాన్నమ్మఉన్న ఫోటో . మెదడు లో ఏదో కదలిక

"ఏది ఏది" అంటూ అందరూ చూసారు, అప్పుడు దివ్య చెప్పింది "ఆవిడ ఎవరంటే మన తాతగారు ఉన్నారు కదా! అదే మీ డాడీ వాళ్ళ డాడీ కి పిన్ని అవుతుంది"

"అవును వాళ్ళిద్దరూ జుట్టు లేకుండా, బ్లౌజ్ లేకుండా అలా టిపికల్ గా ఎందుకున్నారు?" అని అన్నారు ఆ ప్రశ్నకి దివ్యకి కూడా ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

వాళ్ళు ఎందుకలా ఉన్నారనే భావం వాళ్ళ మొహాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వెంటనే నేను వాళ్ళతో "కృతీ, పాత రోజులలో హస్బెండ్ పోతే ఆడవాళ్ళు అలాగే ఉండేవారు. తరువాత ఆ పద్దతి మారిపోయింది. ఇప్పుడు ఎవరు అలా ఉండటం లేదు" అని చెప్పాను

"పాపం వాళ్ళకి జుట్టు లేకపోతె ఏడ్చేవారు కాదా?" అని అమాయకంగా అడిగింది.

దాన్ని ఎలాగో సమాధాన పరిచి ఆ ఫోటో తీసుకోని బయటికయితే వచ్చాను కానీ

ఆ మాటలు మాత్రం నా చెవిలో గింగురుమంటూ ఉన్నాయి.

★★

మా టూర్ నుంచి వచ్చాక ఓ ఫ్రెండ్ ఇంట్లో, ఒక మహిళా దర్శకురాలు వితంతువు ల మీద తీసిన సినిమా చూడటం జరిగింది. అందులో ని చిన్నపిల్ల పాత్ర ని చూడగానే మటుకు చిన్నానమ్మ గురించి, నాన్నమ్మ చెప్పినవన్నీ కళ్ళముందు నిలిచాయి.

ఏడేళ్ల పిల్లకి పెళ్లి చేసారుట, అతనికి దాదాపు ఇరవయ్యేళ్లు ఉన్నాయేమోట ఏదో జబ్బు చేసి ఆయన కాస్తా హరీమన్నారుట. అప్పటి నుంచి పుట్టింట్లో అన్నగారి దగ్గర ఉండిపోయారు.

ఇంతకీ ఆ పెళ్ళి చేసింది'ఆవిడ మేనత్త. ఇంట్లో ఆడపిల్ల ఎదిగిపోతోందని,మేనల్లడుకి భారం తీరిపోతుందని బాధ్యత నిర్వహించి పెళ్లి అయితే చేసింది కానీ."అతను జబ్బు మనిషి అని తెలియదు" అని చేతులు దులిపెసుకుంది. "పైగా వాళ్ళు బోలెడు ఆస్తిపరులే మనోవర్తి ఇస్తారు" అంటూ చెప్పబోయేసరికి. మా నాయినమ్మ అన్నగారు ' ఇక చాల్లే జరగాల్సిన అన్యాయం జరిగిపోయింది. ఇక నోరుముసుకో అని ఆవిడని కసిరేసి పంపించేసారు..

ఏ మాటకామాట చెప్పుకోవాలి. మా తాతగారు పెద్ద అభ్యుదయ వాది, రాజారామోహన్ రాయ్ మాటలకు చాలా ప్రభావితం అయ్యారుట. అందుకే మరదలుని చూసినప్పుడల్లా. చిన్నపిల్ల,మళ్ళీ పెళ్లి చేస్తే బావుంటుందని, ఆయనకి అనిపించేది అని నాన్నమ్మ చెబుతుంటే మా తాతగారు ఓ హీరో లా అనిపించారు. .

అంతే ఆ మాట కాస్త మా నాన్నమ్మ అన్నగారికి తెలిసి ఈ బావగారు తన చెల్లెలికి ఎక్కడ మళ్ళీ చేయించేస్తాడో అని వెంటనే ఆవిడని ఇంటికి పిలిపించి గుండు గీయించి,తెల్లచీర కట్టి ముసుగేసి కూర్చోపెట్టారుట.

ఆవిడకి జుట్టు తీసిన సంఘటన గురుంచి చెబుతుంటే,నాకు మా చెల్లెలుకి ఎంత బాధ వేసిందో.పాపం ఏవిటి ఆవిడ బతుకు అటు పుట్టింటపంచన,లేకపోతె అత్తింటి పంచన చేరి ఎంత నరకం అనుభవించుంటుందో కదా అనిపిస్తుంది.

అటు ఇద్దరు అక్కల ఇళ్ళలో, అన్నగారి ఇంట్లో, ఇటు అత్తగారి వైపు వాళ్ళ ఇళ్ళలో పురుళ్ళకి,పుణ్యాలకి, ఇంకా ఇతరత్రా పనులకి అంకితమయింది .చెయ్యని తప్పుకు అందరి చేత, తిట్లూ .ఈసడింపులూ మధ్య ఆవిడ జీవితం తెల్లారిపోయింది.

అవన్నీ వింటున్న మాకు ఉక్రోషం వచ్చి మానాన్నమ్మతో అన్నాము "మీరు ఎందుకు మన ఇంట్లోనే ఉంచేసుకోకపోయరా అంటే, దానికి ఆవిడ రెండు కారణాలు చెప్పారు "ఒకటి ఇప్పటి కాలం లా కాదు|రా అప్పుడు అన్నిటికి భయమే, రెండోది మీతాతగారు కూడా చిన్న వయసులోనే పోయారు. మీ నాన్నకి ఐదు ఏళ్ళు,అత్తయ్యకి మూడేళ్లు నాకే దిక్కులేదు. మీ నాన్న ఓచోట, నేను ఓచోట ఉండేవాళ్ళము ఇక దాని సంగతి ఏం ఆలోచిస్తాను. మీ నాన్నకి ఉద్యోగం,పెళ్లి, అయ్యాక, అది మళ్ళీ నా దగ్గరకు రావడం మొదలుపెట్టింది" అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

ఇంతలో బయట హడావుడి విన్పించింది. నా ఆలోచనలకు స్వస్తి చెప్పి బయటకు వచ్చాను. శ్రీవారు ఆఫీసు నుంచి వస్తూనే హుషారుగా "కార్లో ఓ రెండు రోజులు ఎక్కడికైనా వెళదాము" అనగానే ఠక్కున "మామిడాడ వెల్దాము" అన్నాను

"అదేమిటి అక్కడికి ఎందుకు" అనగానే పిల్లలు "మమ్మీ ఎందుకో చిన్న తాతమ్మను తలచుకొని అప్సెట్ అయింది" అని చెప్పారు.

"అరె అదేమిటి ఎప్పుడో జరిగిన దానికి ఇప్పుడు తలచుకుని బాధ పడితే ఎలా?" అని అన్నారు.

"అదేం లేదు లెండి ఏదో మా చిన్న తనం ఆ రోజులు,నాన్నగారు,నాన్నమ్మ ఇలా అన్ని జ్ఞాపకాలు కలిపి గుర్తుకొచ్చాయి" అనేసరికి

"సరే! మరి ఆ ఊర్లో ఎవరు ఉంటున్నారు అన్నారు. "ఇంకో చిన్నానమ్మ కొడుకు ఉంటున్నాడ. అని అన్నాను.

"ఓకే అయితే అక్కడికే వెల్దాము" అన్నారు.

★★

అనుకున్నట్లుగానే శనివారం పొద్దున్నే మేము నలుగురం బయలుదేరాము. మధ్యలో సూర్యాపేట లో టిఫిన్లు కానిచ్చుకొని బయలుదేరాము.

అప్పుడు నా పక్కనే కూర్చొన్న దివ్య అడిగింది "మమ్మీ చిన్నతాతమ్మ గురుంచి నాకు తెలుసుకోవాలని ఉంది. ఇప్పుడు వివరంగా చెప్పు"

దానికి చెబుతూ నేను గతం లోకి వెళ్ళిపోయాను .ఆవిడని మొదటి సారి చూసిన దృశ్యం గుర్తుకొచ్చింది. అప్పుడు నాకు పదేళ్లు. ఐదవ క్లాసు చదువుతున్నాను. ఓ రోజున మా ఇంటికి వచ్చారు ఆవిడ పేరు యశోద,కాని అందరూ సోదెమ్మ అని పిలిచేవారు.

చూడటానికి కొంచెం పొట్టి గా,బొద్దుగా లా ఉండే వారు. ఆవిడవి చక్కటి ముఖకవళికలు. ఎప్పుడువచ్చినా పిల్లలున్న ఇల్లు అని ఏదో ఒకటి చేసి తెచ్చేవారు. ఆరోజున కూడా అలాగే రెండు చేతుల నిండా సంచులు,అందులో జంతికలు,చేగోడీలు,ఇంకా అప్పడాలు వడియాలు కూడా తెచ్చారు. రాత్రి అయింది. అందరూ భోజనాలు చేసి పడుకున్నారు. మంచి నిద్ర లో ఉన్న నాకు ఎక్కడ నుంచో మూలుగు వినిపిస్తోంది,అది అంతకంతకూ అది పెద్దదిఅయింది,"బాబోయి చచ్చిపోతున్నరోయి,అంటూ కేకలు", ఉలిక్కిపడి గబగబా లేచాను,

అప్పటికే నాన్నగారు,అమ్మ,నానమ్మ అందరూలేచారు.

నిద్రమత్తులో ఉన్న నాకు ఏమైందో తెలియటం లేదు.

మా నాన్నమ్మ మాత్రం "వెధవ కడుపు నొప్పి దాని ప్రాణాలు తీసేస్తోంది" అని మెల్లగా అంటున్నారు.

మాఅమ్మ "పోనీ నేను వెళ్లి చూస్తాను" అంది.

"నువ్వెళ్ళి ఎలా చూస్తావు, అది అసలే ఇంట్లోకి రాకూడదు" అన్నారు.

"పర్వాలేదు లెండి స్నానం చేస్తాను" అని అమ్మ అంది

"అబ్బ అలా ఆవిడ లుంగలు చుట్టుకు పోతుంటే చూడ లేకపోతున్నాను, అసలు ముందు ఆవిడని ఆ సందులోంచి వచ్చి లోపల పడుకోమను. ఏదైనా పురుగు,కుట్టిందంటే ప్రమాదం,ఆ కడుపు నొప్పి తగ్గడానికి కాస్త వాము నీళ్ళు ఇవ్వండి" అని నాన్నగారు అన్నారు.

అమ్మ వెళ్లి ఆవిడని లోపలకి తీసుకొచ్చి ఓ మూలగ చాపమీద పడుకో పెట్టింది,ఆవిడ నాన్నగారిని చూసి తెగ మొహమాటపడిపోతోంది. "ముందు వాడిని లోపలికి వెళ్లి పడుకోమను. ఈ వెధవబాధ నాకెపుడు ఉండేదే" అనిఅన్నారు.

దానికి నాన్నగారు వెంటనే "పిన్నీ!నువ్వు ఇప్పుడు ఏంమాట్లాడకమ్మా"అని అమ్మ వైపు తిరిగి

"ఆవిడని రేపో సారి హాస్పిటల్ కి తీసుకెళ్ళి ఆ చాకో గారికి చూపించు" అన్నారు.

"అమ్మా,ఏమైంది చిన్నాన్నమ్మకి అని అడిగాను,

"ఏదో లే నీకెందుకు పెద్దవాళ్ల విషయాలు అని కసిరేసారు" ఆ సంఘటన నా మనసులో చెరగని ముద్ర వేసుకుపోయింది. నా మాటలు వింటున్న దివ్య "మమ్మీ ఛీఛీ ఘోరం కదా అది ఆవిడకి పాపం పీరియడ్స్ లో వచ్చే కడుపు నొప్పి వచ్చేదా,అబ్బ వింటుంటే నే భలే బాధగా ఉంది" అంది.

"అవును, దివ్యా ! అప్పట్లో కొన్ని పద్ధతులు అలానే ఉండేవి."అని మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాను. ఎప్పటిలాగే ఆవిడ ఎవరికి సాయం కావాలన్నా వాళ్ళ ఇళ్ళకి వెళ్ళడం,అక్కడ చాకిరీ చేస్తుండగానే,ఇంకో ఇంట్లోంచి పిలుపు వచ్చేది..అలా ఎవరికి అవసరం ఉంటె అక్కడికి వెళుతూ ఉండేవారు. అయితే ఆ పనులకి తగిన గుర్తింపు ఎవరం ఇవ్వలేదేమో అనే ది గుచ్చుతూఉంటుంది

నాన్నగారికి ట్రాన్స్ఫర్స్ మూలంగా మేము ఊర్లు మారినప్పుడు మటుకు మా మేనత్త వాళ్లింట్లో ఉండేవారు ఆవిడకూడా బాగా చూసుకునే వారు. వాళ్ళ ది పెద్ద ఫ్యామిలీ,డబ్బున్నవాళ్ళు కూడా .వాళ్ళ పిల్లలతో ఆవిడ చాల సరదాగా ఉంటూ కాలక్షేపం చేసేవారు. మధ్యలో మా అత్తయ్య తెలుసున్న లేడీ డాక్టర్ ద్వారా ఆవిడకు ఆపరేషన్ చేయించారు. దానితో ఆవిడ కడుపు నొప్పి బాధ పోయింది.

ఆవిడ అందరికి సాయం చేసింది. ఆవిడ అక్కపిల్లలు,అన్నపిల్లలకి కాకుండా మొహమైనా తెలియని భర్త వైపు వాళ్ళకి, మరుదులు,ఆడపడచులు పెళ్ళిళ్ళకి,పురుళ్ళకి,వెళ్లి ఇంటెడు చాకిరీ చేసేది. కానీ తలచుకుంటే ఎంతో బాధ వేస్తుంది ఇంతా చేసి ఆవిడ ఏం సుఖపడింది,తంకో ఇల్లు లేదు,తన సొంతవాళ్ళు యెవరులేరు. సంచారిలా అందరిళ్ళు తిరిగేది. ఎవరి ఇంట్లోను ఓ పరుపుమీద గాని,మంచం మీద గాని పడుకోవడం ఎరగదు. ఏదో మూల చాపవేసుకొని పడుకునేవారు. ఆ తర్వాత,తర్వాత మా నాన్నగారు ఆవిడ కోసం ఒక మంచం చేయించారు. "అబ్బే నాకు మంచం వద్దురా! కొంగు పరచుకుని పడుకుంటే చాలు" అని అనేవారు.

ఆ అభిమానంఅను,కృతజ్ఞత అను ఆవిడ ఖర్చులకి మేము(నేను, పిన్ని, మావయ్యలు) డబ్బు ఇస్తూఉండేవాళ్ళము

ఆవిడకి సినిమాలు అంటే ఇష్టం,బయటకు వెళ్ళడం సరదా, ఇవన్ని అందరికి ఉండే అతి సామన్యమైన కోరికలు. అవికూడా తీరలేదు. మా ఇంటికి వస్తే, ఆవిడకి ఒక విధమైన స్వతంత్రం ఉండేది. మా నాన్నగారు అల చూసుకునే వారు.అప్పట్లో నేను పిన్ని అనే వాళ్లము "మీరు కొంచెం ధైర్యం చేసి ఉంటె బావుండేది.నాన్నమ్మా అంటే "ఒసే ఒసే అలా మాట్లాడకండే,అవన్నీ పాపపు మాటలే నరకం లో కొరత వేస్తాదే" అనేది. ఆవిడ అమాయకత్వానికి జాలి వేసేది. అన్నటికంటే నేను పిన్ని విలవిల లాడింది దేనికంటే జుట్టు పెరిగిపోయింది మంగలి వాడిని పిలవమని అన్నప్పుడు మటుకు ఇద్దరిమీద జాలి వేసేది, "ఆ మంగలి వాడిని పక్కనే ఉన్న గంత లోంచి రమ్మనమను అని చెప్పటం చాల బాధ గ ఉండేది.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. నాకు,పిన్నికి పెళ్ళిళ్ళు అయి ఇక్కడకు వచ్చేసాము. ఫొటోస్ లో చూసారు కదా . ఆ తరువాత మా అత్తయ్య వాళ్లింట్లో కూడా పరిస్థితులు మారాయి. మానాన్నమ్మ పోయారు,ఆ వెంటనే మానాన్నగారు కూడా పోయారు. మా అమ్మే మా దగ్గరుకు వచ్చేసింది. ఇక ఆవిడ మళ్ళి పుట్టింటికి మామిడాడ వెళ్ళిపోయారు. ఆ ఇంట్లో మా నాన్నమ్మ ఇంకో చెల్లెలు కొడుకు దగ్గర ఉండి చివరి రోజులు గడిపారు

ఆవిడ పోయినప్పుడు నాకు ఆపరేషన్ అవటం వల్ల వెళ్లలేకపోయాము. ఆ తరువాత అక్కడి కి వెళ్ళాల్సిన పని లేకపోయింది.

కానీ ఎందుకో మనం టూర్ వెళ్ళినప్పుడు ఆవిడ బాగా గుర్తొచ్చారు. అందుకనే ఒక్కసారి ఆ ఊరు వెళ్ళాలని చాల బలంగా అనిపించింది" అని చెప్పడం ముగించాను.

కొంచెం సేపటి వరకు ఎవ్వరూ మాట్లాడలేదు. వాతావరణం తేలిక చేయడానికి డ్రైవ్ చేస్తున్న మా వారు ఏదో సరదా కబుర్లు చెప్పి నవ్వించారు.

ప్రయాణం మధ్యలో రెండు సార్లు ఆగాము ఒక సారి లంచ్ కోసం తణుకు దగ్గర.ఆ తరువాత రామచంద్రపురం బైపాస్ రోడ్ లో టీ కోసం ఆగాము. మారెండో అమ్మాయి కావ్య ,మా వారు మాట్లాడుకుంటూ బానే తొందరగానే తీసుకొచ్చేసారు.

సాయంకాలం కల్లా కాకినాడకి వెళ్లి పోయాము అక్కడ హోటల్ ఆ రాత్రి గడిపి , పొద్దున్నే. మామిడాడ బయలుదేరాము.

దార్లో బిక్కవోలులో వినాయకుడిని,గోలింగేశ్వరుడుని చూసుకొని మామిడాడ ఊర్లోకి చేరుకున్నాము.ఆ ఇంట్లో ఉన్న ఇంకో చిన్నాన్నమ్మ కొడుక్కి ఫోన్ చేస్తే ఆయన దారిగుర్తులు చెప్పారు. ఆ గుర్తులు పట్టుకొని సరాసరి ఇంటి ముందే వెళ్లి ఆగాము. అప్పటికే వాళ్ళు మాకోసం ఎదురు చూస్తున్నారు. మమ్మల్ని చూసి వాళ్ళు ఎంతో సంబరపడిపోయారు. భోజనాలు అయ్యే లోపల ఎదురుకుండా ఉన్న సూర్యభగవానుడి గుడికి వెళ్లి దర్శనం చేసుకున్నాము. ఈ గుడి గురించి కూడా ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. లోపల ఊర్లోకి వెళితే కోదండరామాలయం కూడా ఉంది. మా నాన్నమ్మల కిష్టమయిన పుట్టింటి రాముడు.

ఈ ఇంటి మనవరాలు మొగుడు అని మా ఆయనకి స్పెషల్ గా వెండికంచం వేసి సుష్టుగా భోజనంపెట్టారు.పిల్లలు కూడా పెద్ద పరిచయం లేకపోయినా వాళ్ళతో బాగా కల్సిపోయారు.

ఆ ఆత్మీయత వెలకట్టలేనిది.

మా నాన్నమ్మ పుట్టిల్లు వందేళ్ళ నాటి పెంకుటిల్లు. ఆకారం ఉంది గాని. ఇల్లు లోపల అంతా పాడు బడిపోతోంది, ఏవో చిన్నచిన్నగ మరమ్మత్తులు చేయించారు.

ఎర్రమందారం,జూకామందారం చెట్లు, బూడిదగుమ్మడి,చిక్కుడు పాదులు ఆ పక్కకి నూతిపళ్ళెం అచ్చు చిన్నాన్నమ్మ వర్ణించి నట్లే ఉన్నాయి. చిన్నాన్నమ్మ చివరి రోజులలో ఇక్కడే గడిపారు.ఆ ఇల్లు మొత్తం ఆవిడ స్మృతులతో నిండి ఉంది. ఇల్లంతా కలయ తిరిగాము.కొన్ని పాత ఫోటోలు చూసాము మసకబారి,మచ్చలుపడి,మొహాలు కనిపించకుండాఉన్నాయి,అయినా ఇన్నాళ్లుగా గుండెల్లో ఉన్న బరువు ను చేత్తో తీసేసినట్లుగ ఉంది. వాళ్ళని చూసి కలసి మాట్లాడినంత ఆనందంగా అనిపిస్తోంది. మమ్మలిని ఇక్కడ చూసి తప్పకుండా ఆవిడ పై నుంచి ఆశీర్వదిస్తారు అనుకున్నాను

వాళ్ళకి చెప్పి తిరుగుప్రయాణం అయ్యాము.

ఆ ఇల్లు, గుర్తులు శిథిలమవుతున్నా లోపల నుంచి మళ్ళీ ఓ జ్ఞాపకం చిగురిస్తోంది ఆకుపచ్చగా!

★★★★★★★

# మార్గదర్శి మంథా భానుమతి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

తలుపు తీసి బైటికి రాబోతూ జేబు తడుముకున్నాడు ఆనంద్. ఖాళీగా తగిలింది. లోపలికెళ్ళి పర్స్ తీసుకుని తెరిచి కావలసినవన్నీ ఉన్నాయా అని చూసుకుని జేబులో పెట్టుకుని బైటికొచ్చి తలుపు తాళం వేశాడు. బిల్టిన్ గాడ్రెజ్ లాక్. అడ్డగడియ మాత్రం వెయ్యలేదు. ఇంట్లో మనుషులు ఉన్నారని అనుకోవాలి బైటనుంచి ఎవరైనా చూస్తే.

ఎప్పుడు బైటికెళ్ళినా పర్స్ లో అన్నీ పెట్టుకుని, పర్స్ జేబులో పెట్టుకుని వెళ్ళమని శ్రీమతి సరస్వతిగారి ఆర్డర్. ముఖ్యంగా సెల్ ఫోన్, తన విజిటింగ్ కార్డు, ఆధార్ కార్డు, క్రెడిట్ కార్డు. లాకర్ తాళం చెవి, బీరువా తాళాలు ఇంటి గుత్తిలోనే ఉంటాయి.. అవన్నీ ఎందుకంటే అలక.. "చటుక్కున ఏదైనా ఐతే.. కళ్ళు తిరిగితే, కార్డు ముక్కుంటే ఫోన్ చేసి చెప్తారెవరైనా ధర్మాత్ములు. అలాగే, మనం లేనప్పుడు దొంగలు వచ్చినా, బీరువా తాళాలు వాళ్ళకి చిక్కవు.." నిజమే.. ఎప్పటికప్పుడు మంచి సలహాలిస్తూ మార్గదర్శి అయింది, తన జీవితంలోకి ప్రవేశించినప్పటి నుంచీ.

ఆవిడని తలుచుకుని నవ్వుకుంటూ గేటు తీశాడు. ఆనంద్ కి డెబ్భై ఏళ్లు నిండాయి వారం క్రితమే. రోజూ పొద్దున్నే ఆరుగంటలలోపు వాకింగ్ కి వెళ్లడం నలభై ఏళ్ల నించీ అలవాటు.

ఇంకా తెల్లవారలేదు. మసక చీకటిగానే ఉంది. వచ్చీరాని సూర్యుడు, వెళ్లీ వెళ్లని చంద్రుడు ఊసులాడుకుంటున్నట్లు, వింత వెలుగు పరుచుకుంది, గేటు లోపలా బైటా కూడా. చలికాలం.. చేతిలో ఉన్న మంకీకాప్ తగిలించి, గేటుతీసి బైటికెళ్తూ, చేతి కర్ర మీద ఆనుకున్నట్లుగా నిల్చుని వెనక్కి తిరిగి చూశాడు ఆనంద్.

కొబ్బరి, మామిడి, అరటి చెట్ల మధ్యలో ఠీవిగా నిల్చుంది ఆనంద్ ఇల్లు. తమ ఇద్దరి కలల పంట. ఒకరి నొకరు ప్రతీ చిన్న విషయం సంప్రదించుకుంటూ కట్టిన ఇల్లు. కాంక్రీట్ పోర్టికో వద్దని, కర్ర స్తంభాలతో దిట్టమైన పందిరి వేయించింది సరస్వతి. దాని మీదికి మాలతీ తీగ, రాధామనోహరం తీగలు పాకించింది. ఇంట్లోకొచ్చే వారికి తలలూపుతూ తెల్లని, ఎర్రెర్రని పూలూ తమ సుగంధాల స్వాగతాలు పలుకుతాయి. రోజూ పైనుంచి పడే తుక్కు తుడవటం కష్టం అని వద్దన్నాడు ఆనంద్. అదంతా నేను చూసుకుంటా అని భరోసా ఇచ్చి, నిజంగానే తనే బాధ్యత తీసుకుంది. రోజూ రెండు పూటలా తుడిపించడం, వారం వారం పందిరి మీద ఎండాకులు ఏరించి, శుభ్రం చేయించడం..

ఆనంద్ కి గర్వంతో హృదయం ఉప్పొంగినట్లయింది.

మూడు పడగ్గదుల ఇల్లు.. ఊరికి దూరంగా కట్టుకున్నా.. కాలక్రమేణా ఊరు పెరిగి, అదే ఊరి మధ్యకు వచ్చేసింది. ధర కూడా అనూహ్యంగానే పెరిగింది. కోటీశ్వరులయ్యామని సంబరంగా చెప్పుకునే సరస్వతిని మురిపెంగా చూసుకోడం ఆనంద్ కి చాలా ఇష్టం.

నెమ్మదిగా నడుస్తూ, చుట్టూ పరికిస్తున్నాడు. చెప్పద్దూ.. కాలనీ సుందరవనంలా తయారయింది. గత ఇరవయ్యేళ్లలో చెట్లన్నీ బాగా పెరిగి, వీధులకి సహజ తోరణాలనేర్పరిచాయి. రెండు వీధులవతలున్న పార్కు దగ్గరవుతున్న కొద్దీ వేగం పెంచాడు ఆనంద్. అప్పటికే తన స్నేహితులంతా మార్చ్ చేస్తున్నట్లు నడవడం కనిపిస్తోంది. నాలుగు వీధుల మధ్యలో పార్క్. ప్రతీ వీధికీ గేటు. లోపల చెట్ల మధ్యలో నడక దారి. కొంత భాగం తీరుగా, కొంత భాగం అడవిలా పెంచారు చెట్లు. కాలనీ సెక్రెటరీ, తన శ్రీమతి సరస్వతే దానికి కారణం. నగరంలో తమ కాలనీ, అందులోని పార్కు ప్రత్యేకంగా ఉంటాయి. ఆమధ్యని ప్రభుత్వ గుర్తింపు కూడా వచ్చింది తమ పార్క్ కి.

"ఆనంద్.. ఇటు ఇటు.." తన ఆఫీసులోనే పనిచేసి, తన తర్వాత రెండేళ్లకి రిటైరయిన వెంకట్ పిలిచాడు. ఆనంద్ వాళ్ల పక్క వీధిలో ఉంటాడు. ఆకాలనీలో సగం మంది పైగా తమ ఆఫీసు వాళ్లే. ఆనందే అందరినీ ప్రోత్సహించి కొనిపించాడు స్థలాలు. అప్పట్లో చాలా చవగ్గా వచ్చాయి. ఒకళ్ల తరువాత ఒకళ్లు ఇళ్లు కట్టేసుకుని స్థిర పడ్డారు.

ముగ్గురు ముగ్గురుగా నడక సాగించారు.

అమెరికా ఎలక్షన్ల దగ్గర్నుంచి ఆవకాయ వరకూ సాగుతుంటుంది చర్చ.. మధ్యలో అటూ ఇటూ మారుతూ, అలిసి పోతే కాసేపు కూర్చుంటూ, రెండు గంటలు పైగా గడుపుతారు రోజూ. కొంత మంది బెంచీల మీద కూర్చుని ప్రాణాయామాలు చెయ్యడం, యువతీ యువకులు చెవుల్లో తీగలు పెట్టుకుని పరుగెత్తు కుంటూ వెళ్లడం, ఇంకా చిన్న పిల్లలు తండ్రి పోరు పడలేక, నిద్ర కళ్లతో, కళ్లు నులుముకుంటూ తూలుతూ నడుస్తూ అప్పుడప్పుడు కూలబడుతూ.. ఆహ్లాదంగా ఉంది వాతా వరణం.

ఆ రోజు వెంకట్ తన ఇంటికి పిలిచాడు ఆనంద్ ని, వేడి వేడి ఇడ్లీ తినెళ్లువుగానని. మార్నింగ్ వాక్ కి వెళ్లే ముందే స్నానం చెయ్యడం అలవాటు ఆనంద్ కి. మనసులోనే, భగవన్నామ స్మరణ చేసుకుంటూ ఉంటాడు. అందుకే ఏ సంకోచం లేకుండా వెళ్లి, ఇడ్లీతో, వేడి వేడి కాఫీకూడా కానిచ్చి ఇంటికి బయల్దేరాడు.

దారిలో కనిపించిన కొందరు మిత్రులతో, కాలనీ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు చర్చించాడు. చెత్త తీసెయ్యడానికి ఏర్పాట్లు, వాన నీళ్లు నిలవకుండా కాలువలు తవ్వడం, వెలగని వీధి దీపాలు.. ఏదో ఒక సమస్య పుడుతూనే ఉంటుంది ప్రతీ రోజూ. చేతి కర్ర ఊపుకుంటూ, స్కూలు బస్సుకోసం వెళ్తూ ఎదురు పడ్డ చిన్నారులకి టాటా చెప్తూ గేటు తీశాడు ఆనంద్.

గేటు దగ్గర్నుంచే.. మీద పడ్డ సూర్యకిరణాలకి తళుక్కుమని మెరుస్తూ కనిపించింది తలుపు మీద. అయోమయంగా, ఆశ్చర్యంగా చూస్తూ ముందుకి అడుగులేశాడు. వీధితలుపుకి అడ్డ గడియవేసుంది. దానికి, మెరుస్తూ పెద్ద తాళం కప్ప. కొత్తది. గాడ్రెజ్ నవతాళ్..

కాళ్లలోంచి ఎవరో శక్తంతా లాగేసినట్లవగా అక్కడున్న సిమెంటు బెంచీ మీద కూలబడ్డాడు ఆనంద్. ఆనుకుని కూర్చోడానికి వీలుగా కట్టించాడు తోటలో అక్కడక్కడ బెంచీలు.. తనే.

"అయ్యగారూ! వచ్చారా?" ఇంటిపక్క సందులోంచి వచ్చి పిలిచింది అలివేలు.. పనిచేసే అమ్మాయి.

అయోమయంగా చూశాడు ఆనంద్.

"అబ్బాయిగారు వచ్చి చాలా సేపు లోపలున్నారండీ. నేను వాకిలంతా ఊడుస్తూ ఉన్నాను. పెద్ద సంచుల్నిండా ఏవో సామాన్లు పెట్టుకొని, తాళం ఏసుకోని వెళ్లిపోయారు. మీరొస్తే వాళ్లింటికి రమ్మన్నారు."

"నువ్వెళ్లిపో. నేను వెళ్తాలే.."

ఆలివేలు వెళ్లిపోయింది. ఆనంద్ నిస్త్రాణగా బెంచీ మీదే కూర్చుండిపోయాడు.. వెనక్కి ఆనుకుని కళ్లు మూసుకున్నాడు. చిత్రంగా.. కళ్లు రెండూ పొడారిపోయాయి. మనసులోని వేదనంతా బయటికి రానంటోంది.

ఆనంద్, సరస్వతిలకి ఒక అబ్బాయి, ఒకమ్మాయి. అమ్మాయి అమెరికా. అబ్బాయి అదే ఊళ్లో తన పిల్లల స్కూలుకి దగ్గరగా, తన భార్య ఆఫీసుకి నాలుక్కిలోమీటర్ల దూరంలో అపార్ట్ మెంట్ తీసుకుని ఉంటున్నాడు. స్వంత వ్యాపారం. కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ నడుపుతాడు.

సరిగ్గా సంవత్సరం అయింది సరస్వతి, ఆనంద్ ని వదిలి స్వర్గానికెళ్లి.

అమ్మాయి రమ్మన్నా, అబ్బాయి వచ్చెయ్యమన్నా ఇంట్లోంచి కదల్లేదు. ప్రతీ అంగుళంలో సరస్వతి సంచరిస్తూ, తనకి సందేశాలిస్తున్నట్లే ఉంది. అలివేలుకి అన్ని పనులూ నేర్పింది. ఆనంద్ కి కావలసినట్లు వండి పెడుతోంది. ఎక్కడికైనా ఎందుకెళ్లాలి? అలవాటయిన చోటు, స్నేహితులూ, కాలక్షేపం. రెండు మూడురోజులకొకసారి, తన వయసువాళ్లతో కలిసి సేవా కార్యక్రమాలకి వెళ్తుంటాడు. తనకి సరిపోగా పెన్షన్ లో ఇంకా మిగులుతుంది.

ఎప్పుడూ చిరునవ్వుతో, నలుగురికీ పనికొచ్చే సలహాలనిస్తూ, పుస్తకాలు చదువుకుంటూ కాలంగడుపుతున్న ఆనంద్ కి వేదన ఎందుకు?

సరిగ్గా నెల క్రితం మొదలయింది ఆనంద్ జీవితంలో ఘర్షణ.

అమ్మాయి దగ్గర్నుంచి వారం వారం పిలుపులు, చూడాలని ఉంది రమ్మని.

అబ్బాయి వత్తిడి పెరిగింది. తమ దగ్గరికి వచ్చెయ్య మని.

పార్కులో కలిసే స్నేహితుల పరిస్థితి కూడా ఇంచు మించు అదే.. కొందరిది తప్ప. ఎవరికీ తమ స్వేచ్ఛని పోగొట్టుకోవడం ఇష్టం లేదు.

కానీ.. ఆనంద్ కి జరిగిన విధంగా ఎవరికీ జరగలేదు.

తను బైటికెళ్లినప్పుడు కొడుకు వచ్చి తాళం వేసెయ్యడం.. తెలుసు ఆ సమయంలో వాకింగ్ కి వెళ్లి రెండు గంటలు గడుపుతాడని. వాడి దగ్గర డూప్లికేటు తాళం ఉంటుంది. అది ఉపయోగించుకుని.. ఇటువంటి పని చెయ్యడం ఊహకి కూడా అందలేదు ఎప్పుడూ! సరైన విలువలు చెలియజెప్పకుండా పెంచారా పిల్లల్ని తాము?

ఆనంద్ కి రెండు రోజుల క్రితం జరిగింది గుర్తుకొచ్చింది.

"నాన్నా! మీరొక్కరూ ఇక్కడెందుకు? మా దగ్గరకొచ్చెయ్యండి." అబ్బాయి వచ్చి, పడక్కుర్చీలో కూర్చున్న నాన్న కాళ్ల దగ్గర కూర్చుని అడిగాడు, అనునయంగా.

"నాకిక్కడ బానే ఉందిరా. ఒక్కడినీ ఉన్నానన్న బాధ లేదు. అలా గేటు ముందు నిలుచుంటే ఎవరో ఒకరు కనపడతారు. ఇంట్లో అన్ని పనులూ పనమ్మాయి చేస్తుంది. మీకు భారంగా ఉండడం ఎందుకు?" కొడుకు ప్రేమకి, బాధ్యతకి మురిసి పోతూ అన్నాడు ఆనంద్.

"మీకు బానే ఉంది.. కానీ మాకే.."

"ఏమయిందిరా?" ఆదుర్దాగా అడిగాడు ఆనంద్.

"ఏం లేదు.. మన ఇంటి పక్క రెండిళ్లు, వెనుక నున్న మూడిళ్లు కలిపి కొని అపార్ట్ మెంట్లు కడ్తానని ఒక పేరున్న బిల్డర్ వచ్చాడు. మనకి మూడు ఫ్లాట్లు ఇస్తాడుట. అది కాక కొంత కాష్. నాకూ పిల్లలు పెరుగుతున్నారు, ఖర్చులు కూడా.." ఆపేశాడు ఎర్ర బడిన ఆనంద్ మొహం చూసి.

"ఈ కాలనీలో అందరం బిల్డర్స్ కి ఇళ్లు అమ్మ కూడదని నిర్ణయించుకున్నాం. కనీసం, మేం బ్రతికున్నన్నాళ్లూ. మన పక్క, వెనుక వాళ్లు కూడా అమ్మరు. ఇది జంగిల్ లాగ ఉండడం మాకు ఇష్టం. కాంక్రీట్ జంగిల్ కాదు." ఆనంద్ నిష్ఠూరంగా అన్నాడు.

"అది కాదు నాన్నా! మనం ముందుకొస్తే అందరూ వస్తారు. డబ్బంటే ఎవరికి చేదు చెప్పండి?"

"మీ ఖర్చులు మీ సంపాదనకి తగ్గట్లుగా ప్రణాళిక వేసుకోండి. మేము అలాగే చేసేవాళ్లం మీకు తెలుసు కదా! నెలకొక సినిమా, ఒక సారి బైటికెళ్లి తినడం. అదే రకంగా, స్కూల్స్ కూడా, మీ తాహతుకి తగ్గ వాటిల్లో చేర్పించాలి. ఇంటర్నేషనల్ అంటూ లక్షలు కడ్తూ.." ఇంక మాట్లాడ్డం ఇష్టం లేనట్లు ఆపేశాడు ఆనంద్.

ఏమన్నా సలహా ఇవ్వబోయినా, దాన్ని మంచిగా తీసుకోవడం లేదు ఈ తరం వాళ్లు. వాళ్ల పిల్లలు ఏదడిగినా ఇచ్చెయ్యాలి. కాదంటే వాళ్లూ ఒప్పుకోరు, వాళ్లమ్మా ఒప్పుకోదు.

ఆనంద్ కి అందుకే తన ఇంట్లో ఒంటరిగా ఉండటమే ఇష్టం. వారానికి రెండు మూడు సార్లు ఇంటికి పిజ్జా తెప్పించుకుంటారు.. అది వాళ్ల భోజనం. రాత్రి ఆ మైదా వంటకం తింటే పడదు ఆనంద్ కి. పైగా వెయ్యి రూపాయల పైనవుతుంది. అంటే నెలకి పదివేల పైన పిజ్జాకే.. ఆలోచిస్తుంటేనే అదోలా అయిపోతుంది ఆనంద్ మనసు. అదే విధంగా పైకి చెప్పుకోలేని అనేక ఇబ్బందులు.. కలతతో కళ్లు మూసుకున్నాడు,

"నాన్నా!" అబ్బాయి పిలుపుకి కళ్లు తెరిచి చూశాడు.

"ఇంకొక్క సారి ఆలోచించండి. మా కష్టాల్ని గుర్తుంచుకోండి. పాతిక లక్షలు కాష్ ఇస్తానన్నాడు బిల్డర్. మన ముగ్గురికీ మూడు అపార్ట్ మెంట్లుంటాయి."

"చెప్పాను కదురా! నా తరువాత మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి." ఇంకేం చెప్పడానికి లేదన్నట్లు లేచి లోపలికెళ్లి పోయాడు ఆనంద్.

అంటే.. ఈ విధంగా తనని వాడింటికి రప్పించుకుని, అనుకున్నది సాధించుకుందామను కుంటున్నాడన్నమాట. ఆనంద్ బెంచీ మీద కూర్చుని, ఏం చెయ్యాలా అని ఆలోచించ సాగాడు.

అంతలో ఫోన్ మోగింది.. తీసి చూశాడు. అమ్మాయి, అమెరికా నుంచి.

నిర్లిప్తంగా నొక్కాడు. అప్పుడే వార్త చేర్చి, తనకి అనుకూలంగా మాట్లాడమని తయారు చేసుంటాడు అన్నగారు.

"నాన్నా! ఎలా ఉన్నారు?"

"బాగున్నా.."

"ఎక్కడున్నారు?

"మనింట్లోనే. ఇంకెక్కడుంటా?" ఆనంద్ కూడా గుంభనగానే మాట్లాడ సాగాడు.

కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయానికొచ్చింది అమ్మాయి.

"ఈ వయసులో మీరు ఒంటరిగా ఎందుకు నాన్నా? అన్నయ్య రమ్మని పిలుస్తున్నాడు కదా! వెళ్ళిపోండి హాయిగా.. ఆ ఇల్లు, జంజాటం అదీ ఎందుకు పెట్టుకుంటారు.." అలా పావుగంట పైగా సాగింది ప్రబోధం.

"ఊ..ఊ.." తప్ప రెండో అక్షరం పలకట్లేదు ఆనంద్.

"ఏంటి నాన్నా అలా ఉన్నారు. ఏం మాట్లాడట్లేదు. అసలెక్కడున్నారు మీరు?"

"మన తోటలో బెంచీ మీద కూర్చున్నా. మళ్లీ మాట్లాడ్తా."

"అన్నయ్య చెప్పిన మాట వినండి నాన్నా.. ప్లీజ్.." అమ్మాయి ఇంకా ఏదో చెప్తుండగానే ఆపేశాడు ఆనంద్.

ఇప్పుడేం చెయ్యాలి? కొడుకు దగ్గరికి వెళ్ళి ఆ లంపటంలో ఇరుక్కోవడం అస్సలు ఇష్టం లేదు. కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్లపోయాడు. ఆ అంతర్యామే సూచిస్తాడు తన గమ్యాన్ని.

నెత్తి మీద ఎండ చురుక్కుమంటుంటే కళ్లు తెరిచి, టైమ్ చూసుకున్నాడు ఆనంద్. పన్నెండు దాటింది. ఇంకా ఆకలి మొదలవలేదు. మనసు ప్రశాంతంగా అనిపించింది. రెండు గంటల్లో బాంక్ మూసేస్తారు.

బాంకుకీ, తన పెన్షన్ ఆఫీసుకీ దగ్గరలో ఉన్న హోటల్లో గది తీసుకున్నాడు. బజారుకి వెళ్లి తనకి కావలసిన బట్టలు, అవసరమైన వస్తువులు, ఒక సూట్ కేసు కొన్నాడు. సాయంకాలం లోగా వీలయినన్ని పనులు ముగించుకోవాలి. అన్ని చోట్లా సహాయం చేసే స్నేహితులున్నారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని పెద్దలు ఊరికే అన లేదు కదా!

ట్రావల్ ఏజంట్ దగ్గరికి వెళ్లి తనకి కావలిసిన చోటికి టికెట్ కొన్నాడు. వ్యవధి తక్కువ ఉంది కనుక ఎక్కువ ఖరీదు.. కానీ తప్పదు. చెప్పవలసిన వాళ్లకి చెప్పదలచు కున్నది చెప్పాడు.

అబ్బాయికి చాలా ఖంగారుగా ఉంది. అనుకున్నదొకటి, అయిందొకటి. తాళాలు వేసి వచ్చేస్తే వేరే దారి లేక తండ్రి తన దగ్గరకు వచ్చేస్తాడనుకున్నాడు. రెండు వారాలయింది.. ఏమైపోయారో తెలీదు.

తెలిసిన అన్ని చోట్లకీ వెళ్లి వెదికాడు. ఎవర్నడిగినా ఏ సమాధానం లేదు. వాకింగ్ స్నేహితులైతే, అబ్బాయి కనిపిస్తే వాయిస్తున్నారు.. తనకి తెలీకుండా ఎక్కడి కెళ్తాడని.

ఇల్లు తెరిచి అంతా తిరగేశాడు. ఇంటి తాలూకు కాయితాలు కూడా ఎక్కడా లేవు. అమెరికా నుంచి రోజూ అమ్మాయి వాయిస్తోంది రెండు పూటలూ. రెండు రోజుల్నుంచీ ఏడుపు కూడా.. తనే మాయం చేశాడేమో నాన్నని అన్నట్లు నెపం వేస్తోంది.

ఇంట్లో భార్యా భర్తలకి కూడా గొడవలెక్కువై పోయాయి. తమకున్న సమస్యలు తీరక పోగా కొత్తవి వచ్చి పడ్డాయి.

ఒక నెల నీరసంగా గడిచాక, అబ్బాయికి ఈ మెయిల్ వచ్చింది. అమ్మాయికి కాపీ కూడా!

సంబోధన ఏమీ లేదు!

"ఎన్నో చెప్పాలని ఉంది. కానీ, మీకు చదివే టైము, చదివినా పాటించే ఓపిక ఉండవని నాకు తెలుసు.

మీకు కావలసిన వన్నీ అమర్చి, మానవత్వపు విలువలు తెలిసేలాగ పెంచామనే అనుకున్నాము మీ అమ్మా, నేనూ. మా అభిప్రాయాలు, ఆశలు మీ మీద రుద్దకుండా, మీకు కావలసినట్లు జీవితాన్ని మలుచుకునేట్లు చేశాము. ఏ నాడూ దేనికీ మిమ్మల్ని బలవంతం చెయ్య లేదు.

మరి ఇప్పుడు నన్ను ఎందుకు బలవంత పెడుతున్నారు?

బలవంతమే కాదు.. బల ప్రయోగం కూడా చేస్తున్నారు. నా ఇంటికి తాళం మీరు వేసుకుని వెళ్లిపోవడం అంటే అది బల ప్రయోగం కిందికే వస్తుంది. నమ్మక ద్రోహం కింద అనిపించింది. నా మనసుకి తగిలింది దెబ్బ. అది మానలేని గాయాన్ని చేసింది.

అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను.

నా పెన్షన్ నాకు సరి పోతుంది ఎక్కడున్నా. పైగా రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఉండనే ఉన్నాయి. మీ మీద ఆధార పడి లేను. ఒక్క రూపాయి కూడా ఆశించ లేదు. నేను కష్టపడి, ఎన్నో కలలు కని కట్టుకున్న ఇల్లు కూల్చేస్తానంటే ఒప్పుకోలేక పోయాను. నువ్వు ఉంటానంటే అందులో ఉండు. లేదా మంచి వాళ్లకి అద్దెకియ్యి. ఇంటి కాగితాలు నా తరువాత నీకు అందేలాగ ఏర్పాటు చేశాను.

అసలు ఏ ఆశ్రమానికో ఇచ్చేద్దామనుకున్నా కానీ.. మీకు ఇవ్వడం నా బాధ్యత అనిపించింది. అది తప్ప ఇంకేమీ నా దగ్గరనుండి ఆశించకండి.

నన్ను వెతకడానికి కూడా ప్రయత్నించకండి. దొరకను.

భగవంతుడిచ్చిన ఓపిక, ఆరోగ్యం ఉన్నాయి. ఆఖరు క్షణం వరకూ ఇలాగే ఉండ నీయమని ఆయన్ని కోరుకుంటున్నాను.

ఒక చోటంటూ లేకుండా తిరుగుతూ ఉంటాను. ఎప్పుడు ఎక్కడుంటానో నాకే తెలియదు. ఆ ప్రదేశం బాగుంటే, నాకు నచ్చితే.. ఎక్కువ రోజులుంటాను. లేక పోతే కొద్ది రోజులే ఉంటాను. ఈ ఆధునిక సాంకేతికత వల్ల పెన్షన్ ఎక్కడున్నా వస్తుంది. బయో మెట్రిక్స్ సహకారంతో, లైఫ్ సర్టిఫికేట్ కి కూడా రానక్కర్లేదు.

నాకు ప్రాపంచిక సుఖాల మీద ఆసక్తి లేదు. ఆధ్యాత్మిక గురువుల ప్రవచనాలు వింటూ, ధ్యానం చేసుకుంటూ ఉంటాను.

నేనీ ప్రపంచాన్ని వదిలి నప్పుడు మీకు సమాచారం వచ్చే ఏర్పాటు చేశాను. కర్మకాండలేమీ చెయ్యక్కర్లేదు. సన్యాసం పుచ్చుకోక పోయినా, మానసికంగా నేను సన్యాసినే.

ఇటువంటి నిర్ణయం తీసుకునే లాగ నాకు అవకాశం కల్పించి నందుకు నీకు ధన్యవాదాలు. జీవిత చరమాంకంలో నా వంటి వారు తీసుకోవలసిన నిర్ణయం ఇది.

జీవితమంతా అవసరమైన సలహాలిస్తూ మీ అమ్మ మార్గదర్శి అయితే, ఈ చరమాంకంలో ఏం చెయ్యాలో సూచించి నువ్వు మార్గదర్శి అయావు.

చివరగా ఒక సలహా.. మీ ఆదాయం చూసుకుని ఖర్చు పెట్టుకోండి. 'అతి'కి పోతే మిగిలేది 'అల్పం'. కష్ట కాలానికి కొంత దాచుకోవాలి. వీలయినంతలో ఇతరులకి సహాయం చెయ్యడం నేర్చుకోండి. ఈ విధంగా రాశానని మీ సంసారాలను పాడు చేసుకోకండి. సామరస్యంగా పరిష్కరించుకోండి సమస్యలను."

మెయిల్ చదివిన అమ్మాయి, అన్నగారికి ఫోన్ చేసింది.. కానీ మాట్లాడ్డానికి మాటలే దొరకలేదు. ఏం మాట్లాడుతుంది? అన్నగారికి ఆ సలహా ఇచ్చింది తనే మరి!

# వెన్నెల బాసలు శ్రీనిధి యెల్లాల

గంధం రంగుతో కొత్తగా పూసిన ఇల్లు, ద్వారబంధాలకి కట్టిన తోరణాలు, బంతిపూల మాలలు, ఇంటినిండా అల్లుకున్న మెలికల ముగ్గులు, మరుసటి రోజు కోసం చిన్న చిన్న బుట్టల్లో తెప్పించిన మరువం, సన్నజాజి, కనకాంబరం మొగ్గలు, వంట వారు ఒక్కొక్కటిగా మోసుకొస్తున్న గంగాళాలు మరియు వంట సామాన్లు... అన్నీ కలిసి ఆ ఇంటికి ఒక కొత్త సొబగుని అద్దుతున్నాయి. ఇంటి వెనుక మూలగా వున్న మల్లెపందిరి ముందు పరిచిన చాప పైన, ముక్కాలి పీటపై కూర్చుని, తన పరికిణీ అంచులని కాస్త పైకి లాక్కుని, అలవోకగా, మొహం పై ఎగురుతున్న పట్టు కురులని జాగ్రత్తగా ఒక వేలితో వెనక్కి తోస్తూ, అలవాటు లేని ఓణీ పిల్ల గాలికి తెరచాప లాగా పైకి లేస్తుంటే, ముంజేతి దాకా పెట్టుకున్న "మెహందీ" తో సరిచేసుకోవడం కుదరక, నాయనమ్మని రమ్మని పిలిచింది మన్విత . మనవరాలికి ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అని కనిపెట్టుకుని ఉన్న సావిత్రమ్మ, పరుగున వచ్చి, మన్విత పైటని చుట్టూ తిప్పి నడుములో దోపింది. ఆఖరి మనవరాలి పెళ్లి ముచ్చట్లు అన్నీ తన ఇంట్లోనే, తన చేతుల మీదే జరగాలని సావిత్రమ్మ కోరిక. ఆమెరికా పెళ్లికొడుక్కి పల్లెలో ఏర్పాట్లు సౌకర్యంగా ఉండవని, మన్విత నాన్నగారి అభిప్రాయం. వీరిద్దరంటే మన్వితకి అమితమైన ఇష్టం , ప్రేమా .. కనుక ఎవరినీ నొప్పించకుండా పెళ్లికూతురుని చేసే పని సావిత్రమ్మ చేతుల మీదుగా తమ సొంత వారి మధ్యన తమ పల్లెలోని స్వగృహంలో జరిపించి, అక్కడి నుండి బయలుదేరి పక్కనే మదనపల్లెలో, ఫంక్షన్ హాలులో పెళ్లి చేసేటట్లు సర్ది చెప్పింది మన్విత.

"మరీ ఆర్భాటాల పెళ్లిళ్లు అయిపోతున్నాయి ఈ రోజుల్లో. అయినవారినందరిని పిలిచి చక్కగా మన ఊర్లో చేస్తే ఏం పోతుంది అంట. అమెరికా పెళ్లికొడుకైతే మాత్రం వాడేమన్నా అమెరికా దొరసానికి పుట్టాడా ? మన పక్క ఊరులోనే గా వాళ్ళ అమ్మని ఇచ్చింది! ఎటువైపు చూసినా అంతా బీరకాయ పీచు చుట్టరికాలే కదా !!అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలీదా అన్నట్టు, ఉద్యోగాలు మిడకడానికి పట్నం వెళ్లి, పిల్లల్ని దేశాలకి పంపేసి ఏమి సొగసులు పోతున్నార్రా మీరు?", అంటూ అటు కొడుకునీ, ఇటు వియ్యపు వాళ్ళనీ కలిపి నిష్టూరం వేస్తోంది సావిత్రమ్మ.

"ఏదో మా చిన్నాన్న కోడలు సుజాత మధ్యవర్తిత్వం చేసి, పూచీ ఉండబట్టి, ధైర్యం చేసాము. నట్టింట్లో కంప్యూటర్ పెట్టి, అందులోకి పెళ్ళికొడుకుని పిలిచి, అటు ఇటూ పెద్దలు కూర్చుని పెళ్లిచూపులు కానిచ్చేసారు. ఇంకా నయం పెళ్లికన్నా తరలివస్తున్నాడు పెళ్ళికొడుకు, సంతోషం," అని ఆపకుండా చెప్పుకు పోతూనే ఉంది. స్కైప్ లో జరిగిన మన్విత పెళ్లిచూపులు ఆవిడకి వింతగానూ, చికాకుగానూ అనిపించాయి.

"నానీ ... మీరోజుల్లోలా అన్నీ కుదరవు కదా ఇప్పుడూ! అవన్నీ వదిలేసేయ్, చూడు నా డిజైన్ . బాగుందా? ఇందులో మా ఇద్దరి పేర్లు ఉన్నాయ్ తెలుసా ? కనిపెట్టాలి నువ్వు, ఇటు రా నానీ," అంటూ మన్విత టాపిక్ ని మార్చేసింది. టౌన్ నుండి వచ్చిన మెహందీలు వేసే అమ్మాయి, పక్కనే ఒకేలాంటి లంగా వోణీల్లో ఉన్న ఇద్దరు అమ్మాయిలకు చక చకా పెట్టడం మొదలెట్టేసింది. వాళ్లు మన్వితతో పాటూ చదువుకుని, ప్రస్తుతం బెంగళూరులో ఇల్లు తీసుకుని, కలిసి ఉంటూ జాబ్స్ చేస్తున్న మన్విత ఫ్రెండ్స్. పల్లెటూరిలో పెళ్లి, అందుట్లోనా తమ క్లోజ్ ఫ్రెండ్స్ లో మొదటి పెళ్లి అనే ఉత్సాహం వాళ్ళ నవ్వుల్లోనే కనిపిస్తోంది. బామ్మ మాటలు వింటూ ఆనాటి పెళ్లి కబుర్లు చెప్పించుకుంటూ, ఆడపిల్లలంతా నవ్వుతూ పెట్టించుకుంటున్నారు మెహందీ . నాయనమ్మ మెడ చుట్టూ చేతులు వేసి, దగ్గరగా లాక్కుంటూ ఒక ఫోటో తీయించుకుంది మన్విత. తర్వాత ఒకే లాంటి బట్టల్లో ఉన్న స్నేహితురాండ్రంతా కలిసి "బ్రైడ్స్ మైడ్స్ " ఫోటోస్ రకరకాల పోజులు పెట్టి తీయించుకున్నారు.

అంతలో వంట మాస్టారు దిగాడు తన పటాలంతో. అదే సమయానికి మన్విత అమ్మగారు కూడా ఊళ్ళో ఉన్న తోడికోడళ్లందరిని పిలుచుకొచ్చింది, లడ్డూలు పట్టడానికి సాయానికి. ఇంట్లో పెళ్ళికి బంధువులే లడ్డూలు పట్టడం అదొక సరదా. వంట మాస్టారు చేసిచ్చిన బూందీని అందరూ అలా మధ్యలో ఉద్దగా వేస్కుని, చేతులకి నెయ్యి రాసుకుంటూ, లడ్డూలు చెయ్యడం ప్రారంభించారు. ఇక సావిత్రమ్మకి ఎక్కడ లేని హుషారు వచ్చేసింది. వాళ్ళపై అజమాయిషీ చేస్తూ తాను కూడా కూర్చుంది.

ఇలాంటి సమయం కోసమే ఎదురు చూస్తున్న మన్విత, తన స్నేహితులైన అను, ద్విజా లతో కలిసి బయటికి బయలుదేరింది. నాయనమ్మ హడావిడిగా ఉంది కదా అని, మెల్లిగా పిల్లుల్లా బయటికి కదిలారు. ఎంత మెల్లిగా గేటు తీసినా , సావిత్రమ్మ పట్టేసింది దొంగలని.

" ఎక్కడికే మనూ, బయల్దేరావూ? రేపు పెళ్లికూతురిని చేస్తున్నాము, కాస్త ఇంటిపట్టునే ఉండరాదు!" అని కేకేసింది కూర్చున్న చోటునుండే.

"నానీ, మరేమో చెరుకు తోట చూస్తామన్నారు మా వాళ్ళు. అలా వెళ్లి వస్తాం నానీ . మళ్ళీ రేపు పెళ్లికూతురిని చేసాక ఎక్కడికి పంపవుగా, ఒక్కసారి తోట చూసి వస్తాను" అని గోముగా అడిగింది.

ఏడుమల్లెల ఎత్తు తెలుగుతనం, అంత గారంగా అడిగితే కాదనే దమ్ము ఎవరికి ఉంది కనుక.

"సరే వెళ్లి రండి, డొంక దారిలో వెళ్ళు, ఊర్లో అందరి కళ్ళలో పడకుండా. దిష్టి తగులుతుంది," అని కేకేసింది సావిత్రమ్మ చెరో చేతితో లడ్డుంటలు చుడుతూ ..

“హమ్మయ్య,” అని అనుకుని, ముగ్గురూ బయలుదేరారు. డొంక వెంబడి బయలుదేరి, మామిడితోపు దాటుకుని, గ్రామ దేవత గుడి వెనగ్గా ఉన్న చెరుకు తోటకి వెళ్లారు ముగ్గురు. ఏపుగా పెరిగిన తోట, వారి లాగే పరువంతో మిస మిస లాడుతూ, వాళ్ళ నవ్వులకి పోటీగా అన్నట్లు గాలికి ఊగుతూ చిరు సవ్వడి చేస్తోంది. పచ్చని పరికిణి పై ముదురు నీలం డిజైనర్ ఓణీతో, మెడలో నాయనమ్మ వేసిన స్వాతిహారంతో, నవ్వుతున్నప్పుడు ఊగే బుట్ట కమ్మలతో , గట్టుపైన పడకుండా జాగ్రత్తగా నడుస్తుంటే వసంత కన్యలా ఉంది మన్విత.

కాస్త దూరం నడిచాక పొలం మధ్యలో చాపలా ఉన్న విశాలమైన రాయిపైన కూర్చున్నారు ముగ్గురు మిత్రులు. ఆ రాయిని ఆనుకుని ఉన్న చింత చెట్టు, మన కావ్య నాయకి ఎండకి కందకుండా ఉండేటట్టు గొడుగుపట్టింది. కన్నె పిల్లల నవ్వులకి, పులకించినట్టుగా చింతచెట్టు కూడా చల్లని గాలిని వీస్తూ తన పూతని రాలుస్తోంది వాళ్లపై.

"ఇంతకీ మీ బావ నుండి, ఫోన్ వచ్చిందా మను? నీ ఉత్తరం తనకి చేరేసాడా?" కూడా తెచ్చుకున్న లడ్డుంటని కసుక్కున కొరుకుతూ మోచేతిపైన వెనక్కు వాలుతూ అడిగింది అను!

"ఏంటో దీని వెర్రి, ఎల్లుండి పెళ్లి పెట్టుకుని, ఇప్పుడీ పిచ్చి వేషాలేంటే బాబు. పైగా ఉత్తరాల గోలేంటే!" అంది ద్విజ.

"ఈపాటికి ఫోన్ చెయ్యాలె బావ. వచేటప్పుడే అడిగాను అక్కని, బావ బయల్దేరాడంట . అందుకే ఇక్కడికి తెచ్చా మిమ్మల్ని. ఇక్కడైతే సిగ్నల్ బాగా వస్తుందట. ఇంట్లో అస్సలు రాదు, మిద్దె పైకి ఎక్కి ఊరంతా వినపడేటట్లు అరిస్తే తప్పించి అవతలి వారికి ఏమీ వినపడదు. "

ఇంతలో మన్విత తన బావకి చేస్తున్న కాల్ కనెక్ట్ అయ్యింది.

"హలో ... ఆ... బావా.....తను కలిసాడా? ... నేనిచ్చిన లెటర్ ఇచ్చావా?...ఒప్పుకున్నాడా?... సరే సరే బావా!! ..ప్లీజ్ ఈ ఒక్కసారికి ..ఇంక ఏం అడగను నిన్ను ..థాంక్స్ ఎ లాట్ ." అంటూ ఫోన్ కట్ చేసింది.

అప్పటిదాకా మన్విత ఏకపాత్రాభినయం చూస్తున్న ఇద్దరూ, ఆసక్తిగా ముందుగు జరిగారు. ద్విజ భుజం పై ఆత్రంగా ఒరిగి పోయిన అను, "ఏంటంటే ..ఒప్పుకున్నాడా? .. వావ్ ..థ్రిల్లింగ్... లైఫ్ టైం ఎక్స్పీరియన్సు ,"...అంటూ ఆనందంతో చప్పట్లు కొట్టింది.

"నీ మొహం, నాకైతే ఎందుకో భయంగా ఉందే. సిటీల్లో, టౌన్లలో ఓకే గానీ , పల్లెల్లో ఇంత సాహసం ఎందుకే బాబు. ఒక్కరికి తెల్సినా రచ్చ రచ్చై పోతుంది. అస్సలే మీ నానమ్మ మమ్మల్ని బంగారు తల్లులని సర్టిఫికెట్ ఇచ్చి, 'మీరేమిటోళ్లు' అని కూడా ఆరాతీసేసింది. తేడా వొస్తే ...వామ్మో !" అంది దిజ్జు, గాల్లో చేతులు ఊపేస్తూ ....

"ఎల్లుండి ఈపాటికి పెళ్లి అయిపోతుంది. ఇప్పుడు ఈ స్వతంత్రం అవసరమా? చక్కగా అమెరికా సంబంధం. ఎందుకొచ్చిన గొడవా!! "అని ద్విజ అంటుండగానే తన నోరు మూసేసింది అను.

తన స్నేహితురాళ్ల మాటలు వింటూ, పైకి లేచిన మను, వాళ్ళని కూడా బయల్దేరదీసింది. ఎండ దిగిపోవడంతో కాస్త చల్లబడి, హాయిగా వీస్తోంది గాలి. కాస్త దూరం వెళ్ళాక , మోటార్ పంప్ దగ్గరికి వచ్చారు. మోటార్ పంపు లోంచి దూకే నీళ్ళని పట్టడానికి చిన్నసైజు స్విమ్మింగ్ పూల్ అంత గుంటని తవ్వి , అందులో కరెంటు ఉన్నప్పుడు నీరు నింపి, అవసరమైనప్పుడు నీరు పొలం లోకి వదిలేలా గట్టు కట్టారు.

నిలువ నీటిలో అక్కడక్కడా నాచు పట్టి, గట్టు చుట్టూతా ఉన్న కొబ్బరి చెట్లతో ఎంతో అందమైన పెయింటింగ్ లాగా ఉంది. నీళ్ళని చూడగానే ద్విజ, అను చిన్నపిల్లలైపోయారు. గట్టుపై కూర్చుని కాళ్ళని నీళ్ళల్లో పడేసి మెల్లిగా ఊపుతూ, చల్లటి నీళ్ళని, సాయంత్రం వెచ్చదనాన్ని ఒకేసారి అనుభూతి చెందుతున్నారు. మధ్యలో ఉన్న మన్విత చెరో భుజం పై వాలి, తమ చేతులను పెనవేసుకున్నారు స్నేహితులు ముగ్గురూ . సాయంత్రం నీరెండలో, కొబ్బరాకుల మధ్యనుండి నీళ్లపై పడ్డ బంగారు కిరణాలు, ముగ్గురి పైనా నాట్యం చేస్తున్నాయి.

పొడుగ్గా ఉన్న కొబ్బరి ఆకుతో నీటిపైన బొమ్మలు గీస్తూ తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా చెపుతోంది మన్విత, " బతకడానికీ , జీవించడానికి చాలా తేడా ఉందే. బతుకు పోరు లో ఎప్పుడైనా అలసిపోయినప్పుడు, జీవితం నిస్సారమైనపుడు, తలచుకోడానికి కొన్ని మధురమైన జ్ఞాపకాలు ఉండాలి. అవి, జీవితం పై ఆశని కలుగజేసి, మరింత కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. ఊహ తెలిసిన నాటినుండి ప్రేమ పై నాకు చాలా గౌరవం, మంచి అభిప్రాయం ఉన్నాయి. ఎంతో ఉన్నతంగా ఊహించుకునేదాన్ని. అమ్మానాన్న , నాకు కావలసినంత స్వేచ్చని ఇచ్చినా , బహుశా అందుకేనేమో నాకు ఎవరూ ఇంతవరకు నచ్చలేదు. కానీ, ఇది నా కోరిక వే, పెళ్ళైతే ఇవన్నీ కుదరవని కాదూ.... ఆ ప్రేమా, ఆ అధికారం వేరు. ఇది నా లాస్ట్ ఛాన్స్, ఇక పై అడుగు పెట్టబోయే జీవితాన్ని ఎదుర్కొని, నాకు తోడుగా నిలిచి నన్ను ఊరడించే ఒక్క అనుభూతి, నాకు చాలా అవసరం." అంటూ చెప్పడం ఆపింది.

ఎంతో సున్నిత మనస్కురాలు, భావుకురాలు ఐన తమ స్నేహితురాలి మనస్సు తెలిసిన ఇద్దరూ, చెరో బుగ్గ పై ముద్దు పెట్టుకున్నారు.

" మనూ, ఆరేళ్ళ నా లవ్ స్టోరీ లో అలకలు, కోపాలు, కాంప్రమైస్లూ, గ్రీటింగ్ కార్డులూ, చోక్లేట్లు తప్ప ఏమి ఎరుగమే. నిన్ను చూస్తే తెలుస్తోంది ప్రేమ గురించి తెలియాలంటే, ప్రేమికులై ఉండాల్సిన పని లేదు. ప్రేమను ప్రేమించగలిగే మనస్సు ఉంటె చాలని. పైగా అబ్బాయిలతో పాటు పోటీగా చదువుల్లో, ఉద్యోగాల్లో పరిగెత్తే మనకి, సర్దుకుపోయే మనస్తత్వం తక్కువ. అందుకేనేమో ఎమోషనల్ బ్రేక్ డౌన్ కి ఎప్పుడు దగ్గరగా ఉంటాము మనం. ఎవరి పరుగులు వారివి అయిన నేటి లైఫ్ స్టైల్ ల్లో, జీవితాలను పెనవేసి ముడివేసే అనుభవాలు ముఖ్యమే కాదు అవసరం కూడా అనుకుంట," అంది ద్విజ.

"ఏంటో మీ గోల. పదండి, పదండి.లేట్ అయ్యింది, ఈపాటికి అప్పుడే పిండిన, ఫ్రెష్ పాలతో కాఫీ ఇస్తుంది ఆంటీ" అంటూ బయలుదేరింది అను.

"ఏయ్, కాస్త ఉండవే బాబూ, పెద్ద దారి తెలిసిన దాని మాదిరి పోతున్నావు. ఇది మా ఊరు, గుర్తుంచుకో! అటు వైపు కాదు, ఇటు వైపు. డొంక వెంబడి. అటు వెళ్తే ఊర్లో నుండి వెళ్ళాలి. ప్రతి ఇంట్లోనూ చుట్టమే, రేపు పొద్దున్న గానీ ఇల్లు చేరం.."మందలించింది మన్విత.

"వామ్మోవ్! మీ వాళ్ళ క్వశ్చన్ బ్యాంకు కి, ఆన్సర్స్ ఇవ్వడం ....ఇంపాజిబుల్ .."అంటూ పరుగున వెనక్కి వచ్చి మన్విత చెయ్యి అందుకుంది అను.

ముగ్గురూ ఇంటికి వచ్చేసారు. మొహాలు కడుక్కుని కాఫీలు, టిఫిన్లు కానిచ్చారు. మన్వితని వాళ్ళ అక్క, మిద్దెపైకి వెళ్లి ఎదురుచూడమంది. కాసేపటికి అక్క, బావా మిద్దెపైకి వచ్చారు. “అబ్బా, ఏంటే ఇంతసేపా?” అని విసుక్కుంది మన్విత, అక్కని.

"నీ మొకం. నీ ఆత్రం అందరికి ఉండొద్దూ. వీళ్ళ లడ్డులు ఏమో గానీ, పావు గంట కోసారి కాఫీలు అంటారు. ఈ రొండు రోజులకీ కలిపి మొత్తం మన ఊరి చెరువంతా కాఫీ పెట్టేస్తే సరి. పైగా ఆ వంట మాస్టారు అన్నీ ఒక్కసారి అడుగుతాడా అంటే, అదీ లేదు.. ఒకసారి చిన్న మిక్సీ అంటాడు, ఒకసారి యాలకుల పాకెట్టంటాడు .ఈయనకన్నా మా ఆఫ్ షోర్ మేనేజర్ నయం. ఇహ నానీ చెప్పే పనులతో పోలిస్తే మా ప్రాజెక్ట్ మేనేజర్ అసలు దేవుడే ," హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఇంజినీరైన మన్విత వాళ్ళ అక్క, అలవాటులేని హడావిడి పనులకి విసుక్కుంటూ పిట్టగోడపై వాలి చెప్పుకుంటూ పోతోంది .

"సరేలే. అసలు పాయింటుకి రా, ఇంకాసేపాగితే మనూ ఏడ్చేటట్టు ఉంది. మనూ, నేను రాత్రి 9.30 కి ఇంట్లోంచి బయల్దేరి బైక్ తో, ఊరి మొదట్లో మైలు రాయి దగ్గర ఉంటాను. నువ్వు సరిగ్గా పావు గంట ఆగి, నన్ను కలుసుకో! సరేనా ? "

"మరి తను?" అని అడిగింది మన్విత ఆత్రంగా!

అక్కా బావా ఒకరినొకరు చూస్కుని నవ్వుకున్నారు.

"హీరో రాకపోతే ఎలా మరి సీన్ పండేది! హీరో ఎంట్రీ కూడా అద్దిరిపోయేలా చూస్తాం లే!" అంటూ ఫోన్ రావడంతో పక్కకి వెళ్లి, ఊరంతా వినపడేలాగా అరుస్తూ మాట్లాడడం మొదలుపెట్టాడు సిగ్నల్స్ అందక.

పదవే కిందకి పోదాం అన్న మన్వితని లాగి కింద కూలేస్తూ, "కాసేపాగవే బాబూ , పూలు కడదాం రమ్మంటే , ద్విజాని, అనూని అక్కడ పెట్టి వచ్చా. ఇప్పుడు వెళ్ళగానే, జాకెట్టు ముక్కలు, పసుపు కుంకాలు రిటర్న్ కవర్లలో పెట్టమంటుంది నానమ్మ . కాంట్రాక్టుకి ఇచ్చేస్తే ఐపోయేదిగా అంటే, గయ్యి మని లేస్తుంది. కాసేపు కూర్చుని వెళ్దాం." అంది మన్విత వాళ్ళ అక్క.

ఇంతలో సావిత్రమ్మ కేకలెయ్యడంతో కిందకి దిగారు ఇద్దరు. వరండాలో కూర్చుని బుద్ధిగా సన్నజాజులనీ, కనకాంబరాలనీ జతలు జతలుగా సర్దుతోంది దిజ్జు, వాటిని చటుక్కున లాక్కుని, దారాన్ని సుతారంగా తిప్పుతూ మాల కడుతోంది సావిత్రమ్మ. మధ్య మధ్యకి మరువం అందిస్తోంది అను. కిందికి దిగుతున్న మన్వితని చూస్తూ , "హేయ్ మనూ , నీకోసం మాత్రమే స్పెషల్ గా, మీ నానీ స్వయంగా కడుతోంది, రేపు నీ జడ కోసం ," అంది.

ఏదోలా నవ్వేసింది కానీ, మన్విత మనసు మనసులో లేదు. ఒక్కసారిగా వాతావరణం అంతా గందరగోళంగా అయిపోయినట్టు అనిపించసాగింది. తన గుండె చప్పుడు తనకే వినపడసాగింది. చూపులు తెలీకుండానే గోడపై గడియారం కేసి మాటి మాటికీ వెళ్తున్నాయి. ఫంక్షన్ హాలులో తన కోసం, ఏ చీరకా చీర జాకెట్టు, పెట్టికోటు, నగలూ, ప్రత్యేకంగా ఒక పెట్టిలో సర్దుతూ మాట్లాడుతోన్న అమ్మతో కూడా , మరబొమ్మలా ఊకొడుతూ ఉంది. తమ ఫ్రెండు బాధని గమనించి, పెళ్ళికూతురికి నిద్ర చాల అవసరం అని చెప్పి, త్వరత్వరగా అన్నాలు తిన్నామంటే తిన్నాము అనిపించి, ఎనిమిది కల్లా మిద్దె గదిలోకెళ్ళి పడుకునేసారు ముగ్గురూ .

నిమిషం ఒక యుగం లాగా గుడుస్తుంటే, నిద్ర నటిస్తూ సమయం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఇంతలో తొమ్మిదిన్నర కల్లా వెళ్తూ వెళ్తూ, మన్విత వాళ్ళ బావ, మిస్డ్ కాల్ ఇచ్చి వెళ్ళాడు. తన గుండె చప్పుడు తనకే వినిపిస్తూ ఉండగా, ప్రాణం అంతా ఫోన్లోనే ఉందేమో అన్నట్టు, క్లాక్ లో మారుతున్న అంకెలను చూస్తూ ఉంది మన్విత. సరిగ్గా పావుగంట తర్వాత నెమ్మదిగా లేచి, తానులేని సమయం లో మేనేజ్ చెయ్యమని స్నేహితురాళ్ళకి చెప్పి, వెనక గుమ్మంనుండి, బయల్దేరి, అప్పటికే తన కోసం ఎదుచూస్తున్న అక్క తో కలిసి, ఊరి మొదట్లో ఉన్న బావ దగ్గరికి చేరింది. చప్పున, ఇక్కడ ఉన్నట్లు వచ్చేయాలి అని మనూకి చెప్పి, వెనుదిరిగింది మన్విత అక్క .

బావతో కలిసి బండిపై కూర్చుంది కానీ, ఎందుకో ఒళ్ళంతా చల్లబడిపోయింది మన్వితకి. కొన్ని పనులు అనుకున్నంత తేలిక కావు. తెలీని ఒక సంచలనం, ఆనందం, భయం తనని ముప్పిరిగొన్నాయి.

కొంచెం దూరం వెళ్ళాక, చెరువు కట్టపైన బైక్ ఆపాడు మన్విత బావ. "జాగ్రత్త మనూ," అని తాను అక్కడే ఆగిపోయాడు. ఆ చోటు మన్విత వాళ్ళు చెఱకుని బెల్లం ఆడించే గానుగ. కట్టకి ఎడమవైపు ఉన్న సన్నటి కాలిబాట వెంబడి కాస్త ముందుకి వెళ్ళి ,చిన్న సిమెంటు గూడులో, కోలగా వున్న నున్నని నల్లని రాయికి పసుపు రాసి, బొట్లు పెట్టిన అమ్మవారి రూపుని దాటుకుని మలుపు తిరగగానే ,అదిగో అక్కడే ఉన్నాడతను. తాను చూడాలనుకున్న వాడు. పుచ్చపూవులా పూసిన వెన్నెల్లో , గడ్డివాము ముందు, చెరువుకి ఎదురుగా , మిణుగురు పురుగులతో చుక్కల తెర కప్పినట్టుగా వున్న కానుగ చెట్టు కింద, పాత చెరుకు మిషన్ని ఆనుకొని, ఈ దారి వెంబడి వచ్చే తన కోసం ఎదురుచూస్తూ... ఒక్కసారి ఊపిరి తీస్కోవడం ఆపేసింది మన్విత. ముందుకి నడవాలంటే అడుగులు తడబడుతున్నాయి.

"ఇంతదాకా వచ్చి, నన్ను ఇంత దూరం రప్పిచ్చి , అంతలోనే అంత దూరంలో ఆగిపోయావేంటి అమ్మాయ్?" అన్నాడు తను, చెయ్యి చాస్తూ .

మంత్రం వేసినట్టు తన చేతిని, అతని చేతిలో పెట్టింది మన్విత. అతని కూడా వెళ్లి , అక్కడే ఉన్న చెక్క బెంచిపై కూర్చున్నారు, చెరువుకి ఎదురుగా . ఎప్పుడూ గల గలా మాట్లాడే మన్విత, మొదటిసారి మాటల కోసం వెతుక్కుంటూ ఉండిపోయింది. తన తనువంతా కనులై, అక్కడున్న ప్రతి, చిన్న విషయాన్నీ నిశితంగా గమనిస్తూ, గుండె గూటిలో భద్రంగా దాచుకుంటున్నట్టుగా ఉంది.

"మాట్లాడవా? అయితే వెళ్లిపోనా ?" అన్నాడతను.

చప్పున చూసింది అతని కళ్ళల్లోకి మన్విత , కంగారుగా!

"చీకటంటే భయం అన్నావుగా? భయం వెయ్యలేదూ,?" చటుక్కున అడిగేసి, మనసులో అంత చచ్చు ప్రశ్న వేసినందుకు తనని తానే తిట్టుకుంది మన్విత. సెమినార్లలో, కాన్ఫరెన్సులలో దడ దడలాడించే పిల్లకి, మాట్లాడదామంటే ఇప్పుడు నాలుక తడబడిపోతోంది .

"ఏమో, మీ ఊర్లో వెన్నెల ఎంత అందంగా ఉంటుందో, ఈ చోటు ఆ వెలుగులో ఇంకెంత బాగా ఉంటుందో, మనసు ఊరేట్టు చెప్పేదానివి కదా, చూద్దామనీ!! అందులోనూ ఈ రోజు లంగా ఓణీ వేసుకుంటానన్నావు గా! వెన్నెల్లో నడిచొచ్చే ఈ కన్నె బంగారుని ఎలా మిస్ అవ్వాలి చెప్పు!!! పైగా వచ్చి కలిసే వరకు మెస్సేజ్ లు , ఫోన్ కాల్స్ బంద్ అని చెప్పావు కదా! అందుకే భయాన్ని అటకెక్కించి వచ్చేసా!" అన్నాడతను .

అందంగా నవ్వేసింది మన్విత, ఆ వెన్నెల రాత్రికి ఇంకొన్ని జిలుగులని అద్దుతూ.

కాసేపు, లోకంలో ఎవరికీ అక్కరలేని, వారికి మాత్రం అపురూపమైనవీ అనుకునే విషయాలు మాట్లాడుకుంటూ ఉన్నారు. మన్విత తనకి తెలియకుండానే, అతని భుజంపై తల వాల్చింది. తన వెనగ్గా వచ్చి, తన నడుముని చుట్టిన అతని చెయ్యి , ఒక భద్రతాభావాన్ని కలిగించింది మన్వితలో.

కాసేపలాగే ఉండిపోయారు ఇద్దరూ.. ఆ క్షణం అలాగే శాశ్వతంగా తమ గుండెల్లో నిలిచిపోయేలా .

"ఒక సెల్ఫీ తీసుకుందామా? " అడిగాడు అతను.

" ప్లీజ్ వద్దు. ఈ క్షణం ఇలాగే మన మనస్సులలో మిగిలిపోనీ ... ఇది కేవలం మన ఇద్దరికే సొంతం.. మూడో కంటికి కాదు కదా, చివరికి కెమెరా కంటికి కూడా తెలీడానికి వీల్లేదు! మనం ఒకరినొకరం తొలిసారి కలుసున్న ఈ క్షణం ఎప్పుడు కళ్ళు మూసుకున్నా, ఎదురుగా నిలిచే తియ్యటి స్వప్నం అయ్యుండాలి," అంది మన్విత, తన చేతిలో ఉన్న అతని చేతిని పెదవులకి ఆన్చుకుంటూ. మన్విత కోరికకు అంగీకారంగా , తన నడుముపై ఉన్న పట్టుని మరి కాస్త బిగిస్తూ , దగ్గరికి లాక్కున్నాడతను.

“అమ్మాయిగారి కోరిక తీరినట్టేనా?” అడిగాడతను మన్విత గుండెలపై మెలికలు పడి ఉన్న స్వాతి హారాన్ని సరిచేస్తూ!

“అవును మరి, ఇదంతా నాకోసమేనా? మన కోసం కాదూ !! స్కైప్ లో పెళ్లిచూపులు కానిచ్చేసావు. నీకు పగలైతే నాకు రాత్రి! కాబట్టి మాట్లాడేటప్పుడు ఇద్దరిలో ఎవరో ఒకరు ఎప్పుడూ నిద్రలో జోగాడుతూ ఉండేవాళ్ళం. అప్పట్లోనే మా తాతయ్య మా నానీని చూడడానికి, పెళ్లి ముందే వచ్చేవాడంట తెలుసా? మీ కన్నా మేమే నయం అని నానీ నవ్వినప్పుడల్లా ఎంత ఉడుక్కునేదాన్నో !" ఉక్రోషం నటిస్తూ, అతన్ని కాస్త విడిపించుకుని రెండు చేతులూ నడుముపై పెట్టి ఆరోపిస్తోంది మన్విత.

"అవును మరి, వాళ్ళ ఊరికీ వీళ్ళ ఊరికీ ఈ చెరువేగా అడ్డం, మనలా సప్తసముద్రాలు దాటాలా ఏంటి? పైగా మేనత్త కూతుర్ని చూడడానికి కూడా ఎంత సాహసం చేసి ఉంటాడో, తోటరాముడు తాతయ్య!" తనూ అంతే ఉడుక్కున్నాడు.

"అయినా నేనేమన్నా బలవంతం పెట్టానా, నీతో పెళ్ళిచూపుల్లోనే..... "

"అవి పెళ్ళిచూపులా?", దబాయించింది మన్విత.

"అదేలే, స్కైప్ చూపుల్లోనే, లోపల గదిలోకి వెళ్ళమని, మాట్లాడానా లేదా? చేసుకుంటే ఈ అబ్బాయినే చేస్కుంటా అని తెగేసి చెప్పిందెవరో ?" అని తనూ దబాయించాడు .

"నీతో కాసేపు మాట్లాడి, నిన్ను కాదనే అమ్మాయి ఎవరో చూపించు? పెద్ద పోజు కొట్టొద్దులే!" వెక్కిరిస్తున్నట్టుగా అంది మన్విత .

తనని పొగిడిందో, తిట్టిందో అర్థం కాక, అయోమయం మొహం పెట్టేసాడు .

“రేపొద్దున పిల్లలకీ, వాళ్ల పిల్లలకి చెప్పుకో, మేము రాతియుగం వాళ్ళ లాగా ఒక్కసారి కూడా ఎదురెదురూ కలుసుకోకుండా పెళ్లి చేసేస్కున్నాం అని!! పప్పీ షేమ్ అయిపోతాం!” అంది.

"ఎలాగూ ఇంకో 48 గంటల్లో అయిపోతాం కదా !!" చిన్నపిల్లాడిలా మొహం పెట్టి అన్నాడు .

"ఏంటీ అయ్యేది ?"

"పప్పీ షేమ్ !!" అంతే అమాయకంగా అన్నాడతను .

"ఛీ ! నే చెప్పేదేంటి, నువ్ అడిగేదేంటీ ?" అలిగినట్లుగా చేసి దూరం వెళ్ళబోయింది.

చటుక్కున బలంగా వున్న తన రెండు చేతులతో మన్విత నడుం పట్టి లాక్కుని ఒళ్ళో కుర్చోపెట్టుకున్నాడతను.

"సరే సరే మన కోసమే. ఒప్పుకుంటున్నాగా." అన్నాడు.

తన చేతులని అతని మెడ చుట్టూ వేసి , అతని ఒళ్ళో ఒదిగి కూర్చుంది మన్విత. "అలా ఉత్తరం రాసి తప్పకుండా రావాల్సిందే అని, వచ్చి కలిసేదాకా మాట్లాడనని రాసినందుకు కోపం వచ్చిందా?" అడిగింది మన్విత.

"ఎక్కడో తిలక్ గారి అక్షరాల్లో ఉండే, వెన్నెల్లో ఆడపిల్ల, స్వయంగా రమ్మనీ, కలవాలనీ ఉందని అంటే, రాకుండా ఉండగలనా?" అన్నాడతను.

" నేను నమ్మను," అంది మన్విత తలెత్తి చిలిపిగా తననే చూస్తున్న అతని కళ్ళలోకి చూస్తూ.

"నిజం చెప్పనా? సరిగ్గా పది రోజుల ముందు దిగానా ఇండియాలో, ఆలోపూ నువ్వు నీ పోస్టింగు, వీసా పనులు ముగించుకుని ఊరు వచ్చేసావు. ఇక నేను వస్తూనే షాపింగ్ అనీ, పెళ్లి పనులనీ హడావిడి పెట్టేసారు!!రోజూ చాటింగ్ చేస్కుంటున్నామా?, వీలైనప్పుడు స్కైప్ లో చూసుకుంటున్నాం కదా? మళ్ళీ కలవడం ఎందుకూ అనుకున్నాను నేను ! పైగా సిటీలో షాపింగ్ చేసి అలసిపోయి ఊరికి వచ్చానో లేదో, బోలెడు చుట్టాలు, పెళ్లి పనులు. ఇంతలో మీ బావతో రాయబారం పంపావు.అది కూడా ఉత్తరం.నిన్నుఫలానా చోట పెళ్ళికిముందు ఒక్కసారి కలుసుకోవాలి అనీ, అంతవరకు

మెసేజీలు , ఫోన్లు బంద్  అని. కోపం రాదూ మరి! ఎంత భయపడుతూ వచ్చానో తెలుసా? నువొచ్చేదాకా హనుమాన్ చాలీసా వింటూ కూర్చున్నా!! ఆ" అన్నాడు అమాయకంగా మొహం పెట్టి.

"అంత కోపం వస్తే, మరెందుకు వచ్చినట్టో?" తాను అలిగి ఉన్నానన్న సంగతి మరచి, నవ్వుతూ అతని  ముక్కు పట్టి లాగుతూ అడిగింది మన్విత.

"ఈ వెన్నెల బొమ్మ కోసం, మన కోసం. ఒక జీవితానికి సరిపోయే తియ్యని అనుభవం మనూ ఇదీ. నువ్వు, నేను మనంగా మారడానికీ, ఎప్పటికీ ఒక్కటై ఉండడానికి మన ఇద్దరికి మాత్రమే సొంతమైన ఒక అనుభవం కావాలి అన్నావు గా... అందు కోసం. మనం కాపురం మొదలుపెట్టే కాంక్రీట్ జంగల్ లో, మనకంటూ నీడనిచ్చి, ప్రాణ వాయువుని అందించే మధురానుభవాల్లో ఇది మొదటిది. ఇలాంటివి మరెన్నో నీతో పంచుకోవాలని నేను ఎదురుచూస్తున్నాను మనూ .." అన్నాడతను తన ఒడిలోని మన్వితని గాఢంగా గుండెలకి హత్తుకుంటూ.

చిన్నప్పటినుండీ వింటున్న "మనూ " అనే పిలుపు, అతని నోటి నుండి వచ్చేసరికి , గమ్మత్తుగా, తాను అప్పుడే సరికొత్తగా పుట్టినట్టుగా అనిపించింది మన్వితకి.  మనసు పులకరించగా మరింత దగ్గరగా హత్తుకుంది అతన్ని. వారిరువురి హృదయాలు తమ జతులని సరిచేసుకుని, ఒకే తాళంతో కొట్టుకోవడం ఆరంభించాయి.

ఆ వెన్నెల బాసలే , వారి భావి జీవితానికి పూల బాటలు వేస్తున్నట్టుగా ఉంది .

కాసేపటికి ఇద్దరి ఫోన్లు రింగైనాయి ." ఆ వచ్చేస్తున్నాం " అంటూ ఇద్దరూ అవతలి వారితో చెప్పారు.

"అవును ఇంతకీ నువ్వు కూడా తోడు తెచ్చుకున్నావా?" మునిపంటికింద పెదవిని కొరుకుతూ నవ్వాపుకుంటూ అడిగింది మన్విత.

"భయానికి, ఆడా మగా తేడాలేదమ్మాయ్. మా బావ వచ్చాడు తోడు. మరి కాబోయే పెళ్ళికొడుకుని ఒంటరిగా పంపిస్తారేంటి? అయినా మా అక్క పెళ్లప్పుడు ఎంత సర్వీసు చేసాను తనకీ? ఆ మాత్రం ఋణం తీర్చాలి కదా?" అంటూ నవ్వాడతను, మన్విత గుండెలు తుళ్ళి  పడేలా, సన్నజాజుల వానలా !

"లవ్ యూ  "

"నాకు తెలుసు అమ్మాయ్"

"మరి నువ్వు?" అడిగింది మన్విత.

మాటల్లో చెప్పలేను అన్నట్టు మరొక్కసారి దగ్గరికి తీసుకున్నాడు.

ఉరకలు వేస్తూ, కుదురులేకుండా ప్రయాణిస్తున్న నది, సాగర సంగమం చేరగానే తన అలజడిని తగ్గించుకుని, ప్రశాంత అనంత సాగరునిలో ఐక్యం అయినట్టు. ఎన్నో సందేహాలతో, అర్థం లేని భయాలతో, వున్న మన్విత మనసుకి కూడా, తన ఇన్నేళ్ల నిరీక్షణకి జవాబు దొరికినట్టు, పెనవేసుకున్నది అతన్ని.

వెళ్లలేక వెళ్తోన్న మన్వితని, మరొక్క సారి దగరికి తీస్కుని, నుదుటి పై ముద్దు పెడుతూ, చెరో వైపు వీడిపోయారు, ఇంకో రోజులో ఒక్కటైయ్యే వారిద్దరూ .

ఇంటికి దగ్గరగా వస్తుంటే, అంత దూరం నుండి, ఇంటికి కట్టిన సీరియల్ లైటింగుల్లో వెలిగిపోతున్న **"మన్విత వెడ్స్  శర్విల్ "** అన్న బోర్డుని తృప్తిగా చూసుకుంది మన్విత.

# పుష్పక విమానం

రవి కొప్పరపు

ఈ సంఘటనలు కొన్ని వేల సంవత్సరాలవి. కాల గర్భంలో కలిసిపోయి, దాని ఛాయలు మన పురాణ ఐతిహాసిక కథలలో కనిపిస్తాయి.

★★★★★★

దాదాపు రెండు వేల సంవత్సారాల క్రితం, అవంతి రాజ్యం, ఉజ్జయిని నగరంలో భద్రభట్టు అనే ధనికుడైన ఒక వర్తకుడుండేవాడు. తన వ్యాపార విషయాల్లో చాలా సునిశితమైన దృష్టి వుండేది. ఏదైనా మంచి లాభదాయకమైన విషయం గమనిస్తే, వెంటనే పట్టేసేవాడు. అందుకే తరగని సంపద వచ్చింది. వరహా ధర్మం చెయ్యడు. ఉజ్జయిని నగర పెద్దలతో, మహరాజులతో మంచి సంభంధాలు ఉండేవి.

అతనికి పుష్ప అని ఒకే కూతురు. సౌందర్యానికి మారు పేరులా ఉంటుంది. పాలరాతి ఛాయ, చక్కగా దిద్దినట్టు వుండే కళ్ళు, చూడడానికి ఒక అద్భుతమైన దేవకన్యలాగా ఉండేది. ఇరవై సంవత్సారలొచ్చేసరికి, చదువుతో పాటు, మంచి లోక జ్ఞానం కూడా నేర్చుకుంది. కాని చదువుకున్నది వల్ల కాబోలు, తండ్రి లాగ కాకుండా, దయా దాక్షిణ్యాలు, ఉపకార బుద్ధి వున్నాయి.

అదే ఊళ్ళో కాశీయప్ప అనే వాస్తుశిల్పికి విశ్వకర్మ అనే కొడుకు వున్నాడు. విశ్వకర్మ చాలా సృజనాత్మక దృష్టి కలవాడు. కొత్త కొత్త గా ఆలో చించి, వాటి తాలూకు నమూనాలు తయారుచేసేవాడు. ఒక సారి ఒక దుర్భిణి తయారు చేసి, దూరపు వస్తువులు దగ్గరగా చూసే అవకాశం కలిపించాడు. ఇంకోసారి, కట్టడాలకి ఉపయోగించే సామాగ్రి తయారు చేసి, అవి వాళ్ళ నాన్నకు చూపించాడు. అవి ఆయనకి ఎంతగానో ఉపయోగపడ్డాయి. కాని ఆయనకు ఇవన్ని అనవసరపు పనులుగా అనిపించాయి. బుద్ధిగా తమకు అచ్చొచ్చిన పని, అన్నం పెట్టే పని చేసుకోకుండా, ఇలాంటి పనులేంటి? అందుకే ఆయన తన కొడుకుని ప్రోత్సాహించలేదు. తెలిసిన వాళ్ళు ఆ అబ్బాయి ఎప్పుడూ ఏదో ఒకటి తయారు చెయ్యడం చూసి, ఒక పిచ్చోడని అనుకునేవాళ్ళు.

ఆ ఊళ్ళో పురుషదత్తుడు అనే వజ్రాలవ్యాపారి కొడుకున్నాడు. పురుషదత్తుడికి చిన్నప్పట్నుంచి ఏది కావాలంటే అది దొరికే అలవాటయ్యింది. దాని మూలంగా, డబ్బుందని అహంకారంతో పాటు, తమకంటే స్థాయి లో తక్కువుండే వాళ్ళంటే అసహ్యం. అతను భద్రబట్టుడి కుమార్తెకి అప్పుడప్పుడు ఖరీదైన బహుమతులు ఇస్తూ వుండేవాడు. భద్రబట్టు కూడా, పురుషదత్తుడు తన కూతురుతో సన్నిహితంగా వుండడం చూసి ఏమీ అనేవాడు కాదు. వజ్రాల వ్యాపారితో బంధుత్వం కలుపుకుంటే తన వ్యాపారానికి కూడా మంచిదే కదా.

పురుషదత్తుడుకీ, విశ్వకర్మకీ ఆ పుష్ప అంటే ఇష్టం. విశ్వకర్మ వాళ్ళ నాన్న తో పాటు భవనాలు, ఇళ్ళు కట్టే పని నేర్చుకున్నాడు. ఒకసారి భద్రభట్టుదుండే భవనానికి ఏదో మరమత్తు పనులు చేస్తూ, పుష్పని చూసి మనసు పారేసుకున్నాడు.

తను మాత్రం ఇద్దరినీ సమానంగా చూసేది. విశ్వకర్మ ఏదో వంకతో పుష్పని అప్పుడప్పుడూ కలుస్తూ వుండే వాడు, తను తయారు చేసిన వాటిని ఆమెకు ఇచ్చేవాడు. కొన్ని సార్లు అవి పని చేసేవి, కొన్ని సార్లు మొరాయించేవి. పనిచెయ్యని వాటిని సరిచెయ్యడానికి అతను పడే అవస్థ చూసి, పుష్ప గల గలా నవ్వేది. కాని కించపరిచేది కాదు. ప్రోత్సాహించేది. అతను చేసేవి కొత్తగా వున్నాయని, ఇంకా చేస్తూ ఉండమని చెప్పేది. ఇంకేముంది? నచ్చినమ్మాయి ఇలాగ ప్రోత్సాహమిస్తే ఎక్కడలేని శక్తి రాదు?

పురుషదత్తుడికి విశ్వకర్మ వేస్తున్న వేషాలు తెలిసింది. ఒకసారి తన మందీ మార్బలం తీసుకెళ్ళి, వాళ్ళ నాన్న ముందే హెచ్చరించాడు. ఇది తెలిసి కాశీయప్ప తన కొడుకుని అతని ముందే తిట్టి, మళ్ళీ ఇలాగ జరగదని మాటిచ్చాడు. ఇంక ముందు ఇలాంటి చెత్త పనులు, ఊరికే కూర్చుని పనికిరానివి తయారుచెయ్యడం ఆపి, తన పనిలో బుద్ధి పెట్టమన్నాడు.

మనసు ఊరుకోదు కదా. పైగా పుష్ప కూడా కాస్త స్నేహంగానే వుంది. విశ్వకర్మ రహస్యంగా కొత్తవి తయారు చెయ్యడం, ఏదో విధంగా కలవడానికి ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. పుష్ప కూడా, ఇతను అందరిలాగా కాకుండా, కొంచెం విభిన్నంగా వుండడం, తనని నవ్వించడం చేస్తూంటే కాస్త మంచి అభిప్రాయం కలిగింది.

కొన్ని రోజుల తరువాత, ఒక సారి తనను కలవమని పుష్ప తాలూకా ఎవరో వచ్చి చెప్పారు విశ్వకర్మకి. ఉజ్జయిని నగరం లోని ఒక వస్త్ర దుకాణం కి రమ్మని కబురు. అతను అక్కడికి వెళ్ళాడు. దుకాణం బయట పుష్ప తన స్నేహితురాళ్ళతో మాట్లాడుతూ వుంది. ఇతను వెళ్ళి, మెల్లగా నసుగుతూ మీరు రమ్మని చెప్పారట అని అడిగాడు. ఆశ్చర్యపోవడం ఆ అమ్మాయి వంతయ్యింది. తనేమీ రమ్మని చెప్పలేదంది. ఈ తికమకేంటో అతనికి అర్థం కాలేదు.

ఇంతలో పురుషదత్తుడు తన మనుషుల్నే కాకుండా, కొంత మంది రాజ భటులని కూడా వెంట తెచ్చాడు. విశ్వకర్మని చూపించి అతన్ని వెతకమన్నాడు. భటులు వెతికితే అతని దగ్గర ఒక వజ్రాల హారం దొరికింది. పుష్ప నమ్మకశ్యం కాని మొహంతో అతన్ని చూసింది. విశ్వకర్మ తనేమీ చెయ్యలేదని ఎంత మొత్తుకున్నా భటులు వినలేదు. అక్కడే పడేసి చావు కొట్టుడు మొదలు పెట్టారు. పురుషదత్తుడు వాళ్ళని ఆగమని, పుష్పతో ఈ హారం నీ కోసమని నేను తెస్తే, వీడు కొట్టేసి నీకిద్దామనుకున్నాడు, నీకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాడు, ఇలాంటి అలగా జనానికి ఇలాంటి బుద్ధులే వస్తాయని నోటికొచ్చినట్టు తిట్టాడు. ఇంకా నమ్మలేని స్థితిలో వుంది పుష్ప..కింద పడి వున్న విశ్వకర్మ దగ్గరకెళ్ళి విషయం అడిగింది. అతని మళ్ళీ తనేమీ చెయ్యలేదని చెప్పాడు. తనకు దగ్గరయ్యే విషయం మటుకు వాస్తవమని, తనని ప్రేమిస్తున్నానని చెప్పాడు. అది విని పురుషదత్తుడు బిగ్గరగా నవ్వి, పది జన్మలెత్తినా తనలాంటి అమ్మాయి అతనికి దక్కదని, ఎవరి స్థాయిలో వాళ్ళు వుండాలని, అసలైనా నీ దగ్గరేముందని, ఎగతాళి చేశాడు.

ఇంతలో ఈ గొడవ విషయం ఎవరో చెప్తే భద్రభట్టు తన కూతురిని వెతుక్కొని వచ్చాడు. పురుషదత్తుడు విషయం చెప్తే, భద్రభట్టు ఉగ్రుడయ్యాడు. తన ఇంటికి పనికి వచ్చి, తన కూతురి మీద ఆశపడడం నచ్చలేదు. విశ్వకర్మని తిట్టి, ముందు ఏదైనా ప్రయోజకమైన పని చెయ్యమని, డబ్బు సంపాదించి, అప్పుడు తనని చూసే స్థాయికి రమ్మని కూతురుని తీసుకెళ్ళాడు. పురుషదత్తుడు భటుల్ని ఈ దొంగ ఇక్కడెందుకని చెప్తే, వాళ్ళు విశ్వకర్మని తీసుకెళ్ళి కారాగారంలో వేసారు.

విషయం తెలిసిన కాశీయప్ప, నానా తంటాలు పడి తన కొడుకుని విడిపిచ్చికొని ఇంటికి తీసుకొచ్చి తిట్టిపోసాడు. పెద్దవాళ్ళతో ఎందుకు పెట్టుకున్నావని, ఆ వజ్రాల హారం నువ్వు దొంగలించలేదని తెలుసని, కాని డబ్బున్న వాళ్ళతో ఎందుకీ తలనొప్పులని, మళ్ళీ ఆ అమ్మాయి వంక చూడొద్దని చెప్పాడు. తండ్రి వెళ్ళిపోయిన తరువాత, తల్లి వచ్చి దెబ్బలు మీదా వేడి గుడ్డతో వత్తుతూ, ఎందుకురా ఇవన్నీ మనకు, నువ్వేవో తయారుచేసుకుంటున్నావు కదా, ఊరికినే పనికిరానివి తయారుచెయ్యడం కంటే ఏదైనా ఉపయోగపడేది చెయ్యమని ఓదార్చి బట్టలు బయట ఆరెయ్యడానికి వెళ్ళింది.

విశ్వకర్మ బయట మంచం మీద పడుకొని, జరిగిన సంఘటనలన్నీ గుర్తు తెచ్చుకుంటున్నాడు. ఏదైనా కొత్తది తయారు చేసి అందరినీ, ముఖ్యంగా ఆ భద్రభట్టుని, పుష్పని అబ్బురపరచాలి. దాని మూలంగా పేరు ప్రఖ్యాతలే కాకుండా, డబ్బు కూడా సంపాదించాలి. ఇంతవరకూ ఎవ్వరూ ఊహించనిది, అద్భుతమైనది చెయ్యాలి. డబ్బూ, పేరు అత్యవసరం. అప్పుడు ఆ పురుషదత్తుడి మీద కూడ కసి తీర్చుకోవాలి. ఎలా? ఏం చెయ్యాలి?

ఏదో చెయ్యాలని కసి, తపన వున్నా ఏం చెయ్యాలో తోచల..పడుకొని ఆకాశంలోకి చూస్తే పక్షులు ఎగురుతున్నాయి...మనకు కూడా ఎగిరే శక్తి వుంటే బాగుండు. తల తిప్పి పక్కన చూశాడు. తన తల్లి బట్టలు ఆరేస్తోంది, వాటికి దగ్గరగా చక్కెల పొయ్యి మీదా గిన్నెలో ఏదో ఉడుకుతోంది. ఆ

పొయ్యి కారణంగా వచ్చే పొగతో బట్టలు పైపైకి లేస్తున్నాయి. విశ్వకర్మ మళ్ళీ ఆకాశంలోని పక్షుల వంక చూశాడు. మళ్ళీ తల తిప్పి ఆ పొగ, బట్టల వంక చూశాడు.

మెదడులో ఒక మెరుపు. ఒక్క క్షణం ఆలోచించాడు. అవును, చెయ్యచ్చు. తనేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో అర్థం అయ్యింది. దిగ్గున లేచి గట్టిగా అరిచి, వాళ్ళమ్మని గట్టిగా హత్తుకున్నాడు. వాళ్ళమ్మ ఆరేసిన పెద్ద కొలత బట్టలు పీకి ఇంట్లోకి పరిగెత్తాడు. ఆవిడ ఉలిక్కిపడి, తన కొడుకు ఇంక పూర్తిగా పిచ్చివాడైపోయాడని అనుకుంది.

ఒక రోజు తరువాత అతననుకున్నది తయారు చేశాడు. ముందు బట్టలన్నీ ఒకదానికొకటి జత చేసి కుట్టి, దాని కింద తాళ్ళు కట్టి, వాటికి ఒక లోహం డబ్బా కట్టాడు. ఆ డబ్బాలో చెక్క పుల్లలు పెట్టి పొగ వచ్చేలా చెశాడు. ఆ పొగ రావడం ద్వారా జత చేసిన బట్టలు ఒక పెద్ద బుడగ లాగ ఉబ్బి పైకి లేచింది. అతను సంతోషంతో చప్పట్లు కొట్టాడు. ఇంక దీనిని పెద్దది చేస్తే తను ఈ గాలి బుడగలో కూర్చుని ఆకాశయానం చెయ్యచ్చు. ప్రపంచంలో ఆకాశయానం చేసిన మొట్టమొదటి మనిషి తనే అవుతాడు. అంతే కాకుండా ఒక చోటు నుంచి మరో చోటుకి త్వరగా కూడా వెళ్ళచ్చు.

నెల రోజులు కష్టపడి ఇంకో పెద్ద గాలి బుడగ తయారు చేశాడు. తెలిసినవాళ్ళందరికీ ఊరి బయట రమ్మని, సోమవారం ఉదయం ఆకాశయానం చేసే మనిషిని చూడొచ్చని చెప్పాడు. ఎవరూ ఇతన్ని పట్టిచ్చుకోలేదు. ఆ రోజు ఒక పట్టుమని పది మంది కూడా రాలేదు. అయిన సరే విశ్వకర్మ సిద్ధమయ్యాడు. సమయానికి తన పెద్ద గాలి బుడగలో పొగ రాజేస్తే, అది మెల్లగా పైకి వెళ్ళడం మొదలెట్టింది. కింద వున్నవాళ్ళు నోరెళ్ళబెట్టారు. ఆ బుడగ అలా నెమ్మదిగా ఎగురుతూ, చాలా ఎత్తుకు చేరి, గాలి వల్ల చాలా దూరం వెళ్ళి, అయిదు కోసుల (10 మైళ్ళు) దూరంలో వున్న గ్రామం దగ్గర దిగింది. అక్కడి వాళ్ళు ఇదేంటో తెలీక భయంకంపితులయ్యి, దాన్ని తగలబెట్టడానికి వస్తే, విశ్వకర్మ కాళ్ళా వేళ్ళాపడి ఏదో చెప్పి మళ్ళీ ఉజ్జయిని కి వచ్చాడు.

ఈ విషయం దావానలంలా వ్యాపించింది. చివరికి పుష్పకి, భద్రభట్టుకి, పురుషదత్తుడికీ కూడా చేరింది. చివరికి ఉజ్జయిని మహరాజుకి కూడా తెలిసింది. ఆయన కబురంపాడు. తనే స్వయంగా వచ్చి చూస్తానని, మళ్ళీ చెయ్యమని ఆదేశం. విశ్వకర్మకి తనుకొన్న అవకాశం దక్కింది. మహరాజు గారు మెచ్చితే ఇంక తనకు తిరుగుండదు. పుష్పని అడిగే తాహతు కూడ వుంటుంది అప్పుడు.

ఇంకో నెల రోజుల తరువాత ఊరి బయట, ఇసక వేస్తే రాలని జనం మధ్య మహరాజు గారు, ఆయన మందీ మార్బలం ఉన్నారు. పుష్ప, ఆమె తండ్రి భద్రభట్టు, పురుషదత్తుడు కూడా వచ్చారు. ఇంక విశ్వకర్మ బుడగ లోకి ఎక్కుతూ పుష్ప వంక చూశాడు. తన అందమైన చిరునవ్వుతో తలాడించింది. అతను కూడా చిన్నగా నవ్వి ఆమె వైపు చెయ్యి వూపాడు. పురుషదత్తుడు వైపు చూస్తే అతను కూడా నవ్వుతున్నాడు. విశ్వకర్మకి చిత్రం గా అనిపించింది. ఎందుకు నవ్వుతున్నాడు? సరే వెళ్ళే సమయమయ్యింది.

గాలి బుడగ మెల్లగా పైకి లేచింది. హాహాకారాలు జనం లోంచి. అలాంటి దృశ్యం ఎన్నడూ చూడలేదు. బుడగ పైపై కి వెళ్తుంటే విశ్వకర్మ కింద చూస్తూ అందరికీ చెయ్యి ఊపుతున్నాడు. ఇంతలో పెద్ద కుదుపు. కట్టిన తాళ్ళలో ఒకటి ఊడొచ్చింది. తను నిల్చొని వున్న డబ్బా కిందకి వంగింది..దాని మూలంగా అతను జారి అంత ఎత్తు నుండి దాదాపు కిందకు పడిపోయేవాడు. కాని డబ్బా అంచు పట్టుకొని, పైకి పాకాడు. లోపల బుడగ ఎగరడానికి పెట్టిన పొయ్యి కూడా జారుతోంది. అది జారితే మొత్తం బుడగ మంట అంటుకుంటుంది. దాన్ని ఇంకో చేత్తో పట్టుకొని కింద కదలకుండా పట్టాడు.

ఇప్పుడర్థమయ్యింది అతనికి పురుషదత్తుడు ఎందుకు నవ్వుతున్నాడో. లేదు, తను విఫలం కాకూడదు. ఎలాగైనా సరే ఆ గ్రామం దాక వెళ్ళాలి. ఈ పొగ పొయ్యి జరగనంత వరకు పర్వాలేదు. దాన్ని అలానే పట్టుకొని ఒక చేత్తో, ఇంకో చేత్తో బుడగ తాడుని పట్టుకొని వేళ్ళాడుతూ అలా ఆ గ్రామం వచ్చేవరకు ఉన్నాడు.

అక్కడ మహరాజుగారి భటులు అతన్ని మళ్ళీ మహరాజు గారి దగ్గరికి వెనక్కు తీసుకొచ్చారు. జనాలందరూ విశ్వకర్మని చుట్టు ముట్టారు. మహరాజుగారి ఆనందానికి అవధులు లేకపోయింది. అతన్ని విపరీతంగా మెచ్చుకొని, తన మెడలోని హారాల్ని బహుమతులిచ్చి, ఇక నుంచి రాజ్య సభలో ముఖ్య సలహా దారుడిగా ఉండాలని, రాజ్యానికి అవసరమైనప్పుడు ఉపయోగపడే వస్తువులు తయారు చెయ్యాలని చెప్పారు. ఇంత కంటే కావల్సింది ఏముంది?

అందరూ వెళ్ళిన తరువాత, భద్రభట్టు, పుష్ప వచ్చారు. పురుషదత్తుడు ఎక్కడా కనిపించలేదు. భద్రభట్టు మెదడు చురుగ్గా పని చేసింది. ఈ బుడగ ద్వారా తన వ్యాపారం ఇంకా పెంచుకోవచ్చు.. నిజంగా ఆకాశమే హద్దు. పైగా మహరాజుగారి కి అత్యంత ఆంతరంగీకుడైయ్యాడు. అవకాశాన్ని ఎలా పట్టాలో వర్తకుడికి బాగా అనుభవం. ఇంతకు ముందు జరిగినవి మరిచిపోవాలని, ఇద్దరికీ ఇష్టమైతే పెళ్ళికి కూడా అభ్యంతరం లేదని చెప్పాడు. పుష్ప అందమైన నవ్వు చూసి, విశ్వకర్మ మాటల్లేకుండా వుండిపోయాడు..

★★★★★★★★★★★★★

ఇద్దరికీ పెళ్ళి జరిగి సంవత్సరమయ్యింది...సంపద, పేరు, మర్యాద అన్నీ వచ్చాయి..

ఒక రోజు తన భవనం బయట వుంటే, తన మామగారు భద్రభట్టు, ఎవరో ముగ్గురు తమ పరివారంతో రావడం కనిపించింది. తన దగ్గరికి వచ్చి "వీళ్ళు ఏదో ద్వీపం నుంచి వచ్చారు. మన భాష రాదు. కాని తెలిసిందేంటంటే నువ్వు చేసిన బుడగ గురించి విని, దాని కోసం వచ్చారు.."

వాళ్ళ వంక చూస్తే వేరే దేశస్థులులా వున్నారు. తనని పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు విశ్వకర్మ. ఎక్కడ నుండి వచ్చారు?"

మామగారు వాళ్ళతో చెప్తే, వాళ్ళు ఏదో చెప్పారు. మామగారు మళ్ళీ మాట్లాడుతూ,

"వీళ్ళు లంక ద్వీపం నుండి వచ్చారట."

"అలాగా, మీకు పుష్పక విమానం కావాలా?"

మామగారు అర్థం కాక చూసారు.

"అదే, మీ కూతురు, నా భార్య అయిన పుష్ప పేరే పెట్టాను నా గాలి బుడగకి. తనే కదా దానికి స్ఫూర్తి"

మామగారు వాళ్ళతో ఏదో చెప్పి, మళ్ళీ అన్నారు.

"ఈయన పేరు కుబేరుడు. వారి అన్నగారు లంక ద్వీపానికి చక్రవర్తట. నీ గాలి...అదే పుష్పక విమానం చక్రవర్తి గారికి కావలట. ఏదో ముఖ్యమైన పని వున్నదట దానితో. కొన్ని మార్పులు చెయ్యాలట."

"అలాగా..ఆ చక్రవర్తి పేరు?"

వాళ్ళతో మాట్లాడి చెప్పారు మామగారు

"రావణ చక్రవర్తి"

# పాత్ర నిండుగా నది    డా. గరిమెళ్ల నారాయణ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"సూర్యారావు మాష్టారి రిటైర్మెంట్ రేపు సాయంత్రం. ఏమైనా వ్రాసివ్వగలవా?"

నా ఫోన్-కాల్ చివరిలో మా బావగారు అడిగారు.

ఊహించని ఈ విషయానికి నేను తేరుకొని "మాష్టారు అప్పుడే రిటైర్ అవుతున్నారా?" అనుమానం కన్నా ఎక్కువ ఆశ్చర్యమే నాది.

"అమెరికా నుండి అయ్య వచ్చే వరకూ ఇక్కడ అమావాస్య ఆగదండి!" నవ్వుతూ ఆట పట్టించారు.

"నాన్న గారి రిటైర్మెంట్ నాటికి అతనికి పదేళ్ళ సర్వీస్ మిగిలి ఉందని తెలుసు. పదేళ్ళు గిర్రున తిరిగి పోయాయా! ఇంతకీ, నేను ఎప్పటిలోగా వ్రాయాలి?"

"రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా నాకు ఈమైల్ లో పంపితే మిగతాది నేను చూసుకుంటాను. ఉపాధ్యాయులు విద్యార్థుల తరపున వ్రాస్తే బాగుంటుంది" అన్నారు.

"తప్పకుండా ప్రయత్నిస్తాను" అని బావ గారికి చెప్పి సెలవు తీసుకున్నాను.

నేను ఆ రోజు చెయ్యవలసిన పనుల జాబితాలో 'సూర్యారావు మాష్టారి రిటైర్మెంట్ సభలో అతనికి ఇవ్వడానికి కవిత వ్రాసి ఈమైల్ లో పంపాలి' అని వ్రాసుకుని ఎదురుగా 'అమెరికా కాలమానం ప్రకారం రాత్రి తొమ్మిది గంటల ముప్పై నిమిషాల లోపల' అని వ్రాసుకున్నాను.

అనుకున్న సమయము కన్నా రెండు గంటల ముందే కవిత ను ఈమైల్ చేశాను. బావగారు ఆ కవితను మెచ్చుకుంటూ పది నిమిషాలలో జవాబు ఈమైల్ ను పంపారు. ఆ తరువాత నాలుగు గంటల తరువాత మరొక ఈమైల్ ను నాకు పంపారు. ఆ ఈమైల్ కు చేసిన అటాచ్మెంట్ లో సర్వాంగ సుందరంగా కాపీ చేసి ఫ్రేం కట్టబడి బహుమతిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉంది నేను నాలుగు గంటల క్రితం వ్రాసి పంపిన కవిత. దళసరి ఆకుపచ్చని రంగు కాగితం మీద ముత్యాల కోవ లాంటి బావ గారి చేతి వ్రాతలో ఆకర్షణీయంగా ఉంది. స్కెచ్ పెన్నుతో బాపుగారి లిపిలా వ్రాసిన అక్షరాలు, కవితకు చుట్టూ గీసిన అంచులూ, దానికి చేసిన లామినేషన్, చుట్టూ అద్దాల ఫ్రేం తో వెరసి నా అక్షరాలు చేసుకున్న పూర్వజన్మపుణ్యం అక్కడ కనిపించినట్టనిపించింది.

ఉదయం నుండీ మాష్టారి గురించి ఆలోచనలు పునశ్చరణం అవుతున్నాయి.

సూర్యారావు మాష్టారు నాన్న కన్నా పదేళ్ళు చిన్న వారు. అట్టడుగు స్థాయి నుండి స్వశక్తి తో ఎదిగిన గొప్ప మనిషి. ఉపాధ్యాయుడిగా అనేక విషయాలలో చెరగని ముద్ర వేసి రేపటి పౌరులను తీర్చిదిద్దే సూర్యారావు మాష్టారు అంటే మా అందరికీ చాలా ఇష్టం.

నేను ఆయన దగ్గర చదువుకోక పోయినా, నాన్నకు తరువాత అక్క బావ గారికి అతను వేరు వేరు పాఠశాలలలో సహ-ఉపాధ్యాయుడు కావడం తో అతని గురించి చాలా విషయాలు ప్రస్తావనకు వచ్చేవి. ఇండియాలో నా కాలేజీ చదువులు రోజులలో మాష్టారు పలుమార్లు వాళ్ళ స్కూలు కి నన్ను ఆహ్వానించారు. బడిలో పిల్లలకు కథలు, సైన్స్ విషయాలు లాంటివి చెప్పమనే వారు. పిల్లలకి నా అతిధి బోధన ఇష్టంగా ఉండేది. అలాంటి సమయాలలో ఒక్కోసారి మాష్టారి బోధన తీరు, చెప్పే విషయాలు, పిల్లలకు ఆయన పట్ల ఉన్న గౌరవ మర్యాదలు నా దృష్టికి వచ్చి మాష్టారి మీద నా అభిమానాన్ని, గౌరవాన్ని అంతలింతలు చేసేవి. అవన్నీ నా దృష్టి పథం లో శాశ్వతమైపోవడంతో కవితను ఈ రోజు అలవోకగా వ్రాయగలిగాను.

చిన్నప్పటి నుండి పుట్టిన రోజు, పెళ్ళి వేడుకలులాంటి పలు కార్యక్రమాలకు కవితలు వ్రాసి బహుమతి గా ఇవ్వడం నాకు అలవాటు. ఆ అలవాటు వలన నాకు వచ్చిన ప్రశంసల మాట ఎలా ఉన్నా, నాకు ఇతరుల మీద ఉండే ఇష్టాన్ని వారి పట్ల నాకున్న శ్రేయోభావాన్ని చెప్పుకోడానికి ఈ కవితలు సాధనాలుగా ఉపయోగపడేవి. ఆ అలవాటే ఈ రోజు ఈ కవిత వ్రాసి ఇచ్చేట్టు చేసింది. వ్రాసిన కవితలు నాకు ఎప్పుడూ గతమై పోతాయి. కానీ వ్యక్తులు మాత్రం ఎప్పుడూ వర్తమానం గానే అనిపిస్తారు.

రిటైర్మెంట్ సభలో మాష్టారు తో పాటూ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఆ కవితను, అది వ్రాసిన నన్నూ మెచ్చుకున్నారని అక్క, బావ గారు చెప్పారు. అలాగే, సూర్యారావు మాష్టారు నా క్షేమ సమాచారాలు కూడా అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

★★★

మాష్టారి రిటైర్మెంట్ జరిగి ఐదేళ్ళు దాటి పోయింది.

నెల రోజుల పాటూ సెలవు పెట్టి అమెరికా నుండి ఇండియా వెళ్ళిన నా కార్యక్రమాల చిట్టాను అమ్మా నాన్నల సహాయం తో సిద్ధం చేశారు అక్కా బావగారు. నా భార్యా పిల్లలూ కొద్ది రోజులు మా అత్తారింట్లో ఉంటామన్నారు. నేను కూడా ఆ సమయాన్ని నా తల్లిదండ్రులు తోబుట్టువులతో గడపాలనుకున్నాను. ఆ సమయము లోనే ఒక రోజు ను మాష్టారిని కలవడానికని నిర్ణయించి, అక్కా బావ గారు తో కలిసి ఆయన ఉంటున్న ఊరు విష్ణుపురానికి వెళ్ళాను.

ఎంతో కాలం కావడం తో మాష్టారుని, అతని భార్యనీ చూశాక అమ్మా నాన్నను చూసినంత సంతోషంగా అనిపించింది. నా నమస్కారానికి ప్రతిగా మాష్టారు నన్ను ఆలింగనం చేసుకున్నారు. ఆ స్పర్శ కీ ఆప్యాయత కీ కళ్ళు వర్షించాయి.

ఆ తరువాత కుశల ప్రశ్నలు, ఫలహారాలు, కాఫీ టీలు రెండు గంటల సమయాన్ని మాకు తెలియకుండా చేసేశాయి. మా నాన్నగారు అడిగినంత ఆప్యాయంగా నా ఉద్యోగం, ప్రగతి, అమెరికా సంగతులు వంటి వివరాలన్నీ మాష్టారు దంపతులు అడిగారు. నేను కూడా వారి ఆరోగ్యాలు, బాగోగులు, వారి పిల్లల కుటుంబాలు మొదలైన ఇత్యాది విషయాలను గురించి ఇష్టంగా అడిగి తెలుసుకున్నాను. అక్కా బావ గారు మాష్టారిని సంవత్సరానికి ఒక్క సారైనా కలుస్తుంటారు. అందువలన వారిద్దరూ ఎక్కువసేపు ప్రేక్షకుల పాత్రలనే పోషించారు.

మరొక పది నిమిషాలలో బయల్దేరాలని మేము చేతి గడియారాలను చూసి సైగలు చేసుకున్నాము.

మా సైగల అర్థాన్ని గ్రహించారో ఏమో మాష్టారు లేచి వెళ్ళి ఇంటిలో నుండి గోడకు తగిలించి ఉన్న ఒక అద్దాల ఫ్రేం ను తీసుకు వచ్చి నా ముందుంచారు. అది మాష్టారి రిటైర్మెంట్ సందర్భంగా నేను వ్రాసిన కవిత అని గుర్తుపట్టడానికి అట్టే సమయం పట్టలేదు.

దాని మీద ఏ దుమ్మూ ధూళీ లేవు. అక్షరాలన్ని స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కవితను అంత మంచి గా వ్రాసి ఫ్రేం చేయించిన బావగారి వైపు కృతజ్ఞతగా చూశాను. దానిని గోడకి తగిలించి శ్రద్ధగా చూసుకుంటున్న మాష్టారి వైపూ కృతజ్ఞతగా చూశాను. కవితలో ఇలా వ్రాసి ఉంది.

మీరే మా బంగారు బాటల పార్శ్యాంశం

---

*ప్రియమైన సూర్యారావు మాష్టారికి,*

బడికైతే
పదవీ విరమణ టాటా చెప్పి
మరి రాను అంటారేమో కానీ
భరోసా ఇచ్చి మరీ మీరు తీర్చిదిద్దిన
బాలల బంగారు బాటలలో మాత్రం
ఎప్పుడూ తారసపడుతూనే ఉంటారు మాష్టారూ!

అందరిలో ఒకరిలా ఉంటూనే
మీదైన స్ఫూర్తి ముద్రను మా ఉపాధ్యాయులలో వేశారు

మేము చెప్పే పాఠాలలో
మీరు తప్పక తొంగి చూస్తుంటారు మాష్టారూ!

మీ ఎక్కాలూ లెక్కలూ వల్లె వేసిన చిరుతలకే
'పిల్లల్లారా పాపల్లారా రేపటి భారత పౌరుల్లారా' అనే
పాటనూ నేర్పి
విత్తనాలకు మీరే నీరూ సారం చేర్చారు.
పువ్వుల్లో ఫలాల్లో కూడా ఉండేదీ మీరే మాష్టారూ.

తల్లిని ప్రేమించమనో
తల్లి లాంటి భాషను ప్రేమించమనో
దైవం లాంటి వృత్తిని పూజించమనో
ప్రపంచాన్ని వీక్షించగలిగే ఆంగ్లం నేర్చమనో
మీరు చెప్పకపోయినా
మీరు చేసి చూపిన మార్గము
మాకు చెప్పకనే చెబుతుంటుంది మాష్టారూ

విరామమెరుగక శ్రమించినందుకు
విశ్రాంతిలో కొంత సేద తీరండి
మీలో గర్వాన్ని పూయించబోయే
విద్యార్థుల భుజాలు తట్టడానికి మాత్రం
ఎప్పటిలా సిద్ధంగా ఉంటూనే ఉండండి మాష్టారూ

(– గౌరవ అభిమాన హృదయాలతో, ఉపాధ్యాయులు మరియూ మీ విద్యార్థులు)

"నేను ఈ కవిత వ్రాసిన విషయము పూర్తిగా మరచిపోయానండి. అమెరికాలో వ్రాసిన కవిత మీ ఇంటి వరకూ ప్రయాణించి నన్ను చాలా సంతోషపరిచింది. ధన్యవాదాలు మాష్టారూ" అన్నాను.

"ధన్యవాదాలు మీకు నేను చెప్పాలి. మీరు వ్రాసిన ఈ కవిత ప్రయాణం అది మా ఇంటికి చేరడం తో ఆగిపోలేదు" కొనసాగింపుగా అన్నారు మాష్టారు.

"మరి!?" తెలియని కుతూహలం తో అడిగాను.

నాకు దగ్గరగా తన కుర్చీని జరుపుకుని చెప్పడం ప్రారంభించారు.

"పెద్దవనుకున్న సమస్యలన్నీ నాకు ఎప్పుడో తీరిపోయాయి. అంటే పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, పురుడులూ, మనవలూ మనవరాళ్ళూ పుట్టుకలు వంటివన్నీను. అవన్నీ సవ్యంగా జరిగిపోయి రిటైర్ అయ్యేనాటికి నాకు ప్రశాంతమైన జీవితం సిద్ధంగా ఉంది".

"మంచిదే కదా మాష్టారు! మీరు ఈ విషయములో కూడా అదృష్టవంతులే" అక్కయ్య అంది మెచ్చుకోలుగా.

"లేదమ్మా, ప్రశాంతత ఎప్పుడూ ఒకేలా ఉండదు" అన్నారు. అలా అన్నప్పుడు ఆయన భృకుటి మీద ముడతలు కనిపించాయి.

మళ్ళీ తనే అన్నారు. "ఏ పనీ పాటూ పెద్దగా లేకనో, మరి టీవీ లో వార్తలు చూస్తూ వార్తా పత్రికలు కూడా అదే పనిగా తిరగేస్తూ అందరి సమస్యలూ నావిగా భావించడం వల్లనో ఏమో నాకు త్వరగానే జీవితం అంటే విరక్తి కలగడం మొదలయ్యింది. 'అనుభవించినది చాలు ఇక తనువు చాలిద్దామా' అని చాలా సార్లు అనిపించింది."

మాష్టారి మాటలకు అతని భార్య గంభీరంగా అయ్యారు. మేము ముగ్గురమూ అవాక్కయ్యాము.

అతను ఉపాధ్యాయుడిగా అనేకమంది జీవితాలను తీర్చిదిద్దారు. స్థిరంగా జీవించడం నేర్పించారు. అంతటి పెద్ద మనిషి ఈ రోజు ఇలా మాట్లాడటం మాకు నమ్మశక్యం కావట్లేదు.

మా అనుమానాన్ని ఎక్కువ సేపు కొనసాగనివ్వక మళ్ళీ అతను చెప్పారు.

“అలాంటి సమయాలలో నా భార్య నాకు కొండంత ధైర్యం చెప్పి జీవితాన్ని నిలిపింది. సరిగా అప్పుడే నీవు వ్రాసిన ఈ కవితను కూడా పదేపదే చదువుకున్నాను. తెలియని శక్తి వచ్చింది. జీవితం మీద మరింత ఇష్టం కలిగింది.”

నాకు ఆ మాటలకి ఆశ్చర్యంగా అనిపించి కుతూహలం పెరిగింది. అక్కా బావ గారిదీ కూడా అదే పరిస్థితి.

"నీ కవితలో ఆశావాదం ఉంది. కాదు కాదు. ఆశావాదంతో ఆ కవిత నిండి పోయింది. అందులో పడమటి సంధ్య చాలా అందంగా, పరిపక్వంగా కనిపించింది. దానిని కోల్పోదలచుకో లేదు. వృధాగా పోనివ్వదలచుకోలేదు. అప్పుడే ఒక మంచి నిర్ణయం తీసుకున్నాను" అతను చెప్పుకుంటూ పోతున్నారు.

ఆ మాటలు వింటున్నకొద్దీ ప్రపంచం పెద్దగా గొప్పగా తోచింది. ఆయన మాటలు ఏవో దిశలకు నిర్దేశాలుగా అనిపిస్తున్నాయి. అతని నిర్ణయం ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక మరింత ఉత్సాహంగా ఆయన మాటలు వినేట్టు చేస్తోంది.

"నీ కవిత నా జీవితములో ఇంత ఆశను కల్గిస్తే, ఇలాంటి కవితలు మరెందరి జీవితాలలోనో వెలుగులు నింపగలవని అనిపించింది. కానీ నాకు కవిత్వం రాదు. ఒక వేళ, నేను కవిత్వం లా వ్రాసినా చదివి నాలా అందరూ అర్ధం చేసుకుంటారో లేదోనని అనుమానం. ఏదైనప్పటికీ మంచి అక్షరాలలో ఏదో మహత్తు ఉంటుందని ఎప్పటినుండో తెలిసిన విషయమే మరొకసారి రూఢిగా అనిపించింది. అక్షరాలంటే పదాలు, వాక్యాలూ అందులో పొదిగిన భావాలు, మనం పరిపూర్ణ శ్రేయోభిలాషిలా మరొకరి పట్ల ఆశించిన ఆశలూ అనిపించింది”

వాక్ప్రవాహం లో ఆవేశానికో ఏమో దగ్గు వచ్చి అడ్డుకట్ట వేసింది.

అప్పుడతని భార్య అన్నారు.

“అవును బాబూ పదిమందికీ ప్రయోజనం కలిగేలా ఏమైనా వ్రాయాలనుకున్నారు. అప్పటి నుండీ ఇప్పటి వరకూ వ్రాస్తున్నారు. నువ్వు ఇచ్చినట్టే ఫ్రేము కట్టి మరీ అందిస్తున్నారు. ఆయన కి ఇప్పుడు ఏ దిగులూ లేదు. సమయము ఎలా గడుస్తుందో అన్న చింత అస్సలు లేదు”

కొత్తగా అనేక విషయాలు తెలుసుకుంటున్నాము.

అంతకంతకూ ఉత్సుకత పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. మాష్టారు తిరిగి అందుకున్నారు.

“ ఈ రోజులలో చిన్న చిన్న విషయాలకే పిల్లలు మొదలు పెద్దల వరకూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మా స్నేహితుడు గణపయ్య కూతురు పన్నెండేళ్ళ పిల్ల ను అస్తమానం టి.వీ. చూడొద్దని తల్లిదండ్రులు మందలించారని బొద్దింకలమందు తాగేసింది. ఆ మందు కక్కించి దానిని బతికించుకోడానికి తాతలు దిగి వచ్చారు. అలాగే పంట గతి ఏమౌతుందోనన్న దిగులుతో మా ఊరి రైతొకరు మంచం పట్టి పోయాడు. అత్తింటివారు పదే పదే కట్నం అడుగుతున్నారని ఒక ఆడపిల్ల, ఎదగడాన్ని ఓర్చుకోలేక ఉద్యోగం లో దెబ్బకొట్టారని మంచి వయస్సులో ఉన్న అబ్బాయి ఉరి వేసుకు చచ్చిపోయారు. ఇలా నిత్యం కుంగుబాట్లు, ఆత్మ హత్యలూ పెచ్చరిల్లి పోతున్నాయి. నా వంతుగా నేను ఏదో ఒకటి చెయ్యాలనిపించింది. ఈ కవిత వలన అనుకోకుండా నేను అదనంగా ప్రయోజనం పొందాక అర్ధం అయ్యింది."

మాష్టారి భార్య దూరంగా అద్దాల బీరువాలో ఉన్న అట్టలకి అతికించిన రంగు కాగితాలు, స్కెచ్ పెన్నులూ, పెన్సిళ్ళూ, ఖాళీగా ఉన్న ఫొటో ఫ్రేములూ తీసుకొచ్చి చూపించారు.

'ఇవి కాదు అసలువి చూపిస్తాను' అని మళ్ళీ ఆ గది లోకి వెళ్ళి ఒక ఫైల్ తీసుకొచ్చి మాకు ఇచ్చారు. అందులో మాష్టారి స్వదస్తూరిలో పెద్ద పెద్ద అక్షరాలు వ్రాసి ఉన్న కాగితాల దొంతర ఉంది. మొదటి కాగితం పై ఇలా వ్రాసి ఉంది.

"రంగ బాబు గారు,

మీరు చాలా మంచోళ్ళు. గొప్పోళ్ళు. దేవుడు మీకు మంచి ఆరోగ్యం ఇచ్చాడు. నూరేళ్ళు కూడా ఇంతే ఆరోగ్యంగా బతకమని కోరుకుంటున్నాడు. మీకు చేతనైనంతలో మీ కుటుంబంలో బాధ్యతలన్నీ మీరు చక్కగా నిర్వహించారు. చిన్నప్పుడు మా పాప కనిపించకపోతే మీ దంపతులిరువురూ కలిసి ఊరంతా వెదికి మరీ మా పిల్లను తెచ్చి మాకిచ్చారు. మీ తమ్ముడు కి ప్రాణం మీదకి వస్తే మీరొక్కరూ పట్నానికి వెళ్ళి డాక్టర్ ని తెచ్చి అతని ప్రాణం నిలబెట్టారు. ఊరిలో పిల్లలు రాత్రి పూట పరీక్షల సమయములో చదువుకునే బిల్డింగ్ కట్టడానికని చందాలు అడిగితే మీరు ఐదు వేల చందా ఇచ్చారు. మీరు ఇలాంటి మంచి పనులెన్నో చేశారు. అందరి మంచీ కోరుకున్నారు. మీకు ఆ దేవుడి దయ వలన ఎప్పుడూ ఏ కష్టం రాలేదు. రాదు కూడా. మీకు మీ కుటుంబానికి నా లాంటి చిరు స్నేహితులు అనేకమంది ఎప్పుడూ అండగా ఉంటారని, మీ బాగుని, ఆరోగ్యాన్ని, ఆనందాన్నీ కోరుకుంటారనీ ఎప్పుడు మరిచి పోకండి."

ఆ వాక్యాలు చదివి ముగ్గురం ఆనంద చకితులమయ్యాము.

రెండవ కాగితం వెంటనే తీసి చూశాము.

"అబ్బాయి సుధాకర్ బాబు,

నువ్వు పట్నం లో చదువుకోడానికి వెళ్తున్నావని ఊరిలో అందరూ సంతోషంగా ఉన్నారు. నా దగ్గర చదువుకుని నువ్వు ఎదిగినందుకు నాకు ఇంకా సంతోషంగా ఉంది. మీ అమ్మా నాన్నా నిన్ను ప్రాణాలలో పెట్టుకుని పెంచారు. నువ్వు చదువుల్లో బాగా రాణించి మంచి ఉద్యోగంలో చేరితే నిన్ను చూసి మీ అమ్మా నాన్నే కాదు, ఊరు ఊరంతా గర్వ పడుతుంది. ఒక వేళ, ఏ కారణం తో ఐనా అనుకున్నట్టూ జరగక పోతే నీ మేలు కోరే వాళ్ళు ఊరి నిండా ఉన్నారని గుర్తు చేసుకో. నిన్ను తిరిగి గాడి లో పెట్టుకోగలరు. నిత్యం ఉత్తరాలు వ్రాస్తూనో ఫోనులూ చేస్తూనో మీ అమ్మా నాన్నల బాగోగులు తెలుసుకుని నీవి వారికి చెబుతూ ఉండు. సదా నీ బాగును, నీ వలన ఊరికి కొంత బాగును మేము కోరుకుంటున్నాము."

వేరొక ఉత్తరమూ ఇలాగే నిండా వయస్సు పెరిగి వృధ్ధులైపోయిన దంపతులకు వ్రాసినది. మరొక ఉత్తరం పెళ్ళికి సిద్దం అవుతున్న పెళ్ళికూతురికి, ఇంకొకటి కాపురానికి వెళ్తున్న ఆడ పిల్లకి, మరొకటి కూతురు పుట్టిన సందర్భములో ఇద్దరు దంపతులకీ, ఇలా వందకు పైగా చక్కని అక్షరాలతో ఉత్తరాల లాంటి ఉద్దేశ్య వచనాలు కనిపించాయి. ఇవన్నీ ఫ్రేములలో పెట్టిన తరువాత కాపీ తీసినందుకు నిదర్శనంగా ప్రతి కాగితానికీ చుట్టూ ఫ్రేం అంచుల ఆనవాళ్ళ గీతలూ కనిపించాయి.

తనకు తెలిసిన మనుషులని కాపాడుకోడానికీ, బాగు పరచుకోడానికీ మాష్టారు కంకణం కట్టుకున్నారని అర్థం అయ్యింది.

తనకి పెద్ద ఆస్థి పాస్తులూ బ్యాంకు నిలవలూ ఏవీ లేక పోయినా మాష్టారు ఊరందరి తరపునా వకాల్తా పుచ్చుకుని ధైర్య వచనాలు కాగితాల నిండా పలికారు. వినడానికి తన చెవి ఉందన్నారు. కష్టాలు చెప్పుకోమన్నారు.

ఇలాంటి భరోసా ఇచ్చే ఉత్తరాలో లేదా వాక్యాలో చదివితే ఎవరికి మాత్రం బతుకు మీద రోత పుడుతుంది. ఎవరికి మాత్రం దుర్బుద్ది పుడుతుంది. పైగా ఈ వాక్యాల ప్రభావానికి తమను తాము తీర్చిదిద్దుకున్న ఎవ్వరూ తిరిగి ఇలాంటి వాక్యాలు వ్రాసి పదిమంది మేలూ కోరుకోకుండా ఉండలేరనిపించింది.

నా ఆలోచనలకు అంతరాయమిస్తూ మాష్టారి భార్య ఖాళీ ఐన కాఫీ గ్లాసులు అందుకుంటూ అన్నారు.

"ఇప్పటి వరకూ ఈ ఉత్తరాలు అందుకున్న అందరూ మాష్టారిని ప్రతి రోజు తలచుకుంటున్నామని చెప్పారు. వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కూడా గోడకి తగిలించుకునే వీలుండే ఈ ఉత్తర సందేశాలని ప్రస్తావిస్తూ మెచ్చుకుంటున్నారని కూడా తెలిసింది" చెబుతున్నప్పుడు ఆవిడ కళ్ళు మెరుస్తున్నాయి.

"కొందరు ఎవరికి వారే ఇలాంటివి వ్రాసుకుని గోడలకి తగిలించుకుని వారిని వారు ముఖ్యమైన వారిగా భావించుకుంటున్నారట. ఇంకొందరు తమకూ ఇలా వ్రాసి ఇవ్వమని మాష్టారిని ప్రాధేయపడుతున్నారు. ఇంకా తమకు తెలిసిన వారికి బహుమతిగా ఇవ్వడానికి ఇవి ఎలా వ్రాయాలో మాష్టారిని అడిగి తెలుసుకుంటున్న వారు కూడా ఉన్నారు. వారు మాత్రమే కాకుండా వారి వారంతా కూడా పలుసార్లు మాష్టారికి కృతజ్ఞతలు చెప్పారు. చూస్తుంటే మాష్టారు అనుకున్నది అవుతున్నట్టే అనిపిస్తోంది" తమ అనుభవాలను హుషారుగా మాతో పంచుకున్నారు.

నేను కవిత రూపంలో ఏమి చెప్పానో మరచిపోయాను. కానీ మాష్టారు ఆ కవిత పేరు తో పెద్ద యజ్ఞానికే శ్రీకారం చుట్టారు. ఆ యజ్ఞ ఫలాల గురించి నాకు ఏ సందేహమూ కలగట్లేదు. ఏ అపనమ్మకమూ లేదు.

సజల నయనాల తో మాష్టారు దంపతుల నుండి సెలవు తీసుకుని ఇంటికి ప్రయాణమయ్యాము. ఆ తరువాత అమెరికాకి వెళ్ళాక కూడా ఈ విషయాలు గుర్తుకు వచ్చిన ప్రతి సారీ ఎవరో నా భుజం తడుతున్నట్టు లేదా వేరెవరి భుజమో నేనే తడుతున్నట్టూ భావనలు కలుగుతున్నాయి.

# నిన్నా- నేడూ

డా.సుభద్ర వేదుల

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

" రోజులు రోజు రోజుకీ మారిపోతున్నాయి" అంది శారద చదువుతున్న పేపర్ పక్కన పెట్టి నిట్టూరుస్తూ.

ఆమె అన్న తీరుకు ఫక్కున నవ్వాడు గోపాల్. " రోజూ మారే దాన్నే రోజు అంటారు. ఎలాగో చెప్పనా? నేడు రేపటిని నిన్నవుతుంది, అలాగే " అంటూ ఏదో చెప్పబోతున్న భర్త గోపాల్ ని ఆపి..

" అబ్బా! నేను అంటున్నదేమిటి? మీరు చెప్తున్నదేమిటి?" అంది విసుగ్గా..

"నీవన్నదే నేనన్నదీ!" అంటూ రాగం తియ్యబోయి ఆమె ముఖం చూసి ఆపేశాడు. "నువ్వెందుకో కాస్త అప్సెట్ అయినట్టు కనిపిస్తున్నావు శారూ! ఏమయింది?" అన్నాడు నెమ్మదిగా.

" ఫలానా అని లేదు లెండి.. రోజు రోజుకీ వెర్రితలలు వేస్తున్న పోకడలు చూస్తుంటే మనమూ, మనతోపాటు ఈ సమాజమూ ఎటువెళుతోందా? అనిపిస్తోంది నాకు. అప్పుడప్పుడు పేపర్ చదవాలన్నా, న్యూస్ చూడాలన్నా కూడా భయం వేస్తోంది" అంది కాస్త వేదన ధ్వనిస్తున్న గొంతుతో..

" మార్పు సహజం శ్రీమతిగారు. నిన్న ఉన్నది నేడు ఉండదు, నేడు మనం అనుకున్నది రేపటికి పనికి రానిదవవచ్చు.. ఎవరో ప్రముఖులు చెప్పినట్టు మార్పు మాత్రమే శాశ్వతం" అన్నాడు నవ్వుతూ..

" అయినా ఇప్పుడు నిన్నంత కలత పెట్టిన విషయమేమిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు కొంత నాటక ఫక్కీలో.

" ఇదిగో ఇది చూడండి.. ఈ మాజీ విశ్వసుందరి తనకి కావలసినప్పుడు పిల్లలు కలిగేలా తన అండాలను ( ఎగ్స్) ని ఎన్నో ఏళ్ళక్రితం భద్రపరుచుకుందిట. ఇప్పుడు తను కోరుకున్న వాడిని పెళ్ళి చేసున్నాకా, తనకి బిడ్డలని కనాలనిపించిన తరుణంలో వాటిని ఉపయోగించి పాపకి

జన్మనిచ్చిందిట. అది చాలా ప్రముఖంగా ప్రచురించారు పేపర్లలో, టీ.వీల్లో చెప్తున్నారు ఇది ఒక ఉదాహరణ మాత్రమే, ఇలా ఎందరో అమ్మాయిలు ఈ బాట పట్టి తమ కలలని సాకారం చేసుకుంటున్నారు అంటూ పెద్ద వ్యాసం రాశారు. ఆమె ఫోటోలు కూడా వేశారు. చూడండి" అంది శారద.

గోపాల్ తల పంకించాడు.. ఆమె భావం అతనికర్ధం అయింది అప్పటికే. అయినా కానట్టుగా..

" గుడ్.. అభివృద్ధి చెందిన విజ్ఞానపు మహత్యం.. వెరీ నైస్" అన్నాడు..

" ఏమిటి నైస్? ఇలా ఎవరిష్టం వచ్చినట్టు వారు చేస్తే దీన్ని నైస్ అంటారా? విపరీతం అంటారు. ఏం ఆ అమ్మాయి కేం కొమ్ములున్నాయా? చక్కగా సరి అయిన వయసులో సక్రమంగా చేసుకోవచ్చు కదా? అప్పుడేమో చదువులనీ, ఉద్యోగాలనీ, కెరియర్ లనీ, ఈ పిల్ల లాంటి వారి విషయం లో అయితే మోడలింగ్ లనీ, ప్రకటనలనీ ఇలా గడిపేసి. ఆ తరవాత తీరిగ్గా ఈ ఆలోచనలకి మళ్ళడమెందుకు?ఈ విపరీతపు ధోరణులెందుకు?" అంది.. ఎందుకో తెలీదు కానీ ఆమె గొంతులో చిన్న పాటి కోపపు జీర..

" ఆ అమ్మాయి జీవితం, ఆ అమ్మాయి ఇష్టం.. మధ్యలో మనకెందుకూ అభ్యంతరం?" అన్నాడు గోపాల్.

మూడు దశాబ్దాల సహచరిగా తన ఇద్దరు పిల్లల తల్లిగా శారద ఆలోచనలూ, అభిప్రాయాలు అతనికి బాగా తెలుసు. పెద్దలు కుదిరిస్తే శాస్త్రోక్తంగా జరిగిన వివాహం తమది. అత్తమామలకు అనుగుణంగా కొన్నాళ్ళు వారితో కలిసీ, ఆ పైన తన ఉద్యోగ రీత్యా విడిగానూ కాపురం చేసి మంచి ఇల్లాలు  అనిపించుకున్న మహిళ శారద.

ఒక గృహిణి గా, యాభై కి అటువైపు అడుగుపెట్టిన మహిళగా జీవితం పట్లా, సమాజం పట్లా ఆవిడకి నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. అవే సరి అయినవి, అందరూ అలాగే నడుచుకోవాలన్న అమాయకత్వమూ ఉంది.. అదే గోపాల్ కి అన్నింటికన్నా ఇష్టమైనది. తను నమ్మినదాన్ని సరి అయినది అని బలంగా నమ్మి వాదించే భార్యతో వాదులాడడం అతనికో గొప్ప సరదా..

" నేడు శ్రీమతికి మాతోటి వివాదం" అంటూ పాటలు పాడి  మరీ ఆమెతో వాదిస్తాడు.. సరదాకే అని తెలిసినా అందులో పూర్తిగా నిమగ్నమై పోయి శారద మాత్రం అప్పుడప్పుడూ కళ్ళనీళ్ళవరకూ వెళుతుంది..

" ఏవిటి ఆ అమ్మాయి జీవితం? ఇలా ఎవరిష్టం  వచ్చినట్టు వాళ్ళు ప్రవర్తిస్తేనే లోకం ఇలా తగలడుతోంది.. రోజురోజుకీ దిగజారుతున్న విలువలూ, వింత పోకడలూ మొదలవుతున్నాయి." అంది..

" నిజమే!" అన్నాడు గోపాల్ ఒప్పుకుంటున్నట్టుగా.

ఎప్పుడూ పావుగంటైనా వాదులాడనిదే ఏ విషయన్ని తనతో ఏకీభవించని భర్త అలా అనేసరికి ఆమెకి గొప్ప సంతోషం వేసింది. తను సరి అయిన పాయింట్ ని పట్టుకున్నానన్న ఆనందం ఆమె ముఖంలో ప్రతిఫలించింది.

" అబ్బా! ఇన్నాళ్ళకి నేనన్నది ఒప్పుకున్నారు మొదటిసారి" అంది కాస్త సంబరంగా.

" నువు అవునంటె నే కాదనిలే!" అంటూ పాటందుకుని

" నిజమే అన్నది నీ మాట ఒప్పుకుని కాదు బంగారం, నిజమే, ఆ అమ్మాయి ఫలానా శారద గారి పర్మిషన్ తీసుకోవలసింది అని చెప్పబోతున్నాను ఇంతలో నువ్వు అందుకున్నావు" అన్నాడు నవ్వుతూ.

ఉక్రోషంగా చూసింది భర్త వైపు. '" నేనేం అలా అనలేదు. నా పర్మిషనేమిటి మధ్యలో! మీరేమంటున్నారు ఇప్పుడు? " అంది కోపంగా.

చెంపల దగ్గర నెరుస్తున్న జుట్టూ, తలంటుపోసుకున్న తడి ఆరని జుట్టు. ఎర్రటి చేనేత చీర, నుదుట  కుంకుమ బొట్టు.. ఎంతో అందంగా కనిపించింది శారద అతని కళ్ళకి..

" ఇప్పుడైనా అదే మాట అంటాను. ఆ అమ్మాయి జీవితం, ఆ అమ్మాయి ఇష్టం. ఏ పరిస్థితుల్లో అలా చెయ్యవలసి వచ్చిందో?“అసలయినా ఎవరైనా తమకిష్టమైన పని చెయ్యడానికి ఫలానా పరిస్థితే ఉండాలని రూలేం లేదు. ఆమె చేసిన పని చట్ట వ్యతిరేకం కాదు, ఆమెకి కావలసినంత డబ్బు ఉంది, చెయ్యాలన్న ఇష్టం ఉంది, కారణం ఉందో లేదో మనకనవసరం.. అందుకని ఆమె ఇష్టం. అంతేనా?" అన్నాడు.

" కనే వయసునేమో రాంప్ వాక్ లకీ, సినిమాల్లో వేషాలకీ ధారపోసి ఆ తర్వాత తీరిక చిక్కాకా చేద్దామనుకుందేమో?" అంది శారద..

" తప్పు శారదా! అలా పరుషంగా మాట్లాడే హక్కు మనకేముంది? ఎవరి నాడు వాళ్ళు చేసినవే ఇలాంటి పనులన్నీ. ఇప్పుడు నువ్వన్నట్టు ఆ అమ్మాయి చేసినది తప్పైతే మనమూ, మనలాంటి మరెందరో చేసినదీ తప్పే. దానికి రక రకాల పేర్లు మనం పెట్టుకోవచ్చు. అది వేరే సంగతి" అన్నాడు గట్టిగా.

" మనమా?" అంది శారద. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యంగా.

" అవును శారూ! ఆలోచించు.. ఒక్కసారి మాన చిన్న అమ్మాయి మైత్రి పుట్టిన తర్వాత రోజులు గుర్తు తెచ్చుకో" అన్నాడు అతను..

-------------

" గోపాల్! నాన్నా మళ్ళీ లక్ష్మి బోసినవ్వులతో, మెరుపుల చూపులతో నడిచి వచ్చిందిరా, మనింట్లోకి!! ఆడపిల్ల.. కోడలూ, పిల్లా సుఖంగా ఉన్నారు.. ఉండి స్వామికి ముడుపు కట్టి వస్తాను.. అన్నట్టు, నీకు తీపి తినిపించలేదు కదూ, ఇదిగో పటికబెల్లం" గోపాల్ తల్లి ప్రసూనాంబ హడావిడి పడుతోంది..

ఆవిడ మాటలు విని ఎంతో సంతోషించాడు గోపాల్. తల్లీ బిడ్డా కులాసాగా ఉన్నందుకు. వసుధకి తోడు చెల్లెలు పుట్టినందుకు..

శారద మాత్రం మళ్ళీ ఆడపిల్లని కాస్త నిరుత్సాహపడింది. 'ఒక పాప ఉంది కదా, రెండో సారి బాబు పుడితే బావుండేది!' అని చాలా సార్లు గోపాల్ తోనూ, అత్త గారితోనూ కూడా అనేది. వసుప్రద అని పేరు పెట్టారు..

" అలాగే లేమ్మా, మనకేం లేదా, పోదా? తాతలనాటి ఆస్థి ఉంది, వాడికి బ్రహ్మాండమైన ఉద్యోగం ఉంది. మరోసారి చూడు, మగపిల్లవాడు పుడితే నీ కోరికా తీరుతుంది." అంది ప్రసూనాంబ.

" అదేమిటమ్మా నువ్వు కూడా అలా అంటావు? ఈ రోజుల్లో ఇద్దరు చాలని తెలీదూ మనకి? ఏదో సరదాకి అంటోంది శారద" అన్నాడు గోపాల్.

" తప్పేముంది రా? పిల్లలు దేవుడిచ్చే వరాలు. ఈ నాడు పిదపకాలపు బుద్ధులు పుట్టుకొచ్చి అందరూ మాకిద్దరు చాలు, ముగ్గురు చాలు అని అంటున్నారు కాని ఇదివరలో ఇలా ఉండేదా? ఇంటినిండా పిల్లలు తిరుగుతూ ఉంటే ఎంత కళగా ఉంటుందీ? అలాంటిది ఇంకొక్కరిని చూడడానికి నీకు కష్టం గా ఉందేం?" అంది ఆవిడ కోపంగా.

" ఆడైనా, మగైనా ఒకటే అంటూ అందరినీ సమానంగా చూస్తూ, ప్రేమించే ఆధునిక భావాలున్న అమ్మ, అందరినీ ఒకేలా ప్రేమించాలి, చక్కగా చదివించాలి. ఏ బిడ్డైనా తల్లి పడే వేదన ఒకటే, వాళ్ళు తమతో తెచ్చే సంతోషమూ ఒకటే అంటూ చెప్పే అమ్మ అలా మాట్లాడడం ఆశ్చర్యంగా అనిపించింది గోపాల్ కి.

" మళ్ళీ ఆడపిల్లే పుడితేనో అత్తయ్యా?" అని శారద అంటే..

" పిచ్చి పిల్లా, ఎవరైనా ఒకటే అనుకోవాలి తప్ప కేవలం మగపిల్లవాడే కావాలి అనుకుంటేనే కదా నీకు కష్టం.. నాకింకో బిడ్డ కావాలి, నా కూతుళ్ళిద్దరికీ తోడు అనుకుని చూడు. ఎంత హాయిగా ఉంటుందో!" అంది..

పెరుగుతున్న జనాభాని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారు చేపట్టిన సంస్కరణలవల్లనైతేనేం, పెరిగిన అవగాహన వల్లైతేనేం గోపాల్ దంపతులు ఇద్దరు పిల్లలతో సరి పెట్టారు.

" ఆయన వద్దన్నారత్తయ్యా, ప్రభుత్వం వారింత పోర్తు పెడుతుంటే కూడ కనీసం మనలాంటి చదువుకున్నవాళ్ళు కూడా పాటించకపోతే ఇంకెన్ని చట్టాలు చేసి ఏ ప్రయోజనం? ఎంతగా చెప్తే మాత్రం ఏం ఉపయోగం? అంటున్నారు. ఆయన అన్నదీ నిజమే కదూ, వీళ్ళిద్దరినీ బాగా పెంచి, చదివించి పెద్దవాళ్ళని చేస్తే చాలనిపిస్తోందినాకు కూడు కూడా." అంది శారద అత్తగారితో..

ఆవిడ మాట్లాడలేదు. పైకి చెప్పిన శారదకీ, చెప్పకపోయినా తల్లికీ కనీసం ఇంకోసారి చూస్తే అబ్బాయి పుట్టేవాడేమో! అన్న ఆశ ఉందని గోపాల్ కి తెలుసు.. తను తీసుకున్న నిర్ణయం వారి మనసులని కష్టపెట్టిందని తెలుసు. ముఖ్యంగా ఎనిమిది మంది పిల్లలున్న నాన్నమ్మ, తాతగార్లనీ మరీ..

" మారుతున్న కాలం, ఆ ప్రకారమే మనమూ ప్రవర్తించాలి కదా!" తండ్రి తల్లితో చెప్పిన మాటలు గోపాల్ కి తెలుసు.

గుర్తు చేసుకుంటూ ఆగింది శారద..

" అప్పుడు మనం చేసింది మన వెనక తరం వారికి తప్పుగా అనిపించింది, గిర్రున తిరిగిన కాలంతో పాటు తిరిగి నిలబడితే, ఈ నాడు మనం స్థానం మారి మనం అక్కడున్నాం. అందుకే నీకివన్నీ అలాగే కనిపిస్తున్నాయి.. అవునా, కాదా?" అన్నాడు గోపాల్.

మాట్లాడలేదు శారద..

"కానీ అప్పుడున్న పరిస్థితుల్లో పెరుగుతున్న జనాభాని నియంత్రించడానికి అంతకంటే మార్గం లేదు కదా! పైగా అది చట్టపరంగా, ప్రభుత్వపరంగా ఆమోదం పొందినది. ఇది అలా కాదు కదా! మనిషే ప్రకృతిని నియంత్రించడం లా కనిపిస్తోంది నాకు" అంది శారద..

" కరక్ట్ గా చెప్పావు. నువ్వు చెప్పినవన్నీ నిజమే. ఒక్క నిమిషం చట్టం అన్న విషయాన్ని పక్కన పెట్టి చూడు..

" వివాహం, వంశాభివృద్ధి ఇవన్నీ ప్రకృతిపరమైన పరిణామాలు. మనిషి జీవితంలో సాధారణంగా, సజావుగా జరగవలసినవి.. ఒక్కసారి గతంలో అవి ఎలా మార్పు చెందాయో చూడు..

మీ నాన్నమ్మ తాతగార్లకి తొమ్మిది మంది పిల్లలు, మీ అమ్మమ్మకి ఆరుగురు.. మీ అమ్మగారికి మీరు నలుగురు.. అలాగే మా వైపు.. క్రమంగా తగ్గింది. మన బంధువులలోనూ, స్నేహితులలోనూ ఇదే కనిపిస్తుంది.. గత నలభై, యాభై సంవత్సరాల్లో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలకంటే ఎక్కువ ఉన్న కుటుంబాలు దాదాపు లేవనే చెప్పవచ్చు.

"ఒక బిడ్డ చాలు! ప్రస్థుత పరిస్థితుల్లో ఒకరు, లేదా ఇద్దరికంటే పెంచలేం, భరించలెం, చదివించలేం అంటున్నారు కదా ఇప్పుడు!..

అదే మరి సంపన్న దేశాలను తీసుకుంటే ఈ ధోరణి కనిపించదు కదా? అప్పుడేది రైటు? కొన్ని దేశాల్లో జనసంఖ్య పెరగాలని ఎక్కువ మంది పిల్లలున్న వారిని ప్రోత్సహించి, బహుమతులూ అవీ కూడా ఇస్తారు కదా, అప్పుడది రైటా, తప్పా?

సిజేరియన్ ఆపరేషన్లు వచ్చేవరకూ ప్రకృతిపరమైన పద్ధతి తప్ప మరో దారి లేక ఎంతో మంది తల్లులూ, బిడ్డలూ ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వాటికి వరంగా వచ్చిన ఈ పద్ధతి వల్ల ఎంత లాభం జరిగిందో మనకి తెలుసు. దాన్ని కూడా ఈ కాలపు పిల్లలు తమ కిష్టమైన రీతిలో వాడుకుంటున్నారు కదా! అది తప్పా, రైటా?

ఫలానా వయసుకే పెళ్ళి జరగాలనీ, ఫలానా టైములో పిల్లలుండాలని ఎవరో ఎందుకు నిర్దేశించాలి? వాళ్ళ మాట మేమెందుకు వినాలి? అన్న వాదన ఒకటయితే.. పెరుగుతున్న చదువులూ, ఉద్యోగాలు. బాధ్యతలూ వీటినడుమ జీవితానికి పరమావధి పెళ్ళే కాదన్న ఆలోచన వచ్చాకా అమ్మాయిలు తమకిష్టమైనప్పుడు పెళ్ళి చేసుకుంటున్నారు, అలాగే పిల్లలుకూడా.

నీలా పదిహేడు, పద్ధెనిమిదేళ్ళకే పెళ్ళిళ్ళు చేసుకోవడం లేదు కదా? మన పిల్లలకే మనం ఇరవై రెండు దాటితే కాని సంబంధాల మాటే తలపెట్టలేదు కద! అది మార్పు కాదా? అది రైటా, తప్పా?

భర్త చెప్తున్న మాటలని శ్రద్ధగా వింటోంది శారద..

" అవును, కనీసపు చదువైనా లేకుండా పెళ్ళి చేస్తే ఏం చేస్తారు పిల్లలు? ఉద్యోగం చేస్తారా, లేదా అన్నది వాళ్ళిష్టం. కానీ అందుకవసరమైన చదువు చదువుకుని ఉండాలి కదా? అంది..

కరక్ట్, అదే నేను చెప్పేది. ఇది మన తరానికి వచ్చిన ఆలోచన.. మీ అమ్మా, నాన్నగార్లు ఇలా ఆలోచించలేదు కదా! అబ్బాయి బావున్నాడు, చక్కటి ఉద్యోగం అని నిన్ను నాకిచ్చి చేసేశారు కదా!" అన్నాడు నవ్వుతూ..

నవ్వింది శారద..

" నిన్నింకా చదివిస్తే బావుంటుందని అనుకోలేదు. నువ్వు కూడా హాయిగా నవల్సు చదువుకుంటూ, ఇల్లు చూసుకుంటూ ఉంటాను అనుకుని సంతోషంగా ఒప్పుకున్నావు కదా! అది మన పిల్లలు చెయ్యలేదు.సో నేను చెప్పేది ఏమిటంటే మార్పు అనేది క్రమంగా జరుగుతూ ఉంటుంది. సమాజమూ, శాస్త్ర పరిజ్ఞానమూ సమాంతరంగా ఎదుగుతున్నాయి" అని..

" ఎంతైనా ప్రకృతి ధర్మాన్ని తప్పకూడదు కదా! దాన్ని జయించాలనుకోకూడదు కదా! నాకెందుకో ఇది అంత సరి అయినది గా అనిపించడం లేదు మీరెన్ని చెప్పినా సరే" అంది..

" ప్రకృతితో మనిషి పోరాటం, ఆదిపత్యం చెలాయించాలనుకోవడం అన్ని రంగాల్లో ఎన్నో రకాలుగా జరుగుతూనే ఉంది శారదా. దానికి ఇదొక్కటే ఉదాహరణగా చెప్పలేము.

అన్నీ మన సౌలభ్యం కోసం, సౌకర్యం కోసం అప్పుడప్పుడు దురాశతోనూ ఎన్నో విపరీతమైన పనులు చేశాము, చేస్తున్నాము.. అందులో మనకి ఉపయోగపడినవాటిని మంచివంటున్నాము, లేనివాటిని ధిక్కరిస్తున్నాము, తప్పంటున్నాము.. ఇదీ అంతే..

ప్రకృతి సహజంగా పిల్లలు కలగని వారికి ఎన్నో రకాల పద్ధతులు వైద్య విజ్ఞాన శాస్త్రం చూపించింది. అందులో ఇదీ ఒకటి.. వేర్వేరు కారణాలవల్ల సరి అయిన సమయంలో జరగనివారికి ఇది కూడా ఒక వరమే కదా!.. అసలు పిల్లలే వద్దనుకునే వారు కూడా ఎందరో ఉన్నారు కదా!" అన్నాడు..

ఆమె ఆలోచిస్తూ ఉంటే.. అతనే మళ్ళీ అన్నాడు.

" ఈ రోజు పేపర్లో వచ్చిన వార్త కనక ఇంతగా ఆలోచిస్తున్నావు. రేపు మన అమ్మాయే ఏ కారణం వల్లనో ఇలాంటి పద్ధతిని ఆశ్రయించాల్సి వస్తే నువ్విలాగే మాట్లాడగలవా? పాపం ఇన్నాళ్ళకి తల్లి అవ్వాలన్న దాని కోరిక తీరింది అని చనివిడీ, చక్కిలాలూ పంచవూ.. మీ పిన్ని కొడుకూ, కోడలూ కృత్రిమ పద్ధతులద్వారా పిల్లాడిని కంటే " ఖర్చు అయితే అయింది కానీ మన రక్తం, మన బిడ్డ" అని మా పిన్ని ఎంత సంబరపడిందో అని నువ్వు సంతోషించలేదూ".. ఆగిపోతున్న గుండెని తిరిగి ఆడేలా చేసే విజ్ఞానం గొప్పదైతే, పిల్లలకోసం తపించే వారి జీవితంలో చిన్నారి చిరుదివ్వెలని తీసుకొచ్చే విజ్ఞానమూ గొప్పదే.. మన అవసరాన్ని బట్టే దాని విలువ పెరిగినా, తరిగినా! కాదంటావా?

అందుకే అన్నాను రోజూ కాదు కాదు.. రివాజుగా మారేదే రోజు అంటే.. నిన్న మనకి తప్పనిపించినది నేడు రైటవచ్చు, రేపు అవసరం అవచ్చు.. అంతే!! అంతకన్నా ఏమీ లేదు ఇందులో.. " అన్నాడు..

" అతనన్న మాటల్లో నిజాన్ని గుర్తించింది శారద.. నిజమే ఈ రోజు పేపర్లలో వార్తలుగా ఉన్నవి ఎవరిళ్ళల్లోకి వచ్చి నిజాలవుతాయో ఎవరూ చెప్పలేం కదా!" అనుకుంది.. మౌనంగా తలఊపింది భర్త మాటలకి.

# గంగిగోవు

## ఆర్. శర్మ దంతుర్తి

బి. కాం పాసై మూడేళ్ళు రోడ్ల మీద తిరుగుతూ అనేకానేక టెస్టులూ ఇంటర్వ్యూలూ అయ్యేక చంద్రరావుకి రెండు ఉద్యోగాలొచ్చేయి. ఒకటి ఊళ్ళోనే ఉన్న కోపరేటివ్ బేంకులో క్లర్క్ ఉద్యోగం, రెండోది రైల్వేలో టిటిఇ. ఉన్న ఊళ్ళోనే జేరితే ఒక రకమైన సదుపాయం. ఇంటద్దె లేదు, సైకిల్ మీద వెళ్ళి వచ్చేయవచ్చు. అన్నింటికన్నా ముఖ్యంగా, తనకి నచ్చిన సుజాత ని పెళ్ళి చేసుకోవడానికి ఆ అమ్మాయ్ నాన్న ఒప్పుకోవచ్చు. చేతిలో ఉద్యోగం ఉంటుంది కనక తాను ధైర్యంగా సుజాత ఇంటికెళ్ళి సుజాత అమ్మా నాన్నల్తో మాట్లాడగల్డు. ఐతే ఇందులో ఓ చిక్కుంది; ఉద్యోగం ఎప్పుడు పోతుందో చెప్పడం కష్టం. కానీ అసలు ఉద్యోగం అంటూ ఉంటే ఇక్కడే ఈ ఊళ్ళోనే రిటైర్ అవ్వొచ్చు. జననీ జన్మభూమీ జయ జయోస్తు మాతృభూమి అని పాడుకుంటూ ఇక్కడే జీవితం గడిపేయవచ్చు. ఇంకో విషయం, ఎక్కడికీ ట్రాన్స్‌ఫర్ చేయరు కానీ ఈ ఉద్యోగంలో జీతం గొర్రె తోక.

రెండో ఉద్యోగం రైల్వేలో కనక పట్టాలు ఉన్నంతవరకూ ప్రయాణం ఉచితం తనకీ, తన కుటుంబానికీను. తాను వెళ్ళకపోయినా ఆ పాస్ ఎవరికైనా ఇచ్చినా – ఉచితంగానో లేకపోతే డబ్బులకో – ఎవరూ పట్టించుకోరు. అయితే భీమవరంలో ఉన్న తాను ఇప్పుడు ఉద్యోగంలో చేరడానికి

విజయవాడ వెళ్ళాలి. అక్కడ మళ్ళీ ఇంటి అద్దె, భోజనం ఖర్చులూ అన్నీ పోతే జీతం ఎంత మిగుల్తుందో? రైల్వే వారంటే బండి మీద షిఫ్ట్ డ్యూటీలు ఉండొచ్చు. ఉండొచ్చేమిటి ఉంటాయి కూడాను. ఆ ఉద్యోగం ఎటు తిరిగి ఎటొస్తుందో?

ఏ విషయం తేల్చుకోలేక తండ్రితో మాట్లాడేడు చంద్రం. రెండింట్లో ఉన్న సాధ్యాసాధ్యాలు ఇద్దరూ కూర్చుని చర్చించేరు, పక్కనుంచి చంద్రం అమ్మ వింటూంటే. ఆవిడకి కొడుక్కి వెంఠనే పెళ్ళి చేసి కోడలిని తెచ్చుకోవాలని ఆరాటం. ప్రస్తుతానికి ఏదో జరిగిపోతే చాలనుకునే ఆలోచించే మనస్తత్వం ఆవిడది. “ఈ ఊళ్ళోనే వచ్చిన ఉద్యోగం వదులుకోవడం ఎందుకురా?” అనేసింది.

“కోపరేటివ్ ఉద్యోగం అంటే జీతం కడిగి చేతులో పెడతారు,” తండ్రి అన్నాడు.

చంద్రం అర్ధం కానట్టు చూసేడు తండ్రికేసి. పక్కన ఉన్న అమ్మ చెప్పింది దానర్ధం, “పై సంపాదన ఏమీ ఉండదు. లంచాలూ గట్రా రావు, మీ నాన్న చేసే పంచాయితీ ఆఫీసు ఉద్యోగం లాగానే ఉంటుంది.”

చంద్రం నవ్వేడు. “ఏవో అప్పులూ అవీ శాంక్షన్ చేసినప్పుటు కాసిని డబ్బులు మిగలవా?”

“పెద్ద పెద్ద బేంకుల్లో మిగుల్తాయేమోలే కానీ కోపరేటివ్ లో ఏమీ మిగల్దురా అబ్బాయ్” తండ్రి తేల్చేసేడు.

ఎలాగా ఈ రెండింటిలో ఓ ఉద్యోగంలో చేరినట్టే కనక చంద్రం ధైర్యం చేసి అనేసాడు, “ఇక్కడే ఉద్యోగం చేస్తే నేను సుజాతని చేసుకోవాలనుకుంటున్నా.”

తల్లి విప్పారిన కళ్ళు పెట్టుకుని చూసింది తాను ఒప్పుకుంటున్నట్టూ.

“ఆ మాత్రం తెలుసులేవోయ్ వెధవాయ్, ఓ సారి ఆలోచించు, సుజాతని చేసుకుంటానని వెళ్ళి అడిగితే ఆ అమ్మాయి నాన్న రైల్వే ఉద్యోగం అయితేనే పెళ్ళి చేస్తానంటాడు కానీ గొర్రె తోక కోపరేటివ్ బేంక్ క్లర్క్ కి చేస్తాడా?”

తండ్రి మాట విన్నాక ఆయన చెప్పినది నిజమే అనిపించింది. తర్వాత మరోరోజు ఇటా అటా అంటూ చర్చించుకుని పై సంపాదనకి ఆకాశమే హద్దుగా ఉన్న రైల్వేలో జేరడానికి చంద్రం విజయవాడ బయల్దేరేడు. నాలుగు నెలల ట్రైనింగ్ లో స్టేషన్ కి ఆనుకునే ఉన్న టి.టి.ఇ. రెస్ట్ హౌస్ లో రూమిచ్చేరు దక్షిణ మధ్య రైల్వే వారు. భోజనం మధ్యాహ్నం ఉచితం ట్రైనింగ్ లో భాగంగా. రాత్రి ఏదో ఒక సత్రం లో వెదుక్కోవడమే. రోడ్డుకో హోటల్ ఉన్న విజయవాడలో భోజనానికేం కొదువ? కావాలిస్తే నార్త్ ఇండియన్, బొంబాయ్ మీల్స్, అలా ఆఖరికి పప్పులో ఉల్లిపాయలు వేసే పాక హోటల్స్, టిఫిన్ సెంటర్స్ ఉన్నాయి కదా?

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి వచ్చి ట్రైనింగ్ లో జేరిన చంద్రానికి కృష్ణా జిల్లాలో తెలిసొచ్చిన మరోవిషయం – కాస్త స్టైల్ గా మాట్లాడాలి విజయవాడ అంటే. హోటల్లో ‘చారు’ అన్న తెలుగుమాట అనరాదు. ‘రసం’ అనే తమిళ పదం వాడితే గౌరవం. ఇంక చంద్రానికి ఉద్యోగంలో హిందీ వచ్చి తీరాలి లేకపోతే దక్షిణ భారతంలో అతి పెద్దదైన విజయవాడ జంక్షన్ లో అన్ని భాషల వారినీ నెగ్గుకు రాలేం. ముఖ్యంగా చెప్పుకోవాల్సినది విజయవాడ ప్లాట్ ఫారం నెంబర్ 7. అక్కడ ప్రయాణీకులకి రైల్వేవారికీ మధ్య జరిగే లావాదేవీలు చెప్పనేల? అక్కడ కనక ఉద్యోగం వచ్చిందా, మూడేళ్ళలో విజయవాడలో మేడ కట్టుకోవచ్చు అతి సులభంగా అనేది ప్రతి రైల్వే ఉద్యోగికీ తెలిసిన సీక్రెట్టు.

★ ★ ★

ట్రైనింగ్ అయిన వెంఠనే చంద్రానికి ట్రావెలింగ్ టికెట్ ఎక్జామినర్ – టిటిఇ – గా విశాఖపట్నం పడింది మొదటి స్టాపు. “తంతే బూర్లె బుట్టలో పడ్డావు గురూ, మంచి రూటు” అంటూ తనకూడా ట్రైనింగ్ కి వచ్చిన వాళ్ళు అంటే నిజమే కాబోలనుకున్నాడు చంద్రం. తనకొచ్చే జీతంతో విశాఖపట్నంలో కాపురం పెట్టడం కష్టం. అనకాపల్లి అయితే ఏదో బండిమీద రోజూ వెళ్ళి వచ్చేయవచ్చు. అదిగో అలా ట్రైనింగ్ అయిన మూడు నెలలకి సుజాతని పెళ్ళి చేసుకుని చంద్రం భార్యతో నూకాలమ్మ తల్లికి నమస్కారం పెట్టుకుని అనకాపల్లిలో కాపురం, ఉద్యోగం మొదలుపెట్టేడు. పొద్దున్నే లేచి దొరికిన బండిలో విశాఖపట్నం వెళ్తే అక్కడనుండి చెప్తారు ఎటువెళ్ళాలో. సాధారణంగా విశాఖపట్నం నుంచి విజయవాడదాకా ఎనిమిదిగంటల డ్యూటీ. ఆ రాత్రికి విజయవాడలో టిటిఇ గెస్ట్ హౌస్ లో పడుకుని మళ్ళీ మర్నాడు మరో ఎనిమిది గంటల డ్యూటీలో విశాఖపట్నం వచ్చేయవచ్చు. కొత్తలో తిరుగుడు ఉత్సాహంగా ఉన్నా చూసిన ఊర్ల పేర్లే – అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం అని అనడానికి తెలుగువారికి నచ్చదు కనక టిపిగూడెం, – చూసి చూసి బోరు కొడుతోంది చంద్రానికి. పై సంపాదన రావడానికి ఇప్పటిదాకా ఏమీ దారి దొరకలేదు.

అన్నింటికన్నా ముఖ్యంగా చెప్పుకోవాల్సింది తనని పనికిరాని డ్యూటీల్లో వేసారు. పనికిరానివంటే లక్ష్మీ కటాక్షం తగిలే గోదావరి ఎక్స్‌ప్రెస్ లో ఏ.సి కోచ్ కి టిటిఇ గానూ, లేకపోతే పొద్దున్నప్పుడు నడిచే అసలు రిజర్వేషన్ అక్కర్లేని సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కి టికెట్లు చూడడానికీను. ఏ.సి కోచ్ లో ప్రతీ పెద్దమనిషీ టికెట్ లేకుండా ఎక్కరాదు. ఎవడూ తనని బెర్త్ కావాలని అడగడు. తాను ఆ పెద్దమనుషులకి మల్లె తెల్లటి బట్టలేసుకుని పీక నులిమేసేలాగా టై కట్టుకు 'సర్ టికెట్ ప్లీస్' అని అడగాలి. ఇంకా నయం తెలుగులోనా మాట్లాడ్డం? తనపరువు పోయి అందరూ నవ్వరూ? ఓ సారి టికెట్ చెకింగ్ అయ్యేక ఖాళీ బెర్త్ చూసుకుని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడమే వెళ్ళేటప్పుడు విజయవాడ, వెనక్కి వచ్చేటప్పుడు విశాఖపట్నం వచ్చేదాకా. మహా అయితే గియితే తనని ఎవరో వచ్చే స్టేషన్ పేరో, వాళ్ళకి అక్కడ తినడానికో, తాగడానికో ఏదైనా దొరుకుతుందో లేదో అడుగుతారు. ఇంకాస్త ముందుకి పోతే దారిలో అమ్మే జాంకాయల పళ్ళ బుట్టలూ, మసాలా వడల మామ్మలూ ఈ ఏ.సి కోచ్ లోకి రాకుండా కాపలాకాయాలి తాను. ఇస్త్రీ బట్టలేసుకుని, టై కట్టుకుని ఇదీ తాను చేసేపని.

సింహాద్రి డ్యూటీ మరీ దారుణం. తట్టా బుట్టా పట్టుకుని ఎక్కేసి ఎక్కడపడితే అక్కడ కూర్చునే జనాల్ని తప్పించుకుంటూ ఈ మూల నుంచి ఆమూల దాకా ఎవరికి టికెట్ ఉందో లేదో వెతకాలి. ఈ కోచ్ ల మధ్య ఒక్కోసారి – ఒకోసారి ఏం ఖర్మ? చాలాసార్లు – ఉండాల్సిన వెస్టిబ్యూల్ ఉండదు. అంటే ఒక కోచ్ లో ఎక్కి అక్కడ అందర్నీ చూసి పక్క కోచ్ లోకి వెళ్ళాలంటే బండి వచ్చే స్టేషన్ లో ఆగే దాకా దిక్కులు చూడ్డమే. తాను టికెట్ చూడ్డానికి వస్తున్నాడని తెలియగానే ఫైన్, లంచం తప్పించుకోవడానికీ మరో కోచ్ లోకి మారిపోయే టికెట్ లేని జనాలు కొత్తగాదు. మొత్తానికి ఈ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్మీనాధుడైన అప్పన్న పేరుపెట్టుకున్నా చంద్రానికి మిగిలేది సున్నా! సింహాద్రి ఎక్స్‌ప్రెస్ అనేది నామకః ఎక్స్‌ప్రెస్, కానీ స్పీడు ఏనాడూ ముప్పై కిలోమీటర్లకి మించదు. ఖర్మ కాలి ఏ దూరం పోయే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్సో, ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్సో, బొకారో, గౌహతి పోయే బండో తగిల్తే ఈ సింహాద్రిని పక్కనే ఉన్న లూప్ లైన్ లోకి తోలేసి ఆ పెద్ద బండి ని వదలాలి. అటువంటప్పుడు చంద్రానికి ఎనిమిది గంటల ఉద్యోగం తొమ్మిదీ, పదిగంటలు పడుతూ ఉంటుంది.

తండ్రి చెప్పిన పై సంపాదనేదీ? ఎప్పుడో ఓ మధ్య ఓ సారి తండ్రితో చెప్పేడు ఈ సంగతి – "కంగారు లేదురా నాన్నా, కాస్త ఓపిక పట్టు అన్నీ దారిలోకి

ఉద్యోగంలో సుళువులు నేర్చుకుంటున్నాడు చంద్రం. అప్పుడప్పుడూ చిన్న చిన్న తాయిలాలు దొరుకుతున్నాయి. టీ అమ్ముకునే కుర్రాడిని కోచ్ లోకి రానిస్తే తనకి టీ ఉచితం. జాంపళ్ళ గంపలో ఓ రెండు పళ్ళు ఉచితం. అనకాపల్లిలో ఎక్కే మామ్మ కూర్ల గంపలో పావు కేజీ వంకాయలో, నోట్లో నాలికలేని మరో కుర్రాడో ఎక్కితే వాణ్ణి గదమాయించి అరకేజీ దాకా దొండకాయలో తీసుకోవచ్చు. ఫర్వాలేదు తండ్రి చెప్పినట్టూ తన జీవితం దారిలో పడుతోంది.

★ ★ ★

ఇలా చిన్న చిన్న సరదాలు తీర్చుకుంటూ రైల్వే ఉద్యోగస్తుడు చంద్రం జీవితంలో, ఉద్యోగంలో పాఠాలు నేర్చుకుంటున్నప్పుడు అనుకోని పై సంపాదన అనే అవకాశం చంద్రం తలుపు తట్టింది. ఆ రోజు విజయవాడలో ఎక్కిన చంద్రం విశాఖపట్నంలో దిగి మేనేజర్ కి అన్ని కాయితాలు ఇచ్చేసి బయటకొచ్చేడు. మర్నాడూ, ఆ పై రోజూ చంద్రానికి శెలవు. అనకాపల్లిలో ఇంటికిపోయి పడుకోవడమే. దాదాపు అయుదున్నరకి బయల్దేరే గోదావరి ఎక్స్‌ప్రెస్ లో అనకాపల్లి వెళ్ళడానికి బండి ఎక్కి ఏ.సి చెయిర్ కార్ లోకి దూరేడు చంద్రం. ఈ చెయిర్ కార్లో వెళ్ళే జనం తక్కువ. వెళ్తే ఏసిలో పడుకునే బెర్త్ ఉన్నదాంట్లో వెళ్తారు పెద్దవారు లేకపోతే సెకండ్ క్లాస్ ఏసీ, అది లేకపోతే మామూలు సెకండ్ క్లాస్ లో బెర్త్ దొరికితే అది. ఏ విధమైన టికెట్టూ కొరక్కపోతే ఇందులో ఎక్కాలి కానీ లేకపోతే ఈ చెయిర్ కార్లో కూర్చుని హైద్రాబాద్ దాకా ఎవరు వెళ్ళేది? ఎవరికంత దూరం కూర్చునే ఓపిక?

కోచ్ లోపలకి వెళ్ళిన చంద్రానికి మొత్తం చెయిర్ కార్ అంతా ఖాళీగా కనిపించింది. అసలే శీతాకాలం అందులోనూ ఉపవాసం ఉండే శివరాత్రి తప్ప ఏ పండగా లేని ఫిబ్రవరి నెలలో ఈ కోచ్ ఖాళీగా ఉండడంలో కొత్తేం లేదు. మహా అయితే ఇంకో తనకి తెలిసిన టిటిఇ వచ్చి పలకరిస్తాడు. గంటలో అనకాపల్లి చేరుకోవచ్చు. ఈ ఆలోచనల్తో ఉండగానే గోదావరి మెల్లిగా కదలడం ప్రారంభించింది చిన్న కుదుపుతో. కోచ్ తలుపులు ఇంకా లాక్ చేయలేదులా ఉంది తీసే ఉన్నయ్. దాదాపు ప్లాట్ ఫారం దాటుతూంటే ముగ్గురు కుర్రాళ్ళు చెయిర్ కార్ లోకి చొరబడ్డారు, ఒగుర్చుకుంటూ.

"ఒరే ఇది ఏసి కోచ్, ఇందుకో ఎక్కకూడదు" అన్నాడొక కుర్రాడు.

"పోరా, బండి కదిలిపోతూంటే ఎక్కేం చూసుకోలేదు. అయినా ఎవడు ఇక్కడ మనల్ని అడిగేది? ఇదే బండిలో రోజూ వెళ్ళట్లేదా?" రెండో కుర్రాడు సమాధానం.

"నేను ఎక్కేముందు అరుస్తున్నా మీరిద్దరూ ఎక్కేసార్రా. ఇప్పుడేం చేద్దాం?"

ఈ మాటలు విన్న చంద్రానికి ఏం చేయాలో తెలియడానికి అయిదు నిముషాలు పట్టలేదు. బండిని స్పీడు అందుకోనిచ్చి జూలు విదిల్చిన సింహంలాగా లేచాడు. కోచ్ రెండు పక్కలకీ అటూ ఇటూ నడిచి ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక, నాలుగు తలుపులూ లాక్ చేసి కుర్రాళ్లదగ్గిరకొచ్చి అడిగేడు స్టైల్ గా, "టికెట్లు చూపించండి, ఎక్కడికి వెళ్తున్నారు?"

"మాది అనకాపల్లి నుంచి విశాఖపట్నం రోజూ పాస్ అండి. ఇలా పొద్దున్నే కాలేజీకి వచ్చి సాయంత్రం వెళ్ళిపోతాం. ఈ రోజు బండి కదిలిపోతూంటే ఏసీ అని చూసుకోకుండా ఇందులో ఎక్కేశాం. అనకాపల్లి రాగానే దిగిపోతాం." ముగ్గురూ ఒకేసారి చెప్పేరు.

మొహం గంభీరంగా పెట్టి చంద్రం అన్నాడు, "మీ పాస్ లూ, ఏకాలేజీలో చదువుతున్నా ఆ ఐడి కార్డులూ ఉన్నాయా?"

ముగ్గురూ అడిగినవి బయటకి తీసి చూపించారు. అన్నీ సరిగ్గా ఉన్నాయాలేదా చూసేక చంద్రం చెప్పేడు, "ఏసీ కోచ్ లో ఈ పాస్ తో ఎక్కకూడదు. ఫైన్ కట్టాలి. ఒక్కొక్కరికీ మూడు వందలు అవుతుంది; డబ్బులు బయటకి తీయండి."

"అదేంటి సార్ ఒక్క స్టాప్ అనకాపల్లి. చూసుకోకుండా ఎక్కేసాం. అయినా ఇది ఏసి అని మాకు తెలియదు." ఓ కుర్రాడు కాస్త అనునయంగా చెప్పేడు బతిమాలుతున్నట్టూ.

"తెలియదా? ఈ కుర్రాడు, ఎక్కగానే ఏమన్నాడో నేను వినలేదనుకుంటున్నారా? నేను ఎక్కేముందు అరుస్తున్నా మీరిద్దరూ ఎక్కేసార్రా అన్నాడా లేదా?" చంద్రం వాళ్ళ పాస్ లూ ఐడి కార్డులూ తన కోటుజేబులో పెట్టుకుంటూ గద్దించేడు.

అలా అరిచిన మూడో కుర్రాడి ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. మిగతా ఇద్దరూ ఆ సరికి లేచి నుంచుని చంద్రాన్ని బతిమాల్టం మొదలుపెట్టేరు. చంద్రం ఊరుకుంటాడా? అసలే తనకి ఇది అనుకోకుండా వళ్ళోకి వచ్చి పడిన మొదటి తాంబూలం. "ఎటువంటి పరిస్థితిలోనూ టికెట్ లేకుండా ఏసి కోచ్ లోకి ఎక్కకూడదు. మీరు ఏం చేసినా అరిచి గీపెట్టినా వదిలేది లేదు.  డబ్బులు తీయండి బయటకి; లేకపోతే అనకాపల్లిలో ఆర్ పి ఎఫ్ కి చెప్పి అప్పగిస్తాను. ఆర్ పి ఎఫ్ అంటే తెలుసా? రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అంటారు దాన్ని. వాళ్ళు రైల్వే పోలీసులు. బయట పోలీసులకి లంచం ఇచ్చినట్టూ వాళ్లతో కుదరదు మరి.  ఆ తర్వాత మీరు వాళ్లతో జైల్లో ఉండడమే ఫైన్ కట్టేదాకా. తేల్చుకోండి ఏం చేస్తారో?" మరింత బెదిరించేడు చంద్రం.

కుర్రాళ్ళు మరింత బతిమాలడం మొదలుపెట్టగానే చంద్రం ఏదో పుస్తకంతీసి చూపిస్తూ చెప్పేడు కుర్రాళ్లతో, "ఇదిగో చూడండి, ఏసిలో టికెట్ 260 రూపాయలు. మీరెక్కినదానికి చార్జీలు కట్టవల్సిందే. మీ పాస్ ప్రకారం మీరు సెకండ్ క్లాస్ రిజర్వేషన్ లేని కోచ్ తప్ప మరేదీ ఎక్కకూడదు. ఒక్కొక్కరూ 260 బయటకి తీయండి. ఇప్పుడే టికెట్ రాస్తాను." ఇలా అంటూ చంద్రం వాళ్ల వంక్ చూసేడు కుర్రాళ్ళు ఎలాంటి వాళ్ళో అసలు అంచనాకి. మహా బాడీ బిల్డర్స్ అయితే ముగ్గురూ తనమీద పడి తన్నినా తనకి ఈ కోచ్ లో దిక్కుండదు. జాగ్రత్తగా ఉండొద్దూ?

ముగ్గురికీ అప్పుడే గెడ్డాలు వస్తున్నట్టున్నాయి. పదిహేడూ పద్దెనిమిదేళ్ళు ఉండొచ్చేమో. వీళ్ళా తనని కొట్టేదీ, ఈ బేరం పోనీవ్వకూడదు, చంద్రం ఇలా ఆలోచిస్తూంటే ఆ కుర్రాళ్ళు బతిమాలుతూనే ఉన్నారు, ఇలా చూసుకోకుండా ఎక్కేసాం. ఈ సారికి వదిలేయండి అంటూ.  చంద్రం వాళ్లని గదమాయిస్తూనే ఉన్నడు పెన్నూ, చేతిలో చార్జీల పుస్తకంతోనూ.

అనకాపల్లి వచ్చింది. ముగ్గురితోనూ కిందకి దిగేడు చంద్రం.  బండి ఆగేది ఐదు నిముషాలే కనక ఎక్కే దిగే జనం అటూ ఇటూ పరుగెడుతూంటే చంద్రం వీళ్ళనో పక్కకి  తీసుకొచ్చి ఆర్ పి ఎఫ్ దగ్గిరకా, ఫైన్ కడతారా, లేకపోతే తను అడిగినంత ఇచ్చి వెళ్ళిపోతారా అని బేరం మొదలుపెట్టాడు. ఇంజినీరింగ్ కుర్రాళ్ళు ఎంత డబ్బున్నవాళ్ళో తనకి తెలియదా? ఇస్తారో ఛస్తారో తనకేం? వీళ్ల పాస్ లూ ఐడిలు తన దగ్గిరున్నాయి కనక తనని వదిలి పోలేరు ఇప్పుడు.

ముగ్గురు కుర్రాళ్ళు చంద్రం అనేసరికి కాళ్ళబేరానికొచ్చి ఏడుపు మొహాలతో అడిగేరు "ఎంతివ్వాలండి?"

ఓ రైల్వే పోర్టర్ వీళ్ల దగ్గిరకొచ్చి అడిగేడు, సామాను మోసే బేరం ఏదైనా ఉందేమో అని. చంద్రం వాడితో చెప్పేడు, "ఇది నీ బేరం కాదు. వెళ్ళు, వీళ్ళు టికెట్ లేకుండా ఏసి ఎక్కితే పట్టుకున్నాను." ఈ మాటలు సాగుతూంటే ఎవరో పక్కన వెళ్తూ ఆగినట్టు ఆగి చంద్రంకేసి పలకరింపుగా నవ్వేడు కానీ కలగజేసుకోలేదు. తనది కాని బేరంలో తల దూర్చకూడదని మరో రైల్వే ఉద్యోగస్తుడికి ఆ మాత్రం ప్రొఫెషనల్ కర్టెసీ తెలియదా?

"ముగ్గురికీ ఫైన్ వేస్తే ఆరువందల నుంచి వెయ్యి దాకా తేలుతోంది. నాకు నాలుగొందలు ఇస్తే ఫైన్ లేకుండా చేస్తా!" చంద్రం చెప్పేడు గంభీరంగా.

"అంత ఇచ్చుకోలేమండి, ముగ్గురూ తలో యాభై వేసుకుని నూట యాభై ఇస్తాం," చెప్పేరు కుర్రాళ్ళు.

"నూట యాభై ఓ పంటికిందకి రాదు కానీ నాకెందుకొచ్చిన గోల రండి ఆర్ పి. ఎఫ్ దగ్గిరకి పోదాం. వాళ్ళు మీ తాట వలుస్తారు. మీరెలాపోతే నాకేల?" ఆఖరి బ్రహ్మాస్త్రం ప్రయోగించేడు చంద్రం ముందుకి నడవబోతూ.

"ఇప్పుడు డబ్బులు లేవండి. ఇంటికెళ్ళి రేపు తెస్తాం," దాదాపు ఏడుస్తున్నట్టూ చెప్పేడు మూడో కుర్రాడు.

ఓ సారి ఇలా లొంగిపోయేసరికి చంద్రం భుజాలు పొంగేయి. "అలా అయితే రేపు ఇక్కడికే వచ్చి డబ్బులిచ్చి పాస్ లూ ఐడిలూ తీసుకెళ్ళండి. రేపు సాయంత్రం మొదటి ప్లాట్ ఫారం మీద టికెట్ కలక్టర్ ఆఫీసులో కల్సుకొండి. సరేనా?"

"మరి రేపు కాలేజీకి వెళ్ళాలండి, పాస్ లు ఇస్తారా?"

"అలాంటి ఆటలు పనికిరావు. రేపు కాలేజీ కి టికెట్ కొనుక్కుని వెళ్ళండి. ఇవి మీ చేతికిస్తే మళ్ళీ నాకు కనిపిస్తారా? ఐడి లు డూప్లికేట్ గా తీసుకునీ, పాస్ లు పోతే మరోటి కొనుక్కునీ నన్ను మోసం చేద్దామనుకుంటే నేను మీ కాలేజీకొచ్చి రిపోర్ట్ చేస్తా ఇలా చేసారని. సరైన టికెట్ లేకుండా ఎసి కోచ్ ఎక్కినట్టు మీరు ఒప్పుకోవడం ఎలాగైనా ఉంది. ఆ పైన మిమ్మల్ని జైల్లో పెట్టడానికి ఆర్. పి. ఎఫ్ ఉండనే ఉంది. ఇది అలా తేలిపోయే వ్యవహారం కాదు. మీరు ఫైన్ కట్టినా సరే నాకు డబ్బులిచ్చినా సరే." మరో మాట లేకుండా చంద్రం ముందుకి నడిచేడు. ముగ్గురు కుర్రాళ్ళూ దిగాలు పడిన మొహాలతో చంద్రం వెనకనే నడిచారు.

స్టేషన్ లోంచి బయట కెళ్ళే గేటు దగ్గిర టి.సి తో చంద్రం ఈ ముగ్గురు కుర్రాళ్ళు తన కేస్ అని చెప్పాక ఆయన వీళ్ళని బయటకి వదిలేడు. ప్రొఫెషనల్ కర్టెసీ అని చెప్పుకున్నాం కదా?

కుర్రాళ్లని వెళ్లనిచ్చి చంద్రం తన వాగ్ధాటికీ, కుర్రాళ్ళని డీల్ చేయడంలో తాను చూపించిన తెలివికీ మనసులో విజయగర్వంతో చిరునవ్వు నవ్వుకుంటూ రిక్షా ఎక్కేడు ఇంటికెళ్ళడానికి.

ఇదే సమయానికి అనకాపల్లి స్టేషన్ నుంచి ఓ ఫోన్ వెళ్ళింది చంద్రం మేనేజర్ ఆఫీసుకి. ఫోన్ చేసినాయన – చంద్రం ప్లాట్ ఫారం మీద కుర్రాళ్లతో బేరం మాట్లాడుతున్నప్పుడు మొహమాటంగా నవ్వుతూ పట్టించుకోనట్టు మర్యాదగా ప్రొఫెషనల్ కర్టెసీ చూపిస్తూ నడిచిపోయిన మరో రైల్వే ఉద్యోగి, అనకాపల్లి ప్లాట్ పారం మీద పనిచేసే టికెట్ కలెక్టర్, లేదా రైల్వే వారి పరిభాషలో ఉత్తి టి.సి.

★ ★ ★

మర్నాడు సాయంత్రం చంద్రానికి శెలవు. అనకాపల్లి స్టేషన్ లో టిసి ఆఫీసుకొచ్చి కూర్చున్నాడు తనకి రాబోయే మొదటి పెద్ద తాంబూలం కోసం. ఆరు దాటుతూండగా ముగ్గురు కుర్రాళ్ళలో ఓ కుర్రాడొచ్చేడు. చంద్రం లేచి బయటకొచ్చి కుర్రాడ్ని చూస్తూ కళ్ళెగరేసాడు సంగతేమిటన్నట్టూ.

కుర్రాడు జేబులోంచి డబ్బులు తీస్తూంటే అతణ్ణి దూరంగా తీసుకెళ్ళి అడిగేడు చంద్రం, "ఫైన్ కడుతున్నారా? నాకా?"

"మీకేనండి ఇవిగో డబ్బులు." నాలుగు వందనోట్లు తీసేడు బయటకి.

చంద్రం ఆ డబ్బులు జేబులో పెట్టుకుని ముగ్గురు కుర్రాళ్ళ ఐడి లూ, పాస్ లూ చేతికిచ్చి చెప్పాడు, "జాగ్రత్తగా ఉండండి. మొదటిసారి కనక ఇలా డబ్బులు తీసుకుని వదిలేసాను. రెండోసారి అలా కుదరదు. మరింత ఖర్చు అవుతుంది."

కుర్రాడు చంద్రాన్ని పురుగుని చూసినట్టు చూసి అప్పుడే చిక్కబడుతున్న చీకట్లో విసవిసా ప్లాట్ పారం మీద నడుచుకుంటూ వెళ్ళిపోయేడు చివరలో ఉన్న పార్సెల్ ఆఫీసుకేసి.

డబ్బులు తీసుకుని బయటకొచ్చిన చంద్రానికి ఆ కుర్రాడు పార్సెల్ ఆఫీసులో మరో రైల్వే ఉద్యోగస్తుడికి, తాము ముగ్గురూ చంద్రానికి ఎంత ఇచ్చారో, తమని చంద్రం ఎలా ఆట ఆడించాడో అన్నీ పూస గిచ్చి చెప్పేసినట్టూ చంద్రానికి తెలియదు.

★ ★ ★

తనకి దొరికిన తాయిలం జేబులో పెట్టుకుని ఆ రోజు రాత్రి హోటల్లో భోజనం, సుజాతతో సినిమాకి వెళ్ళాడు చంద్రం తన విజయాన్ని సెలెబ్రేట్ చేసుకోవడానికి. మర్నాడు కూడా చంద్రానికి శెలవు.

మూడో రోజు చంద్రం యధావిధిగా డ్యూటీకి విశాఖపట్నం వెళ్ళేసరికి మేనేజర్ రమ్మంటున్నాడని ఆఫీసులో ప్యూన్ చెప్పేడు. తనకింకా మరో గంట ఉంది రాబోయే ట్రైన్ లో టిటిఇ డ్యూటీ మొదలుపెట్టడానికి.

ఏమీ ఉపోద్ఘాతం లేకుండా నవ్వుతూ అడిగేడు మేనేజర్, "ఎంతండీ కలెక్షన్ మొన్న?"

"ఏం కలెక్షన్? ఏం మాట్లాడుతున్నారు?" బుకాయించబోయేడు చంద్రం.

"హన్నన్నా తప్పుకాదూ? మీరు చూడబోతే మంచి భవిష్యత్తు ఉన్న కుర్రాళ్ళు. అలా దాచకూడదు. మనందరం ఒక రైల్వేకి చెందినవాళ్లం. మనదందరిదీ ఒకే కుటుంబం. జయమో అపజయమో అన్నీ ఒకళ్ళకొకరు చెప్పుకుంటూ చాలాకాలం కలిసి ఉండాలి. మీరు దాస్తానంటే దాగుతుందా? చెప్పండి ఎంత కలెక్షన్ కుర్రాళ్ల దగ్గిర్నుంచి?"

"కుర్రాళ్ళు మేము చదువుకునే వాళ్ళం, అన్ని డబ్బులు లేవంటే తలో యాభై తో పోనిచ్చానండి."

"అబద్ధం ఆడితే అతికినట్టుండాలి చంద్రం గారూ. మీకు కుర్రాళ్ళిచ్చిన నాలువందల్లో రెండు వందలు ఇలా పారేయండి. అదే ముష్టి అనుకుంటే మళ్ళీ నేను అందులో వీర ముష్టి నా పై వాడికివ్వాలి."

చంద్రానికి నోటమ్మట మాట రాలేదు. ఈయన చూడబోతే ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేలా ఉన్నాడు. ఇంకేం మాట్లాడితే ఎటు తిరిగి ఎటుస్తుందో? జేబులోంచి రెండు వందలు తీసి టేబిల్ మీద పెట్టి వెర్రినవ్వు నవ్వుతూ అన్నాడు, "ఇది మొదటిసారి సారి ఇలా తీసుకోవడం. దీనిలోనే మీరు సగం తీసుకుంటున్నారు. కొంచెం ఎక్కువ సంపాదించి ఉంటే సంతోషంగా ఇచ్చి ఉండేవాణ్ణి కానీ..."

మేనేజర్ నవ్వుతూ చెప్పేడు, "చంద్రంజీ, మీరు ఇంకా చాలా నేర్చుకోవాలండి. అడిగినదానికి సరైన సమాధానం చెప్పకుండా అబద్ధాలు ఆడితే రోజూ అటువైపు విజయవాడ వెళ్ళే డ్యూటీ మార్చి ఇటు దండకారణ్యం కేసి గూడ్స్ బండికి పడుతుంది డ్యూటీ. బండికి డ్రైవర్ ఈ చివరా మీరు ఆ చివరా కూర్చుని రాత్రంతా గంటకి అయిదు కిలోమీటర్లు వెళ్ళే గూడ్స్ బండిలో తిండీ, తిప్పలూ, లైటూ అదీలేని చిన్న గార్డు పెట్టెలో చీకట్లో చలిలో వణకాలి మరి. అయినా మీరు జేరి అప్పుడే ఏడాది కాలేదు కదా? ఇంకా బోల్డు భవిష్యత్తు ఉంది. ఎందుకు కంగారు అంతా ఇప్పుడే సంపాదించడానికి? మన రైల్వే గంగిగోవు. దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటే ఎంతకాలం కావాలిస్తే అంతకాలం చిక్కటి పాలు పిండుకోవచ్చు. పై ఆఫీసర్లతో జాగ్రత్తగా ఉండండి. వృద్ధిలోకి వస్తారు. మేమంతా అంతా అలాగే పైకి వచ్చాం కదా?"

చంద్రం మరో వెర్రి నవ్వునవ్వుతూ తనెక్కబోయే గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టుకోవడానికి ప్లాట్ ఫారం మీదకి నడిచేడు.

## అవగతం — పాలగుమ్మి రామకృష్ణారావు

**సర్దుకుపోవడం జీవితంలో** చాలా ముఖ్యమైన విషయం. అది లేనివాళ్ళు జీవితాన్ని నష్టపోవడం సహజం. నేను సావిత్రితో పదే పదే ఈ విషయాన్నే చెబుతూ వచ్చాను. ఆమె నా మాట లెక్క చెయ్యలేదు.

"నేను ఈ ఇంట్లో ఉండలేకపోతున్నాను" అంది ఏడుస్తూ. ఆ మాటకు నాకు బాధ కలిగింది, కోపం వచ్చింది. 'ఎందుకు?' అని నా ప్రశ్న రాకుండానే జవాబిచ్చింది, "అత్తయ్యకు నేనంటే ఇష్టంలేదు."

"అబద్ధం" నేను పైకి గట్టిగానే అన్నాను. నా కంఠస్వరం కొంచెం గంభీరం. ఉలిక్కిపడింది.

అమ్మకూడా నా మాటలు వింటుందేమోనని భయం వేసి స్వరాన్ని తగ్గించాను. "నువ్వు మా అమ్మను తప్పుగా అర్థం చేసుకుంటున్నావు. నీతో పెళ్ళికి ప్రోత్సహించింది మా అమ్మే."

అర్థం కానిదానిలా మొహాన్ని ముడివేసింది. నా మాటలు స్పష్టంగానే ఉన్నాయి. సావిత్రి హావభావాలు నన్ను చికాకు పెట్టినా గతంలోకి తొంగిచూడడానికి అవి సహాయం చేసాయి.

అమ్మంటే నాకు ఎందుకు అంత ప్రేమ?

నా జీవితంలో ప్రతి అడుగు అమ్మ ప్రోత్సాహమే. నేనేం చదవాలో నిర్ణయించి నన్ను ప్రోత్సహించింది. పరీక్షలు పూర్తయ్యేవరకు టేబుల్ లైటు ముందు నేను, వెనుక అమ్మ. అమ్మ నాకన్నా ముందు నిద్రపోవడం నేనెప్పుడూ చూడలేదు.

క్షణం తీరికలేని ఉద్యోగంలో ఇరుక్కుపోయిన రోజుల్లో కూడా అమ్మ నా ఆకలి అవసరాన్ని గుర్తుపెట్టుకుని నా కడుపు నింపేది.

"నాన్నా నువ్వు పెళ్ళి చేసుకోవాలిరా" అంది అమ్మ ఒకరోజు. నేను మరింత సుఖవంతమైన జీవితాన్ని గడపాలని అమ్మ కోరిక. నేనొప్పుకోలేదు.

"ఇంకా ఎన్నాళ్ళు నీకోసం నేను కష్టపడాలి?" అంది. ఒప్పుకోక తప్పలేదు.

"మా అమ్మ పదే పదే నాకు చెప్పకపోతే నేను ఈ సంబంధానికి అంగీకరించేవాడిని కాను."

సావిత్రి తెల్లబోయింది. "ఈ పెళ్ళి మీకు ఇష్టంలేదా?"

నేను సర్దుకోవలసి వచ్చింది. "ఇష్టం లేదంటే ఇష్టంలేదని కాదు. అప్పుడు పెళ్ళిమీద నాకో అభిప్రాయం లేదు."

"ఇప్పుడు ఇష్టపడుతున్నారా?"

తలతిక్క ప్రశ్న. భార్యాభర్తల మధ్య ఇష్టాలు, ప్రేమలు అంటూ ప్రతిదానికి సమాధానం చెప్పలేం. "ఇప్పుడు నేను నీకు ఏం లోటు చేసానని ఇలాంటి ప్రశ్నలు వేస్తున్నావు? ఇష్టం లేకపోతే నీతో కాపురం ఎలా చేస్తాను? ఇష్టం లేకపోయింది నీకు. ఇంట్లో తీరిగ్గా కూర్చుని లేని కష్టాలను నెమరువేసుకుంటూ ఎదుటి మనిషిలో తప్పుల్ని వెతుకుతున్నావు. అమ్మా నాన్నలు పెద్దవాళ్ళు ఏదో అంటారు. సర్దుకుపోవాలి. నా చిన్నప్పుడు మా నాన్నమ్మ కూడా అలాగే అనేది. మా అమ్మ కాపురం చేసుకోలేదూ! సర్దుకుపోవాలి సావిత్రీ సర్దుకుపోవాలి." ఆ రోజుకు కథ ముగిసింది.

సావిత్రి మళ్ళీ నా దగ్గర అమ్మ గురించి ఫిర్యాదు చెయ్యలేదు. నాతో కూడా చాలా ముభావంగా ఉండటం మొదలు పెట్టింది. నాలుగు రోజులు గడిస్తే గొడవ అదే సర్దుకుపోతుంది. ఇది నా ఫిలాసఫీ.

నేను అనుకున్నంత తేలిగ్గా సమస్య ముగిసిపోవడం లేదు. సావిత్రి నా దగ్గరకొచ్చినప్పుడల్లా వంటింట్లో కంచాలు, గిన్నెల చప్పుళ్ళు ఎక్కువగా వినపడుతున్నాయి. ఎంతో ఆప్యాయతతో సావిత్రితో మాట్లాడాలనుకుంటా. ఆ క్షణంలోనే ఇలాంటి సంఘటనలు ఏవో మా మధ్య దోబూచులాడతాయి.

"ఏమిటి? నువ్వు వంటిల్లు సర్ది రాలేదా?" సమాధానం లేదు. నేను మరోసారి అడగలేదు. నాది జవాబులేని ప్రశ్నా? నాకు కోపం వచ్చింది. సావిత్రి మొహంలోకి చూసాను. ఆ మొహం కూడా నా భావాలే పలుకుతోంది. అంతే. మేం 96లోకి మారిపోయాము.

ఆ రోజుకు మౌన యుద్ధం ముగిసిందనుకుంటే మరుసటి రోజు తిరిగి అవే శబ్దాలు. సావిత్రిని ప్రశ్నించి లాభం లేదని నేనే ఒక్క ఉదుటన వంటగదిలోకి వెళ్ళాను.

"ఏమయిందిక్కడా? ఈ చప్పుళ్ళేవిటి?" పెద్దగా అరిచాను. అమ్మ బిత్తరపోయి చూసింది. అమ్మ మీద ఇంతకు ముందెప్పుడూ నేను ఇలా అరవలేదు. ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నేను అరవడం తప్పని నాకు అప్పటికి కానీ స్ఫురించలేదు. "ఏమయిందమ్మా?" అన్నాను సౌమ్యత కొని తెచ్చుకుని.

అమ్మ కోపంతోనే జవాబిచ్చింది, "ఇవన్నీ మా ఆడవాళ్ళ వ్యవహారాల్లే. నీకెందుకు? నువ్వెళ్ళు."

నేను వెనక్కు వచ్చేసాను. అమ్మ మాటలు ఆగిపోలేదు. "కాసిన్ని నీళ్ళుపోసి దులిపేస్తే గిన్నెలు కడిగినట్టు కాదు. వంటిల్లు చూస్తే ఎవరైనా నవ్విపోతారు."

"చేసే పని సవ్యంగా చెయ్యాలి" మంచం మీద వాలిపోతు నేనన్నమాట అదొక్కటే. సావిత్రి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎందుకు ఏడుపు? ఇప్పుడు నేనేమన్నానని?"

"నేను చేసిన పనేమిటో మీరు చూసారా?" కన్నీళ్ళతో కూడిన మాటల్లో పవరెక్కువ ఉంటుందేమో! నేను సమాధానం చెప్పలేకపోయాను. సావిత్రి మాట్లాడుతూనే ఉంది. వంటింట్లో శబ్దాలు వస్తూనే ఉన్నాయి. ఆ రెండూ ఎప్పుడాగాయో నాకు తెలియదు.

తెల్లవారు ఝామున మెలుకువ వచ్చింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. రాత్రి సంఘటన మళ్ళీ ఆలోచించాను. సావిత్రి అడిగిన మాటలో తప్పులేదు. నేను నిజంగా చూడలేదు. అమ్మ అన్నదాంట్లో కూడా తప్పులేదు. అది ఆడవాళ్ళ విషయం. నేను తలదూర్చకూడదు. కోడికూతలు విని కళ్ళు తెరిచింది సావిత్రి.

"సారీ సావిత్రి. ఏదో తెలియకుండానే అడిగాను." సావిత్రి లేచి బట్ట సర్దుకుని బయటకు నడిచింది.

"నేను సారీ చెప్పడం సరైనదేనా?" మళ్ళీ ఆలోచనలు అటు పరుగెట్టాయి.

ఆఫీసులో కూడా ఇవే ఆలోచనలు. చేసే పనిలో సవ్యత లోపిస్తోంది. సహోద్యోగులు కనిపెట్టేసారు. స్వీయ అనుభవం అయియుండవచ్చు. "వారం రోజులు సెలవు పెట్టి హనీమూన్‌కి చెక్కేయ్ గురూ" అని సలహా ఇచ్చారు.

రాత్రి హుషారుగా సావిత్రి చెవిలో ఊదాను. ఆమె మొహం వికసించింది. మర్నాడు డైనింగ్ టేబులు దగ్గర అమ్మకు చెప్పాను. "ఊటీకి వెళ్ళాలనుకుంటున్నాం" అని.

"ఒక్క ఊటీయేనా?"

"అలా మధురై కూడా వెళితే బాగుంటుందనుకుంటున్నాను."

"నేను మధురై చూడలేదురా. ఎన్నిసార్లు అడిగినా మీ నాన్న గుమ్మం దాటి కదలనీయలేదు. నీ చిన్నప్పుడేమో నువ్వు నడవలేవని, పెద్దయ్యాక స్కూలు పాడవుతుందని. ప్రతికాలానికి నిన్నే వంకగా చూపించేవారు. ఇప్పుడేమో ఆయన మంచం మీద, నేను వంటింట్లోను. ఇద్దరికీ సరిపోయింది."

"పాపం అమ్మను కూడా రమ్మంటే" నేను సావిత్రికేసి తిరిగేటప్పటికి అంత వేగంగాను వంటింటికేసి తిరిగిపోయింది.

"మధ్యలో నేనెందుకులే ముసలిదాన్ని. మీరు వెళ్ళండి" అంది అమ్మ నేను అడక్కుండానే అంతా తనకు అర్థమైపోయినట్లు.

"నీ ఇష్టం. వస్తే రా"

రాత్రి సావిత్రి మొహంలాగే ఇప్పుడు అమ్మ మొహం కూడా వెలిగిపోయింది.

ఆ సంతోషం అంతవరకే. ప్రయాణం అంతా రెండు ప్రక్కలా ఏడుపులు, అలకలతో నడిచింది. సావిత్రికి సర్దుకుపోవాలి అనే మాట మా ప్రయాణంలో అనేకసార్లు చెప్పాను.

క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చాము కానీ సెలవలు దండగయ్యాయని అనిపించింది. ఆ తరువాత సావిత్రి ఇంట్లో సర్దుకుపోయినట్లే నటించింది. ఆ నటనలోనే ఒక పాపను కని నా చేతిలో పెట్టింది.

నటనకు ఏదో ఒక రోజు తెరపడుతుంది. అమ్మానాన్నలు కళ్ళనీళ్ళు పెట్టుకుని అన్నారు. "మీ ఆవిడకు మాతో ఉండటం ఇష్టంలేదురా. ఇలాంటి దానితో ఎలా కాపురం చేస్తున్నావురా!"

"ఏమంటుంది?" నా చేతిలో పాప కేర్‌మంది. నేను లెక్కచెయ్యలేదు. "చెప్పమ్మా ఏం జరుగుతోంది ఇంట్లో. నాకర్థంకావడం లేదు."

అమ్మ నోరు విప్పింది. "ఏం అనదు. వంట చెయ్యమంటే కూర మాడ్చేస్తుంది. ఇల్లు శుభ్రం చేసుకోవడం తెలీదు. ఎక్కడి బట్టలు అక్కడే ఏమడిగినా కోపం. పదిమంది వచ్చే కొంప. ఇలా ఉంటే ఎలా? ఏం మాట్లాడినా తప్పు పట్టుకుంటుంది. మా పీడ వదుల్చుకోవడానికి ఇంత విషం పెట్టినా ఆశ్చర్యపోనక్కరలేదు" సావిత్రి ఎదురుగానే తారాస్థాయికి వెళ్ళింది అమ్మ.

నాన్న జతకలిసాడు. "ఆకలిగా ఉందమ్మా కాస్త ఫలహారం చెయ్యమంటే నన్నో పురుగును చూసినట్లు చూసిందిరా"

నేను సావిత్రిని పెళ్ళి చేసుకుని చాలా పెద్ద తప్పు చేసాననిపించింది ఆ క్షణంలో. వ్యవహారం తొండ ముదిరి ఊసరవిల్లి అయిందన్నట్లయింది.

నేను చాలా తొందరగా నిర్ణయం తీసుకున్నాను. సావిత్రిని వెనక్కు పంపేసాను. పంపించేస్తూ ఒక మాట అన్నాను. "పురిటికని పుట్టింటికి వెళ్ళిన దానివి నీకు అక్కడ తిండి బాగా వంటబట్టింది. ఇకనుండి అక్కడే ఉండు." సావిత్రి గుడ్లనీరు కుక్కుకుంది.

తిరుగు టపాలో నా ఇంటికి అత్తమామలు, బంధువులు - బ్రతిమాలటాలు, కాళ్ళు పట్టుకోవడాలు. అమ్మానాన్నల సలహా తీసుకున్నాను.

కథ మామూలే. సావిత్రిని పుట్టింట్లో దింపేయడం తప్పని సరి అయింది. పాపను నాతోనే ఉంచుకున్నాను.

పాప పావనిగా ఎదిగింది. ఇరవైరెండు సంవత్సరాలు గతించిపోయాయి. ఇప్పుడు అమ్మానాన్నలు లేరు. పావని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయింది. మరో సాఫ్ట్‌వేర్‌కు ఇల్లాలు అయింది.

కథ మళ్ళీ మొదటికొచ్చింది.

పావని ఫోన్ చేసి చెప్పింది "నాన్నా నేను వేరుపడుతున్నాను. మీ ఇంటికి రావచ్చా? వీల్లేదంటే ఏదైనా హాస్టల్లో ఉంటాను" ఫోన్ కట్ అయింది.

నాకు మతిపోయింది. వేయి వోల్టుల విద్యుత్ ఘాతం తగిలినట్లయింది. "ఇదేమిటి ఇలా జరిగింది. మంచి సంబంధం చూసి మరీ చేసాను. అల్లుడు ఏమైనా అన్నాడా? ఇద్దరూ చదువుకున్న వాళ్ళు, రెండు చేతులా సంపాదించుకుంటున్నవాళ్ళు. సుఖంగా వెళ్ళిపోయే సంసారంలో గొడవలేం ఉంటాయి?

తిరిగి పావనికి ఫోన్ చేసాను. "అమ్మాయ్ నేను అల్లుడితో మాట్లాడతాను. కంగారు పడకు"

"అవసరం లేదు నాన్నా. నా కొడుకును నా నుండి దూరం చేస్తున్నావు అంటూ గొడవపెట్టింది ఆవిడ. ఆవిడకే కొడుకున్నాడు, వాళ్ళే మనుషులు. ఏం, వాళ్ళు నన్ను మీ దగ్గరనుండి దూరం చెయ్యలేదూ? అదే నిలదీసి అడిగాను. ఆ ఊరుకు ఈ ఊరు ఎంత దూరమో ఈ ఊరుకు ఆ ఊరూ అంతే దూరం." కటువుగా మాట్లాడి మరోసారి ఫోన్ కట్ చేసింది.

కన్నకూతురు కాపురం వదులుకునే స్థితికి వచ్చిందంటే నా మనసు కకావికలం అయిపోయింది. ఎన్ని విధాల ఆలోచించినా మార్గం దొరకడం లేదు. సావిత్రిని ఇంట్లోంచి పంపించేసినప్పుడు నేను ఇంతగా ఆలోచించలేదు. సావిత్రి తండ్రి ఇలాగే మధనపడ్డాడేమో?

అప్పుడు నేను తండ్రి స్థానంలో లేనుగా. నాకు ఆ బాధ తెలియదు. ఇప్పుడు కాలం నన్ను తండ్రి స్థానంలో నిలబెట్టింది. పావని ఆలోచనను సరిదిద్దాలంటే నేనేం చెయ్యాలి?

మొదట సావిత్రి దగ్గరకు వెళ్ళి నా తప్పును ఒప్పుకుని క్షమించమని అడగాలి.

గతంలో లోపాలను గుర్తించి భవిష్యత్తును సరిదిద్దుకోవాలనుకోవడం గొప్ప మార్గమే. కానీ ఆ గతం ఒక ప్రామాణికమైన సమయం అయినప్పుడే అది సాధ్యపడుతుంది. నిన్న, మొన్న కొన్ని రోజుల క్రిందట, కొన్ని నెలల క్రిందటి తప్పును సరిదిద్దుకునే అవకాశం ఉంది. మరి ఇన్నేళ్ళ తరువాత.

మళ్ళీ సెల్ రింగయింది. అల్లుడు దగ్గరనుండి ఫోను. స్విచ్ ఆఫ్ చేసాను. ముందు సావిత్రిని కలుసుకోవాలి. ఆ తరువాతే మాటలు.

# ఏడడుగులు స్వాతీ శ్రీపాద

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

ఎక్కడ చూసినా ఒకటే హడావిడి. రంగు రంగుల పరికిణీలు ఒకచేత్తో ఎత్తిపట్టుకుని ఇంకా రెక్కలు సరిగ్గా రాని సీతా కోక చిలుకల్లా అటూ ఇటూ పరుగులు తీస్తున్న పదేళ్ళ కు అటూ ఇటూ గా ఉన్నఅమ్మాయిలూ , అమ్మల చేతులు పట్టుకు గాలి బుడగల్లా ఊగుతూ, గారాలుపోతూ, అది కావాలి ఇది కావాలని వేదిస్తున్న రెండు మూడేళ్ళ అబ్బాయిలూ అమ్మాయిలూ సినిమాల్లో చూసిన లేటెస్ట్ ట్రెండ్ సాంప్రదాయిక డిజైనర్ లంగా వోణీలు గిల్ట్ వో బంగారమో కాని వడ్డాణాలు,వంకీలూ, కాసుల పేర్లు, ఓరచూపులూ పెళ్లీడు అబ్బాయిల కళ్ళలో పడాలన్న తపనలూ వీటన్నింట్లో కొత్తమెరుపు కాగితం లో చుట్టి కట్టిన పూలగుచ్చాల్లా వయస్సులో ఉన్న అమ్మాయిలు.

అవును. అసలు కన్నా ఆడంబరం ఎక్కువై పోయిన పెళ్ళిళ్ళు. లేత గులాబీ రంగు గోరింటాకు చూసి ఎన్నాళ్ళయింది! పచ్చని ఆకు తెంపుకు వచ్చి రుబ్బి పెట్టుకున్న రంగుకో నానా కెమికల్స్ కలిపి పొట్లాలు కట్టిన మెహందీకి పూల వనానికీ ఒక జంతు ప్రపంచానికీ ఉన్నంత అంతరం.

మోచేతులదాకా ముదురు తోపు రంగులో చెయ్యంతా అల్లుకు పోయిన డిజైన్లు చూసేందుకే వెగటుగా అనిపిస్తున్నాయి. ఎన్నాళ్ళకో కలిసిన బంధువర్గాలు ఒకరితో ఒకరు పరామర్శలూ, కష్టస్సుఖాలు కలబోసుకోడం ఎక్కడి వాతావరణం అక్కడ కనిపిస్తోంది.

ఇప్పటికి నా పెళ్ళైన నలభై నాలుగేళ్ళలో కనీసం ఒక వంద పైగా పెళ్ళిళ్ళు చూసాను. ఒక రొటీన్ తంతు. పెళ్లి వారిని ఎదుర్కోడం, దుమ్ము కాళ్ళు కడగటం అంటూ పీట మీద నించో బెట్టి పెళ్ళికొడుకు కాళ్ళు కడగటం, మంగళ హారతులు, వెనకాల వచ్చిన ఆడవాళ్ళకు బొట్టు జాకెట్ గుడ్డలు ఇవ్వడం. ఆ సరికే పెళ్లి కూతురు పెళ్లి పందిరి అనే వేదిక మీద గౌరీ పూజ చేస్తూ ఉంటుంది. బావమరిది వరసైన వాళ్ళు కడిగిన కాళ్ళు నెలకు అనకుండా ఎత్తుకు తీసుకు వెళ్లి వేదిక ముందు భాగాన వేసిన కుర్చీలో అమెను చూడనివ్వకుండా ఆశీనుడిని చెయ్యడం ... ఒక్కదానిలోనూ ఒక యాంత్రికత తప్ప సహజత్వమే కనబడదు. ఎవరి ధ్యాసలో వాళ్ళు. నెమ్మదిగా తలతిప్పి అందరినీ ఒకసారి గమనించాను. పెళ్లి వేదికకు ఆ పక్కన పెళ్ళికొడుకు తరఫు వాళ్ళు ఈ పక్కన పెళ్లి కూతురి తరఫు వాళ్ళు. ఇదివరకులా చాపలమీద కూర్చునే కాలం చెల్లిపోయింది. అందరికీ కీళ్ళనొప్పులు ముప్పై దాటకుండానే వస్తున్నాయి. అందుకే కుర్చీలు ... లైవ్ టెలికాస్ట్ కి ఏర్పాట్లు. పెళ్ళికూతురి వెనక కొత్తగా పెళ్లైన, పెళ్లి కావలస్సిన అమ్మాయిలూ, పిన్నులూ , మేనత్తలూ అవసరం లేకున్నా ఏదో ఒకటి సవరిస్తూ ...

వద్దన్నామనసు గతంలోకి వెళ్లి పోయింది. ఎంత నిరాడంబరంగా జీవితాలు పంచుకున్నారు? ఒకరంటే ఒకరికి వల్లమాలిన అభిమానం, దూరమై బ్రతకలేమనిపించాక, తలిదండ్రులను ఒప్పించలేమని అర్థమయాక నలుగురు మిత్రుల మధ్య జరిగిన పెళ్లి. అయినా తలెత్తి అతని వంక చూసేందుకే ఎంత బెరుగ్గా ఉండేది. ఒకరి కొకరు మనసులు తప్ప మరేదీ ఇచ్చి పుచ్చు కోలేదు.

ముప్పై మూడేళ్ళ తరువాత కూడా " ఇంకా ఇలా కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడతావు" అనేవాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నిన్న గాక మొన్న కవ్వింపుగా అతను పాడిన ఆ పాట చెమ్మ ఇంకా తడి ఆరలేదు. " ఇరువుర మొకటై పరవశించగా ఇంకా జాగేలా బేలా" కంటిలో నీటి పొర కదిలింది. అది చుక్కగా మారి కొలకులు దాటకుండా జాగ్రత్తపడ్డాను.

తలుచుకుంటే గుండె బరువెక్కి పోతుంది. ఎలా ఉన్నాను తను లేకుండా ? అనిపిస్తుంది. మరుక్షణమే ఓదార్పుగా వీచిన గాలి చెక్కిళ్ళు తాకి అతని చేతి పరామర్శలా లాలిస్తుంది.

ఏమిటో ... నేను మాత్రమే ఇలా ఎందుకున్నానో, ...

పెళ్లి జరుగుతున్నా ఆలోచనలు తమ దారిన తాము సాగుతూనే పోయాయి. పెళ్లి కూతురు లావణ్య పెద్దన్నయ్యకు నాలుగేళ్ళ క్రితం పెళ్లైంది. ఆర్నెల్లలో ఆ పిల్ల నాకు నచ్చలేదు. ససేమీరా నేను దానితో కలిసి ఉండలేనని విడాకులకు వెళ్లి పది లక్షల నష్ట పరిహారం ఇచ్చి వదిలించుకున్నాడు. పాపం అనిపించింది. రుచి చూసి నచ్చలేదని ఏకూరో వదిలేసినంత సులువా ఇలా జీవితంలోకి వచ్చిన మనిషిని వదిలెయ్యడం అనుకున్నాను. అదిగో ఆ చివర కూచున్న సుమతి కొడుకు పెళ్లై నాలుగేళ్ళు. రెండేళ్ళుగా కోడలు రావడం లేదు. కలిసి ఉండటం నా వల్ల కాదు విడిగా వస్తావా రా లేదూ నీ దారి నీది నా దారి నాది అందట.

మనసు చివుక్కుమంది.

పెళ్ళికి కొత్త నిర్వచనం ఇవ్వాలేమో.

సంప్రదాయాన్ని ఎగతాళి చేస్తున్నట్టు పెళ్ళికి ముందే కలిసి కబుర్లూ షికార్లూ స్వీట్ నతింగ్స్ అన్నీ అయాక మళ్ళీ తెరచాటు పరదాలు, జీలకర్ర బెల్లాలు, ... మంత్రాలు ... తంత్రాలు

తుమ్మితే ఊడే ముక్కులా తయారైన ఈ పెళ్లిళ్లకు ఇలా డిజైనర్ చీరలూ, సినిమా షూటింగ్ లా మేకప్ లు వెడ్డింగ్ థీమ్ లూ, అట్టహాసంగా లైవ్ టెలికాస్ట్ ... కనీసం ఒక్కసారైనా ఇతనే నా జీవన సహచరుడు అనుకోలేని దౌర్భాగ్యం, అప్పో సొప్పో లక్షలు ఖర్చు అవాల్సిందే అట్టహాసంగా పెళ్లి జరగాల్సిందే.

బంగారు బొమ్మ రావేమే –సన్నాయిపాట. అవును బంగారు బొమ్మలే కావాలి.ఒంటి నిండా బంగారం దిగేసుకున్న బొమ్మలు. వరుడు మనసైన వాడో కాదో ... గాని

ఛ మరీ పెళ్ళికి వచ్చి ఈ ఆలోచనలేమిటి అనుకున్నాను.

వెనకాల ఎవరో అమ్మాయిలూ గుసగుసలాడుకుంటున్నారు. వద్దన్నా మాటలు వచ్చి చెవులను మనసును తాకుతూనే ఉన్నాయి.

" మొన్న మొన్నటి దాకా వాడు లేకుండా బ్రతకలేనని అంటివి గదా , మరి వీడితో పెళ్ళెందుకు చేసుకున్నావు?"

వాడు , వీడేనా మర్యాద అనేదే లేదా అనుకున్నాను.

" ఇప్పుడు కూడా వాడిని చూడకపోతే అంతేనే కాని ఏంచేస్తాను? తప్పలేదు. అమ్మకు నాన్నకు వాడు నచ్చలా ... చదువు లేదంటారు. కాని ఎంత ప్రేమగా మాట్లాడతాడు? అది చాలే.తిండీ తిప్పలు లేకున్నా బతికెయ్యడానికి. కాని మేం చూసిన వాడిని చేసుకోకపోతే చిల్లిగవ్వ ఇవ్వమన్నారు. ఇద్దరూ కొంపలు మునిగి నట్టు ఒకటే ఏడుపు. అమ్మ చెప్పిందిలే. ప్రేమ ప్రేమే పెళ్లి పెళ్ళే దేని దారి దానిదని. అదే అనుకున్నాం. వీలైనప్పుడు కలుస్తాం. ఫోన్ చేస్తానన్నాడు రోజూ"

తలతిప్పి చూద్దామని ఎంత బలంగా అనిపించినా అతి కష్టం మీద ఉగ్గబట్టుకున్నాను.

ఎటు పోతోందీ యువత?

ఒకరిద్దరు తెలిసిన వారు పలకరించారు. ఒక చిరునవ్వు ఒక కరచాలనం.

ఏం పట్టుకుపోయేది ఉంది.

ఇంతలో మంగళ సూత్ర ధారణ ముగిసినట్టుంది. మిగతా కార్యక్రమాలు జరుగుతున్నాయి. తలంబ్రాలు అంటూ పాతికేళ్ళు దాటిన వారు అక్షంతలు పోసుకోడం ఫోటోలో ఒక్కోగింజా రావాలని మొహాలు సరిగ్గా కనబడాలనీ సవరించుకుని కృతకంగా ఫోటోలు...

ఈ లోగా పెద్ద వాల్యూం తో మైక్ గరగరమంది. కాస్సేపటికి సర్దుకున్నాక అర్థం అయింది. పెళ్లి పాటలు పాడే బృందం ఏర్పాటు చేసారని. సంప్రదాయ గీతాలు వినిపిస్తారేమోనని మనసులోనే సంబరపడ్డాను కాని అది ఆవిరవడానికి ఎంతో సమయం పట్టలేదు. పాతకాలం మొదలు నిన్నమొన్నటి వరకు వచ్చిన సినిమాలలో పెళ్లి పాటలు పాడింది ఆ బృందం.

పట్ట పగలు నూతన దంపతులకు చుక్కను చూపించాక అదే అరుంధతి ఇహ అతిధుల ఆశీర్వచనాలు. రెండు దాటింది. ఆకలితో నకనకలాడుతూ ఉగ్గ బట్టుకు కూచున్న వాళ్ళు ఒక్కసారి లేచారు.

ఈ అరుంధతి ఆచారం ఎందుకో ఈ తరం వారికి.

ఈ లోగా ఒక్కొక్కరూ లేచి బంధుమిత్ర ఉభయకుశలోపరిగా పరామర్శలు.

ఇహ ఏదో కాస్త తిన్నాననిపించి సెలవు తీసుకోడం మంచిదనుకున్నాను.

లేచి రెండడుగులు వేశానో లేదో ఆర్నెల్ల క్రితం పెళ్ళయిన పారుల్ వాళ్ళమ్మ పలకరించారు.

గుజరాతీ అమ్మాయి,శశాంక తనూ ఒకే ఆఫీస్ –ప్రేమ పెళ్లి.

బాగానే వుంది. అమ్మయ్య కాస్త కాస్త మారుతున్నారు కులం మతం అంటూ వేళ్ళాడ్డం మాని అనుకున్నాను.

కాని పారుల్ వాళ్ళమ్మ ఏం చెప్తోందో ముందు అసలు అర్థం కాలేదు.

" నరకం చూపిస్తున్నారు"

ఎవరు ఎవరికి నరకం చూపిస్తున్నారు , ఆ మాటా నాకెందుకు చెప్తోంది...

తెల్లమొహం వేశాను.

" నాలుగు నెలలుగా నా కూతుర్ని నాతోనే ఉంచుకున్నాను. పెళ్ళైన మూడో రోజునుండే మొదలు సతాయంపు. ఎంత గ్రాండ్ గా పెళ్లి చేశాము. ఎవరూ కనీవినీ ఎరగని విధంగా , అయినా ఏం తెచ్చావని రోజూ సతాయింపే. రాత్రీ పగలూ ఉద్యోగం చేసి పైసా పైసా లెక్కలు చెప్పాలట...పార్లర్ కి వెళ్ళా లన్నా చివరికి సానిటరీ నాప్కిన్స్ కూడా లెక్క చెప్పాలట........"

నా తల గిర్రున తిరిగింది.

"శశాంక ఏమీ అనడా?" ఎందుకు అడిగానో నాకే తెలియదు.

"ఏమీ అనదు మూగ మొద్దులా నిల్చుంటాడు... వాడి అక్కలూ అంతే ..కోర్ట్ కి వెళ్ళమంటున్నారు " అల్లుడిని వాడు అన్న ఆమె సంస్కారం ఎక్కువేమీ కాదనిపించింది.

నెమ్మదిగా అక్కడినుండి ఎవరినో మాట్లాడిస్తూ తప్పించుకున్నాను..

మనసుకు బెంగగా అనిపించింది.

నేనూ తనూ ఎప్పుడో అనుకున్న మాటలు మళ్ళీ మనస్సులో మెదిలాయ.

తొలితొలి రోజుల అలకలు కోపాలు ఒకటి రెండు సార్లు చూసాక్ కాబోలు, ఆ రోజున అందరూ నిద్రపోయిన అర్థరాత్రి, ఆలస్యంగా ఉదయించిన నవమి నాటి వెన్నెట్లో చాపమీద వాలిన అతని ఎదపై తల పెట్టుకుని ముని వేళ్ళతో మీసాలు సవరిస్తూ

" మనిద్దరం ఈ వెన్నెల సాక్షిగా ఒక ప్రమాణం చేద్దాం" అన్నాను

" ఊ చెప్పెయ్యి"

"ఇహపై మనకు ఒకరి భావాలు ఒకరికి నచ్చకపోతే, ఈ అల్లకలూ కోపాలూ వద్దు. అది రంపపు కోతలా ఉంటుంది. ఎవరిష్టం వారిది అనుకుందాం. మాట్లాడకపోతే నాకు భయంగా ఉంటుంది. ..." ఆపైన మాటలు రాలేదు కళ్ళలోని నీళ్ళు అడ్డంపడి.

దగ్గరకు లాక్కునిఉక్కిరిబిక్కిరి చేస్తూ , "నువ్వు చెప్పావు నేను చెప్పలేదు అదేరా తేడా... సరే ఇహపై మనకు వాదనలే వద్దు. అందరిలా జీవితాంతం వరకీ కాదు ఒకరికొకరం ఎప్పుడూ కలిసే ఉందాం"

నిజమే ...

అందుకే గదా నా చుట్టూ ప్రతి క్షణమూ అతనే.

కాని ఈ తుమ్మితే రాలిపడే ఉల్కల్లా ఈ కాలపు పెళ్ళిళ్ళు ఎటు దారి తీస్తున్నాయి.

అన్యమనస్కంగా ఒక చివర కూచున్నాను. అంద'రికీ దూరంగా ............

"వద్దంటే వినవు కదా కామాక్షీ ఆ కళ్ళకు కాటుక పెట్టుకుంటే నలుగురి కళ్ళూ నీ మీదే, అందుకే దిష్టి తగిలి వొళ్ళు వెచ్చబడింది.

"ఒరే సుబ్బారావ్, ఇంకా నీకు అనుమానం పోలేదా ఎవడో నన్ను ఎత్తుకు పోతాడని.. "ముసిముసిగా నవ్వు.

తలతిప్పి ఓరగా చూసాను

పండుటాకుల్లా , రేపటి తరాన్ని వెక్కిరిస్తూ ఒకరి చూపుల్లో ఒకరు కరిగిపోతూ కామాక్షీ సుబ్బారావూ——తొంభైల్లోకి అడుగుపెట్టిన పెళ్ళికూతురి తండ్రి నాయనమ్మ ముత్తాతా.

వణుకుతున్న ఆమె పెదవులపై "మీ నగు మోమూ నా కనులారా........."

# బాధ్యత

మనస్విని

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"అమ్మా, శర్మగారు ఎలాగున్నారు?" అడిగాడు రమేశ్. సొంత ఊరిలో కొన్ని ఏళ్ళ తర్వాత తహశీల్దారు హోదాలో అడుగుపెట్టాడు. కొడుకు ఉన్నతి చూసి, పొంగిపోయింది ఆ తల్లి.

"ఎవర్రా, శర్మగారు?" అడిగింది విజయ్యమ్మ.

"ఆయనేనే, మా తెలుగు మాష్టారు, మన ఇంటి దగ్గర గుడిలో పూజలు చేసేవారు!"

"ఓహ్, పెద్దపంతులుగారా? ఆయన నీకు శర్మగారు ఎప్పటినుంచి? హై స్కూలుకని ఈ ఊరు వదిలేంతవరకు, ఆయన్ని పంతులు అనే వాడివిగా?"

"లేదమ్మా, ఆయన గురించి చెప్పుడు మాటలు విని, ఆయన అహంకారి అనుకుని, అలా అనేవాడిని. ఆయన పద్ధతులు, అప్పట్లో నాకు ఆయన ఆచారాలు నచ్చేవి కావు"

మాటకు అడ్డు తగులుతూ, "ఆయన కష్టం వింటే, కడుపు ఎవరికైనా తరుక్కు పోతుంది. ఈ వయస్సులో కొడుకు అన్నీ చూసుకుంటాడు అనుకుంటే, అతనే సంపాదన సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నాడు. చినపంతులుగారు ఊర్లోనే ఉద్యోగం చేసుకుంటాడు అనుకుంటే, ఆ స్కూలు పిల్లలులేక

మూతబడింది. గుడికి కూడా జనాలు రావడం తక్కువైపోయింది. పెద్దపంతులుగారు ముసలివాడైపోయాడు. పెన్షన్ కూడా సరిగ్గా రాదు. ఉన్న రెండెకరాల పొలం కూతురు పెళ్ళికి అమ్మేశారు."

"అయ్యో, ఓడలు బండ్లవ్వడమంటే ఇదేనేమో" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు రమేశ్.

★★★

"ఏరా, గుడికి నెలనెలా వెయ్యి రూపాయలు ఇస్తానన్నావంట, చినపంతులుగారు చెప్పారు," నెల తర్వాత ఊరికి వచ్చిన కొడుకును అడిగింది విజయమ్మ.

"నా జేబులోంచి కాదులే, ప్రభుత్వం ఇస్తోంది, దానికి కావలసిన ఏర్పాటు చేయించాను. తహసీల్దారు అయ్యుండి మన ఊరికి నేను చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు?" చెప్పాడు రమేశ్.

"అదేంటి, నీకూ గుడి అంటే పడదు కదా, అక్కడ మనకి విలువ లేదు, నన్ను అక్కడికి వెళ్ళడం మానెయ్యమని పోరుపెట్టేవాడివి?"

"నేను గుడిని, గుడిలో రాయిని నమ్మను, నాకూ నేను రోజూ కొలిచే దేవుడు ఉన్నారు. సాటి వాడికి సహాయం చేసినవాడు ఎవ్వరైనా నాకు దేవుడే. నాకు చిన్నప్పుడు పంచుకోవడంలో ఉన్న సుఖం నేర్పాడు ఒక దేవుడు. అదే చేస్తున్నా, ఇది నా బాధ్యత," తేల్చేశాడు రమేశ్.

"ఇంతే కాదు, మూతబడ్డ అప్పర్ ప్రైమరీ కూడా మళ్ళీ తెరుచుకుంటుంది. ఊరికి కొత్త మాస్టారు అవసరం లేదు. మీ చిన పంతులుగారు ఉన్నారుగా? మరి అందులో పిల్లలాంటావా, అది నీ బాధ్యత. ఈ పేటలో ఉన్న పిల్లలందరూ ఆ బడికి వెళ్ళాలి. నువ్వు ఏమి చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలియదు. అవసరమైతే, చిన్నప్పుడు నన్ను బెత్తంతో బెదిరించే దానివే, అలాగ మళ్ళీ చెయ్యి," ఆజ్ఞ వేశాడు కొడుకు. కించిత్ గర్వం కలిగింది విజయమ్మకు. తన ఇంటివాడు జబ్బు చేసి అనుకోకుండా పోయి, కొడుకు ఎమైపోతాడో అని భయపడుతూ ఉంటే, పెద్దపంతులుగారు సముదాయిస్తూ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "నీ కొడుకు మొండి వాడే కాని, తెలివిగలవాడు. నువ్వు చేస్తున్న సేవకు ఆ దేవుడు మంచి దోవ చూపెడతాడులే". మనసులోనే ఆయనకీ దణ్ణం పెట్టుకుంది.

అలా అడుగులు వేస్తూ, శర్మగారి ఇల్లు దాటి గుడిదాటి కోనేరు దాకా వెళ్ళాడు. అక్కడే మెట్ల మీద కూర్చుని, గతాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు.

★★★★★★★★★

"ఎవర్రా అక్కడ గొడవపడేది?" అడిగాడు శర్మగారు.

"నాన్నా, వీడు రమేశ్ మన మావిడి చెట్లోంచి కాయలు దొంగలించి తీసుకుపోతున్నాడు," నెపం మోపాడు శర్మగారి అబ్బాయి మనోహర్.

శర్మగారు దగ్గరకు వచ్చి అడిగారు. "అయ్యా, ఈ వేళ ఉగాది కదా, పచ్చడి చేసుకుందామని అమ్మ చెబితే, ఒక మామిడికాయ కోసం వచ్చా. అమ్మ ఇచ్చిన డబ్బులకి, చింతపండు, బెల్లం మటుకే వచ్చాయి. వేప పువ్వు గుడి దగ్గర చెట్లో దొరికింది. మామిడికాయ కోసం వచ్చా. ఒక్కటి చాలు అయ్యా మాకు. మా ఇంట్లో ముసిలి తాత చాల ఇష్టంగా అడిగితే మా అమ్మ కూలి డబ్బులలోంచి ఇచ్చింది" చెప్పాడు రమేశ్.

"నువ్వు విజయ్యమ్మ కొడుకువి కదూ?" రోజు గుడిలో ఏంతో సేవ చేసే విజయంమని గుర్తు చేసుకుంటూ అడిగాడు శర్మగారు. అవునంటూ తల ఊపాడు.

"మనోహర్, వాడికి ఆ మామిడికాయతో బాటు, ఇంకో నాలుగు ఇవ్వు, ఆవకాయ పెట్టుకుంటారు. అలాగనే మీ అమ్మనడిగి, ఒక సోలెడు ఆవ పిండి కూడా తీసుకురా", ఆజ్ఞాపించాడు శర్మగారు.

"నాన్నా, వాడు దొంగతనంగా తీసుకువెళ్తున్నాడు, వాడికి ఇవన్నీ...?" అడిగాడు మనోహర్. ఇద్దరూ ఒకే క్లాసులో చదువుకోవటంవల్ల పోటీ ఎక్కువ.

"ఒరేయ్, మన చెట్టుకు కొన్ని వందల కాయలు కాస్తాయి, మనకి కావలసినవి కాకుండా మిగతావి పంచితేనే, ఆ చెట్టు ఇంకా ఎక్కువ కాస్తుంది. పంచుకోవటంలో ఉన్న సుఖం తెలుసుకోరా" అంటూ, కొన్ని మామిడి రెమ్మలు కూడా కోసుకోమని చెప్పాడు శర్మగారు.

జూన్ నెల స్కూలు మొదలుకాబోతోంది. ఊరిలో ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూలుకు తెలుగు మాస్టరు తోబాటు, హెడ్మాస్టారుగా చేస్తున్నారు శర్మగారు. రమేశ్, మనోహర్ ఇద్దరు హైస్కూల్ లోకి వచ్చారు. ఉన్న ఊరిలోకన్నా, ఇరవై మైళ్ళ దూరంలో ఇంకా మంచి స్కూలు హాస్టల్ తో కూడి ఉంది. రమేశ్ తెలుసుకున్న దాని ప్రకారం పక్క ఊర్లో ఉన్న హై స్కూల్లో ఒకే సీటు ఖాళీ ఉంది, దానికీ, శర్మగారి రెకమెండేషను ఉంటే ఖచ్చితంగా ఇస్తారు. ఆయన, వాళ్ళ అబ్బాయికి ఇస్తారు కాని, తనకు ఎందుకు ఇస్తారు అని అనుమానిస్తూ, స్కూలుకు వెళ్ళాడు రమేశ్. ఇంతలో, ఆ పక్క ఊరి స్కూలు హెడ్మాస్టారు, పరమేశం గారు కూడా అక్కడ ఉండటం చూసి, ఇక పని అవ్వదు అనుకుంటూ, హెడ్మాస్టారుగారి రూము బయట నిలబడి వింటున్నాడు రమేశ్.

"అదేంటండి, మీ అబ్బాయికి కాదని రమేశ్ కి ఇవ్వమంటారా? నాకేమి అభ్యంతరం లేదు. కానీ, నాకు మీ ఆలోచన అర్థం కాలేదు" అడిగాడు పరమేశం గారు.

"పరమేశం గారు, నాకు మాత్రం మా వాడు వృద్ధిలోకి రావాలని లేదా? అయితే, ఇక్కడే వుంటే వాడు కాస్త నా దగ్గర వేదం, పూజలు నేర్చుకోవచ్చు. వాడికి పెద్ద వుద్యోగం రాకున్నా, నా స్థానంలో ఇక్కడి స్కూలులో టీచరు ఉద్యోగం చేసుకునేంత చదువు వస్తే చాలు. నా తర్వాత, ఎటూ ఆ గుడి కూడా చూసుకోవాలి. రమేశ్ అయితే, వాడే కాదు, వాడి కుటుంబం, ఆ పేట కూడా కాస్త బాగుపడుతుంది. వాడు మంచి చదువు చదువుకుంటే, వాడిని చూసి ఆ పేటలో మిగతా పిల్లలు చదువుకోడానికి కాస్త ముందుకు వస్తారు" వివరించారు శర్మగారు.

"మీలాంటి వారి వల్లే ఇంకా వర్షాలు కాస్త పడుతున్నాయి. సరే, అలాగే కానిద్దాం" పరమేశంగారు కూడా ఏకీభవించారు.

ఇంకొద్ది సేపట్లో ఇద్దరూ బయటకి వస్తారు అని గ్రహించి, చమర్చిన కళ్ళతోనే పరుగు లంఘించుకున్నాడు రమేశ్. ఆ రోజు కూడా, కోనేటి మెట్ల మీద ఇలానే కూర్చుని. తన మనస్సులో ఉన్న సందిగ్ధాలన్నీ పక్కకు తోసి, కేవలం చదువు మీద ధ్యాస కుదుర్చుకున్నాడు.

గతాన్ని తలచుకోగానే, కళ్ళు మళ్ళీ చెమర్చాయి. తన్ని తమాయించుకుని, శర్మ గారిని, అదే, పెద పంతులుగారిని కలుసుకుని, ఆయన పెన్షన్ గురించి తెలుసుకుందామని బయలుదేరాడు.

## ఆఖరు ఫైలు — డేగల అనితాసూరి

"ఏమండీ ఆఫీసుకు టైమౌతోంది లేవండి. ఈ లోపు కాఫీ తెస్తా" అంటూ లేపి వెళ్ళిపోయింది సుభాషిణి.

ఎప్పుడూ "అబ్బా! మరికాస్సేపు పడుకుంటే బాగుండు. అయినా లేవక తప్పదు కదా?" అనుకుని చిరాకుపడే నాకు చటుక్కున మెలకువొచ్చింది. ఓ క్షణం కళ్ళుమూసుకున్నా. రేపిలా అనలేందు కదా సుభాషిణి అనిపించింది. గుండెల్లో ఏదో వెలితి.

నున్నగా షేవింగ్ చేసి స్నానం ముగించి , వద్దన్నా కొడుకు కుట్టించి పెట్టిన క్రొత్త బట్టలు తొడుక్కుని వచ్చేసరికి వేడివేడి టిఫిన్ ప్లేట్ లో వడ్డిస్తూ కనిపించింది సుభాషిణి. కొడుకు ఆఫీస్ కు వెళ్తూ 'బై నాన్నా' అన్నాడు. సరేనని తలాడించి టిఫిన్ ముగించి లేచా. నాకోసం ప్రత్యేకం గా

తయారుచేసిన లంచ్ బ్యాగ్ చేతికిచ్చింది సుభాషిణి. ఎప్పుడూ లేంది కోడలు వింధ్య కూడా సుభాషిణి తో కలిసి కారుదాకా వచ్చింది సాగనంపడానికి. పెదవులపై నవ్వు వింతగా మెరిసి మాయమైంది.

డ్రైవర్ నాచేతిలోని బ్యాగ్ అందుకుని కారు డోర్ ఓపెన్ చేసి లోపలపెట్టి నిలబడ్డాడు. వాడి కళ్ళలో చిన్నగా మెదిలిన అభిమానపు భావన నా చూపుల్ని దాటిపోలేదు.

@@@@@

రోడ్డుమీద పరుగులుతీస్తోన్న కారు కొద్దిసేపటికే స్లో అయ్యింది. షరా మామూలే. .. ట్రఫిక్ జాం. ఏనుగుల్లా బస్ లు, చిరుతల్లా కార్లు, జింకల్లా బైక్ లు, ఎలుగుల్లా ఆటోలు దేనిపరుగు దానిదే, దేని ఆత్రం దానిదే అన్నట్టు కార్చిచ్చురేగితే దిక్కుతోచక పరుగెట్టే వన్య మృగాల్లా వురుకుతున్నాయ్.

ఎందుకోగానీ రోజులా విసుగు, చిరాకు అస్సలనిపించలేదు. పైపెచ్చు చుట్టూ చూస్తూ హాయిగా ఆస్వాదిస్తున్నా. 'నేనేనా?' అని డౌటొచ్చింది నామీద నాకే!

అలా..అలా..సిగ్నళ్ళు, స్పీడ్ బ్రేకర్లు దాటుకుంటూ ఆఫీసుముందుకొచ్చేశాం. రాజుకోట లాంటి నా కార్యాలయ ద్వారాలు బాహుబలి బాహువుల్లా బారచాచి రారమ్మని స్వాగతించాయి ఎన్నో యేళ్ళ వాత్సల్యమంతా నింపుకున్నట్టు ఆర్తిగా. నిన్నటి వరకూ అనిపించని వింత భావన! ద్వారం లో రక్షకభటులు చేసే ఐ.డి కార్డు పరిశీలన కోపం తెప్పించేది. రోజూ చూస్తున్నా అడుగుతున్నారని. ఈరోజు వారి విధి నిర్వహణా దీక్ష కనిపించిందేమిటో! అడగకముందే ఆదరంగా చూపించి లోపలికి ప్రవేశించాం.

కారులోంచి దిగి లిఫ్ట్ ముందు నిలబడ్డా. ఇంకా ఆరులో వుంది. ఎప్పట్లా అసహనం ఆవరించలేదు. అక్కడున్న తెలిసినవారి శుభోదయ అభివాదాలను అందుకుని ప్రతిగా చిరునవ్వుతో స్పందిస్తూ వేచివున్నా.

నా ఛాంబర్ లోకి అడుగు వేస్తుంటే కాళ్ళలో ఏమిటో చిన్నగా తడబాటు. నా కుర్చీ హాట్సీట్ లా, ఏసుప్రభువు తలమీది ముళ్ళ కిరీటంలా కనిపించేది కాస్తా మళ్ళీ బాల్యాన్ని వెనక్కితెచ్చినట్టు అమ్మపొత్తిళ్ళలా మెత్తగా హాయిగా అనిపించింది. హ్యాండ్ రెస్ట్ మీద చేతులు పెట్టి వెనక్కువాలి దీర్ఘంగా శ్వాసతీసుకున్నా. హిమాలయాల కొండంచున కూడా ఆక్సిజన్ అందినంత ఫ్రీ గా అనిపించింది.

అటెండర్ రిజిష్టర్ తెచ్చి ముందుంచాడు. తెరిచిపట్టుకున్న దానిమీద ఓ సంతకం పడేయటం తప్ప మరో అభిప్రాయం లేని నేను దాన్ని రెండు చేతుల్లోకీ తీసుకుని నెమ్మదిగా సంతకం పెడ్తుంటే వ్రేళ్ళు సన్నగా వణికాయి. ఎన్నిసార్లు నాలో బి.పి. పెంచిందో, ఎన్నిసార్లు లెక్కించుకుంటూ తొందరగా రావాలని ఉరుకులు, పరుగుల తో గుండెవేగం రెట్టింపు చేసిందో గుర్తొచ్చింది. సంతకం చేసి మూసి ఇచ్చాను.

అటెండర్ తీసుకెళ్తుంటే దాని మనసు నాతో నిష్ఠూరంగా పలికినట్టనిపించింది, 'ఇక నా గురించీ నీకే టెన్షన్ వుండదు నేస్తం...ఇక సెలవ్!" అని.

ముఖ్యమైన కొన్ని ఫైళ్ళు సంతకాలకోసం ఎదురుచూస్తూ కనిపించాయి. ఈలోపే స్నేహితులు ..అంటే , ఒకే బ్యాచ్మేట్స్ గా కలిసిన వాళ్ళు, ఈ ముప్పై మూడేళ్ళలో కలిసి పనిచేసిన కలీగ్స్, పరిచయాలతో దగ్గరైనవాళ్ళు ఒక్కొక్కరే, కొంతమందిగానూ కలిసి రాసాగారు.

ఎన్నో సంతోష క్షణాల్ని నెమరేస్కున్నాం, మరెన్నో దాటివచ్చిన కఠిన సమస్యల్ని గుర్తుచేస్కున్నాం, ఇంకెన్నో మధురానుభూతుల్ని పంచుకున్నాం. పెద్దగా నవ్వుకున్నా. ఒకర్నొకరు అభిమానపూర్వకం గా చూసుకున్నాం.

ఆ తరువాతో అరగంట సమయం దొరికింది. అప్పుడు ఫైళ్ళు పట్టుకున్నా. ఎక్కువ లేవు. పదో పదిహేనో అంతే! ముందు జాగ్రత్తగా చాలా వరకూ నిన్ననే ముగించినందువల్ల. రెండుంబావు అవుతోంది. ఇక లంచ్ మేట్స్ వచ్చే టైమవుతోంది.

అన్నీ చూసి ప్రక్కన పెట్టినా ఏమనిపించలేదు. చివరగా ఒక ఫైల్ మిగిలింది. అంతా చదివాక గతం మళ్ళీ సినిమారీల్లా కళ్ళముందు కదలాడింది. ఎన్ని జీవితాల్లో ఈ ఫైళ్ళు వెలుగులు నింపాయో! మరెన్ని జీవితాల్ని తెలిసి తెలిసి ఏమీ చేయలేక రిజెక్టై నిరాశల్లో పడేశాయో. కొన్ని ఫైళ్ళు కలల్లో సైతం కనిపించేవి. మరికొన్నయితే నిద్రపట్టనీకుండా చేసేవి. కొన్నయితే కొర్రీలతో బుర్రను రామకీర్తన పాడించేవి. ఇంకొన్ని బాగా ఏడిపించాక

విజేతగా నెగ్గి మనసును ఆనంద డోలికల్లో ఓలలాడించేవి. కొన్ని మొండి ఫైళ్ళ సంగతి తేల్చడానికి ఎన్ని రూల్స్ తిరగేయాల్సొచ్చేదో. మరికొన్నయితే సమయమంతా తినేసి ఎన్నోసార్లు ముఖ్యమైన పుట్టినరోజులు, పెళ్ళిరోజుల్ని సైతం మరిపించి ఇంట్లో అలకలు, గొడవలకు కారణాలయ్యేవి.ఎన్ని స్పీకులు, ఎన్ని డిస్కషన్ లు, ఇంకెన్ని మీటింగ్ లు, ఒత్తిడులు చవిచూపాయో! కానీ, పరిస్థితి ఏదైనా ..రోజులో ఎన్నిసార్లు 'ఫైలు...ఫైలు' అంటూ రామకోటిలా ఫైలు కోటి జపించానో లెఖ్ఖే లేదు. అయినా..ఈ ఫైళ్ళే కదా ఇన్నాళ్ళు నాకు అన్నం పెట్టిన దేవుళ్ళు!?

కొన్నిసార్లు కోపం వచ్చి ఫైళ్ళను పెద్దాఫీసర్లు విసిరేయటం, మరికొన్నిసార్లు ఆ విసురులో తానొచ్చి బల్లమీద గిరాటేయటం జరిగేది. నాకు నేనే క్రొత్తగా ఆలోచిస్తున్నాననిపించింది. ఎప్పుడూ లేంది ఈ ఫైలో దేవతలా అనిపించింది. నెమ్మదిగా ముఖం దగ్గరికి తీసుకుని కళ్ళకద్దుకున్నా. గ్రీన్ పెన్ అందుకుని చివరిగా ఆఖరు ఫైలుమీద సంతకం పెడుతుంటే నా అధికారాన్నెవరో లాక్కొంటున్నట్టు, నీ అవసరమిక తీరిపోయింది వెళ్ళమన్నట్టు, నీ సేవలికో నమస్కారం అన్నట్టు అనిపించింది. కళ్ళలో నీటిపొర చేస్తున్న సంతకాన్ని అలుక్కుపోయినట్టు చేసింది. కానీ, అలవాటు కొద్దీ పెట్టడం పూర్తిచేసి మిగతా ఫైళ్ళ పైన నెమ్మదిగా పెట్టేస్తుంటే గుండెనెవరో చిక్కబట్టినట్టైంది.

"హాయ్...! హాయ్..." అంటూ వచ్చేశారు లంచ్ మేట్స్ ఆరుగురి తో కూడిన బృందం.

"ఏమిటోనోయ్ నీ ఛాదస్తం...ఇవ్వాళ మేమంతా బయట హోటల్లో ట్రీటిద్దామని ప్లాన్ వేస్తే ఆదివారానికి పోస్ట్పోన్ చేశావ్. పైగా ఎవరూ తెచ్చుకోవద్దని స్పెషల్ ట్రీట్ ఇస్తానంటావ్" కినుకగా వాపోయారు వాళ్ళు.

ఈలోపు నా క్యారేజ్లోని వెజిటబుల్ రైస్, గారెలు, పాయసం ప్లేట్లలో వడ్డించాడు అటెండర్. కబుర్లతో తినటం ముగించాక అటెండర్ తో మంచి స్వీట్ షాప్ నుంచీ స్వీట్, హాట్ ప్యాకెట్స్ చేయించి తెప్పించి సెక్షన్లన్నీ స్వయం గా తిరిగి పంచి నమస్కారాలతో సీటుకొచ్చేసరికి నాలుగయ్యింది.

పెద్దాఫీసర్లు, ముఖ్యమైనవాళ్ళు, స్టాఫ్ మెంబర్స్ అంతా కాన్ఫరెన్స్ హాల్లో చేరారు. శాలువాలు సత్కరించాయి, బొకేలు పలకరించాయి, జ్ఞాపిక గుర్తుంచుకొమ్మని నవ్వింది, వీడియోలు, ఫోటోలు తీశారు. నా గురించీ, నిజాయితీ గురించీ, నా కుటుంబం గురించీ చిన్న విశ్లేషణ వినిపించారు. కొందరు నాతో వారి అనుబంధాల్ని గుర్తుచేసుకున్నారు. నేనూ నాకనిపించిన భావాల్ని పంచుకున్నా. అందరికీ కృతజ్ఞతలు తెలిపా. అంతా చప్పట్లతో విషెస్ తెలిపారు. కుటుంబ సభ్యులూ వస్తే బావుండేదన్నారు. నిజమే. కానీ, ఎందుకో నాకే ఇష్టం లేకపోయింది. వారిని చూసుకుంటూ వీళ్ళతో పూర్తిమనసుతో ఆస్వాదించలేననిపించింది.

వాహనం వరకూ అందరూ వచ్చి వీడ్కోలు పలికి వెళ్ళారు. అటెండర్ పూలహారాలు, శలువాలు, జ్ఞాపిక, బొకేలు తెచ్చి కార్లో సర్దాడు. కారు కదిలింది.

"సార్..సార్.." ఎవరో కారు కి అడ్డంగా చేయి ఊపుతూ ఆపారు. డ్రైవర్ని ఆపమన్నా. అప్పటికి ఐదున్నరవుతోంది సమయం.

"సార్..ఈ ఫైల్ రావటం కాస్త ఆలస్యమైంది. సారీ మిమ్మల్నిలా ఆపాల్సొచ్చింది. దీనివల్ల ఇతని జీవితం బాగుపడి వీళ్ళనాన్న ఉద్యోగం వస్తుంది" చెప్పాడు సెక్షన్ హెడ్.

వెంటనే ఫైలందుకున్నా. సంతకంచేసి ఇచ్చేశా. తలెత్తి చూస్తే మొన్నామధ్య సెక్షన్ లోనే హార్ట్ ఎటక్ తో వాలిపోయిన సీనియర్ అసిస్టెంట్ భార్య, కొడుకు కనిపించారు. ఇద్దరూ నమస్కరించారు. చెయ్యెత్తి ఫర్వాలేదన్నట్టు చూశాను. వారికళ్ళలోని కృతజ్ఞత నిండిన చూపుల ముందు నా ప్రక్కనున్న శాలువాలు బొకేలు చిన్నబోయాయి.

అప్పుడనుకున్నా. మధ్యాహ్నం నేను పెట్టిందే ఆఖరు ఫైల్ అనుకున్నా. కానీ, నా ఆఖరు ఫైల్ ఎంత మంచి ప్రయోజనంతో ముగించాడా పైవాడు?' అని. కారు సరిగ్గా బిర్లా మందిరం ప్రక్కకే వచ్చింది. అప్రయత్నం గా చెయ్యెత్తి నమస్కరించా తృప్తిగా!

# యథా..తథా.. పాలపర్తి జ్యోతిష్మతి

పనంతా పూర్తిచేసుకుని పదిగంటలవేళ టీవీ పెట్టుక్కూర్చున్నాను.

"కొంతమంది ఉంటారు, అన్నీ వాళ్ళ కనుకూలంగానే జరగా లనుకుంటారు. కొంచెంకూడా సర్దుబాటు చేసుకోడానికి ఇష్టపడరు. ముందు వాళ్ళ సుఖం చూసుకుంటారు. పక్క మనిషినిగురించి ఆలోచించరు. సాటివారికి సహాయం చెయ్యడం వాళ్ళ బాధ్యతగా తీసుకోరు. అటువంటివాళ్ళమీద సామాన్యంగా మనకి కోపం వస్తుంది, ఒక్కోసారి అసహ్యంకూడా వేస్తుంది. నిజానికి కనీస సంస్కారం లేని వాళ్ళమీద జాలిపడాలి మనం..."

టీవీలో గురువుగారు ప్రవచనం చెప్తున్నారు. వింటూ వింటూ ఆలోచనల్లోకి జారిపోయాను నేను.

రెండురోజులుగా నా మస్తిష్కాన్ని ఆక్రమించి స్థిమితం లేకుండా చేస్తున్న ఆ కుర్రాడిమీద ఇప్పుడు నేను జాలి పడాలన్నమాట.

నిజానికి ఆ కుర్రాడిమీద నాకు కోపంగానీ, అసహ్యంగానీ కలగలేదు. టీనేజ్ పిల్లలు ఇట్లా ఉన్నారేమిటి అన్న ఆలోచన నన్ను ఆందోళనకి గురిచేస్తోంది.

అనుకోని పనిమీద హైదరాబాదు వెళ్ళి మొన్న ఉదయం తిరిగి వచ్చాను. పని పూర్తయి తిరుగు ప్రయాణం ఎప్పటికి కుదురుతుందో తెలీక రిజర్వేషన్ చేసుకోలేదు. బస్టాండుకి వచ్చి ఎదురుగా కనిపించిన, మా ఊరిమీదుగా వెళ్ళే బస్సు ఎక్కి కండక్టరుని 'సీటు ఖాళీ ఉందా?' అని అడిగితే ఒక సీటు నాకు ప్రసాదించాడు.

కాసేపటికి ఒక కుర్రాడు, ఏ బీటెక్కో చదువుతూ ఉండి ఉంటాడు, వచ్చి నా పక్కన కిటీకీ సీట్లో కూర్చున్నాడు.

నేను కూర్చున్న సీటుకి అవతలపక్క సీట్లో కిటికీపక్కన ఒకాయన, ఇవతల ఒకావిడ కూర్చున్నారు. ఆవిడకూడా నాలాగే రిజర్వేషను లేకుండా ఎక్కికండక్టరు దయకతమున ఆ సీట్లో కూర్చోగలిగింది. ఆవిడ భర్త ఇంకెక్కడో, కిటికీ సీటు ఎవరో రిజర్వ్ చేసుకుంటే వాళ్ళ పక్కన ఖాళీ సీట్లో కూర్చున్నాడు.

'ఈ రిజర్వేషన్లు చేసుకునేవాళ్ళు ఎవరికివాళ్ళు తలాఒక విండోసీటు రిజర్వ్ చేసుకుని పక్క సీట్లన్నీ ఖాళీగా వదలకపోతే పొందిగ్గా వరుసక్రమంలో చేసుకోవచ్చుకదా' అని మనసులోనే సమస్త ప్రయాణీక లోకంమీద విసుక్కుని "బాబూ! నీకభ్యతరం లేకపోతే అటు కూర్చుంటావా? ఆడవాళ్ళం ఒకచోట కూర్చుంటాం" అన్నాను నా పక్కన కూర్చున్న కుర్రాడితో అటుపక్క సీటు చూపిస్తూ.

"విండో సీటు కావాలండీ! గాలి కావాలి" అని నాకు సమాధానం చెప్పి, బ్యాగ్‌లోకి చేతులు దూర్చి ఏదో వెదుకులాడుకోవడం మొదలుపెట్టాడు.

కేవలం సహాయం చేసే తత్వం లేకపోవడమే కాదు, ఉచితసలహా లిచ్చే అలవాటుకూడా ఉన్నట్టుంది ఆ కుర్రాడికి. 'ఆయన్నే ఇక్కడ కూర్చోమనండి' అంటూ ఒకటి నా మొహాన కొట్టి చెవుల్లో వైర్లు దూర్చుకుని సెల్‌ఫోన్‌లో సినిమా చూస్తూ వేరే లోకంలోకి వెళ్ళిపోయాడు.

ఈ కుర్రాడొచ్చి నా పక్కన కూర్చోకముందే ఆ పక్కసీట్లోఆవిడ, ఆమె భర్త కూర్చున్నచోటికి వెళ్ళమని అతన్ని అడగడమూ, కాదనిపించుకోవడమూ అయిపోయాయి. అతను చెప్పినమాటకూడా అదే 'విండోసీటు కావాలి, గాలి కావాలి' అని.

నిజానికి 'ఒక మగాడి పక్కన కూర్చుని రాత్రంతా ప్రయాణం చెయ్యాలా?' అని భయపడాల్సిన వయసుకాదు నాదికానీ, ఆ కుర్రాడిది కానీ సాపేక్షంగా చూస్తే.

సమవయస్కుడైన పరపురుషుడి పక్కన కూర్చోవలసివచ్చిన, ఆ పక్కసీట్లోని నడివయసు స్త్రీ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని నేను ఆ కుర్రాడితో సీటు

మారే ప్రతిపాదన చేశాను. కాదనిపించుకున్నాక ఆ విషయం అక్కడితో వదిలేసి నా ధ్యాసలో నేను పడ్డాను. కానీ తల్లిలాంటి ఒక స్త్రీ కోరిన చిన్న ఫేవర్‌ని ఆ కుర్రాడు అంగీకరించలేక పోవడాన్ని నేను అంగీకరించలేక పోతున్నాను.

నా ఆలోచనల్లో నేనుండగా "అత్తయ్యా...!" అంటూ సుడిగాలిలా వచ్చి నా పక్కన కూర్చున్నాడు నా ముద్దుల మేనల్లుడు. పక్క వీధిలోనే ఉంటున్న నా తమ్ముడి కొడుకు వాడు. చెన్నైలో ఎంబియ్యే చదువుతున్నాడు. వాళ్ళమ్మ ఉద్యోగానికి వెళితే చిన్నప్పుడు నా దగ్గరే పెరిగాడు వాడు. ఆ మాటకొస్తే నా తమ్ముడుకూడా నా చేతుల్లోనే పెరిగాడు.

టీవీని మ్యూట్‌లో పెట్టి "ఎప్పుడొచ్చావురా?" అన్నాను ఆనందం ఆశ్చర్యం కలగలిసిన స్వరంతో.

"పొద్దున్నే వచ్చాను. అమ్మ నీ కిది ఇచ్చి రమ్మంది" అంటూ ఒక కవరు నా చేతిలో పెట్టి లేచి నిల్చున్నాడు.

"కూర్చోరా, అప్పుడే లేచావేంటి?" అంటూ వాడి చెయ్యి పట్టి లాగాను ఆ కవర్లో ఏముందో చూడనుకూడా చూడకుండా ఓ పక్కన పెడుతూ.

నేను లాగిన ఊపుకి నా పక్కన కూలబడుతూ "రాత్రి ప్రయాణానికి ఒళ్ళు హూనమైపోయిం దత్తయ్యా! పడుకోవాలి" అన్నాడు.

"అదేంటిరా, సీటు రిజర్వు చేసుకోలేదా? నిలుచుని వచ్చావా?" అన్నాను ఆదుర్దాగా.

"సుబ్బరంగా కిటికీపక్కసీటే రిజర్వ్ చేసుకున్నాను. కానీ నా సీట్లో నేను కూర్చోలేదు" అన్నాడు వాడు.

"ఎందుకని?" కుతూహలంగా అడిగాను ఏదో అర్థమవుతున్న ట్టనిపించినా.

"చిన్న అడ్జెస్ట్‌మెంట్. ఒక వృద్ధజంట రిజర్వేషన్ లేకుండా ఎక్కారు. నా పక్క సీటు ఖాళీగా ఉంది. ఇంకో ఖాళీసీటు వెనకెక్కడో దొరికింది వాళ్ళకి.వాళ్ళు రిక్వెస్ట్ చేశారు. నేను వెనక సీటుకి మారిపోయాను. ఎత్తెత్తి వేసిందనుకో. కిటికీ సీటుకూడా కాదు. అస్సలు గాలాడలేదు, నిద్ర పట్టలేదు" అన్నాడు వాడు బద్ధకంగా ఆవులిస్తూ.

"సౌకర్యవంతమైన సీటు రిజర్వు చేసుకునికూడా ఇబ్బంది పడ్డావన్నమాట" అన్నాన్నేను నిట్టూరుస్తూ.

"పోన్లే అత్తయ్యా! నేను సీటివ్వక పోయుంటే పాపం ఆ పెద్దాయనో, ఆవిడో ఆ వెనకసీట్లో కూర్చోవలసి వచ్చేది. నాకే ఇంత బడలికగా అనిపిస్తుంటే ఆ వయసులో వాళ్ళు ఆ ప్రయాసకి తట్టుకోగలరా?" అంటూ మళ్ళీ లేచాడు వాడు.

"సరే! వెళ్ళి పడుకో" అన్నాన్నేను వాణ్ణి సాగనంపడానికి లేస్తూ.

"అయినా ఇప్పుడు నేను చెయ్యాల్సిన రాచకార్యాలుమాత్రం ఏమున్నాయిలే, పడుకుని నిద్రపోవడం తప్ప. మళ్ళీ సాయంత్రం వస్తాలే" అంటూ వెళ్ళిపోయాడు.

వాడితోబాటు గుమ్మందాకా వెళ్ళిన నేను 'వీళ్ళ నాన్నకూడా ఇంతే చిన్నప్పణ్ణించీ. ఎవరికి ఏ అవసరం వచ్చినా సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉంటాడు' అని మురిపెంగా అనుకుంటూ వెనక్కి తిరిగితే మ్యూట్‌లో పెట్టిన టీవీలో పెదవులు కదులుస్తూ కూర్చున్న గురువుగారు నన్ను మళ్ళీ జాలి పడడం దగ్గరికి లాక్కెళ్ళారు.

కిటికీ పక్క సీట్లో కూర్చుని తప్ప ప్రయాణం చెయ్యలేని ఆ కుర్రాడిమీద కాదు, కొడుక్కి కనీస సంస్కారం నేర్పలేకపోయిన తల్లిదండ్రులమీద జాలి కలిగింది నాకు.

పనిలో పనిగా ఆపక్కసీట్లో అతనిమీదకూడా జాలి పడ్డాను, 'రేపెప్పుడైనా విండో సీటు దొరకకపోతే ఈ మనిషి ప్రయాణ మెట్లా చేస్తాడా?' అని కాదు, 'భవిష్యత్తులో అతని సంతానంకూడా ఈ కుర్రాడిలాగే తయారవుతారు గదా' అనిపించి.

# పెళ్ళి రాత్రికి అనగా..

డా.చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

'ఫుస్స్' అనే శబ్దంతో పొలమారింది, పెళ్ళిళ్ళ పేరయ్య రామశాస్త్రికి.

అతనికి మంచినీళ్ళందిస్తూ, "ఏమిటి శాస్త్రిగారూ, మా ఆవిడ మజ్జిగలో అల్లం, పచ్చిమిర్చి గట్టిగా దట్టించిందా ఏం?" అడిగాడు వేంకటేశ్వర్లు.

కొన్ని మంచి నీళ్ళు తాగి, మిగిలిన మజ్జిగ పూర్తి చేసి, 'బ్రేవ్' మని త్రేంచి, కండువాతో నుదుటి మీదున్న చెమటను తుడుచుకుంటూ, "ఎంత మాటన్నారండీ ఎండాకాలంలో నాకు మజ్జిగ దానం చేసిన మహాతల్లిని? నేనులిక్కి పడింది మీరు పెళ్ళికొడుకులో కోరుకున్న లక్షణం గురించి", అన్నాడు రామశాస్త్రి.

"అంత కాని కోరికేం కోరానండీ బాబూ! మీ ఉలికిపాటు చూసినవాళ్ళెవారైనా నేను మిమ్మల్ని భయపెట్టానేమో అనుకుంటారు", అన్నాడు వేంకటేశ్వర్లు.

"భయం కాదూ మరి! మీరు మీ అమ్మాయికి సంపన్నుల సంబంధం తెమ్మనండి, తెస్తాను; ఆఫీసర్ సంబంధమా, సరే సరే! మీ కులం అబ్బాయిని వెతికి తెమ్మంటారా, ఇంకా సులభం; అమెరికా సంబంధం కావాలా, కొంత సమయం పడుతుంది; ఇల్లరికపుటల్లుడు కావాలా, దొరుకుతాడు. ఇవన్నీ వదిలేసి, క్రమశిక్షణాపరుడు అనే ఒక విశాలమైన పదాన్ని నా మీదకి వదిలేసి, అటువంటి సంబంధం తెమ్మంటే నా వల్లవుతుందంటారా?" గుక్క తిప్పుకోకుండా మాట్లాడి, మంచి నీళ్ళు గడగడా తాగేశాడు రామశాస్త్రి.

"అదా మీ కంగారుకి కారణం? హహహ! నేను ఒక మధ్య తరగతి కుటుంబీకుణ్ణి. ఓ మోస్తరుద్యోగం చేస్తున్నాను. సొంతిల్లుంది. సిగరెట్, తాగుడు, స్త్రీలోలత్వం లేనివాణ్ణి. అది నా క్రమశిక్షణ. ఉన్న ఒక్కగానొక్క కూతురికి అటువంటి అబ్బాయిని కోరుకోవడం తప్పు కాదుగా! మొన్నామధ్య మా పక్కింటి వాళ్ళబ్బాయి పాతికేళ్ళకే పోయాడు, కాన్సర్ తో. బాధ పడాల్సిన విషయమే. పక్కింట్లో ఉన్న పుణ్యానికి మేమెరిగిన విషయమేమిటంటే ఆ అబ్బాయి తెగ సిగరెట్లూదేసేవాడు. అదృష్ట వశాత్తు పెళ్ళి కాలేదుగానీ, అదే జరి గుంటే ఆ అమ్మాయి తన తప్పు లేకుండా అశుభసూచకం అయ్యుండేది. నా కూతురికి అలాంటి జీవితం వద్దు.

"తాగితే మనిషి పశువవుతాడని అందరికీ తెలుసు. కానీ, ఈ మధ్య 'సోషల్ డ్రింకింగ్' పేరిట పార్టీల్లో మగా, ఆడా కలిసి మందు కొట్టడం సర్వసాధారణమైపోయింది. నా పెంపకంలో పెరిగిన మా అమ్మాయి బీరు కోసం బారు చుట్టూ తిరగదు.

"మా బట్టలు ఇస్త్రీ చేసే చిన్నారావు ఏకంగా మరో స్త్రీని ఇంట్లోకే తెచ్చిపెట్టుకున్నాడు. ఆవిడ మాటల్లో పడి కొన్నాళ్ళకి భార్యాబిడ్డల్ని ఇంట్లోంచి తరిమేశాడు. ఇలాంటి వాణ్ణి చేసుకున్నా, చేసుకోకపోయినా ఒకటే.

"మా మూడో ఇంటిని మూణ్ణెల్ల క్రితం ఖాళీ చేసిన సుబ్బారావు గారు పేరు మోసిన ప్రైవేటు కంపెనీలో జనరల్ మేనేజర్. వాళ్ళ ఓనర్ ఎవరో వగలాడి వలలో పడి దివాలా తీసి, తన కంపెనీలో పని చేసే వారి కుటుంబాలను రోడ్డుకీడ్చాడు.

"మా ఆఫీసర్ గారి డ్రైవర్ కొడుక్కి ఎంసెట్ లో ఇరవై వేల చిల్లర రాంక్ వస్తే, ఎక్కడా ఫ్రీ సీటు రాలేదు. వాళ్ళ నాన్నకి పైడ్ సీటు కొనే స్థోమతు లేదు. ఆ పిల్లవాడు చేసిన గోలకి తండ్రి స్వచ్ఛంద పదవీ విరమణ చెయ్యాల్సి వచ్చింది. ఎంతో మంచివాడైన ఆ డ్రైవర్ ఇలా ఉద్యోగం వదలడం మా అందరికీ బాధ తెచ్చింది. మా అమ్మాయికి పదిహేను వేల చిల్లర రాంక్ వస్తే తనకి ఇంజనీరింగ్ చదివే త్రాణ లేదని రుజువయ్యిందని, తనను బీకాంలో

చేర్పించమని కోరింది. అదయ్యా మా పిల్ల మంచితనం. అందువల్ల, అందని వాటికి అర్రులు చాచే అబ్బాయి నాకొద్దు. ఉన్నదాంతో సంతృప్తి పడి, రెక్కల కష్టంతో ఇద్దరూ కలిసి, ఆడంబరాలకు పోకుండా తమ కుటుంబాన్ని నడుపుకుంటే చాలు. వయసుతో బాటు వాళ్ళూ వృద్ధిలోకి వస్తే చాలు.

"పెద్ద ఆఫీసరో, అందగాడో అవక్కరలేదు. క్రమశిక్షణాపరుడైతే చాలు", అంటూ ముగించాడు వేంకటేశ్వర్లు.

"అదక్కరలేదు-ఇదక్కరలేదు అంటూ చాలా పెద్ద లిస్టే ఇచ్చారండీ. ఆ ఏడుకొండలవాడి దయుంటే ఆ అబ్బాయి మనకు త్వరలోనే కనబడతాడు," అని బయలుదేరాడు రామశాస్త్రి.

★★★

మూడు నెల్ల తరువాత.....

"అయ్యా, మీ అంచనాలకు మించిన వరుడు దొరికాడండీ! జాతీయ బ్యాంకులో ఆఫీసరు. నోట్ల రద్దు విషయంలో అతని సహోద్యోగులు కక్కుర్తి పడినా ఇతను పడలేదట. అంటే, నిజాయితీపరుడన్న మాట. పెద్ద ఆఫీసరూ, అందగాడూను. ఫోటో చూస్తే మీరే ఒప్పుకుంటారు. అమ్మాయి ఉద్యోగం చేయకపోయినా ఫరవాలేదట. మీరూ మీరూ చూసుకుని, మాటలాడుకుని ఏ విషయం తేల్చుకుంటే బాగుంటుంది", అన్నాడు రామశాస్త్రి దాహం తీర్చుకుంటూ. "అమ్మాయిని వంటింటి కుందేలుని చేస్తాడా ఏమిటి?" అనుమానాస్పదంగా ఫోటో చూస్తూ అడిగాడు వేంకటేశ్వర్లు. "అన్నన్నా, ఎంత మాటండీ! మీరు అమ్మగారి చేత ఉద్యోగం చేయించలేదు; అంత మాత్రాన ఆవిణ్ణి అగౌరవ పరచలేదు కదండీ! అలాగే అనుకోండి!" అని జవాబిచ్చాడు రామశాస్త్రి.

జాతకాలు కుదిరాక మగ పెళ్ళి వారు సుజూకి స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చి పిల్లని చూసుకుని, రెండు రోజుల్లోనే అమ్మాయి నచ్చిందనీ, మాటలకి రమ్మనీ కబురంపారు. వేంకటేశ్వర్లు, భార్యా తీరా అక్కడికి వెళ్ళాక ఆడంబరంగా వివాహం జరిపించాలని పట్టుపట్టారు. రామశాస్త్రి అక్కడ గనక ఉన్నట్లతే వేంకటేశ్వర్లు అతణ్ణి వాళ్ళెదురుగానే నిలదీసి, మగ పెళ్ళివాళ్లకి గుడ్ బై కొట్టి వచ్చేసేవాడు. ఇప్పుడు మధ్యవర్తి లేకపోబట్టి వాళ్ళు తమముందు కొట్టే గొప్పలన్నీ భరించల్సి వచ్చింది ఆ దంపతులకి. "మా అబ్బాయి ఉద్యోగానికీ, అందానికీ, మా కుటుంబపు స్థోమతు బట్టి ఎంతమంది అతని కోసం ఎగబడ్డారో తెలుసా! మా తదనంతరం ఈ భోగాలన్నీ మీ అమ్మాయికే సొంతం!" అని ఏవేవో చెప్పుకు పోతోంది పెళ్ళికొడుకు తల్లి. ముక్తాయింపుగా, "పెళ్ళికి మేమే పాతిక తులాల బంగారం పెడతాం. మీరు ఒక హోండా సిటీ కారు కొనిస్తే సరిపోతుంది", అని ఆవిడ ముగించింది.

"అమ్మా, మా గురించి రామశాస్త్రి గారు చెప్పలేదా?" అని అయిష్టంగా, నీళ్ళు నములుతూ అడిగాడు వేంకటేశ్వర్లు.

"చెప్పారే! మీకు ఇంకా మూడేళ్ళ సర్వీసుందనీ, సొంతింటి మీద అప్పులన్నీ తీరిపోయాయని!"

"క్షమించండి, అయన అసలు విషయం చెప్పకుండా మిమ్మల్ని శ్రమపెట్టాడు. మీకు తూగగలిగిన వాళ్ళం కామండీ!" అన్నాడు వేంకటేశ్వర్లు.

"అదేమిటండీ, మీ ఒక్క అమ్మాయికీ మేమింత చేస్తామంటే పది-పన్నెండు లక్షలకి చూసుకుంటున్నారు!" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అది కాదండీ, మేము కొన్ని ఆదర్శాలని పాటిస్తాము. నిరాడంబరంగా ఉండాలన్నది మా ఉద్దేశ్యం. పెళ్ళి మీద ఇంత డబ్బు ఖర్చు చేసే బదులు ఏ వృద్ధాశ్రమానికో, అనాథ శరణాలయానికో విరాళమివ్వచ్చు; లేదా మన సంతోషాన్ని వాళ్ళతో పంచుకోవచ్చు. ఉన్న కారు సరిపోక పెద్దది కొనాలంటే అబ్బాయి లోను తీసుకుని కొనుక్కోవచ్చు కదండీ!"

"ఓ, ఈ విషయమా! దాని గురించి శాస్త్రి గారు చెప్పారు లెండి! అందరూ ఈ రోజుల్లో రూల్సు మాట్లాడుతూనే వాటిని ఉల్లంఘిస్తారు కదండీ! ఘనంగా పెళ్ళి చెయ్యకపోయినా, ఆడ పెళ్ళి వాళ్ళు ఖరీదైన బహుమతివ్వకపోయినా మా చుట్టాల్లో మాకు నగుబాటు! అందుకనే సూటిగా చెప్పేశాం", అంది పెళ్ళికొడుకు తల్లి.

ఇక చర్చ కొనసాగించి ప్రయోజనం లేదని వేంకటేశ్వర్లు, "మమ్మల్ని ఆలోచించుకోనివ్వండి", అని చెప్పి భార్య మంగతో సహా ఇంటికొచ్చాడు. ఈ విషయం పెళ్ళికూతురు అవనితో చెబితే, ఆమె తన తల్లిదండ్రులనే సమర్థించింది. ఆ సంగతి మగ పెళ్ళివాళ్ళతో చెప్పాలంటే రామశాస్త్రి ఊళ్ళో లేడాయె. ఈ సందిగ్ధంలో వీళ్ళున్నపుడు, పెళ్ళి కొడుకు తండ్రి ఫోన్ చేసి, జాతకాలు కుదరలేదని సారీ చెప్పాడు. పచ్చి అబద్ధం కానీ గొడవ వదిలిపోయిందని సంతోషించిందా కుటుంబం.

★★★

ఊరు నుండి వచ్చిన రామశాస్త్రి విషయం తెలుసుకుని పెళ్ళి వాళ్ళ దాబు గ్రహించనందుకు బాధపడి, కొన్నాళ్ళకి మరో సంబంధం తెచ్చాడు. “ఇదిగో, ఈ ఫోటో చూడండి! ఈ అబ్బాయి పేరు రామగోపాల్. రాముడిలాంటి వాడు. ఇంటరు చదువుతున్నప్పుడు తండ్రి పోతే, అక్కడితో చదువాపేసి, ప్రభుత్వంలో కారుణ్య నియామకం పుణ్యమా అని గుమాస్తాగా చేరి, ఇప్పుడు, ఇరవై ఏడేళ్ళ వయసుకి, ఈ మధ్యనే ఆఫీసరయ్యాడు. ఒక తమ్ముడు, ఒక చెల్లి. ఇద్దరినీ క్రమశిక్షణలో పెట్టి గొప్ప వారిని చేశాడు. చెల్లెలికి పోయినేడు పెళ్ళి చేసి ఈ ఏడు పురిటికి తీసుకొచ్చాడు. తమ్ముడు ప్రాజెక్ట్ నిమిత్తం అమెరికాలో ఉన్నాడు. చెడ్డ అలవాట్లు లేవు. స్త్రీలంటే బలహీనత లేదట. కట్నం కానీ అక్కరలేదు. మరీ పెద్ద అందగాడు కాదు. జాతకాలూ, అవీ చూడమంటారా?” అడిగాడు రామశాస్త్రి.

పెళ్ళి చూపుల్లో రామగోపాల్ ప్రవర్తించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. తన చెల్లీ, బావ గారూ కూడా మగ పెళ్ళి వాళ్ళలా గిరి గీసుకుని భీష్మించుకోకుండా, కలుపుగోలుగా ఉన్నారు. అప్పటికప్పుడే తనకి అమ్మాయి నచ్చిందని, ఆమె అభిప్రాయం కనుక్కొని చెప్పమని వెళ్ళాడు. బాధ్యతాయుతుడుగా కనిపించి, బుద్ధిగా మసలుకున్న అబ్బాయి విషయంలో ఆడ పెళ్ళివాళ్ళకి ఏం అభ్యంతరముంటుంది? వెంటనే ఝామ్మని నిశ్చితార్థం జరిగిపోయి, పెళ్ళికి రోజులు దగ్గర పడసాగాయి.

రోజూ అమ్మాయీ, అబ్బాయీ తెగ మాట్లాడుకునేవారు. పెళ్ళిరోజు కోసం ఎదురు చూస్తూండే వారు. అప్పుడప్పుడు అవని కాబోయే ఆడబడుచు అంజలి తోనూ, కాబోయే అత్తగారితోనూ కూడా సంతోషంగా మాటలాడుతుండేది.

★★★

పెళ్ళికి రెండు రోజులు ముందుగా పెళ్ళివారు తరలి వచ్చారు. రామగోపాల్ తమ్ముడు నందగోపాల్ పెళ్ళి కోసమని సెలవు పెట్టి అమెరికా నుండి వచ్చాడట. పెళ్ళయిన తరువాతి రోజు మధ్యాహ్న భోజనం ఒక వృద్ధాశ్రమంలోనూ, మరుసటి రోజు ఉదయపు ఫలహారం ఒక అనాథ శరణాలయంలోనూ నిర్ధారింపబడ్డాయి.

రాత్రికి పెళ్ళనగా సాయంత్రానికి అవని తనకు ఈ పెళ్ళి వద్దని మొండి పట్టు బట్టింది. వేంకటేశ్వర్లు, మంగ నిర్ఘాంతపోయారు.

ఎవరూ లేకుండా తలుపులు బిడాయించి, ఆ కుటుంబం మంచి చెడ్డలు చర్చించుకున్నారు. “బుద్ధుండే ఈ మాటంటున్నావా?” అన్నాడు వేంకటేశ్వర్లు. “రోజూ ఇష్టంగానే గంటల తరబడి కబుర్లాడుకునే వారు కదే! ఇంతలోనే అతను ఎందుకు నచ్చలేదు?” అని గద్దించింది మంగ. ఎప్పుడూ మితభాషియై తన పని చేసుకునే మంగ ఇలా మాట్లాడడం విని అవని, వేంకటేశ్వర్లు ఆశ్చర్యపోయారు.

“ఇవ్వాళ నన్ను పెళ్ళికూతుర్ని చేసినప్పుడు అంజలి, నందు వచ్చి నాతో కొంత సేపు మాట్లాడారు కదా! ఆ తరువాత బరువైన మనసుతో ఈ నిర్ణయం తీసుకున్నాను”.

“అర్థమయ్యేట్టు చెప్పు తల్లీ! వాళ్ళన్నయ్య సుఖపడకూడదని ఏమైనా కుళ్ళుబోతు పనులు చేశారా ఈ చిన్న పిల్లలు?” అడిగాడు వేంకటేశ్వర్లు.

“అబ్బే, అలాంటిదేమీ లేదు. పెళ్ళికొడుకు క్రమశిక్షణాపరుడైతే చాలుననుకున్నాం మనం. ఇతను క్రమశిక్షణ పేరుతో చెయ్యి చేసుకుంటాడట నాన్నా! తను ఆశించిన విధంగా మార్కులు రాకపోతే చెల్లెలిని, తమ్ముణ్ణి బెల్టుతో కొట్టేవాడట నాన్నా. చెప్పండి, ఎదిగొచ్చిన చెల్లెలిని, తమ్ముణ్ణి కొట్టే అతను రేపు నన్నూ, నా పిల్లల్నీ కొట్టడని ఏమిటి గారంటీ?”

“నువ్వన్నది నిజమే. కానీ, పెళ్ళి మండపంలో ఇలాంటి మాటలు మీ మధ్య ఎలా వచ్చాయే?” అడిగింది మంగ.

“అంజలి నా పూల జడ సరదాగా లాగి, ఏవో సర్దుబాట్లు చేయబోయింది. మీకు తెలుసుగా, ఎవరైనా నా జుట్టుని పట్టుకుంటేనే చిరాకని? అందుకే, మర్యాదగా నన్నడిగి నా జుట్టు పట్టుకోమన్నాను నేను. మాటవరుసకి అప్పుడామె, ‘నన్ను కొట్టేటప్పుడు మా అన్నయ్య అడక్కుండానే నా జడ లాగి బెల్టుతో కొట్టేవాడు’, అంది. నేను షాక్ అయ్యాను. అప్పుడు నందు తన అనుభవాన్ని పంచుకున్నాడు. ‘మీకు కోపం రాలేదా? మీరు బాధ పడలేదా?’ అనడిగితే ఇద్దరూ, ‘అన్నయ్య మా మంచి కోరే కదా అలా చేశాడు?’ అని నన్ను ఎదురు ప్రశ్నించారు. సామదానభేదాలొదిలేసి ఈ దండనేమిటి అనుకున్నాను. నేను మాటలాడినంతలో వీళ్ళు దండనకి అర్హులైనంత మొండి వాళ్ళు కారు. తను అనుకున్న క్రమశిక్షణలో ఏపాటి లోపం ఉన్నా అతను సహించడట. మనం మెచ్చే అబ్బాయి ఒక అంతరించిపోతున్న జీవరాశి అనుకునేదాన్ని. ఇతను తారసపడినప్పుడు ఎంత సంతోషించానో మీకు తెలియనిది కాదు. ఇతన్ని పెళ్ళి చేసుకుని, తరువాత దెబ్బలు తిని, ఓడిపోయిన ఒక భార్యగా మనింటికి రావాలని లేదు. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు అని

నేననుకుంటున్నాను. మీరేమంటారు? నేను కోరిన భర్త దొరక్కపోతే అంతరించిపోయిన జీవరాశిని కోరుకున్న ఒక మూర్ఖురాలిలా మిగిలిపోతాను. అంతేగా! కానీ, క్రమశిక్షణ పేరుతో దండనకు దిగే ఈ 'దండ'నాయకుణ్ణి చేసుకోడానికి మాత్రం నా మనస్సాక్షి ఒప్పుకోవట్లేదు. ఇక జరగాల్సిన విషయం గురంచి ఆలోచించాలి. ఒక చిన్న మనవి– నిజం చెప్పిన పుణ్యానికి పాపం అంజలి, నందూల పేర్లు బయటపెట్టకుండా జాగ్రత్త పడాలి", అంది అవని.

కాస్సేపు నిశ్శబ్దం తరువాత వేంకటేశ్వర్లు తేరుకుని, "నీ నిర్ణయం సబబైనదే. నువ్వు కోరినట్టే అంజలి, నందగోపాల్ పేర్లు బయటికి రావు. కానీ, దాన్ని ఈ సమయంలో చెప్పడం వల్ల వచ్చే చెడ్డ పేరు మాతోనే ఉండనీ. నువ్వు కోరుకునే జీవరాశి ఇంకా జీవించి ఉండాలని, నీకు దొరకాలని ఈ క్షణంలో నీ తండ్రిగా దేవుణ్ణి ప్రార్థిస్తాను", అని మంగతో కలిసి మగపెళ్ళివారి విడిది వైపు వెళ్ళాడు.

# ఒక్కరోజు వసుంధర

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

పుట్టగానే సరిపోదు. బిడ్డ పుట్టుకకు గుర్తింపునిచ్చేది బర్త్ సర్టిఫికెట్.

ఆధునిక యుగంలో బిడ్డ మనుగడకి బర్త్ సర్టిఫికెట్ కావాలి. మనుగడ అంటే బ్రతుకుతెరువే కాదు, ఒకోసారి కేవలం మనుగడకే కూడా!

పుట్టిన ప్రతి మనిషికీ మరణం తప్పదు. దానికి డెత్ సర్టిఫికెట్ అవసరం. ఐతే ఒకోసారి బర్త్ సర్టిఫికెట్‌లోనే జీవన్మరణ సమస్య ఉండొచ్చు. అదెలాగంటే.....

– – – – –

ఖరీదైన కారు ఆ భవనం ముందాగింది. ముందు సీట్లోంచీ తలుపు తెరుచుకుని డ్రైవరు దిగాడు. అతడి దుస్తులు పరిశుభ్రంగా ఉన్నా, కారు హోదాకి కాక, డ్రైవరు హోదాకి తగినట్లు ఉన్నాయి.

డ్రైవర్ వెనక్కి వెళ్లి బ్యాక్‌డోర్ తలుపు తీసి పట్టుకున్నాడు.

కార్లోంచీ దిగాడో శాల్తీ. పేరు రామనాథం.

ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, ఖద్దరు కండువా. ఐనా కూడా ఖరీదైన మనిషిలా ఉన్నాడు.

రామనాథం ముందుకి కదల్లేదు. స్వాగతం పలకడానికి ఇంకా ఎవరూ రారేమని భవనం వైపే చూస్తున్నాడు. ఆ చూపులు భవనంలోకీ చొరబడి అక్కడున్న సుదర్శనం అనే చిరుద్యోగి భుజం తట్టి హెచ్చరించాయి. అతడు వెంటనే పరుగులాంటి నడకతో బయటికొచ్చాడు. ఆయాసపడుతూ ఆయనకి రెండు చేతులూ జోడించి, "చివరి క్షణంలో చేతిమీద టీ ఒలికింది సార్! ఆ చేత్తో తమకెలా దణ్ణం పెడతాను? చెయ్యి కడుక్కొచ్చేసరికి ఇలా ఆలస్యమైంది. తమరికేం ఇబ్బందవలేదుగా?" అన్నాడు.

సంజాయిషీ ఇవ్వడం మర్యాద. సుదర్శనం పాటించిన మర్యాదకి రామనాథం ముఖం కాస్త ప్రసన్నమైంది.

సుదర్శనం ముందుకి దారి తీశాడు. రామనాథం హుందాగా అతణ్ణి అనుసరించాడు. ఆయన డ్రైవరు నెమ్మదిగా బ్యాక్‌డోర్ మూసి కారు పార్కు చేసుకునే ప్రయత్నంలో పడ్డాడు.

రామనాథం భవనంలో కింద అంతస్తులో హాల్లో ప్రవేశించాడు. అక్కడ పని చేసుకుంటున్న ఉద్యోగుల్లో కొందరు చప్పున లేచి నిలబడ్డారు. వాళ్లని చూసి మిగతావాళ్లు లేచారు. రామనాథం ఎవర్నీ పట్టించుకోలేదు. తనకా ప్రాంతం సుపరిచితమే నన్నట్లు నేరుగా అక్కడున్న ప్రత్యేకమైన ఎయిర్ కండిషన్డు గదిలో దూరాడు.

"ఎవరాయన?" అన్నాడు రెణ్ణెళ్ల క్రితమే అక్కడ చేరిన ఓ కొత్త ఉద్యోగి.

"పేరు రామనాథం. చాలా పెద్ద తలకాయ. పల్లెనుంచి ఢిల్లీదాకా ఎంతటి పెద్దలకైనా తలలు మార్చగల అఖండుడు. ఆయనతో పెట్టుకున్నవాళ్లకి తలలుండవు. ఇలా మనసులో అనుకోగానే, అలా పనులైపోతాయ్ ఆయనకి. కానీ ఈరోజు స్వయంగా వచ్చాడు. ఎవరికో మూడింది" అన్నాడు పక్కనున్న ఉద్యోగి. చేరి ఏడాదే ఐనా అక్కడి విషయాలు చాలా తెలుసన్న గర్వం అతడి మాటల్లో తొణికిసలాడింది.

అతణ్ణి కాస్త తగ్గించాలన్నట్లు, "నీకింకో విషయం తెలియదు. మామూలుగా ఐతే ఆ ఎయిర్ కండిషన్డు గది వెయిటింగ్ రూం. కానీ రామనాథానికి మీటింగ్ రూం. ఇప్పుడు చూడు, మన బాసే ఆయన్ని కలవడానికి ఆ రూంకి వెడతాడు" అన్నాడు ఇంకొంచెం పాత ఉద్యోగి.

ఆ మాటలు నిజం చేస్తూ, కొద్ది క్షణాల్లోనే వాళ్ల బాస్ వినయ్ ఆ గదిలోకి వెళ్లాడు.

అప్పటికి రామనాథం సోఫాలో వెనక్కి జారగిలబడ్డాడు. వినయ్ వచ్చేక కూడా ఆయన అదే భంగిమలో ఉన్నాడు. అంతవరకూ ఆయనముందు బాగా వంగి నిలబడ్డ సుదర్శనం, బాస్ రాగానే అదే భంగిమలో బయటకు వెళ్లిపోయాడు. అప్పుడు వినయ్ ఆయన్ను సమీపించి అచ్చం సుదర్శనంలాగే వంగి నిలబడ్డాడు.

రామనాథం ముందు వినయ్ అలా వంగడం రహస్యమేం కాదు. ఐనా అది చిన్న స్టాఫ్ ముందు జరక్కూడదు. అందుకే సుదర్శనం వెళ్లిపోయాడు. ఆ ఏర్పాటు రామనాథానికీ ఇష్టమే.

"బర్త్ సర్టిఫికెట్ రెడీ అయిందా?" అన్నాడాయన.

"ఇంకా లేదండి!" అన్నాడు వికాస్.

రామనాథం కళ్లుఎర్రబడ్డాయి. "ఎందుకని?" అన్నాడు. మాట కూడా ఎర్రగానే ఉంది.

"రికార్డ్సన్నీ ఖచ్చితంగా ఉన్నప్పుడు మార్చడం కష్టమండి. పైగా ఆ సీటుమీద పీఎంఓ నిఘా ఉందండి"

"ఉంటేనేం? చిన్న పని – చిన్న పని చెయ్యలేరా? ఎందుకున్నట్లు మీరంతా?"

వికాస్ గొంతు సవరించుకుని, "ఒరిజినల్ని మార్చడం చిన్న పనేనండి. ఆ మార్పుని వెనక్కి తీసుకోవడం అంత చిన్న పని కాదండి. చాలామందిని ఆకట్టుకోవాలి" అన్నాడు.

"మార్పు జరిగిన రికార్డ్సు మాఫీ చెయ్యలేరా?" అన్నాడు రామనాథం.

"మీకు తెలియందేముంది? ఈ డిపార్టుమెంట్లో నందిని పంది చెయ్యగలం. మళ్లీ పందిని నంది చెయ్యాలంటే అంత సులభం కాదండి"

రామనాథం తల అడ్డంగా ఊపి, "ఒరిజినల్లో తప్పుందనుకుని సవరించమని కోరాం. సవరించారు. ఇప్పుడేమో ఒరిజినలే కరెక్టని తెలిసింది. కరెక్టు మనుషులం, కరెక్టుగా ఉండాలనుకోవడం తప్పు కాదుగా! అందుకే ఒరిజినల్ని రిస్టోర్ చెయ్యమంటున్నాం. ఐనా సైన్సు బోల్డు దెవలప్పయింది. ఒరిజినలే కరెక్టనడానికి, మెడికల్ టెస్టులు కూడా ఉన్నాయి. ఏమిటి కష్టం?" అన్నాడు.

"కష్టమంతా పీఎంవో నిఘా వల్లనండి" అన్నాడు వికాస్.

"ఈ దేశంలో చట్టం దారి చట్టానిదే. మన దారి మనదే. నిఘా దారి నిఘాదే. ఎటొచ్చీ విషయం నాదాకా రాకూడదు. అవసరమైతే డబ్బుతో గోడ కట్టు" అన్నాడు రామనాథం తేలికగా.

"గోడ కట్టడం కష్టం కాదండి. వాటికి చెవులు మొలవకుండా ఆపడమేనండి చిక్కు!" అన్నాడు వికాస్.

"స్వయంగా ఇక్కడికొచ్చాను. ఆ విషయం తెలియాల్సినవాళ్లకి తెలిస్తే, మొలవాల్సిన చెవుల మాటటుంచు. ఇప్పటికే మొలిచున్న చెవులు కూడా గల్లంతైపోతాయ్. ఇక మాటలొద్దు. ఈరోజుకి సరిగ్గా వారం తర్వాత మళ్లీ ఇక్కడికొస్తాను. బర్త్ సర్టిఫికెట్ నా చేతికందాలి" అని లేచాడు రామనాథం.

ఆయన మొహంలో గాంభీర్యముంది. అది మేకపోతు దనుకుందుకు లేదు.

“నా ప్రయత్నం నేను చేస్తానండి. ఆపైన మీ దయ, నా ప్రాప్తం” అన్నాడు వికాస్.

రామనాథం దయకీ, వికాస్ ప్రాప్తానికీ ఉన్న అవినాభావసంబంధం ఆ ఇద్దరికీ తెలుసు.

2

ఏడాది వయసు బాబు. తెల్లగా బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. దయపర్ మినహా ఏ ఆచ్ఛాదనా లేదు. రెండు తప్పటడుగులు ముందుకేసి ఆగి వెనక్కి తిరిగాడు. సోఫాలో కూర్చుని తనని ముచ్చటగా చూస్తున్న పల్లవి కనిపించింది.

వెంటనే వాడి ముఖంలో చిరునవ్వు. అందులో కొంచెం చిలిపితనం. కొంచెం ఆశ. కలిపి చిన్నికృష్ణుడి దైవత్వం. అలాంటి నవ్వు వాడి వయసుకే సాధ్యం, అదీ తల్లిని చూసినప్పుడే.

పల్లవికి అర్థమైంది. తనిప్పుడు వాణ్ణి పట్టుకోవడానికి లేవాలి. వాడు పారిపోతాడు. తను పట్టుకోలేకపోతే పట్టరాని సంతోషంతో కిలకిలమంటాడు. ఏ మధురగాయనికీ అందని స్వరంలో పలికే హాసరాగమది.

పల్లవి లేచి నిలబడింది. బాబు గొంతులోంచీ కేరింత – పాంచజన్యాన్ని పూరించినట్లు. వాడి తప్పటడుగుల్లో వేగం – ఉసైన్ బోల్ట్ ప్రేరణతో.

పల్లవి కదిలింది, “ఒరేయ్, ఆగరా” అంటూ. వాడు ఆగలేదు. ఒలింపిక్ మెడల్ కోసం పరుగెడుతున్నాడు.

పల్లవి నటిస్తోంది. ముందే నిర్ణయించిన ప్రకారం, ఆమె వేగం వాడి వేగాన్ని మించలేకపోతోంది.

బాబు ఆగి వెనక్కి తిరిగి తల్లి అసహాయతని చూసి ఆనందంగా నవ్వాడు. ఆమె అడుగు ముందుకెయ్యగానే మళ్లీ వెనక్కి తిరిగి హడావుడిగా పరుగెత్తబోయి కింద పడ్డాడు.

పల్లవిలో కంగారు – వాడి ముఖం పచ్చడైపోతుందని. కానీ వాడి తప్పటడుగుల అనుభవం తక్కువదేం కాదు. చేతులతో కాసుకుని నేలకి ఆని, నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. తల్లి వచ్చేస్తోందని కంగారుగా వెనక్కి చూసి, ఆమె ఆగిందని గ్రహించడంతో, వాడి ముఖంలో గర్వం. పడిపోయినా నాకు నేనుగా లేవగలననీ, పడి లేచినా కూడా నన్నందుకోవడం నీవల్లకాదులే అనీ ఆ గర్వం!

మళ్లీ పరుగు మొదలు. ముందు వాడు, వెనుక ఆమె. ఇద్దరూ హాలంతా పరుగులు. అడుగుల చప్పుడు లయగా, బాబు నవ్వులే స్వరంగా, కొనసాగుతోంది సంగీత కచేరీ మధురంగా.

ఒకసారి పడ్డాడుగా, ఈసారి జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు బాబు. మధ్యమధ్య వెనక్కి తిరిగి, తల్లి వెనుకబడి ఉండడం చూసి మురిసిపోతున్నాడు.

అలా ఎంతసేపు – ఐదు నిముషాలు! అంతే, బాబు అలసిపోయాడు. వాడి తప్పటడుగుల వేగం తగ్గింది. ఉన్నట్లుండి ఆగి వెనక్కి తిరిగాడు. పల్లవి నవ్వుతూ వాణ్ణి సమీపించి రెండు చేతులూ ముందుకు చాచింది.

అప్పుడు బాబుకి పోటీ గుర్తు లేదు. గెలుపోటములు తెలియవు. అమ్మ వెచ్చని కౌగిలిలోనే వాడికి హాయి. అమ్మ పిలుపులోని సమ్మోహనశక్తికి లొంగిపోవడమే వాడికి గెలుపు. పరుగున వచ్చాడు.

అమ్మను చేరుకునేటప్పుడు వాడికి జాగ్రత్త తీసుకోవాలని గుర్తుండదు. దాంతో బొక్కబోర్లాపడబోయాడు. కానీ పల్లవి మెరుపు వేగంతో వాడిని చేరుకుని పడిపోకుండా ఆపింది. రెండు రెక్కలూ దొరకపుచ్చుకుని పైకెత్తి వాణ్ణి బలంగా హృదయానికి హత్తుకుంది. వాడు కూడా తల్లిని కరిచిపెట్టుకు పోయాడు....

– – – – –

విడియో ఆఫ్ చేసి కళ్లు తుడుచుకుంది పల్లవి.

ఆమెకింకా బాబుని హత్తుకున్నట్లే ఉంది. పసిబిడ్డని సాకడంలో ఎంత ఆనందం?

ఇంటర్ ప్యాసవగానే తనకి పెళ్లి కుదిరితే, క్లోజ్ ఫ్రెండ్ వనజ తిట్టింది – “లైఫ్ ఎంజాయ్ చెయ్యకుండా ఇప్పట్నించీ పెళ్లేమిటే! ఇంకా చదివి, మన కాళ్లమీద మనం నిలబడి, ఒకటి రెండేళ్లు సరదాలన్నీ తీర్చుకున్నాక, తప్పదంటే అప్పుడాలోచించాలి పెళ్లి గురించి” అని.

ఆ మాట తల్లి జయలక్ష్మి కి చెబితే, "నీ ఫ్రెండ్ కూడా పెళ్లి వాయిదా వెయ్యమంది కానీ, వద్దనలేదు. ఏ మనిషికైనా పెళ్లి, పిల్లలే జీవితంలో గొప్ప ఎంజాయ్‌మెంట్! అందుకిదే సరైన వయసు. ఈ వయసు దాటితే – పెళ్లి, పిల్లలు బరువైన బాధ్యతల్లా తోచి జీవితం నిస్సారమౌతుంది. అప్పట్లో నన్ను నిరసించినవాళ్లు తర్వాత నా దగ్గర ఒప్పుకున్న నిజమిది. ఆపైన ఇప్పుడు నీకొచ్చిన సంబంధం, నీ అదృష్టం. కాలదన్నుకుంటే, మళ్లీ ఇలాంటిది దొరకదు. ఐతే – ఫ్రెండ్ చెప్పిందనో, అమ్మ చెప్పిందనో కాదు. నీ జీవితం నీ ఇష్టం. పెళ్లి విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా, నీకు నా సపోర్టుంటుంది. సరా?" అని తనదైన పద్ధతిలో హామీ ఇచ్చిందామె.

పల్లవి క్లాసులో టాపర్. ఇంకా చదవాలని లేకపోలేదు. కానీ తల్లి మాటలు వినగానే వికాస్ స్ఫురణకొచ్చి మనసు పెళ్లివైపు లాగింది.

వికాస్ వాళ్లకి దూరపు బంధువు. పల్లవికంటే ఐదేళ్లు పెద్ద. చిన్నప్పట్నించీ కొంచెం పరిచయముంది. వాళ్లకి ఆస్తిపాస్తులున్నాయి. ఇంజనీరింగు పూర్తవగానే అతడికి మంచి ఉద్యోగమొచ్చింది. తనకంటే కాస్త చిన్నపిల్లని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. తన భార్య గృహిణిగానే ఉండాలని అతడి ఆశ.

పెళ్లికిముందు ఇద్దరూ ఓసారి కలుసుకుని మాట్లాడుకున్నారు.

"నేను భార్యని ప్రేమిస్తాను. గృహిణిని గౌరవిస్తాను. నా అభిప్రాయంలో భార్య, గృహిణి ఒకటి కాదు. భార్యంటే నాలో సగం. గృహిణి అంటే మనింటి బాధ్యత. చదువులరాణివైన నువ్వు గృహిణి బాధ్యత తీసుకుంటే, నీ నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత నాది. ప్రతి నెలా నీకు నా శక్తిమేరకి కొంత డబ్బిస్తాను. ఆ డబ్బుపై సర్వాధికారాలూ కేవలం నీవి. నా ఆదాయంలో మిగతాదంతా మనది. దానిపై సర్వాధికారాలూ మనిద్దరివీ. ఏ ఖర్చుకైనా ఇద్దరికీ వీటో చేసే అధికారముంటుంది. అదీ ఆదర్శ దాంపత్యం" అని చెప్పాడు వికాస్ ఆమెకి.

ఒకసారి పెళ్లయ్యేక నువ్వూ, నేనూ అనే తేడా ఉండదని పల్లవి మనసులో అనుకుంది కానీ పైకి అనలేదు. వికాస్ సంస్కారం నచ్చి – అతడికిష్టమైనట్లు మసలాలనుకుంది. ఐనా అడగనూ అడిగింది – తను శాశ్వతంగా గృహిణిగా స్థిరపడిపోవాల్సిందేనా అని.

"కొన్నాళ్లు గృహిణిగా ఉండి చూడు. ఆ జీవితం నీకు నచ్చకపోతే, నీ ఇష్టప్రకారం చదవొచ్చు. ఉద్యోగమూ చెయ్యొచ్చు. అందుకు నా పూర్తి సహకారం ఉంటుంది" అన్నాడు వికాస్. అది నమ్మదగ్గ హామీలా ఉంది.

పెళ్లిలో కట్నాలు, లాంఛనాలు లేవు. ఇరుపక్షాలూ ఖర్చుల్ని లెక్కవేసి సమంగా పంచుకున్నారు.

పల్లవి పద్దెనిమిదేళ్లకి వికాస్ భార్య అయింది. ఇరవైఏళ్లకి బాబుకి తల్లి అయింది.

రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. వేరే కెరియర్ గురించి ఆలోచించాల్సిన అగత్యం ఆమెకి రాలేదు. తగిన గౌరవం లభించే హోదా దొరికితే, దాన్నుంచి బయటపడాలని ఎవరూ అనుకోరు.

వికాస్ కూడా కెరియర్లో చకచకా ఎదుగుతున్నాడు. గృహిణిని గౌరవించే మగవాడి ఎదుగుదలకి ఢోకా ఉండదు మరి. ఐనా బాబుకి రెండేళ్లు నిండేక అడిగాడు వికాస్ పల్లవిని – కాలేజిలో చేరతావా అని.

కాలేజి అంటే – రోజూ ఎన్నో గంటలు బాబుని వదిలుండాలి. ఆ ఆలోచనే దుర్భరం ఆమెకి!

అలాగని ఆమె ఇంట్లో ఊరికే కూర్చోలేదు. రెండేళ్లలోనూ కొన్ని కంప్యూటర్ కోర్సులు చేసింది. ఇంట్లోంచే చిన్న ఆన్‌లైన్ ఉద్యోగమొకటి చేస్తోంది. వాళ్లు కొన్ని సర్క్యులర్లు పంపుతారు. ఇంగ్లీషువి తెలుగులోకీ, తెలుగువి ఇంగ్లీషులోకీ తర్జుమా చేసి పంపాలి. అది చేస్తూనే మధ్యమధ్య బాబు విడియోలు చూస్తుంటుందామె. అవి చూసినప్పుడల్లా ఆమెలో ఏవో మధురానుభూతులు. కానీ ఒకోసారి వేరే ఆలోచనలొస్తాయి.

కానీ ఇప్పుడు విడియో చూసిన కారణం వేరు.

ఇంటర్‌తో చదువాపి వికాస్‌ని పెళ్లి చేసుకుని ఓ బాబుకి తల్లిగా సంతృప్తికరమైన జీవితం గడుపుతోంది తను. బాబు తర్వాత పాప. మళ్లీ పాపతోనూ ఇవే అనుభూతులు. ఆ తర్వాత....

పిల్లలు పెద్దవాళ్లయి క్రమంగా తనకి దూరమౌతారు. వికాస్‌కి తన ఉద్యోగమే ఓ వ్యాపకం. మరి తనేం చెయ్యాలి? అప్పుడు కొత్తగా కెరియర్ ఆరంభించగలదా?

తన క్లాస్‌మేట్సు చాలామంది ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కెరియర్ గురించే ఆలోచిస్తున్నారు.

తప్పు చేశానా అనిపిస్తుంది. ఆ వెంటనే, 'అందమైన జీవితమంటే, ఆదాయం తెచ్చిపెట్టే కెరియర్ మాత్రమే కాదు. ఇరవైఏళ్ల లేత యౌవనంలో – భర్తతో అర్ధాంగిత్వం, బాబుతో మాతృత్వం ఓ అపూర్వం. ఆడపిల్లకి ఇదీ ఓ గొప్ప కెరియర్. ఈ మధురానుభూతుల పరిమళాన్ని ఆస్వాదించడానికి ముగ్ధత్వం అవసరం. అది ముప్పైఏళ్ల వయసులో దొరకదు' అన్న తల్లి మాటలు గుర్తుకొస్తాయి.

కానీ ఈ ముగ్ధత్వం ఎవరికోసం అని ఆలోచిస్తే – తన ఇంటి పేరు భర్తది. తన బాబు ఇంటిపేరు భర్తది. తను పెళ్లి చేసుకున్నది భర్త వంశాభివృద్ధికోసం. మరి తన ఉనికికి గుర్తింపు ఏదీ?

ఇలా ఆలోచించినప్పుడు ఆమెకి మళ్లీ తల్లి గుర్తుకొస్తుంది.

జయలక్ష్మి టెన్తులో టాపర్. సైన్సు, మాథ్స్ ఆమెకి ఇష్టమైన సబ్జక్టు. కానీ తలిదండ్రులు ఇంటరవగానే పెళ్లి చేసేశారు. ఆమెకింకా చదవాలనుంది. ఆమె ఉత్సాహం చూసి శ్రీరాం సరేనంటే, ప్రయివేటుగా ఎమ్మే దాకా చదివింది. తర్వాత బియ్యీడీ కూడా చేసింది. పిల్లలు కాస్త పెద్దవాళ్లయ్యేక కొన్నాళ్లు టీచరుద్యోగం చేసింది. ఇంటి బాధ్యతలతో పొసగక, ఆ ఉద్యోగం మానేసి పూర్తిగా ఇంటికే అంకితమైపోయింది.

శ్రీరాం జయలక్ష్మి కి అంతగా విలువివ్వడనిపించేది పిల్లలకి. సంపాదిస్తున్నానన్న అహం అప్పుడప్పుడు స్ఫురించేది. జయలక్ష్మి పట్టించుకునేది కాదు. ఒకసారి పల్లవే ఆమెని ఆ విషయమై నిలదీసింది.

"దాంపత్యమంటే రెండు వ్యక్తిత్వాల ఏకత్వం అంటారు. అది మా విషయంలో పూర్తిగా నిజం. ఆయన నన్నేమన్నా నాకది అహంలా అనిపించదు. ఆ క్షణంలో ఆయన మానసిక స్థితి తెలుసుకుందుకు పనికొస్తుంది. ఎవరు ఎవర్ని నిందించినా అది ఇద్దరికీ వర్తిస్తుందనే తప్ప, ఒకరికి చిన్నతనమని మాకనిపించదు. అందుకే మామధ్య ఏ పొరపొచ్చాలూ లేవు" అని తేలిగ్గా తీసిపారేసిందామె.

భర్త, పిల్లలు – ఇదేనా తన జీవితం అన్న ఆలోచన వచ్చినప్పుడు కలిగిన నిస్పృహని ఒకసారి ఫోన్లో తల్లితో పంచుకుందామె. అప్పుడు జయలక్ష్మి నవ్వేసి, 'కారే రాజులు? రాజ్యముల్ కలుగవే? గర్వోన్నతిన్ బొందరే? వారేరీ? సిరి మూట కట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనం గలదే? శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై ఈరే కోర్కెలు? వారలన్ మరచిరే ఇక్కాలమున్' అంటూ భాగవతంలోని పద్యం ఒకటి వినిపించింది. తర్వాత, "ఎవరు తమ ఉనికిని త్యాగం చేస్తున్నామనుకుంటున్నారో, వారే శిబి ప్రముఖులు! మనింట్లో పేరు నాన్నదని నువ్వనుకుంటున్నావు. పిల్లల హృదయాల్లో నా స్థానమెప్పుడూ పదిలమేనని నేననుకుంటాను" అందామె.

నిజానికి పల్లవికీ అసంతృప్తి లేదు. మెజారిటీకి భిన్నంగా ఉన్నప్పుడు, మోరల్ సపోర్టు కోసం తల్లికి ఫోన్ చేసింది. అది లభించగానే, "వికాస్ నా ప్రాణం. బాబు నాకు ప్రాణాతిప్రాణం" అనుకుందామె.

"ఉంటానే మరి లవ్‌లీ" అని ఫోన్ పెట్టేసింది జయలక్ష్మి .

ఉలిక్కిపడింది పల్లవి. 'లవ్‌లీ" – అన్న ఆ పదమే ఈ రోజు ఆమె బాబు విడియో చూడ్డానికి కారణం. చూస్తున్నప్పుడు కళ్లలో నీళ్లు తిరగడానికీ కారణం.

లవ్‌లీ జయలక్ష్మి ఆమెకి పెట్టుకున్న ముద్దుపేరు. మిగతావాళ్లంతా పల్లూ అంటే, తల్లిమాత్రం లవ్‌లీ అంటుంది. ఆమె నోట ఆ పిలుపు కలిగించే మధురానుభూతి అనుభవైకవేద్యం. అది పలచనైపోకూడదనే, భర్తకి కూడా తనని లవ్‌లీ అనే అవకాశమివ్వలేదు పల్లవి.

గంట క్రితం పల్లవికి ఓ ఫోనొచ్చింది. చేసింది సుధీర్. అతడామెని, 'హలో' అనలేదు. 'లవ్‌లీ' అన్నాడు.

అతడలాగనడం మొదటిసారి కాదు. ఆ పిలుపుకి ఆమెలో కలిగిన కలవరం వళ్లంతా వణుకు పుట్టించింది.

ఆమె బాబు విడియో చూడ్డానికి కూడా, ఆ ఫోన్‌కాలే కారణం!

– – – – –

పల్లవి టెన్తుకొచ్చినప్పుడు సుధీర్ అదే స్కూల్లో ఆరులో చేరాడు. ఒకరోజు సుధీర్ తల్లి గౌరి జయలక్ష్మి కి ఫోన్ చేసి, తన్నుతాను పరిచయం చేసుకుని, "మా సుధీర్ లెక్కల్లో వీక్. మీ అమ్మాయి హెల్ప్ కావాలంటున్నాడు. డ్రైవర్నిచ్చి కార్లో పంపిస్తాను. ఓ గంటలో డౌట్సు తీర్చుకుని వెళ్లిపోతాడు. ఈలోగా కావాలంటే మీరు కారు కూడా ఉపయోగించుకోవచ్చు" అంది.

గౌరి గొప్పింటిది. స్నేహపూర్వకంగా మాట్లాడింది. హెల్పు కావాల్సింది ఆరో తరగతి కుర్రాడికి. జయలక్ష్మి కి కాదనడానికి కారణం కనబడలేదు. సుధీర్‌కి పల్లవి దగ్గర స్టడీస్ మొదలయ్యాయి.

నాలుగు రోజులు గడిచేసరికి పల్లవికి అర్థమైపోయింది – సుధీర్ చాలా తెలివైనవాడని. “నీకు నా హెల్ప్ అవసరం లేదు” అని చెప్పిందామె మెచ్చుకోలుగా.

“ఆ విషయం నాకూ తెలుసు లవ్‌లీ” అన్నాడు సుధీర్ వెంటనే.

పల్లవి ఉలిక్కిపడి, నీకా పేరెలా తెలుసని అడిగితే, “నువ్వు నాకు ముద్దొస్తావు. నీ ముద్దు పేరు తెలియకుండా ఉంటుందా?” అన్నాడు.

పల్లవి తెల్లబోయింది. ఐనా అతడి వయసుని దృష్టిలో ఉంచుకుని, “తప్పు. ఇలా మాట్లాడొచ్చా?” అంది.

సుధీర్ వెంటనే, “ఐలవ్‌యూ లవ్‌లీ. నిన్ను చూస్తే ఇలాగే మాట్లాడాలనిపిస్తుంది” అన్నాడు.

పల్లవి ఇంకా అతణ్ణి సీరియస్‌గా తీసుకోలేదు, “ప్రేమించాలంటే నీ వయసువాళ్లని చూసుకో. నేను నీకంటే నాలుగేళ్లు పెద్దదాన్ని!” అంది నవ్వుతూ.

“నీకు తెలీదా? తెండూల్కర్ భార్య అంజలి కూడా తనకంటే నాలుగేళ్లు పెద్ద” అన్నాడు సుధీర్ వెంటనే.

మాటలు దూరం వెడుతున్నాయని అర్థమైంది పల్లవికి. ఐనా సౌమ్యంగా, “పెద్దయ్యేక నీకంటే పెద్దమ్మాయిని పెళ్లి చేసుకోవచ్చులే. ప్రస్తుతానికి బుద్ధిగా చదువుకో” అంది.

“నేను పెద్దయ్యేసరికి నీకు పెళ్లైపోతుంది. నేను తట్టుకోలేను. నువ్వు నా ప్రాణం” అన్నాడు సుధీర్.

“అలాగని ఇప్పుడెలా పెళ్లి చేసుకుంటావ్, చట్ట ప్రకారం నేరం” అంది పల్లవి ఆరిందాలా.

“అందుకో ఉపాయముంది. ఇప్పుడు నాతో కమిటైపో. ఒక్కసారి కమిటైపోతే, మంచింటి ఆడపిల్ల మరో పెళ్లి జోలికి వెళ్లదుటగా” అన్నాడు సుధీర్.

బదులుగా పల్లవి అతణ్ణి సాచి లెంపకాయ కొట్టింది.

“నన్ను కొడతావా, ఫలితం అనుభవిస్తావ్. నేను నిన్ను వదలను” అని సినిమా హీరోల్లా చూపుడువేలితో హెచ్చరిస్తూ వెళ్లిపోయాడు సుధీర్.

పల్లవి ఊరుకోలేదు. జరిగింది తల్లికి చెప్పింది. ఆమె సుధీర్ తల్లికి ఫోన్లో జరిగింది చెప్పి, “స్కూల్లో ఫిర్యాదు చేయాల్సిన అవసరం రానివ్వకండి” అంది. తర్వాతేమయిందో, సుధీర్ స్కూలు మారాడు.

ఆతర్వాత ఇన్నేళ్లకి ఈ రోజు ఫోనొచ్చేదాకా, సుధీర్ విషయమే మర్చిపోయిందామె.

సుధీర్ ఫోన్లో సూటిగానే చెప్పాడు. అతడికి పల్లవి కావాలి. వారం రోజులు టైమిచ్చాడు. తనకి తానుగా లొంగిపోతే, గుట్టుగా ఉంటుంది. లేదూ, ఆమె కొడుకుని కిడ్నాప్ చేసి, ఆమెని రేప్ చెయ్యడానికి ఆయుధంగా వాడుకుంటానని బెదిరించాడు.

“నీ గురించి వెంటనే పోలీస్ కంప్లయింటిస్తాను” అంది పల్లవి వెంటనే.

“బీహార్లో రాకీ, ఆదిత్యని ఏంచేశాడో తెలుసుగా! నాదీ అదే లెవెలు. నా వెనకాల డబ్బుంది, పవరుంది. బుద్ధిగా నేను చెప్పినట్లు వింటే, సరే! లేకపోతే నీ బ్రతుకే బజారు పాలౌతుంది. నన్నెవరూ ఏంచెయ్యలేరు”

ఏ గుర్తింపూ లేని గృహిణి జీవితంపై మోజుతో, చదువూ కెరియర్ల భవిష్యత్తుని త్యాగం చేసిన సామాన్య మహిళ పల్లవి. ఆమె భవిష్యత్తుపై పంజా విసురుతున్నాడు సుధీర్. భయపడిపోయిన పల్లవి డైవర్షన్‌కి బాబు విడియో చూస్తే, వాడి భవిష్యత్తు స్ఫురించి కంట్లో నీరు, వంట్లో వణుకు పుట్టింది.

---

ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, ఖద్దరు కండువా. రామనాథం బయల్దేరుతుంటే, “రెండ్రోజుల్నించి బయటికెళ్ల నివ్వకుండా గదిలో పెట్టి ఉంచారు సుధీర్ని. కన్నబిడ్డన్న జాలి కూడా లేదా మీకు?” అంది గౌరి.

ఆయన ఆగి, “వాడిమీద జాలే కాదు, ప్రేమా ఉంది కాబట్టే – అలా చేశాను. పల్లవి విషయంలో ఒక్క రోజు కూడా ఆగనంటే ఏంచేసేది? అనుకున్నట్లు బర్త్ సర్టిఫికెట్ వస్తే సరేసరి, లేకుంటే – వాణ్ణి కొన్నాళ్లు ఫారిన్ పంపేస్తాను!” అన్నాడు.

“అప్పుడేమో, మీ పెదనాన్నగారు మేజర్లయిన మనవళ్లకందరికీ తలో రెండు కోట్లూ ఇస్తానన్నాడని, కక్కుర్తిపడి మన సుధీర్ బర్త్ సర్టిఫికెట్ మార్పించి, వయసు ఏడాది పెంచి మేజర్ని చేశారు. తల్లి పుట్టిల్లు మేనమామ కెరుకే కదా, ఆయన మనవాడికి పైసా ఇవ్వలేదు. ఇప్పుడేమో బర్త్ సర్టిఫికెట్ మళ్లీ యథాప్రకారం మార్పిస్తున్నారు. దీనివల్లమాత్రం వాడికి ప్రయోజనముంటుందని నమ్మకమేమిటి?” విసుక్కుంది గౌరి.

రామనాథం ఏదో అనబోగా జేబులో మొబైల్ మ్రోగింది. తీసి అవతలి మనిషి చెప్పింది విని, “పది లక్షలు కాదు, ఇరవై ఇస్తాను. కానీ సర్టిఫికెట్ ఇంకో గంటలో రావాలి. రేపటిదాకా తెలీదంటే, నాకిక దాంతో పని లేదు. ఒక్క పైసా కూడా ఇవ్వను, తెలిసిందా?” అన్నాడు చిరాగ్గా.

“ఏంటీ, ఒరిజినల్ సర్టిఫికెట్ రిస్టోర్ ఔతుందిటా?” అంది గౌరి కుతూహలంగా.

రామనాథం మొబైల్ కట్ చేసి, “ఔతుందని గ్యారంటీ ఇవ్వలేదు. ఏ విషయం రేపు తెలుస్తుందిట. సర్టిఫికెట్ రిస్టోరైతే రేపటితో మనవాడికి పద్దెనిమిది నిండుతాయి. అంటే మనవాడికిక ఈవేళ ఒక్కరోజే టైముంది. అసలే మీడియా స్టింగులు పట్టుకు తిరుగుతున్న రోజులివి. సర్టిఫికేట్ రిస్టోరైతే, మనవాడు దొరికిపోయినా, జువెనైల్‌గా చిన్న శిక్షతో బయటపడొచ్చు. ఆ విషయం అర్థం చేసుకోకుండా, ఒక్క రోజుకి తేడా ఏమిటంటాడు ఫోన్లో వాడు” అని విసుక్కున్నాడు.

అచ్చోసిన ఆంబోతులు విచ్చలవిడిగా తిరుగుతున్న దేశంలో –

నేరాల్ని బర్త్ సర్టిఫికెట్లతో ముడిపెట్టిన చట్టంతో –

ఒక్క రోజు కొందరి జీవితాన్నే మార్చేస్తుందని ఆయనకే కాదు, పల్లవికీ తెలుసు!

## ఇంగ్లీష్ టీచర్

డా.పేరం ఇందిరాదేవి

సుజన ఆరోగ్యం బాగా పాడయ్యింది. ఏమీ మాట్లాడదు. మాట్లాడుతూ మాట్లాడుతూ మౌనంగా అయిపోతుంది. యాభై లోకి రాగానే కోర్టు లో తన క్లర్క్ వుద్యోగానికి వాలంటరీ రాజీనామా ఇచ్చేసింది.

నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చేప్పటికి నవ్వుతూ కాఫీ అందించేది, అక్కడి కెళదాం ,ఇక్కడికెళదాం అని ప్రణాళికలు పెట్టేది, నాకు పని వత్తిడి ఉంటే తన స్నేహితులతో వెళ్లిపోయేది , షాపింగ్ లని ,కిట్టీ పార్టీలని , స్నేహితుల పిల్లల పెళ్లిళ్లకు చక్కగా అలంకరించుకుని వెళ్ళేది.

మా సంతానం అజయ్, అనిమ బాగా చదువుకున్నారు, అనిమ తానే మంచి వరుడ్ని ఎన్నుకుంది, పెళ్లి చేశాం, భర్తతో అమెరికా వెళ్ళిపోయింది, అజయ్ కూడా అమెరికాలోనే ఎమ్మెస్ చేశాడు , తర్వాత ఎంబీఏ చేసి వుద్యోగం చేస్తున్నాడు. మొన్నటి వరకు ఏమీ ఆదుర్దా పడే విషయాలు ఉండేవి కావు. కానీ సుజన కొద్ది రోజులుగా ప్రతి చిన్న విషయానికి కోపం, విసుగు చూపడం, ఏడవటం ఇలా తన నైజం కానివి చేస్తోంది. ఎవరినీ కలవడానికి ఇష్టపడడం లేదు, ఎవరైనా వచ్చినా మొక్కుబడిగా పలకరించడం, టీవీ కూడా పెట్టుకోకుండా గదిలోనే ఎప్పుడూ పడుకోవడం, కారణం అడిగితే తలనొప్పి అనడం, డాక్టర్ దగ్గరకు వెళదామంటే తర్వాత వెళదాం అని చెప్పేసి తప్పించుకోవడం, గట్టిగా నిలదీస్తే ఏడవటం. నాకేమీ అర్థం కావడం లేదు మోనోపాజ్ సమస్య అని డాక్టర్లు అన్నా , ఆమె ఎక్కువ దిగులు పడుతున్నది అజయ్, అనిమల గురించి అని నాకు తెలుసు. వాళ్ళను అమెరికా పంపడానికి సుజన వ్యతిరేకించలేదు. వెళ్ళాక కూడా రెండేళ్లు వాళ్ళు దూరంగా వున్నారని అని బాధపడేది కూడా కాదు. స్కైప్ లో మాట్లాడుతుండేది కాబట్టి దాదాపుగా వాళ్ళని రోజూ చూసేది, వాళ్ళు వంట చేయడం కొత్త కార్లు కొనడం, పార్టీలకు వెళ్లడం స్నేహితులతో గడపడం అన్నీ స్కైప్ లో వాళ్ళు చూపడం అవన్నీ నాకు చెప్పడం, అలా కాలం బాగానే గడిచింది. రాను రాను లాప్టాప్ లో స్కైప్ సంభాషణలు తగ్గిపోయాయి, స్మార్ట్ ఫోన్లో వీడియో కాల్స్ కొద్దికాలం

నడిచాయి. ఆఫీసుకు వెళ్తూ డ్రైవింగ్ చేస్తూ కొన్ని రోజులు మాట్లాడే వాళ్ళు. నెమ్మదిగా వారంలో ఒక్క రోజు ఏదో సమయంలో పలకరింపులు జరిగేవి. అనిమ అప్పుడప్పుడైనా మాట్లాడేది కానీ అజయ్ అసలు దొరికే వాడు కాదు. వాట్స్ ప్ లో కాల్ చేయమని మెసేజ్ పెట్టినా కాల్ చేయలేదని ఎప్పుడూ నాకు పిర్యాదు చేసేది, అజయ్ దొరికినప్పుడు వాడితో కన్నవారితో మాట్లాడే తీరిక లేదా అని పోట్లాడేది. వాళ్ళ ఉజ్వల భవిష్యత్ కోసం మేము చేసిన త్యాగాలు ఏకరువు పెట్టేది. కన్నవాళ్లకు అది బాధ్యత కదా అని వాదన్నాడని "వాడికి తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేదా వాడిలా మాట్లాడతేమిటండీ మీరు వాళ్ళనేమీ అనరా?" అని నాతో పోట్లాడేది.

ఇది ఇలా జరుగు తుండగానే అనిమ తన భర్త నుండి విడిపోయింది, ఇద్దరి మధ్య ఎందుకు గొడవలొచ్చాయో కూడా అనిమ తల్లితో చెప్పలేదు. కూతురు చేసిన పని అసలు నచ్చలేదు. సుజనకు అల్లుడు చాలా మంచివాడని ఇదే అతనితో చిన్నవాటికి గొడవ పడి ఉంటుందని మందలించమని నన్ను పోరుతుంటే, కూతురును అడిగాను. తన వ్యక్తిగత విషయాల్లో కల్పించుకోవడానికి మాకు హక్కు లేదని అనిమ అనడం నాకు బాధ అనిపించినా, సుజనకు అది అవమానంగా, అసహజమైన పరిణామంగా అనిపించి తీవ్ర మైన నొప్పిని కలిగించింది. ఆ వార్త ఎలాగో మా బంధువులకు కూడా తెలిసి పోయింది, తన పెంపకంలో లోపమేముందో అని ఆత్మ పరిశీలన చేసుకోవడం లోనే సుజన తీవ్ర ఘర్షణకు గురయ్యింది. అనిమతో మాట్లాడినప్పుడంతా సుజన కాపురం చక్కదిద్దుకోమని చెప్పడంతో అనిమ కూడా సుజనతో మాట్లాడ్డం తగ్గించింది. పిల్లలిద్దరి ప్రవర్తన గురించి నాకు కూడా బాధగానే వుంది కానీ చేయగలిగింది ఏమీలేదని నాకు తెలుసు, కానీ సుజన వాళ్ళ కారణంగా నలగడం నాకు నచ్చడం లేదు. సైకాలజిస్ట్ దగ్గరకు తీసికెళ్ళి చూపించినా ఫలితం లేకపోయింది. ఇన్నాళ్లు పిల్లల భవిష్యత్తు గురించి ఇద్దరం ఆలోచించాము.బీ ఎస్ ఎన్ ఎల్ ఇంజనీర్ గా నాకు వుద్యోగ ధర్మంతో రోజులో సగం సమయం గడిచి పోతుంది, కానీ సుజన ఇంట్లో వుండి ఇలా వేదన పడి నలుగుతోంది.

కర్నూలు లో నేను డిగ్రీ చదువుకున్న ఉస్మానియా కాలేజ్ నుండి పూర్వ విద్యార్థుల సమ్మేళనంకు తమ భార్యలతో రమ్మని ఆహ్వానం అందింది. ముప్పైఏళ్ళ క్రిందట చదువుకున్నప్పటి తోటి విద్యార్థులను కలవడం అంటే నాకు చాలా ఉత్సాహం కలిగింది. కర్నూల్ అనగానే నాకే కాదు సుజనకు కూడా ఉత్సాహం కలుగుతుందని అనుకున్నాను. దానికి కారణం అక్కడున్న ఇంగ్లిష్ టీచర్ రేచల్. ఆమె దగ్గరే నేను సుజన కలుసుకుంది. సుజనకు రేచల్ మేడం అంటే ఎంతో ఇష్టం. మా పెళ్లయ్యాక చాలా ఏళ్ళు హైదరాబాదులో వుద్యోగం చేసినా కర్నూల్ లో మా ఇద్దరి కుటుంబాలు లేకపోయినా మేము రేచల్ మేడం ను కలవడానికి వెళ్ళేవాళ్ళం. దాదాపుగా అయిదేళ్లయింది మేడంని కలవక, క్రిస్మస్ కు గ్రీటింగ్స్ చెప్పడం తప్ప తర్వాత మేడంకు ఫోన్లు చేయడం కూడా మర్చిపోతున్నాం. కర్నూల్ కు చాలాసార్లు వెళ్లినా మేడం లేక, కొన్నిసార్లు మాకు కుదరక, కలవలేకపోయాం.

ఇంటర్ లో ఉండగా ఇంగ్లిష్ లో సుజన నేను ఇద్దరం వెనకబడేవాళ్ళం. మేము రెండో సంవత్సరంలోకి రాగానే క్రొత్తగా వచ్చిన రేచల్ మేడం మాకు ఇంగ్లిష్ అంటే వున్న భయం పోగొట్టింది ,అంతే కాదు మాకంటే నాలుగయిదేళ్లు పెద్దదయిన మేడం మాతో ఒక స్నేహితురాలిగా కలిసిపోయి, మాలో చదువు పట్ల ఆసక్తిని కలిగించింది. ఆమెను ఇష్టపడని విద్యార్థులు ఉండేవారు కాదు. సుజన నాకు క్లాస్మేట్ అయినా పరిచయం అయింది మాత్రం మేడం ఇంటి దగ్గరే. కాలేజ్ చదువు అయినా తర్వాత కూడా చాలా మంది మేడం ఇంటికి వెళ్లేవారు, అక్కడే మా పరిచయం ప్రేమగా, పెళ్లిగా మారింది. మేడంని కలవడం వలన సుజనకు సంతోషం కలుగుతుంది. రెండురోజులన్నా కొంచం మార్పు ఉంటుంది అనుకున్నా. కర్నూల్ కు వెళదామనగానే ,రేచల్ మేడం ను చూద్దామనగానే సుజన కళ్ళలో కాంతి, ముఖంలో ఉత్సాహం కనపడగానే నాకు చాలా సంతోషం కలిగింది.

సుజన నా ప్రాణం, నా జీవితానికి ఒక అర్థం కలిగించిన జీవన జ్యోతి. ఆమెకు కష్టం కలిగించింది నా బిడ్డలు అయినా వాళ్ళను నేను క్షమించలేకపోయాను. వాళ్ళతో కోట్లాడి మరుసటిరోజు పిల్లలతో ఆమె మామూలుగా మాట్లాడగలుగుతుంది కానీ నేను వాళ్ళతో మామూలుగా మాట్లాడలేకున్నాను. సుజన తర్వాతే నాకు ఎవరైనా. ఇన్నాళ్లు రేచల్ మేడం దగ్గరకు వెళ్లాలని నాకు ఆలోచన కలగనందుకు నన్ను నేను తిట్టుకున్నాను .వారం రోజులు సెలవు పడేసి కర్నూల్ బయలుదేరాం.

మా కాలేజ్ పూర్వ విద్యార్థులతో కళకళ లాడింది. ఈ మధ్య వాట్సప్ లో మా క్లాస్మేట్స్ ఫోన్ నంబర్లు దొరకడం వలన చాలా మంది కలిసి మాట్లాడుకుంటున్నాం, మెసేజ్ చేసుకుంటున్నాము మిగతా వాళ్ళు కూడా ఇప్పుడు కలిశారు.చాలా మంది భార్యా సమేతంగా వచ్చారు అందరం సంతోషంగా గడిపాం. కానీ అందరు మాలాగే పిల్లలపట్ల నిరాశగా మాట్లాడారు, వాళ్లు ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగినందుకు మంచి ఉద్యోగాల్లో వుంటున్నందుకు గర్వపడినా, వెంటనే వాళ్ళ కళ్ళలో పిల్లలు భౌతికంగానే కాక మానసికంగా దూరమయ్యారని బాధని గమనించాను .నాకు, సుజన

కున్న సమస్యనే  అందరిదీ కూడా అని  గ్రహించాక నాకు కొంత ధైర్యం కలిగింది. కానీ  సుజనకు అది తనకొక్కరికే కలిగిన బాధగా, తన దురదృష్టంగా భావించడం ఆపలేదు. నాకు ఆమెను కన్విన్స్ చేసే శక్తి సన్నగిల్లింది. ఆమెకున్న  సమస్య కంటే ఆమె ఊహించుకునే సమస్యే ఎక్కువ అని నాకు అర్థమైనా అది చెప్పే ధైర్యం నాకు లేదు ఎందుకంటే సుజన మానసిక పరిస్థితి ఇప్పటి కంటే ఇంకా అధ్వాన్నంగా అవుతుందేమో అనే భయం నాకుంది.

స్నేహితులందరూ  వెళ్ళిపోయాక  మేము రేచల్ మేడం దగ్గరకు వెళ్లాలని ఫోన్ చేసాం.

“నేను బయట వున్నాను ఓ గంటలో వస్తాను, మీరు ఇంటికి వెళ్లిపోండి, ఇల్లు మారాను” అంటూ ఇంటి గుర్తులు చెప్పారు. సుజన కు ఉత్సాహంగా  వుంది మేడం ను కలవబోతున్నందుకు.రేచల్ మేడం ఇల్లు కనుక్కోవడం కష్టమేమీకాలేదు. వూరికి కొంచం దూరంగా వుంది. చిన్న ఇల్లు పెద్ద తోట. గేటు తీసుకుని లోపలి వెళ్ళే లోపల ఒకమ్మాయి ఎదురుగా వచ్చింది.

”మేడం ఫోన్ చేశారు. మీరు స్నానం చేసుకుని రండి, కాఫీ పెడతాను, నా పేరు గాయత్రి “ అంది.

“ఓహ్ అలాగా, నేను సుజన ఇతను నా భర్త ముకుంద్ , మాకు ఇంటర్ లో  మేడం లెక్చరర్, సార్ ఎలా వున్నారు ? ఏమైనా  మేలేనా ?” అంది సుజన

“ ఉహూ..  అలాగే వున్నారు.. రండి చూద్దురు గానీ,  ఈ మధ్య మరీ బాగా లేకుంటే స్కాన్ చేపించారు ఆ రిపోర్ట్ తీసుకుని వెళ్లారు సీతారాం డాక్టర్ దగ్గరకు, చాలా రద్దీగా ఉందట “ అంది గాయత్రి.

గాయత్రి తీసికెళ్ళిన గదిలో మంచానికి అతుక్కుని వున్న ఆయన్ని చూస్తే కళ్ళకు నీళ్ళొచ్చాయి.వాళ్ళ పెళ్ళిలో  ఆజానుబాహుడైన జాన్ సార్ తో  మేడం ఎంతో అందమైన జంట .మేడం పెళ్లి కి అతిథులంతా విద్యార్థులే. పదేళ్ల క్రిందట ట్రైన్ ఆక్సిడెంట్ లో వెన్నెముక దెబ్బతినడం వలన మంచానికి పరిమితం అయిపోయారు. చికిత్స కోసం ఎన్నో చోట్లకి తిరిగారు. .అయినా ఆయన పరిస్థితిలో మార్పు లేదు.

స్నానం చేసి బయటికి వచ్చేసరికి  ఒక రెండేళ్ళ బాబు నా దగ్గరకు పరుగున వచ్చాడు ఎత్తుకోమని చేతులు చాస్తూ. ఎత్తుకుని ఆశ్చర్యంగా చూశాను ఎవరబ్బాయని !

మేడం నవ్వుతూ నుంచున్నారు. “ఎలా వున్నారు ముకుంద్ ? చాలాకాలం అయింది మిమ్మల్ని చూసి, ఈ మధ్య సుజనను మిమ్మల్ని గుర్తు చేసుకుంటున్నాను “

నా చేతుల్లోంచి  వాడు మేడం దగ్గరకు ఉరికాడు.వాడ్ని చూస్తే గుండె నిండా హాయి నిండింది. బొద్దుగా, ఉంగరాల జుట్టుతో, కిలకిలా నవ్వుతూ హడావుడిగా అటు ఇటు  తిరుగుతూ ఉంటే వాడినే చూడాలనిపిస్తుంది. మేడంలో నాకు పెద్ద మార్పేమీ కనపడలేదు అలాగే వున్నారు. ఆమెను చూస్తే నాకు ఇంటర్ రోజులు గుర్తొచ్చాయి మమ్మల్ని ఆమె తీర్చిన పద్ధతి గుర్తొచ్చింది ఎన్నో సార్లు నలుగురు అయిదుమంది అబ్బాయిలం  అక్కడే భోంచేసేవాళ్ళం. ఎంతమందికి ఆమె ఇంగ్లీషంటే  భయం పోగొట్టి చదువులో ముందుకు పోనిచ్చారో లెక్కలేదు. ఎంతో మంది ఆమెను  దేవతలా చూసేవారు. చిరునవ్వు  చెదరకుండానే ఓపిగ్గా మా ఇంగ్లిష్ రాని మొద్దుల్ని మెరకలుగా చేసిందో ! ఇలాంటి కరుణామయి ఈ రోజు మారుమూల ఓ చిన్న ఇంట్లో ,అవిటివాడై మంచాన పడ్డ భర్తతో  విభవం వీడి జీవించడం నాకు మింగుడు పడలేదు.

“ చేతన్ ఉంటే సమయమే చాలదు వీడి ముద్దు మాటలు వింటే అన్నీ మర్చిపోతాం “ అని మేడం అంటుండగానే సుజన స్నానం చేసి వచ్చింది. మేడం సుజన ముఖాల్లో ఆనందం తాండవించింది. ఇద్దరూ  చేతులు పట్టుకుని ఒకరినొకరు కౌగలించుకున్నారు. సుజనను అలా చూడక ఎన్ని రోజులైందో...! అనిమ అజయ్ ల గురించి దిగులు పడుతూ సుజన ఎంత పాడయ్యింది?

సుజన చేతన్ తో ఆడుకుంటూ మేడంతో మాట్లాడుతోంది.చేతన్  కొత్త పాత లేకుండా  అందరి దగ్గరకు రావడం నాకు ఆశ్చర్యం కలిగింది ముగ్గురం చేతన్ ను తీసుకుని తోటలోకి వచ్చాం  ఊపిరి తీసుకోలేకపోయింది సుజన. తోట  అంత అద్భుతంగా వుంది అనేక రకాల పూల మొక్కలతో.  హైదరాబాదులో మాకున్న అపార్ట్మెంట్ లో బాల్కనీలో సుజన కూడా చాలా చెట్లు పెట్టింది. మొక్కల మధ్య తిరుగుతూ అడిగాను.

“మీ పాత ఇల్లు అమ్మేశారా మేడం ... ఎంత పెద్ద ఇల్లు ! ఎంత బావుండేది ఆ ఇల్లు . ఎన్ని చెట్లు ! ఎన్ని  మొక్కలు ...  ఎందుకని అమ్మేశారు ?”

మేము చదువుకునే రోజుల్లో మేడం వుండే ఆ పెద్ద ఇల్లు మేడం ఆంగ్లో ఇండియన్ తాతగారు బ్రిటిష్ స్టైల్లో కట్టించింది. యాభై సెంట్ల లో ముందంతా పెదద తోట, తర్వాత పెద్ద ఇల్లు, రాజభవనం లాగా ఉండేది.ఇంట్లో ఆ కాలం నాటికే అధునాతనమైన పరికరాలు ఉండేవి. జర్మన్ షెపర్డ్, బుల్ డాగ్ ,లాబ్రిడార్ కుక్కలు ఏమీ అనకున్నా భయపడి చచ్చేవాళ్ళం. మేడం నాన్నగారు కర్నూల్ లోనే ప్రఖ్యాతి చెందిన లాయర్. మేడం ఒక్కతే కూతురు, ఇంపాలా కారులో రాజకుమారి లాగా కాలేజ్ కు వచ్చేది. ఆమెకు వుద్యోగం చేసే అవసరం లేకున్నా కేవలం బోధన పట్ల ఆమెకున్న ఆసక్తి వలన చేసేది.

ఇప్పుదు ఆ ఇల్లు అమ్మేసిందంటే ఆర్థికపరమైన ఇబ్బందుల వలన ఉండొచ్చు..

“అంత పెద్ద ఇల్లు మాకు అవసరం లేదు పైగా డబ్బు అవసరం కూడా మమ్మల్ని అది అమ్మేట్టు చేసింది. ఆ ఇల్లు అమ్మాక ఈ ఇంటిని మీ జూనియర్ సుదర్శన్ ఆరు నెలల్లో కట్టించాడు. తాతగారి ఇల్లు అని కొంచం మమకారం ఉండేది. కానీ తప్పలేదు . మేడం ముఖం లో కొద్దిగా కూడా బాధ కనపడలేదు. “

“సార్ స్కాన్ గురించి ఏమన్నారు మేడం డాక్టర్ ?”

“జాన్ నాడీ వ్యవస్థ పని చేయడం మానేస్తోంది, మెమరీ లాస్ వచ్చింది ఎవర్నీ గుర్తు పట్టడం లేదు “

“రోషన్, రోజా ఎలా వున్నారు? ఎక్కడున్నారు ? ఈ మధ్య రాలేదా ?”..

“రోషన్ జర్మన్ అమ్మాయిని పెళ్లి చేసుకుని అక్కడే వున్నాడు , రోజా స్టేట్స్ లోనే వుంది తను కూడా అమెరికాలోనే సెటిల్ అయిన అబ్బాయిని చేసుకుని సంతోషంగా వుంది.. రెండేళ్ల క్రిందట వచ్చారు .. బాగా బిజీగా వుంటారు .మేం వెళ్లాలంటే జాన్ కి హెల్త్ ఇష్యూస్... “

“అదేంటి మేడం బిజీ అంటే ఎలా? వాళ్ళను కనీ, పెంచి,పెద్ద చేసి, చదివించి ఇంత వాళ్ళు అయ్యాక వాళ్ళుతాము బిజీ అని మనల్ని పట్టించుకోకుంటే ఎలా మేడం ? ఈ కాలం పిల్లలు అందరు ఇలా తయారయ్యారేంటి? జీవితం అంటే ఇంతేనా! పిల్లల నిర్లక్ష్యం భరిస్తూ ఏడుస్తూ చావడమేనా ? అనిమ అజయ్ కూడా అంతే మేడం... ఫోన్ చేయడానికి కూడా వాళ్లకు తీరిక లేదు ఆదివారాలు శనివారాలు కూడా ఫ్రెండ్స్ తో పిక్ నిక్ లతో బిజీ అదేమని నిలదీస్తే అసలు మాట్లాడరు... , బిజీ బిజీ ఈ మాట వింటే కోపం వస్తుంది ... నా పిల్లల గురించి అనుకుంటే బాధ , మీ పరిస్థితి చూస్తుంటే .. సార్ పరిస్థితి చూస్తుంటే నాకు దుఃఖం వస్తుంది మేడం, పిల్లల్ని మీరు వచ్చేయమని అడగలేదా రోజా అమెరికాలో ఉండకపోతే వాళ్ళ నాన్న గారిని చూసుకోవడానికి ఇండియా వచ్చేయరాదా ... ఏముంది మేడం అమెరికాలో జీవితం? ఉరుకుల పరుగుల జీవితం .. డాలర్లు తప్ప అక్కడయితే నాకు ఏమీ కనపడలేదు. మనం చస్తే కూడా వాళ్ళు రావడానికి లేదు... ఏదో రావాలంటే రావాలని వచ్చే వాళ్ళకోసం శవాల్ని కుళ్లిపోయే వరకు ఫ్రీజర్ బాక్సుల్లో పెట్టడమెందుకు మేడం నేను చచ్చిపోతే వాళ్లకు చెప్పాల్సిన అవసరం కూడా లేదని ముకుంద్ కు చెప్పా మేడం ... “ దుఃఖం తో గొంతు పెగల్లేదు సుజన కళ్ళలో కన్నీళ్లు బుగ్గల పై ఉరికాయి.

మేడం నెమ్మదిగా సుజనను దగ్గరకు తీసుకుని కన్నీళ్లు తుడిచింది. ఏమీ మాట్లాడలేదు. చాలాసేపు సుజన ఏడుస్తూనే వుంది. నేను ప్రేక్షకుడిని అయ్యాను. మేడం ఏమి చెబుతుందో అని ఎదురు చూశాను. ఆమె ఏమీ చెప్పలేదు సరికదా అసలు మాట్లాడలేదు. జారుతున్న సుజన కన్నీళ్లను తుడుస్తూ వుంది. తర్వాత నాకు అనిపించింది .. ఆమె ఏమిచెబుతుంది ? ఏమి చెప్పగలదు? ఆమెదీ అదే పరిస్థితి కదా !

నెమ్మదిగా సుజన తేరుకుని “సారీ మేడం .. నా బాధంతా చెప్పి మిమ్మల్ని విసిగించాను”. అంది పేలవంగా నవ్వుతూ .

“ఏమీ పరవాలేదు. పద లోపలి వెళదాం. ఆ .. మర్చిపోయా నీకు కొన్ని మొక్కలు చూపాలి ఒక ఫ్రెండ్ తెచ్చిచ్చింది. పూలు రెండు నెలల వరకు వాడవు ..” అని ఆ మొక్కల ప్రక్కకు దారి తీసింది.

నిజంగానే ఆ మొక్కలపై పూలు గుత్తులు గుత్తులుగా చాలా బాగున్నాయి. వాటిని చూసి సుజన ముఖం లో దుఃఖం. మాయమవడం కళ్ళు ఆనందంతో మెరవడం గమనించాను. మేడం సుజన మూడ్ ని మార్చడానికి చేసిన ప్రయత్నం ఓహ్ ఆమె ఒక గొప్ప టీచర్ అన్న విషయం గుర్తుచేసింది. అక్కడి నుండి ఇంకో ప్రక్కకు వెళ్లాం అక్కడ ఓ మూల కుందేళ్ళ చిన్న ఇల్లు వుంది. తెలుపు, గోధుమ రంగు నలుపు రంగుల్లో కుందేళ్ళను చూసి చేతన్ సంతోషం తో అరవడం సుజన కూడా చిన్నపిల్లలా వాటి దగ్గర ఆడడం నాకు సంతోషాన్నిచ్చింది.

“చేతన్ కోసం కుందేళ్ళను తెచ్చాం వీడి ఆనందం చూడు ముకుంద్ “ మేడం చేతన్ చూసి మురిసిపోతోంది..

“రోజాకు , రోషన్ కు పిల్లలు లేరా మేడం “ అన్నాను.

"ఇద్దరికీ వున్నారు రోషన్ కు పాప , రోజాకు కూడా పాప ఫోటోలు చూపిస్తాలే"

మొక్కల్ని , కుందేళ్ళని చూస్తున్న కొద్దీ మేడం వాటితో చాలా కాలం గడుపుతుంది అనిపించింది .

చీకటి పడుతుండగా లోపలి వెళ్లాం మేడం సార్ దగ్గరకు తీసి కెళ్ళింది . చిన్నపిల్లాడిని ఒడిలోకి తీసుకున్నట్లు అతన్ని ఒడిలోకి తీసుకుంది బుద్ధిగా ఆమె వొడిలో పడుకున్నాడు."

"ముకుంద్ సుజనా వచ్చారు చూడు... జాన్" అన్నది కానీ జాన్ సార్ మమ్మల్ని గుర్తుపట్టలేదు, మేడం మాటలు అర్థం అయ్యాయో కూడా తెలియలేదు. అన్నం పప్పు కలిపి మిక్సి కేసి మెత్తగా చేసి రెండు గిన్నెల్లో వేసింది ఒక గిన్నె నుండి స్పూన్ తో సార్ కు తినిపించింది. మరో గిన్నెలో నుండి చేతన్ కు తిని పించింది చేతన్ తింటూ ఉంటే ఆయన తింటున్నారు. చేతన్ తినకుండా ప్రక్కకు పోతే ఆయన చేతన్ లేదు కాబట్టి తాను తినమని మారాం చేస్తున్నారు. గాయత్రి చేతన్ ను పట్టుకొచ్చింది "తాతయ్య తొందరగా తినేశాడని చేతన్ని, చేతన్ తొందరగా తినేశా"డని జాన్ ని ఇద్దరినీ లాలించి బుజ్జగించి మేడం తినిపించారు,

"రోజూ ఇలాగ చేస్తే కానీ ఇద్దరు తినరు....అంతకు ముందయితే ఇద్దరికీ వేరు వేరు గా పెట్టటానికి చాలా ఇబ్బంది పడేదాన్ని .. ఇప్పుడు ఇద్దరూ పోటీగా తింటున్నారు" అన్నారు.

ఎవరీ గాయత్రి .. ఆమె బిడ్డపై మేడం కెందుకు అంత మమకారం ? మేడం సందర్భం వచ్చి నప్పుడు చెబుతారులే అనుకున్నాను

రోషన్ రోజాల ఫోటోలు చూపారు..

"జర్మన్ అమ్మాయి కోడలు గా వప్పుకున్నారా మేడం?" అంది సుజన.

"మనం వప్పుకోవడం, వప్పుకోక పోవడం అన్న ప్రశ్న ఏముంది సుజనా! వాళ్ళ పెళ్లి వాళ్ళ ఇష్టం"

"మనకేమీ ప్రమేయం లేదా... మన బిడ్డల పెళ్ళిళ్ల లో .. మన కుటుంబం లోకి వచ్చే అమ్మాయి మనకు తెలియవద్దా మేడం?"

"వాళ్ళు అనుకోవాలి కదా మనం అంతా ఒక కుటుంబం అని వాళ్ళు వాళ్ళు ఏర్పర్చుకున్నదే కుటుంబం అనుకుంటున్నారు. వాళ్ళ జీవితంలో మనకు చోటు లేదని అనుకుంటున్నారు .మనమేమి చేయగలం సుజనా? వాళ్ళు అలా అనుకున్నప్పుడు అది జర్మన్ అయినా ఇండియన్ అయినా మనకెందుకు? వాళ్ళు దూరంగా వుండాలని అనుకున్నప్పుడు మనం దగ్గరగా పోవాలని అనుకున్నా ప్రయోజం లేదు కదా ! మనకు దగ్గరగా రావాలని ప్రయత్నించే వాళ్లను ప్రేమించే నైజం మనంఅలవర్చుకోవాలి...లేకపోతే మనకు ప్రేమించడానికి ఎవరూ వుండరు, మనల్ని ప్రేమించే వాళ్ళు వుండరు"

సుజన ఆలోచిస్తూ వుంది.

మేడం రిటైర్ అయినప్పటి ఫోటోలు చూపారు. మేము సీనియర్ ఇంటర్ లో ఉండగా మేడం ఇరవై రెండు వయసులో కాలేజ్ లెక్చరర్ గా తన ప్రస్థానం మొదలెట్టారు. ఒక టీచర్ రిటైర్ మెంట్ కు అప్పటి విద్యార్థులే కాక ముప్పై అయిదేళ్ల క్రిందటి విద్యార్థులు కూడా రావడం బహుశా చాలా తక్కువ మంది టీచర్ల కు జరిగే గౌరవం అనుకుంటా ఫోటోలు చూసాక. సుజన చేతన్ ని ఆడిస్తూ ఉంటే, నేను సుజన పిల్లల గురించి పడుతున్న వేదన గురించి ,పిల్లల ప్రవర్తన లో అంత మార్పు ఎందుకొచ్చిందో నా కున్న సందేహం కూడా మేడం కు చెప్పాను ,దానికి పరిష్కారం చెప్పమని అడిగాను .

" సుజన నువ్వు ఒక వారం ఇక్కడుండండి" అన్నారు మేడం.

తల ఊపాను..

"చేతన్ తో సుజన ఎంత సంతోషంగా వుందో చూడండి మేడం .. ఆమె నవ్వులు చూడక ఎన్ని రోజులైందో.. గాయత్రి ఎవరు మేడం ? "

సుజన చేతన్ ఎత్తుకుని వచ్చి పడీపడీ నవ్వుతోంది. ముకుంద్ వీడు ట్వింకిల్ ట్వింకిల్ లిట్టిల్ స్టార్ రైమ్ చెబుతాడు విను. చేతన్ చెప్పు కన్నా " వాడు సిగ్గు పడుతూ తల ని పైకెత్తి స్టార్స్ ని చూపిస్తూ వచ్చీరానీ ముద్దు మాటలతో చెబుతుంటే నిజంగానే మాకు చెప్పలేని సంతోషం కలిగింది.

మేడం, సుజన ఒకరి తర్వాత ఒకరు వాడ్ని ముద్దులాడారు. పసి పిల్లలు ఎంత సంతోషాన్ని తెస్తారు ఇంటికి?

"గాయత్రి నా స్టూడెంటే తన తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ఓ అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వాడు కొద్దికాలం తర్వాత ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకుని ఇంటికి తెచ్చి, వద్దన్న గాయత్రిని నిండు గర్భవతిని చంపడానికి ప్రయత్నించాడు. మృతువుతోపోరాడి బ్రతికింది.

ఆశ్రయం కోసం వచ్చింది, నిజానికి గాయత్రి రోజా కంటే కూడా ఎక్కువ నాకు. రోషన్,రోజాల పిల్లలు మన దగ్గర వుండరు. మన, పర ఎందుకు ముకుంద్? .ఎవరికీ మనం అవసరమో, ఎవరు మనల్ని ఆశిస్తారో  ఎవరు మన ప్రేమని గౌరవిస్తారో వాళ్ళే మనవాళ్ళు. గాయత్రి ఈ రెండేళ్లలో బాగా చదువుకుంది. వుద్యోగం వస్తే వెళ్ళిపోతుంది.. తన జీవితం తాను నిర్మించుకుంటుంది. అది కూడా నేను ఆశిస్తున్నా తన కంటూ ఒక సొంత జీవితం వుండాలని... ”

సుజన మేడం మాటలు వింటూ ఆలోచిస్తోంది.

రాత్రి నా గుండెలపై తలపెట్టుకుని ” ముకుంద్ ఎంతబావుంది కదూ ఇక్కడ ! నాకయితే ఇక్కడే ఉండిపోవాలని వుంది .. ”

“ఉందాం వారం రోజులు”

“ఆహా- - - ఇక్కడే  ఉండి పోదాం “

“సరే ఆలోచిద్దాం”

ఉదయాన్నే గాయత్రి లేపింది ” సార్..మేడం వాకింగ్ వెళుతున్నారు మీరు వస్తారా?” అని అడిగారు.

సుజన ఎగిరి కూర్చుంది.

మేము బయటికి వచ్చేప్పటికి మేడం సార్ కు స్నానం చేపించి వీల్ చైర్ లో కూర్చోపెట్టి సార్ వళ్ళో చేతన్ ను కూర్చో పెట్టి బెల్ట్ వేశారు .. వాడు బుద్ధిగా కూర్చున్నాడు..  సార్ ఏదో మాట్లాడుతున్నాడు కానీ అవి మాకు అర్థం కాలేదు. మేడం వాటికి సమాధానం చెబుతోంది. చేతన్ తో ఆయనేదో నవ్వుతూ చెబుతున్నాడు చేతన్ ఆయన్ని మాటి మాటికీ మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెడుతున్నాడు. మేడం కి ఇద్దరూ పసివాళ్లే అనిపించింది. ముగ్గురం ఒకరి తర్వాత ఒకరం వీల్ చైర్ ని తోసుకుంటూ వెళ్లాం.

దార్లో వృద్ధాశ్రం తీసికెళ్ళారు. అక్కడున్న కొందరితో మాట్లాడాను. అక్కడ ఏదో  నిరాశలో వుండే ముసలివాళ్ళు,రోగులు వుంటారనుకున్నా .. కానీ అక్కడ చాలా అర్థవంతమైన జీవితం నడుస్తోంది. చదువుకున్న వాళ్ళు , నిరక్షరాస్యులు కూడా ఉన్నారట.  చాలా విశాలమైన ఆ ప్రదేశంలో  మంచి తోట పెట్టారు . పూల మొక్కలతో పాటు ,వరి, కూరగాయలు ,ఆకుకూరలు పండిస్తున్నారు. వాళ్లకు సరిపోయి మళ్ళీ మార్కెట్ కు కూడా వేస్తారట. వాళ్లలో ఎక్కడా నిరాశ కనపడలేదు. చదుకున్న వాళ్ళకోసం చిన్న లైబ్రరీ నడుస్తోంది న్యూస్ పేపర్లు పత్రికలు ,పుస్తకాలు వున్నాయి.అక్కడివాళ్ళతో మేడం మాట్లాడుతుంటే వాళ్ళకళ్ళలో మెరుపు చూశాను ..

“ప్రతిరోజూ వస్తాను ఇక్కడికి - - - ఎంతో బావుంటుంది ఈ వాతావరణం” అన్నారు మేడం

“పిల్లలు వుండి  కూడా ఇలాంటి చోట ఉండాల్సిన దురదృష్టం పట్టింది కదా మేడం వీళ్ళకి,  వీళ్ళను చూస్తుంటే బాధగా వుంది” అంది సుజన

“అదృష్టం దురదృష్టం అనేవి లేవు సుజనా! జీవితాన్ని ఎలా వచ్చినా స్వీకరించాలి. మనకు అనుగుణంగా మార్చుకోగలిగితే మార్చుకోవాలి. మార్చలేనిదాన్ని అంగీకరించి ముందుకు పోవాలి- - - పిల్లల్ని మనం దోషులుగా చేయలేం ప్రతి దానికి,  వాళ్ళమీద చాలా ప్రభావాలున్నాయి . మన సంస్కారం వాళ్ళకెందుకు రాలేదంటే,  వాళ్ళు ప్రపంచపు పోకడల్ని ఎక్కువ చూస్తున్నారు ,వాటికి ఎక్కువ ప్రభావితమవుతున్నారు . మనకాలంలో మనం తల్లి దండ్రులమీద ఎక్కువ ఆధారపడ్డాం, ఎక్కువ సమయం గడిపాం.  అందుకని వాళ్ళతో మనకు అనుబంధం వుంది , ప్రతి దానికి వాళ్ళ అనుమతి కోరాం  ఒంటరిగా ఏ నిర్ణయం తీసుకోలేకపోయేవాళ్ళం .ఇప్పుడు వీళ్లకు మనం ఇచ్చిన స్వేచ్ఛ , నిర్ణయాన్ని తీసుకునే అధికారం, వాళ్ళని ఎక్కువ స్వతంత్రాన్ని తీసుకునేలా చేశాయి.  ఇప్పటి  ప్రపంచపు రీతులు,సోషల్ మీడియా, చిన్న వయసులో ఆర్థిక స్వాతంత్ర్యం  యువత పై ఎక్కువ ప్రభావం చూపాయి. ఇక్కడే ఇలావుంటే అమెరికాలో వున్న జీవన విధాన ప్రభావం అక్కడి కెళ్లిన మనవాళ్లపై పడకుండా ఎలా వుంటుంది? అతి కొద్దికాలం లో మనదేశం కూడా అమెరికా లాగే ఉంటుంది మనం అప్పుడు దానికి అలవాటు పడిఉంటాం .”

దార్లో సుజనకు మేడం కు జరుగుతున్న సంభాషణ ఉంటున్నాను.

"పాతికేళ్ళు మనతోవుండి ఈ దేశం ఇచ్చిన చదువును , అవకాశాల్ని ఉపయోగించుకుని మన త్యాగం తో ఎదిగి ఇప్పుడు మా జీవితంలో మీకు చోటు లేదంటే , మన గురించి ఆలోచనే చేయకుంటే మనం ఏమవుతున్నా వాళ్లకు సంబంధం లేదంటే ఎలామేడం ?" సుజన కళ్ళలో నీళ్లు తిరిగాయి.

" సుజనా హృదయ సంస్కారం పనిచేయని చోట ఏదీ పని చేయదు, నాకు తెలిసి అది బాహ్యమైన విషయాలను తెలియజేయడం వలన ఏర్పడదు. సాధారణంగా డబ్బు, కేరియర్ లాంటి వాటికి ప్రాధాన్యత హెచ్చినచోట అది అసలు ఏర్పడదు."

"ఏమో మేడం.. పిల్లలు నన్ను పట్టించుకోవడం లేదని. వాళ్ళు మాకు కాకుండా పోయారని నేను చాలా క్రుంగి పోతున్నాను, ముకుంద్ నా బాధ చూడలేక వాళ్లకు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా, వాళ్ళు లెక్కచేయడం లేదు"

"మన పిల్లలు మనకెప్పుడూ మన ప్రపంచంగా అనిపిస్తూ వుంటారు, పసితనం లో వాళ్లకు మనం తప్ప లోకం తెలియనంతవరకు వాళ్లకు మనమే కదా ప్రపంచం ! తర్వాత కూడా అలా ఎలావుంటారు ? ఇప్పుడు చేతన్ ని మనం ఎలా పెంచామో, ముద్దులాడామో వాడు పెద్దయ్యాక గ్రహిస్తాడంటావా?... ఇది ప్రకృతి ధర్మం సుజనా..మన జీవితం మనం జీవించి..వాళ్ళ జీవితం కూడా మనమే జీవించాలంటే ఎలా సుజనా !"

"అయితే మనమేం చేయాలి మేడం? నాకయితే పిల్లలు లేకుండా పండుగలు లేవు, ప్రతి నిమిషం వాళ్ళు గుర్తొస్తారు. ఒక్క రోజు వాళ్ళు మాట్లాడకపోతే జీవితం శూన్యంగా అనిపిస్తుంది"

" వాళ్లకు నచ్చినట్లు వాళ్ళు గడుపుతున్నారు కదా ! మనం కూడా సమయాన్ని క్వాలిటేటివ్ గా గడపాలి. మనకంటూ వున్నది ఒకటే జీవితం, ఇందులో ఎన్ని ఒడిదుడుకులున్నా, మనం చేయాల్సిన పనులు చేయాలి ,చేయాలనుకున్న పనులు , ఇష్టమైన పనులు చేయాలి. ఉద్యోగ రీత్యా కానీ ,బాధ్యతల వలన కానీ ఇంతకాలం మనకు తీరిక లేదనుకో ఇప్పుడు మనకు సంతోషాన్నిచ్చే స్నేహితుల్ని బంధువుల్ని కలవాలి, మనకిష్టమైన ప్రదేశాలు తిరగాలి. ఒకటి జరగలేదని ఇంకేవీ జరగరాదా సుజనా !"

సుజన దీర్ఘంగా ఆలోచిస్తోంది.

స్థితప్రజ్ఞత తో కూడిన ఆమెను చూస్తూనే వున్నాను ముప్పై అయిదేళ్ల నుండి; వృద్ధాప్యం ఆమెను ఏ మాత్రం అనిశ్చలంగా గానీ చంచలంగా చేయలేదు. బాధలు ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేదు.

భర్త అనారోగ్యం ,అవిటితనం, పిల్లల నిర్లక్ష్యం, కరిగి పోయిన ఆస్తులు , వెడలిపోయిన అంతస్తులు ఏవీ ఆమెను కృంగదీయలేదు .ఎన్ని సమస్యలు ఎదురైనా ఆమె చిరునవ్వు చెదరలేదు , జీవిత సమరానికి ఆమె బెదర లేదు. మాకు, ఇంకా అనేక మంది వయసుమళ్లుతున్న వాళ్ళకి సాధ్యం కానిది ఈమెకు ఎలా సాధ్యమయింది ? సుజన కు ఇప్పుడు రేచల్ మేడం నిజమైన చదువు నేర్పాలి.

"దీపావళికి ఓ స్నేహితురాలు ఇవాళ రాత్రికి భోజనానికి రమ్మంది వెళదాం" అంది మేడం.

"మీరు వెళ్లి రండి మిమ్మల్ని పిలుస్తే మేము వస్తే ఎంబావుంటుంది?" అన్నాను.

"అదేం లేదు మీరున్నారని చెప్పా ..అందర్నీ పిలిచింది"

సార్ తో సహా అందరం వెళ్లాం. మేడం స్నేహితురాలు విజయ ఇంటి ముంగిట్లోకి వెళ్ళగానే ఆ ముగ్గులు, ముగ్గుల్లో అందంగా అలంకరించిన దీపాలు మమ్మల్ని ఆశ్చర్య చకితుల్ని చేశాయి. ప్రక్కనున్న రాంప్ పైనుండి సార్ వీల్ చైర్ ని తీసుకొచ్చాం. ఆ రాంప్ సార్ కోసమే కట్టించారని మేడం చెప్పారు . లోపలికి వెళ్ళాక ఇల్లు మొత్తం ఒక అందమైన కళాఖండంలా అనిపించింది. మమ్మల్ని పలకరించిన వ్యక్తిని చూడగానే నేను సుజన ఆమె క్యాన్సర్ పేషంట్ అని గ్రహించాము. కానీ ఆమె ఎంత చలాకీగా తిరుగుతోందో చూసి ఆశ్చర్యపోయాం. ఆమె మాటలు వింటే, పెదవుల పై కదలాడే చిరునవ్వు చూస్తే...ఆమె ఎంత ఆశావాదో అర్థమయింది. ఆమె చాలా రకాల వంటకాలు చేశారు. అన్నీ స్వయంగా చేశారట. బాగా చదవడం ,ఇల్లు ,తోట అంత చక్కగా పెట్టుకోవడం ఆమె హాబీ అని మేడం చెప్పారు. కీమో థెరపి తీసుకుంటున్నట్లు ఆమె పిల్లలు కూడా ఎక్కడో ఉన్నట్లు వాళ్ళిద్దరి సంభాషణ లో తెలిసింది. భర్త మరణించినట్లు ఒక ఫోటోకు పూల దండ వేయడం వలన, అతనామె భర్త అని అతను ఆమె తీసుకున్న ఫోటో వలన తెలిసింది. ఆమె తో మాట్లాడ్డం ఒక ఎడ్యుకేషన్ అనిపించింది . ఆమె పెద్దగా చదువుకోలేదని, డిగ్రీలేవీ లేవని మేడం ప్రోద్బలం తోనే పుస్తకాల చదవడం మొదలెట్టానని ఆమె చెప్పి నప్పుడు మేము నమ్మలేక పోయాము.

విజయ గారి గురించి మేడం చెబుతున్నారు దారిలో. "ఫోర్త్ స్టేజ్ లో వున్న లింఫాటిక్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు . క్యాన్సర్ వచ్చిందని తెలిసి సింగపూర్ లో వున్న కొడుకు కూతురు వచ్చి తీసికెళ్ళి ట్రీట్మెంట్ ఇప్పించారు. ఎక్కువకాలం బ్రతికే అవకాశం లేదని తెలిశాక ఆమె ఇక్కడే వుండాలని నిర్ణయించుకున్నారు . పిల్లలు అప్పుడప్పుడు వస్తుంటారు.భర్త అయిదేళ్ల క్రిందటే మరణించారు. "

"ఆమె ఉక్కు మహిళ లాగా వుంది మేడం.. ఇన్ని సమస్యలతో .. కూడా అంత ఆశావాదమా !"

"జీవితం పై ప్రేమ... బ్రతికిస్తుంది ముకుంద్ ..అదీ చాలా అర్థవంతమైన జీవనం సాగించడానికి"

సుజన ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండిపోయింది.

మరుసటి రోజు మేం మేడం దగ్గర సెలవు తీసుకున్నాం. "ఈ వారం రోజులు మన పిల్లలు మనకసలు ఫోన్ చేయలేదని నీవు ఒక్క సారి కూడా అనలేదు సుజనా ..!"

"అవును ముకుంద్.. నేను ఇంకెప్పుడూ అలా వాళ్ళ ఫోన్ రాకపోతే ,వాళ్ళు మనల్ని పట్టించుకోలేదని బాధపడను , మంచాన పడ్డ సార్ తో , పట్టించుకోని పిల్లలతో నలుగురికి సహాయం చేస్తూ మేడం ఎంతో సంతోషంగా వుంది కదా! క్యాన్సర్ తో బాధపడుతూ కూడా పిల్లల్ని ఆశించకుండా ఒంటరిగా తనకు నచ్చినట్లుగా వున్న విజయ గార్ని చూశాక , భర్త వదిలేసినా చిన్న బిడ్డని పట్టుకుని తన జీవితాన్ని చదువుతో దిద్దుకోవడానికి ప్రయత్నించే గాయత్రి , వీళ్ళని చూసి కూడా నేను ఏడిస్తే ఎలా ? నన్ను ప్రాణంలా చూసుకునే నీవుండగా కూడా, లేని వాటి గురించి ఇంతకాలం బాధపడ్డాను, నిన్ను బాధపెట్టాను . ముందుగా పనిలో నిమగ్నమవుతాను , ఇంక ఎప్పుడూ విచారంగా ఉండను . పిల్లల పట్ల కూడా నాకేమీ వ్యతిరేకత లేదు."

సుజన మాటలు నన్ను చాలా సంతోషపెట్టాయి. థాంక్స్ రేచల్ మేడం అనుకున్నా మనసులో .

## బ్రహ్మ తేజస్సు అన్నాపంతుల జగన్నాథ రావు

ఆకలి. మూడక్షరాల మాట. మనిషిని ముప్పుతిప్పలు పెట్టే మాట. జఠరాగ్నిని తట్టుకోవడం కష్టమనిపిస్తోంది నారాయణ సోమయాజికి. అన్నం తిని మూడు రోజులైంది. మూడు రోజుల కిందట సాయంకాలం తిన్న గుప్పెడు అటుకులే ఆఖరి ఆహారం. రెండురోజుల నుండీ మంచినీళ్ళ తోనే కాలం గడుపుతున్నాడు. పొద్దున్న పంటి బిగువున సంధ్యావందనం చేశాడు. అప్పటి నుంచి నిస్త్రాణగా పడుకొనే వున్నాడు మండువాలో. లేచి మంచినీళ్ళు తాగడానికి కూడా సత్తువ లేదు. కానీ కడుపులో అగ్నిహోత్రుడు వూరుకుంటాడా? బలవంతంగా లేచి వంటింట్లోకి వెళ్ళాడు. కాసిన్ని మంచినీళ్ళు తాగడంతో కొద్దిగా ఓపికవచ్చినట్టు అనిపించింది. "అమ్మా, గంగాభవానీ, నా ప్రాణాలు నిలబెడుతున్నావా తల్లీ" అనుకున్నాడు.

ఇల్లంతా కలయ జూశాడు. లంకంత యిల్లు. ఒకప్పుడు పిల్లా పాపలతో, వచ్చేపోయే బంధువులతో కళకళలాడుతూ వుండేది. తన దగ్గర వేదం చెప్పుకొనే విద్యార్థులే పదిహేను యిరవై మంది వుండేవారు యింట్లో. అంతమందికీ విసుక్కోకుండా మూడు పూటలా అన్నం వండి పెట్టేది తన భార్య సావిత్రి. ఎప్పుడు లేచేదో, యెప్పుడు నిద్రపోయేదో తెలియదు. ముఖంపై చిరునవ్వు చెదరనివ్వకుండా పనులన్నీ చక్కబెట్టేది. ఆ వైభవం యేదీ యిప్పుడు? తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తులన్నీ హారతి కర్పూరంలా హరించుకు పోయాయి. ఇంట్లో వున్న వస్తువులన్నిటికీ కాళ్ళు వచ్చేయి. ఆఖరికి యిల్లు కూడా కుదువ పెట్టవలసి వచ్చింది. క్షీణిస్తున్న తన ఆర్థిక స్థితిని చూసి బంధువులందరూ నెమ్మదిగా ముఖం చాటేశారు. ఇంట్లో భోజనం పెట్టి విద్య నేర్పించే స్తోమత లేకపోవడంతో శిష్యులెవరూ రావడం లేదు. రెండేళ్ళ కిందట అనారోగ్యంతో సావిత్రి కన్నుమూసింది. తనకి వైద్యం చేయించడానికి వేరే దారి లేక యిల్లు తనఖా పెట్టవలసి వచ్చింది. అయినా మనిషి దక్కలేదు. జీవితపు మలిసంధ్యలో వొంటరి వాడైపోయాడు.

ఎంతోమందికి ఆశ్రయం కల్పించిన యిల్లు యిప్పుడు కళావిహీనంగా మారి బోసిపోయింది. తనకి సంతతి లేకపోయినా, శిష్యులే సంతానంగా భావించేవాడు. తన దగ్గర వేదం చెప్పుకున్న శిష్యులంతా ప్రయోజకులయ్యారు. భోజన వసతులు కల్పించి వుచితంగా విద్యాదానం చెయ్యడమే తన యింట్లో వంశానుగతంగా వస్తున్న సాంప్రదాయం. శిష్యులు అభిమానంతో యేమిచ్చినా పుచ్చుకొనే అలవాటు యేనాడూ లేదు. రెండు నెలల కిందట, తన దగ్గర వేదం చెప్పుకొని ఘనాపాటీ అనిపించుకున్న కేశవుడు వచ్చి, తన పరిస్థితిని చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. "గురువుగారూ, మీరింక యిక్కడ వుండొద్దు. నాతో వచ్చేయండి. మిమ్మల్ని నా కన్నతండ్రిలా చూసుకుంటాను" అన్నాడు.

"నామీద నీకున్న అపేక్ష నాకు తెలుసురా కేశవా. కానీ, జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అనే రామాయణ వాక్యం మరిచిపోయావా?" అన్నాడు తను.

"అదికాదు గురువుగారూ! అమ్మగారు కూడా లేరు. ఈ వయసులో మీరు యిక్కడ వొంటరిగా..." నసిగాడు కేశవుడు.

"ఒరేయ్! నేను పుట్టి పెరిగిన యిల్లురా యిది. ఈ గాలి, యీ వూరు వీటితోనే నా జీవితం ముడిపడిపోయింది. ఈ యింటితో నాకెన్నో జ్ఞాపకాలు, అనుబంధాలూను. వీటన్నిటిని వదిలి నేను యెక్కడికీ రాలేను. ఈ కట్టె యిక్కడే రాలిపోవలసిందే" గాద్గదికంగా అన్నాడు నారాయణ సోమయాజి.

"మీ నోటివెంట అమంగళం పలకకండి గురువుగారూ" అంటూ కొంత పైకం తీసి యివ్వబోయాడు కేశవుడు.

"నాకు ధనసహాయం చేసేంత పెద్దవాడి నయ్యాననుకుంటున్నావురా?" చిరుకోపంతో అన్నాడు నారాయణ సోమయాజి.

"ఎంతమాట గురువుగారూ. ఇది సహాయం కాదు, గురుదక్షిణ అనుకోండి" అన్నాడు కేశవుడు.

"ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా విద్యాదానం చెయ్యడమే మా పెద్దలు నేర్పించిన వరవడి. ఇప్పటి వరకూ నేను అదే మార్గాన్ని అనుసరిస్తూ వచ్చేను. ప్రస్తుతం జీవితం చరమాంకంలో వున్నాను. ఇప్పుడిక ధనాపేక్షతో పితృ పితామహుల గతికి తప్పలేను" అన్నాడు నారాయణ సోమయాజి.

చేసేదేమీ లేక భారంగా వెనుదిరిగాడు కేశవుడు.

-000-

నీళ్ళు తాగి ఘడియైనా కాలేదు. ఆత్మారాముడు మళ్ళీ ఆకలీ అంటున్నాడు. ఇక లాభం లేదు, లేచి బయటకు వెళ్ళి యేదో ఒక ప్రయత్నం చేయకపోతే ప్రాణాలు నిలిచేలా లేవు అనుకున్నాడు నారాయణ సోమయాజి. పోనీ, ప్రాణాలు పోతేనేం, తాను యిక యెవరికోసం బతకాలి? కానీ ఆలా చేస్తే అది ఆత్మహత్యకింద అవుతుంది. ఆత్మహత్య మహాపాపం అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం అని కదా శృతి వాక్యం. అంచేత శరీరాన్ని నిలుపుకోవాలి. కాబట్టి యేదో ఒకటి చెయ్యాల్సిందే. ఇంతవరకూ తను యెవ్వరి దగ్గరా చెయ్యి సాచి యెరుగడు. అన్నార్థమై యాచించడమంటేనే యేదోలా వుంది. కానీ యేం చెయ్యడం? యాచించవలసి వచ్చేసరికి, విష్ణుమూర్తి అంతటి వాడే వామనుడైపోలేదా?

ఇలా అనుకుంటూ, వుత్తరీయం భుజాన వేసుకొని, యింట్లోంచి బయటకు వచ్చాడు. జేష్టమాసం, మిట్ట మధ్యాహ్నం కావడంతో గ్రీష్మాదిత్యుడు భీషణంగా ప్రతాపం చూపిస్తున్నాడు. రహదారి నిప్పుల కొలిమిలా వుంది. వీధిలో యెక్కడా నరసంచారం లేదు. అన్ని యిళ్ళు తలుపులు మూసేసి వున్నాయి. అయినా యెవరింటికి వెళతాడు, యేమని అడుగుతాడు.

పచ్చని మేని ఛాయ యెర్రగా మారిపోయింది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నాలుక తడారిపోతోంది. దేహమంతా చెమటతో తడిసి ముద్దై పోతోంది. పాదరక్షలు లేకపోవడంతో పాదాలు బొబ్బలెక్కుతున్నాయి. గమ్యం తెలియకుండా నడుస్తున్నాడు నారాయణ సోమయాజి. మూసిన తలుపులు వెక్కిరిస్తున్నాయి. ఒకప్పుడు వేదమే యీ దేశంలో సామాజిక జీవనానికి మూలం. అలాంటిది ఆ వేదానికి ప్రతినిధియైన తాను యీనాడు క్షుద్బాధతో నడివీధి పాలయ్యాడు. "అమ్మా, వేదమాతా! యేమిటి తల్లీ యీ పరీక్ష?" అనుకున్నాడు నారాయణ సోమయాజి.

వీధి చివరలో పెద్ద గడీ. తలుపులు తీసి వున్నాయి. అపరాహ్ణవేళ కాబట్టి, యింకా భోజనాలు అయి వుండక పోవచ్చు అనుకుంటూ గడీలోకి అడుగు పెట్టాడు నారాయణ సోమయాజి. అదే వూళ్ళో వుంటున్నా యింతకు ముందెప్పుడూ గడీలో అడుగు పెట్టలేదు నారాయణ సోమయాజి. ఎదురుగా యెత్తైన అరుగుల మీద దొరగారు కూర్చొని వున్నారు. వారి చుట్టూ ఐదారుగురు కూర్చొని తాంబూలచర్వణం చేస్తున్నారు. అంటే భోజనాలు అయిపోయాయన్నమాట – నిరాశగా అనుకున్నాడు నారాయణ సోమయాజి. అయితేనేం, యేదో వొక సహాయం దొరకక పోతుందా అనుకుంటూ దగ్గరగా వెళ్ళేడు. అతని రాకని యెవరూ గమనించలేదు. చిన్నగా దగ్గాడు. ఫలితం శూన్యం. అయినా యేమని అడుగుతాడు. నాకు ఆకలి వేస్తోంది, అన్నం పెట్టండీ అని అడుగుతాడా? అందుకు అభిమానం అడ్డొచ్చింది. కానీ, ఆకలిదే పై చెయ్యి అయింది. సరే, యేదైతే అది అవుతుంది అనుకుంటూ తడారిపోయిన పెదవులను నాలుకతో తడుపుకుంటూ "శతమానం భవతి శతాయు: పురుష శ్శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతీ" అంటూ ఆశీర్వచన మంత్రం చదివాడు.

దొరగారు కళ్ళెత్తి చూశారు. నారాయణ సోమయాజి ఆశగా చూశాడు. దొర పక్కన కూర్చున్న వ్యక్తి "అడుక్కు తినేటోల్లకి యేలాపాలా లేకుండా పోతాంది" అన్నాడు. అతని పక్కన కూర్చున్న యింకొకడు "యేలాపాలా లేక పోవడమేంది. సరిగ్గా బోయినాల యేల జూస్కొనే వచ్చిండు బాపనాయన" అన్నాడు నవ్వుతూ. నారాయణ సోమయాజి సిగ్గుతో చితికిపోయాడు. భూమి నిలువునా చీలిపోయి తనలో ఐక్యం చేసుకుంటే బావుణ్ణు అనిపించింది. వెనక్కి తిరగబోతుండగా, లోనికి పో అన్నట్టుగా కళ్ళతో సైగ చేశాడు దొర. వేరే దారి లేక లోనికి నడిచాడు నారాయణ సోమయాజి. వెనక నుంచి వెకిలి నవ్వులు వినిపిస్తూనే వున్నాయి.

ఒక్కొక్క గుమ్మం దాటుకుంటూ లోనికి వెళ్తున్నాడు నారాయణ సోమయాజి. ఒక గదిలో కొంతమంది యువకులు కూర్చొని, పులి జూదం ఆడుతున్నారు. పక్కగా వెళ్తున్న నారాయణ సోమయాజిని చూసి "ఓయ్, యేడకి పోతున్నావ్?" అంటూ గద్దించి అడిగాడొకడు.

"దొరగారు లోనికి వెళ్ళమన్నారు" సమాధానం చెప్పాడు నారాయణ సోమయాజి.

"ఏం గావాలే?" మళ్ళీ అడిగాడు వాడు.

"భో.. భో..జనం" తడబడుతూ అన్నాడు నారాయణ సోమయాజి.

"ఇదేమైనా నీ అత్తోరి యిల్లనుకున్నావు. ఇంటల్లునికి మల్లె పోతుంటివి?" గట్టిగా అడిగాడు ఆ యువకుడు. నారాయణ సోమయాజికి యేం జవాబు చెప్పాలో తోచలేదు.

"పోనీయ్ రా, పాపం బాపనాయన" అన్నాడు పక్కనే వున్న మరొకడు.

"బాపనాయన అయితేంది. మూడుసార్లు పుట్టిండా? ఇగో, యిట్టా రా. ఇయన్నీ దీసి పెరట్లో బావి కాడ పెట్టి పో" పక్కనే వున్న యెంగిలి కాళీ గ్లాసులు, వుమ్మేసిన పాత్రలు చూపిస్తూ అన్నాడు ఆ యువకుడు. నేనా అన్నట్టు చూశాడు నారాయణ సోమయాజి. "ఏం, యీ పని నువ్వు చెయ్యరాదని యేడైనా రాసుందా?" వంకర నవ్వు నవ్వుతూ అన్నాడు ఆ యువకుడు. చేసేది లేక పాత్ర సామాను పట్టుకొని లోనికి నడిచాడు నారాయణ సోమయాజి. "బాపనాయనకి మంచిగ బుద్ధి చెప్పినావ్ రా" అంటున్నారెవరో. వెనక్కి తిరిగి చూడలేకపోయాడు నారాయణ సోమయాజి.

రెండు గుమ్మాలు దాటి వెళ్ళేసరికి, పట్టు చీర కట్టుకొని, ఒంటి నిండా నగలు ధరించి వున్న దొరసాని యెదురైంది. ఎన్ని నగలు ధరిస్తేనేం, నల్లని ఆమె శరీర ఛాయకి అవి వన్నె తీసుకురాలేకపోతున్నాయి. నారాయణ సోమయాజికి సావిత్రి గుర్తుకు వచ్చింది. నారచీర కట్టుకున్నా, పసుపుతాడు వేసుకున్నా, నుదుటన కాసంత బొట్టుపెట్టుకొని, అన్నపూర్ణా దేవిలా వుండేది.

తాంబూలం నములుతున్న నోటితోనే "ఏం గావాలే?" అని బొంగురు గొంతుతో అడిగింది దొరసాని. ఆమె పక్కనున్న దాసి, అతని చేతిలో వున్న పాత్ర సామాన్లు అందుకొని, పెరట్లోకి వెళ్ళిపోయింది.

"దీర్ఘ సుమంగళీ భవ! అమ్మా, అన్నార్థినై వచ్చాను" అన్నాడు నారాయణ సోమయాజి.

ఎగాదిగా చూసి, రా అన్నట్టు సైగ చేసి, లోనికి నడిచింది దొరసాని. ఆమె వెనుక నిస్సహాయంగా నడిచాడు నారాయణ సోమయాజి. రెండు గదులు దాటిన తరువాత, విశాలమైన భోజనశాలకి ఆనుకొని వున్న వంటింట్లోకి నడిచి, "ఇగో, ఆడున్న సిబ్బెలు, గిన్నెలు అన్నీ మంచిగ శుభ్రం చెయ్" అంటూ అంట్ల గిన్నెలు చూపించి, తను వసారాలో వున్న తూగుటూయ్యాలలో కూర్చొని వూగసాగింది దొరసాని. నారాయణ సోమయాజి నిర్ఘాంతపోయాడు. ఎలాంటి వాణ్ణి, యెలా అయిపోయాను అనుకున్నాడు. మంత్రసాని పనికి వొప్పుకున్నాక అన్నీ చెయ్యాల్సిందే అనుకుంటూ ఆత్మారాముణ్ణి తిట్టుకుంటూ దొరసాని అప్పగించిన పని ముగించి, ఒక పక్కన నిలుచున్నాడు.

దొరసాని యెంతకీ తనవైపు చూడదే. వంటింట్లో గట్టుమీద పచ్చని అరటి గెలలు వున్నాయి. నాలుగైదు పళ్ళు కింద రాలిపడ్డాయి కూడానూ. దాసీది వచ్చి, వాటిని తీసి బయట పడేస్తుంటే ప్రాణం వుసూరు మంది నారాయణ సోమయాజికి. రెండు ఘడియలు గడిచేయి. నిలుచుని నిలుచుని కాళ్ళు నొప్పెడుతున్నాయి. కడుపులో అగ్నిహోత్రుడు జ్వలించిపోతున్నాడు. ధైర్యం చేసి దొరసాని ముందుకు వెళ్ళి నిలబడ్డాడు. అతని వంక చిరాగ్గా చూస్తూ, "ఇయ్యాలకేం లేవుగానీ, రేపు రా, పో" అంది దొరసాని. నారాయణ సోమయాజికి కోపం, వుక్రోషం తన్నుకొచ్చాయి. ఏం చెయ్యగలడు తను? శపించలేడు, రోదించలేడు. ఉదరంలో జ్వలిస్తున్న అగ్నిహోత్రుణ్ణి తలచుకుంటూ ఋగ్వేదాంతర్గతమైన అగ్ని సూక్తం అందుకున్నాడు.

"అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్ | హోతారం రత్నధాతమమ్ ||
అగ్నిః పూర్వేభిర్ ఋషి భిరీడ్యో నూతనై రుత ! సదేవాన్ ఏమ వక్షతి !!
అగ్ని నా రయిమశ్నవత్ పోషమేవ దివే దివే !యశసం వీర వత్తమమ్ !!

అగ్నేయం యజ్ఞ మధ్వరం విశ్వత: పరిభూరసి ! స ఇద్దేవేషు గచ్ఛతి !!”

వేదం వల్లిస్తూనే, ఎవరి వంకా చూడకుండా, పెద్ద పెద్ద అంగలేస్తూ, యింట్లో నుంచి బయటకు వచ్చేస్తున్నాడు. ఎర్రబడిన దేహంతో నడిచివస్తున్న హుతాశనుడిలా వున్నాడు. ఇంకా ప్రధాన ద్వారం వరకూ రాకముందే, పెరట్లో నుంచి అరుపులు వినిపించాయి. దాసీలు, పనివాళ్ళూ, అంతా హడావుడిగా పెరట్లోకి పరుగులు తీస్తున్నారు. ఎలాంటి నిప్పు రవ్వా పడకుండానే, ధాన్యాగారం తగలబడిపోతోంది. అగ్ని హోత్రుడు వేయి నాలుకలతో చెలరేగుతున్నాడు. మంటలు వేగంగా వంటింటి వైపు విస్తరిస్తున్నాయి. పనివాళ్ళతో పాటు, యింట్లో వున్న వాళ్ళందరూ దొరగారితో సహా బెంబేలెత్తి పరుగెడుతున్నారు. ఎవ్వరూ యేమీ చెయ్యలేకపోతున్నారు.

వేదోచ్చాటన చేస్తూ వస్తున్న నారాయణ సోమయాజికి యేం జరుగుతోందో తెలియడం లేదు. పూనకం వచ్చిన వాడిలా నడుస్తూ, గడీ లోంచి బయటకు వచ్చేసి, ఎదురుగా వున్న యింటి అరుగుమీద కూర్చున్నాడు. వూరు వూరంతా కదలి వచ్చింది. అగ్ని కీలలు తమ యిళ్ళ మీదకి యెక్కడ వ్యాపిస్తాయోనని భయభ్రాంతులౌతున్నారు. ఎవరో వచ్చి నారాయణ సోమయాజిని అడిగారు “ఏం జరిగింది స్వామీ?” అని.

“బ్రహ్మ తేజస్సు ఆకలి తీర్చుకుంటోంది” నిర్లిప్తంగా అన్నాడు నారాయణ సోమయాజి. చుట్టూ వున్న బ్రాహ్మణ్యానికి అర్థమైపోయింది. ఈ మహా పండితునికి యేదో జరగరాని అవమానం జరిగి వుంటుంది. దాంతో అగ్నిని ఆవాహన చేశాడు అని. చుట్టుపక్కల యిళ్ళున్న వాళ్ళు వచ్చి “రక్షించండి స్వామీ” అంటూ నారాయణ సోమయాజి కాళ్ళ మీద పడ్డారు.

అప్పటికి పూర్తిగా లౌకిక జగత్తులోకి వచ్చాడు నారాయణ సోమయాజి. ఎదురుగా చూస్తే, దొరగారి గడీ అంతా మంటల్లో దగ్ధమౌతూ కనిపించింది. తనవంక భయంతో, ఆశతో చూస్తున్న జనం కనిపించేరు. వెంటనే “యచ్చిద్ధి తే విశో యథా ప్ర దేవ వరుణ” అంటూ వరుణసూక్తం వల్లించడం మొదలుపెట్టేడు. రెండు నిమిషాలలో, యెక్కడా మబ్బు తునకైనా లేకుండానే, దట్టమైన వర్షం గడీ వున్న మేరకు గోడ కట్టినట్టుగా కురవసాగింది. ప్రజలంతా ఆశ్చర్యపోయి చూస్తున్నారు. పక్కనున్న యిళ్ళమీద ఒక్క నీటి చుక్కైనా పడలేదు. అగ్ని జ్వాలలు చల్లారాయి. గడీ మొత్తం బూడిద కుప్పలా మారింది. విషయం దొర చెవిన చేరింది. దొర పరుగెట్టుకుంటూ వచ్చి నారాయణ సోమయాజి పాదాల మీద పడ్డాడు.

“నీ వైభవం నీతోనే సరి. నీ వంశంలో నీ తరవాత యింకెవ్వరికీ సుఖ ప్రారబ్ధం లేదు. ఇది దైవ నిర్ణయం” అంటూ వుత్తరీయం బుజాన వేసుకొని బయల్దేరాడు నారాయణ సోమయాజి. అతని నోట వచ్చిన మాట అక్షర సత్యమై చరిత్రలో నిరూపితమైంది.

(ఇది తెలంగాణలో నవాబుల కాలంలో జరిగిన యదార్థ సంఘటనగా జనశ్రుతిలో వుంది)

# నెక్స్ట       యమున చింతపల్లి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"నాకు ఏదో అనుమానంగా ఉంది"

"దేని గురించి "

"రావలసిన డేట్ దాటిపోయి నాలుగు రోజులు అయ్యింది"

"ఛా, వద్దన్నా వినలేదు నువ్వు.... అందుకే ఇలా అయ్యింది" విశాల్ కంఠం నిండా విసుగు.

నన్ను తప్పు పట్టటం యెంతో తేలిక విశాల్ కు. తనని పెళ్లి చేసుకున్న ఈ రెండేళ్ళల్లో నేను గమనించిన విషయం అది.అసలు అది మాత్రమే తేలిక తనకి. ఇంటి పని అందుకోవటం,చిన్ని చిన్ని అందాలను ఆస్వాదించటం అవన్నీ కష్టమే. కాని ఆ తేలిక తనాన్ని అంత తేలికగా ఈ మాటు భరించాలనిపించలేదు.

"చూడు విశాల్, కొన్నిపనులు కేవలం ఒక్కరు మాత్రమే చెయ్యలేరు.రెండు చేతులూ కలిస్తేనే జరుగుతాయి" నా గొంతులో తీవ్రత నాకు తెలుస్తూనే ఉంది.

"నిజమే.కాని అర్ధరాత్రి నిద్ర పోతున్న నన్ను లేపి...."

"చట్ " చిటుక్కున అక్కడనుండి లేచి వెళ్లి పోయాను.

పున్నమి రోజున చంద్రుని చూసి మనసులో చెలరేగే ప్రణయ భావాలకి అడ్డుకట్ట వెయ్యలేక జీవితభాగస్వామి 'తట్టి లేపి', ఎదచేరి....అనుభవించి, ఆస్వాదించి......అలసి... ఆ జ్ఞాపకాన్ని పదిలపరుచుకోవటమే నేను చేసిన తప్పా? ఇది తప్పు ఒప్పుల సమస్య కాదు.ఆ కలయిక ఓ జీవిగా ఊపిరిపోసుకుంటుందేమో అనే భయం. అలా ఊపిరి పోసుకోకూడదనే ఓ ఆలోచన....

ఆ ఆలోచన విశాల్ కే ఉందా.....నాకు లేదా? నాకూ ఉంది. ఈ ఆలోచన పాపం కాదా?కాదు,కాదు...బంగారు భవిష్యత్తు పట్ల మమకారం. ఎవరికి బంగారు భవిష్యత్తు? నాకా...మాకా...ఎప్పుడో భవిష్యత్ లో పుట్టబోయే బిడ్డకా... 'అందరికి'. 'అందరికా ' ఎవరో నిలదీస్తున్న భావన. మళ్ళీ ఆలోచన విశాల్ మాటల మీదకి మళ్ళింది.అసలు విశాల్ అంత చీప్ గా యెట్లా మాట్లాడాడు నన్ను భాద్యురాలిని చేస్తూ...

"మనం తొందరపడ్డాము.కాస్త జాగ్రత్తలు తీసుకునుంటే బాగుండేది" అని విశాల్ మాట్లాడి ఉంటే కొంత ఊరటగా అనిపించేది. కాని ఇలా నన్ను వేలెత్తి చూపటం నాకు కష్టంగా ఉంది.

"కూల్ ఇందు! ఒక్కోసారి పిరియడ్ మామూలుగా ఆలస్యం అవ్వొచ్చు కదా| ముందు టెస్ట్ చేసి ప్రెగ్నన్సీ అవునో కాదో తేల్చుకో. ఆ తరువాత ఆలోచిద్దాము ఏం చెయ్యాలో" టీ ని మరగపెడుతున్న నా వెనకగా విశాల్. తనలో నచ్చేది అదే. తను తొందరపడ్డా , నేను తొందరపడ్డా ముందుగా అడుగేసి అనునయంగా మాట్లేడేది విశాలే.

"ప్రెగ్నన్సీ టెస్ట్ కిట్ కొనుక్కొచ్చుకోవాలి. ఇప్పుడు ఆఫీసు టైం అయ్యిందిగా. సాయంత్రం టెస్ట్ చేసుకుంటాను" అంతకు ముందు తన మీదున్న ఉన్న చిరాకు పోయి నా బాధ ని చెప్పుకోవటానికి అవకాశం వచ్చిందనే రిలీఫ్ తో నా జవాబు.

"టెన్షన్ పడకు . అలాంటి తప్పు అవ్వదులే " అన్నాడు నా భుజం మీద చెయ్యివేసి ధైర్యం చెపుతున్నట్లుగా.

ఏది తప్పు? ఆ రాత్రిని ఆస్వాదించటమా...కన్సీవ్ అవ్వటమా? దానికి సరియైన జవాబు నా దగ్గర ఏమి లేదు మూగ పోయిన మనసు తప

★★★★

"ఏంటి ఇందూ ,ఈ రోజు అంత డల్ గా ఉన్నావు?" కొలీగ్ స్నేహ ప్రేమగా అడిగింది.

"టెన్షన్ గా ఉంది"

"దేనికీ , ప్రమోషన్ వస్తుందో రాదో అనా"

"దాని గురించి కాదు ప్రెగ్నన్సీ ఏమో అని భయంగా ఉంది"

"ఏంటి, జాగ్రత్తలు తీసుకోలేదా ? నీకు ప్రమోషన్ వస్తుందని గట్టి నమ్మకం ఉంది. ప్రమోషన్ వచ్చిన వాళ్ళని ఒక సంవత్సరం పాటు ప్రాజెక్ట్ కోసం అమెరికా పంపిస్తారని నీతో సహా అందరికీ తెలిసిన విషయమే. ఈ పరిస్థితి లో ప్లాన్ లేకుండా నువ్వు ఇలా చెయ్యటమేమిటీ?" కసిరినట్లే అడిగింది.

స్నేహ నా కన్నా రెండేళ్ళు సీనియర్. చాల కలిసిపోయే తత్వం. రెండుసార్లు ప్రేమ విఫలం అయిన తరువాత ఇప్పుడు 'సహజీవనం' లో ఉంది. నా పెళ్లి కుదిరిందని చెప్పగానే ' ఇందూ , చేసుకున్నవాడు ఎలాంటి వాడో తేలేదాకా పిల్లల గురించి ఆలోచించకు. ఒక వేళ ఏదన్నా తేడా వచ్చి విడాకులు తీసుకోవాలంటే పిల్లలు ఉంటే పెద్ద తలనొప్పి. ఆ తరువాత వేరే పెళ్లి చేసుకోవాలన్నా కూడా కష్టమే" అని సలహా చెప్పిన వ్యక్తి.

"ఈ నెల నేను ఫ్యామిలీ ప్లానింగ్ పిల్స్ వాడల. రోజుల లెక్క , ఇంకా వేరే పద్ధతులు ఫాలో అవ్వటంలో ఏదో పొరపాటు జరిగింది"

"ఉద్యోగం, జీవితం రెండూ తేలికగా తీసుకునే నాలాంటి వాళ్ళంటే ఫరవాలేదు. కెరియర్ మీద శ్రద్ధ, మంచి క్వాలిఫికేషన్స్ (అర్హతలు) ఉన్న నీలాంటి వాళ్ళు ఇలా ఉంటే ఎలా ఇందు?"

నిలదీసి అడుగుతున్న స్నేహకు జవాబు చెప్పలేనట్లు నిస్సహాయంగా చూసాను. నా మొహం చూసి జాలేసిందేమో "కూల్, ఇందు. డోంట్ వర్రీ. అదే నిజమైతే నెక్స్ట్ ఏం చెయ్యాలో ఆలోచించు.డి.ఎం.సి చేయించుకోవచ్చు. చేయించుకున్న కొన్ని గంటలలోనే డిశ్చార్జ్ చేసేస్తారు. జస్ట్ టు డేస్ రెస్ట్. అంతే.సాధ్యమయినంత తొందరగా చేయించుకోవటం మంచిది. ధైర్యంగా ఉండు. నేను హెల్ప్ చేస్తాను. నాకు ఆ విషయం లో కూడా అనుభవముందిలే. మీ పెద్ద వాళ్లకు మాత్రం తెలియనీకు. వాళ్ళు ఇలాంటి నిర్ణయాన్ని ఒప్పుకోకపోవచ్చు. వాళ్లకి సెంటిమెంట్స్ అడ్డువస్తాయి" అని ఏ భావము లేకుండా యెంతో మామూలుగా చెప్పింది.

నాలో ఏదో ఒత్తిడి...తలలో భారం. ఇహ తట్టుకోలేక 'కాఫీ తాగి వస్తాను' అని నా ఆలోచనలను కూడగట్టుకుని ఒంటరిగా క్యాంటీన్ కి బయలుదేరాను.

★★★★

నా టెన్షన్ కి తోడు ఆఫీసులో పని ఎక్కువయ్యి బయటపడేసరికి ఏడు దాటిపోయింది. వస్తూ వస్తూ మెడికల్ షాప్ లో 'ప్రెగ్నాఎడ్వాన్స్ డివైస్' కిట్ కొనుక్కొచ్చాను. ప్రొద్దున్నుండీ వర్క్ తో బిజీ గా ఉండి ఈ విషయం గురించి ఆలోచన , ఆందోళన తగ్గింది. ఈ కిట్ కొనగానే మరల మొదలయ్యింది. 'ప్రెగ్నెన్సీ అవునా , కాదా' దోవంతా ఒకటే ఆలోచన.

రాగానే టెస్ట్ చేసాను. టెస్ట్ రిజల్ట్స్ తెలిసే ఆ కొన్ని నిమిషాలు నా గుండె చప్పుడు నాకే వినపడుతోంది....రిజల్ట్ నెగటీవ్ వచ్చింది. 'హమ్మయ్య , నేను భయపడ్డట్లు ఏమీ కాలేదు. నా ప్రమోషన్, ఆ పైన ప్రాజెక్ట్ కు అమెరికా వెళ్ళటం అన్నీ హాయిగా జరిగిపోతాయి. ఇహ ఏ సమస్య లేదు' ఆనందంతో బాత్ రూమ్ లో ఎదురుగా అద్దం లో కనపడుతున్ననా ప్రతిబింబానికి 'ఇందు, యు ఆర్ లక్కీ ' అని చెయ్యెత్తి థమ్సప్ సైన్ చూపించాను .

విశాల్ కి ఫోన్ చేసాను. డ్రైవింగ్ లో ఉన్నాడేమో మొబైల్ ఎత్తలేదు. నా సంతోషాన్ని వెంటనే ఎవరితో ఒకరితో పంచుకోవాలని తీవ్రమైన కోరిక. అమ్మా, నాన్నలకి చెప్పలేను. ఇంకా ఎవరు? స్నేహతో చెపితే? అవును,తను కూడా సంతోష పడుతుంది.. వెంటనే ఫోన్ చేసాను.

ఫోన్ లో విషయం చెప్పాను. 'కంగ్రాట్స్ . నాకు చాల సంతోషంగా ఉంది. చిన్న విషయం ఇందు, ఆ టెస్ట్ కరక్ట్ గానే వస్తుంది కాని ఒక్క శాతం తప్పయ్యే అవకాశం ఉంది. అందుకని నువ్వొక పనిచెయ్యి . రేపొద్దున నిద్ర లేవగానే ఎర్లీ అవర్స్ యూరిన్ తో టెస్ట్ చేసుకో. అప్పుడు చేస్తే వచ్చే రిజల్ట్ నూటికి నూరు పాళ్ళు కరెక్ట్. ఆ సారి రిజల్ట్ కూడా నెగటీవ్ వస్తే ప్రెగ్నెన్సీ రాలేదని ఖచ్చితంగా నమ్మొచ్చు. ఆల్ ది బెస్ట్" అని చెప్పి ఫోన్ పెట్టేసింది స్నేహ.

క్షణం క్రితం ఉన్న ఆనందం ఆవిరయిపోయింది. అరగంట తరువాత వచ్చిన విశాల్ కు విషయం చెప్పాను.

"ఇది తప్పయ్యేందుకు వన్ పర్సంటే కదా ఛాన్స్. రేపు కూడా నెగటీవే వస్తుందిలే. టెన్షన్ పడకు. ఆలసిపోయినట్లున్నావు. తొందరగా పడుకో " అంటూ తేలిగ్గా తీసుకుని భోజనం చేసి హాయిగా నిద్రపోయాడు.నాకు మటుకు అస్సలు నిద్ర రాలేదు. ఒకటే టెన్షన్. ఆందోళన పడీ పడీ అలసిపోయి అర్ధరాత్రి ఎప్పుడో నిద్రపోయాను.

★★★★

తెల్లవారుతుండగా మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి హడావిడిగా వెళ్లి టెస్ట్ చేసుకున్నాను.

రిజల్ట్స్ తెలిసే ఆ నాలుగు నిమిషాల్లో అమెరికా ప్రాజెక్ట్ నుండి రక రకాల దేవుళ్ళ ప్రార్ధనలు దాకా అన్నీ బుర్ర లో గిర్రున తిరిగాయి.... రిజల్ట్ పాజిటీవ్.... కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి...ఛా , ఇహ నా అమెరికా ప్రయాణం, ప్రాజెక్ట్ అన్నీ గాల్లో కలిసిపోయినట్లేనా?ఊహు, వాటిని పోగొట్టుకోను...పోగొట్టుకోకూడదు. మరి ఏమి పోగుట్టుకోవాలి?

మనసంతా విచారం....ఎలాగో నడుచుకుంటూ వెళ్లి హాల్లో సోఫాలో వాలి పోయాను. కడుపులో తిప్పుతున్నట్లుంది. కడుపుతో ఉన్న ఫలితమా లేదా రాత్రి నిద్ర లేని కారణమా?! నేనేం దోషం చేసానని నాకు ఈ శిక్ష.

సినిమాల్లో , నా తోటి ఉద్యోగస్తులు కడుపుతో ఉన్నామని తెలియగానే స్వీట్లు పంచటం , హడావిడి చెయ్యటం చూసాను. మరి నేనేంటి శిక్షలా అనుకుంటున్నాను. నాకెందుకు ఇంత దుఃఖం ...నేను మంచి అమ్మని కాదా ? రాక్షసినా? ఊహు, నేను మంచి అమ్మనే. ఎక్కడ పిల్లల్ని చూసినా పలకరించకుండా ఉండలేను. వాళ్ళని చూస్తేనే చాలు నాకు చాల సంతోషంగా అనిపిస్తుంది. నన్ను నేను మరిచిపోయి ముద్దు చేస్తాను. కాని ఇప్పుడే తల్లిని అయ్యి ఉద్యోగంలో ఎదిగే అవకాశాన్ని వదులుకోవటం నాకు,విశాల్ కి ఇద్దరికీ ఇష్టం లేదు. అందుకే ఈ బాధంతా.

“ఏంటి ఇందూ, ఇక్కడ పడుకున్నావు. ఒంట్లో బాలేదా“ లేచి వచ్చిన విశాల్ ప్రక్కన కూర్చుని ఆత్రుతగా అడిగాడు. ఆపుకోలేని దుఃఖంతో విశాల్ ని చుట్టేసాను.

★★★★

ఆఫీసుకి లీవ్ మెయిల్ చేసి హాస్పటల్ లో అడుగుపెట్టాను. ఎన్నో ప్రైవేట్ హాస్పిటల్స్ లానే ఆ ఆసుపత్రి కూడా కళ కళ లాడుతోంది...హాస్పిటల్ కళ కళలాడటం అనటం తప్పేమోరిసెప్షన్ లో డబ్బులు చెల్లించి , పేరు రాయించుకుని టోకెన్ తీసుకున్నాను. నా నెంబర్ పది. వెయిట్ చెయ్యాలి. వచ్చి కుర్చీలో కూర్చుని చుట్టూతా చూసాను.

నా ప్రక్కన చేతిలో చిన్న బిడ్డతో ఓ అమ్మాయి. నా వయసే ఉంటుంది. ఆ బిడ్డ మీదకి వంగుని ముద్దు చేస్తూ ఇంకో యువతి . ఆ అమ్మాయి చెల్లెలేమో. ఇంకో ప్రక్క గుస గుస లాడుకుంటూ యువతీ , యువకుడు. మరో ప్రక్క మధ్య వయస్కురాలు. ఆమె ప్రక్కన కూతురో లేక కోడలోకూర్చునుంది. నా పరిస్థితి తెలిసుంటే అమ్మో, అత్తయ్యో ఇలాగే ఊరినుండి ఆఘమేఘాల మీద ఊడిపడి నాకు తోడుగా వచ్చేవారేమో. కాని వాళ్ళకి తెలియటం మాకిష్టం లేదు. అందుకే చెప్పలేదు. బహుశా నేను ఒక్కదాన్నేనేమో ఒంటరిగా వచ్చింది. రేపు అయితే విశాల్ కూడా వచ్చేవాడు. ఈ రోజు తన ఆఫీసు హెడ్ వస్తున్నాడు. సెలవు తీసుకోవటం కష్టం. రేపటిదాకా ఆగే ఓపిక లేక ఒక్కదాన్నే వచ్చేసాను.

ఎత్తైన పొట్టతో ఆయాస పడుతూ ఓ పాతికేళ్ళ అమ్మాయి, ఆమె చేతిని పట్టుకుని ఓ పెద్దామె నడుచుకుంటూ వచ్చి నా ఎదురు కుర్చీలో కూర్చున్నారు. నాకు కూడా అంత పెద్ద పొట్ట వస్తుందా...ఊపిరి ఆడుతుందా ...నేను వచ్చినది ఎందుకు ... ఆలోచించే విషయం ఏమిటీ ? అదా నా భవిష్యత్? ఉహు, అది కాదు.అది కాకపోతే మరేమిటీ? అదీ నా భవిష్యత్ లో భాగమే కాని అది ఇప్పుడు కాదు. మరి ఎప్పుడు? ....రక రకాల ఆలోచనలతో అయ్యోమయంగా ఉంది.

“ఎన్నో నెల “ ఇంకాస్త అవల కూర్చుని ఉన్నామె నా ఎదురుగా కూర్చున్నామెని ఆసక్తిగా అడిగింది.

“ఎనిమిదో నెల”

“పెళ్లి అయ్యి ఎన్నేళ్ళు”

“పెళ్లి అయి ఇంకో రెండు నెలలకి ఏడాది నిండుతుంది “

“వెంటనే వచ్చిందా “

“అవును. ‘హాయిగా , స్వేచ్చగా ఎంజాయ్ చెయ్యక ఈ పిల్లల గోల ఏమిటీ’ అని వాళ్ళు ఏదో పిచ్చి పని చేద్దామనుకున్నారు. ‘ఫ్యామిలీ ప్లానింగ్ టాబ్లెట్స్ ఏళ్ళతరబడి వాడటం, ఏదన్నా తేడా వస్తే అడ్డు తొలగించుకోవటం....అవన్నీఆరోగ్యమైన పనులు కావు. తొందరపడి తిక్క పనులు చెయ్యకండి. మీకు ఇబ్బంది లేకుండా పుట్టే బిడ్డని మేమే పెంచుతాము’ అని ఇరు పెద్దలం అడ్డంపడి చెప్పి ఎలాగో ఒప్పించాము” ఆమె దభాయించి చెపుతోంది. ఆ కడుపుతో ఉన్న అమ్మాయి చిరాకును అణచుకుంటున్నట్లు చూస్తోంది.

ఏంటో మనసంతా గందరగోళంగా ఉంది. మొబైల్ లో వాట్సప్ ఓపెన్ చేశాను. జోక్స్, మంచి మెసేజస్, పిల్లల సరదా వీడియోలు .....దానిలో పూర్తిగా మునిగిపోయాను.

"హాయ్ ఇందు " పలకరింపుకు తలెత్తి చూసాను. ఎదురుగా మధురిమ నాలుగేళ్ల తన పాప చెయ్యి పట్టుకుని.

"హాయ్, మధూ ఎలా ఉన్నావు"

"బ్రహ్మాండంగా ఉన్నాను. నువ్వేంటి ఇక్కడికి వచ్చావు...ఏదన్నా శుభవార్తా " మొహమంతా సంతోషం నింపుకుని అడుగుతోంది మధురిమ.

ఏం చెప్పాలో అర్థం కాలేదు.ఇంతలో 'ఆంటీ , మీ ఫోన్ లో కొత్త గేమ్స్ ఉన్నాయా " అంటూ నాలుగేళ్ల పాప నా చేతిలో ఫోన్ తీసుకోవటంతో సంభాషణ మారి పోయింది.

"దీనికి , భలే తెలివి. ఏది చూసిన యిట్టే పట్టేస్తుంది. డాన్స్ నేర్చుకుంటోంది . ఆ టీచర్ కూడా 'మీ అమ్మాయి చాల ఫాస్ట్ అండీ అంటుంది'. స్టేట్ కాపిటల్స్ అన్నీ చెప్పేస్తుంది. యు ట్యూబ్ లో పెట్టాను. లింక్ పంపుతా చూడు " గల గలా తన పాప తెలివి గురించి ఆనందంగా చెపుతోంది.

"అమ్మా , నేను చెల్లి తో ఆడుకోవాలంటే ఇంకా ఎన్ని రోజులు ఆగాలి' తను ఇక్కడికి వచ్చినది ఎందుకో గుర్తుకొచ్చినట్లు ఫోన్ నా చేతికిచ్చేసి ఊపిరి ఆడకుండా అడుగుతోంది పాప.

బి.టెక్. అయ్యి ఉద్యోగంలో చేరిన ఆరునెలలకే మధురిమకి పెళ్లి చేసేసారు పెద్దలు. పెద్ద కుటుంబము, వచ్చిపోయే బంధు వర్గము...చాల బిజీ జీవితం తనది. పెళ్లి అయ్యి ఏడాది తిరక్కుండానే పాప. దాంతో జాబ్ కి స్వస్తి చెప్పి కుటుంబ భాధ్యతలను స్వాగతించింది. అంత తీరుబడి లేని జీవితమైనా కూడా అందరితో ఉన్న స్నేహబంధాన్ని చాల చక్కగా నిలుపుకుంటుంది.

"ఇది వేసే ప్రశ్నలతో మనం మాట్లాడుకోవటానికి ఉండదు. ఓ సారి నువ్వు, విశాల్ భోజనానికి ఇంటికి రండి. గుడ్ న్యూస్ ఉంటే ఫోన్ చేసి చెప్పు ఇందూ " అంటూ పిల్లని తీసుకుని వెళ్ళిపోయింది.

ఆనాడు అంత తొందరగా పెళ్లి చేసుకుని వెంటనే పిల్లని కనేసిన దాన్ని చూసి ఫ్రెండ్స్ అందరం తెగ బాధ అయిపోయాము. కాని దాని మొహం లో ఉన్న ఆనందం, తృప్తి చూస్తే మేము పడ్డ బాధ తప్పేమో అనిపిస్తోంది.

" ఈ మా బంగారు తల్లి పెంపకం కోసం మీ అమ్మ ఉద్యోగం వదులుకుంది" అని నాన్న ఒకసారి మురిపెంగా నాతో అన్న మాటలు కూడా ఆ క్షణం గుర్తుకొచ్చాయి. అది విన్న ఆ రోజు 'నాకోసం అమ్మ ఉద్యోగం వదులుకుంది' అని నాలో ఓ గర్వం. అలాంటిది ఈనాడు నేను ఆలోచిస్తున్నది ఏమిటి?

"మేడం, మీరు రూమ్ లోకి వెళ్లి కూర్చోండి" రిసెప్షన్ మాటలకు 'లోపల ఇంకో రౌండ్ వైటింగా' అనుకుంటూ రూమ్ లోకి నడిచాను.

" 'పెళ్ళవ్వగానే పిల్లలేంటీ ' అని మూడు సంవత్సరాలుగా మందులు మింగావు. అప్పుడు వద్దనుకున్నావు ఇప్పుడు కావాలనుకుంటే ప్రెగ్నన్సీ రావటం లేదు" డాక్టర్ రూమ్ నుండి బయటకు వచ్చి నన్ను దాటి వెడుతున్న ఆ మధ్య వయసామె ప్రక్కనున్న అమ్మాయితో అంటున్న మాటలు వినపడి నా మనసులో ఏదో కలవరం.ఆ అమ్మాయి మొహం నిండా విచారం.

★★★★

మధ్యలో స్క్రీన్ తో రెండుగా డివైడ్ చెయ్యపడ్డ ఆధునికంగా ఉన్న ఎసి రూమ్ అది. అక్కడున్న కుర్చీలో కూర్చున్నాను. అవతల డాక్టర్ పేషెంట్ తో ఏదో జోకు వేసినట్లుంది . నవ్వులు వినపడుతున్నాయి.

డాక్టర్స్ కి జాలీ మూడ్స్ కూడా ఉంటాయా? 'కార్పోరేట్ ఉద్యోగాలు మెకానికల్ ,ఎలా చేస్తారో' అని మమ్మల్ని అంటారు కాని ప్రొద్దున్నుండి రాత్రి దాకా రక రకాల కేసులు...ఒకరు బిడ్డ కావాలని వస్తే మరొకరు వద్దని, వచ్చిన గర్భాన్ని నిలుపుకోవాలని తాపత్రయంతో కొందరు వస్తే వచ్చిన గర్భాన్ని పోగొట్టుకోవాలని ఇంకొకరి ఆరాటం ....ఆత్రుత ఆపుకోలేక ఆడా, మగా అని అనుమానం తీర్చుకోవటం కోసం ఇంకొందరు. అమ్మో , అన్ని రకాల మనుష్యులతో డీల్ చెయ్యటం యెంత కష్టమో!

"ప్రీతి, ఈ సారి కూడా అబార్షన్ చేయింకోవాలనుకుంటున్నావా? డాక్టర్ గానే కాదు నీ మంచి కోరే మనిషిగా కూడా చెపుతున్నాను. ఇప్పటికే రెండు సార్లు అబార్షన్ చేయించుకున్నావు. అసలే ఈ రోజుల్లో ఆలస్యంగా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. దానికి తోడు పిల్లలు , పెంపకం మీ ఎదుగుదలకు అడ్డమని ఇలా చేసుకుంటూ పోతే కావాల్సినపుడు కన్సీవ్ కాలేకపోవచ్చు. ఇంకోసారి ఆలోచించు" జాలీ మూడ్ ప్రక్కన పెట్టి స్థిరంగా చెప్పిన డాక్టర్ మాటలు బయటకు వినపడ్డాయి.

"లేదు డాక్టర్. ప్లానింగ్ ఫెయిల్ అయ్యి వచ్చిన ప్రెగ్నంసీ కాదిది. బేబీ కావాలని నేను , మా వారు నిర్ణయించుకున్నాము. సో, వుయ్ ఆర్ డ్రీమింగ్ ఎబౌట్ అవర్ స్వీట్ బేబీ"

"ఓహ్, దెన్ కంగ్రాట్స్". పది నిమిషాలు మౌనం. రిపోర్ట్స్ ఏమన్నా చూస్తోందో ... టెస్ట్ చేస్తోందో!?

"గుడ్ ప్రీతి. ప్రెగ్నెన్సీ వద్దనుకుని ఒకటికి రెండుసార్లు అబార్షన్ చేయించుకున్నా కావాలనుకోగానే కన్సీవ్ అవ్వటం అంత తేలిక కాదు. అందరికీ ఇలా జరగక పోవచ్చు.ఆ విధంగా నువ్వు చాల లక్కీ ప్రీతి. యై యాం వెరీ హ్యాపీ ప్రీతి" సంతోషం నిండిన గొంతుతో అభినందిస్తోంది డాక్టర్.

"థాంక్ యు డాక్టర్ " అని చెప్పి ఇవతలకు వచ్చిన ఆ ప్రీతి అనబడే ఆమె మొహం నిండా ఏదో ఆనందం, విజయ గర్వం.

"నెక్స్ట్" డాక్టర్ పిలిచింది.

"అవును , నెక్స్ట్ ఏమిటీ ? నేనేం చెయ్యాలి ? ఏది నిలుపుకోవాలి... కెరియర్ నా ....బిడ్డనా? "

"నెక్స్ట్" మరోసారి గట్టిగా పిలిచిన డాక్టర్ పిలుపుకు మనసు నిండా ముసురుకున్న ఆలోచనలతో లేచి స్క్రీన్ అవతల అడుగు పెట్టాను.

# మానస సాగర మధనం - డా. యండమూరి సత్య కమలేంద్రనాథ్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**పొత్తిళ్ళలో పసిపాప** నిద్రపోతోంది. మధ్య మధ్య ఉలిక్కిపడుతోంది, నవ్వుకుంటోంది, తుళ్ళి పడుతోంది, చేతులూ కాళ్ళూ కొట్టుకుంటోంది. పసి హృదయంలో ఏ కలలు వస్తున్నాయో ఎవరికీ తెలియదు.

కూతురివైపే చూస్తోంది సుమతి. సంతానం కలిగిందనే ఆనందం కంటే పుట్టిన కూతురు భవిష్యత్తు ఏమవుతుందోననే భయం, తనలాగే అవ్వవలసి వస్తుందేమోననే ఆందోళన మనస్సులో ప్రళయం రేపుతోంది.

వీధిలోని మహిళలంతా వస్తున్నారు. పసిపాపని చూసి వెళుతున్నారు. అందరి దృష్టిలో ఒకే ఆలోచన "మరో ఆడపిల్ల - ఈ వీధిలో మరో అంగడి బొమ్మ జన్మించింది."

కూతురు తడబడే అడుగులతో, పడుతూ లేస్తూ నడుస్తోంది. వచ్చీరాని మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడుతోంది. ఆ యింట అందరికీ పాప వల్లే సందడి, కాలక్షేపం. వయస్సు పెరిగి మాటలు నేర్చి యింట తిరుగుతూ వుంటే, కూతురి వయస్సు పెరుగుతున్నందుకు సుమతి మనస్సులో బెంగ పెరుగుతోంది. ఆ యింట వాతావరణంలో పెరిగితే భవిష్యత్తు ఎలా వుంటుందో తనకు అనుభవమే. అదే పాప విషయంలో భయపెడుతోంది.

సాయంత్రం వీధి గుమ్మంలో నిలబడి వుంది. పాప నిద్రపోతోంది. పదిరోజుల క్రితం జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తోంది సావిత్రి.

ఆ రోజు రాత్రి ఏడుగంటలకి నాయకురాలు పిలిచి - తనని, రమని అడ్రసు చెప్పి వెళ్ళి రాత్రి గడిపి రమ్మంది. ఇద్దరూ బయలుదేరి వెళుతూవుండగా పెద్ద వయసుగల ముసలావిడనీ, యిద్దరు చిన్న పిల్లలనీ కూడా తీసుకుని వెళ్ళమంది. వాళ్ళంతా తమ కూడా ఎందుకో అర్థంకాలేదు. తెల్లవారుఝామున తిరిగి వస్తూవుండగా పోలీసు అడ్డగించాడు. ఆ సమయంలో ముసలావిడ సమయస్ఫూర్తితో తనని, రమని కూతుళ్ళని, పిల్లలు మనవలు అని చెప్పింది. పోలీసు మారుమాట్లాడలేదు. తనకి మాత్రం ఒళ్ళంతా వణుకు, గుండెల్లో దడ. ఆ రోజున పోలీసు స్టేషన్‌కి తీసుకుని వెళ్ళి విచారించి వుంటే మరుసటిరోజు పాప తల్లి ఎక్కడ వుందని యిల్లంతా వెతుక్కునేది. ఆ తర్వాత దాని జీవితం ఏమిటి?

చీకటిపడేవేళ అయింది సుమతి ఆలోచనల్లో వుండగా సందు చివరగా తన వయస్సుగల స్త్రీ నడచి రావటం కనిపించింది. ఆ సమయంలో ఏ నూతన స్త్రీ, ఆ సందులోకి రావటానికి సాహసం చెయ్యదు. వస్తే సమాజం ఆ స్త్రీని కూడా అంగడి బొమ్మగానే పరిగణిస్తుంది.

నడచి దగ్గరకు వచ్చే కొద్దీ ఎక్కడో చూసిన మొహంలా అనిపించి పరిశీలనగా చూసింది. దగ్గరకు రాగానే గుర్తుపట్టింది. పలకరించటానికి సంశయించింది. మౌనంగా వుండిపోయింది.

గుమ్మం ముందు నిలబడి "నువ్వు సుమతివే కదూ" అంది ఆ స్త్రీ.

మెట్లు దిగి "సుధా! నువ్వా ఎలావున్నావ్?" అంటూ ఎన్నో ప్రశ్నలు వెంటవెంటనే అడిగింది సుమతి.

"బయటే నిలబడి మాట్లాడతావా? ఇంట్లోకి రానీయవా?" అంది సుధ. "సుధా! నువ్వు యీ వీధిలోకి రావటమే ఊహించలేదు. పైగా యింట్లోకి వస్తానంటున్నావ్" అంటూ లోపలికి నడిచింది.

సుధ నవ్వుతూ "సుమతీ ప్రస్తుతం నేను స్వచ్ఛంద సేవా సంఘసంస్కర్తని తెలుసా! రా అంటూ గడపదాటి లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుని "ప్రస్తుతం ఏం చేస్తున్నావ్?" అంది.

"ఏవుంది? ఈ వీధిలోని బాగోతం నీకు తెలియనిది కాదు"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"ఎనిమిదివరకు"

"అంటే నేను వూరు వదిలివెళ్ళిన తర్వాత చదువునేశావా?" అంది సుధ.

నిట్టూరుస్తూ "సుధా! నాలాంటి వాళ్ళకి చదువు మీద ఎంత యిష్టం వున్నా, ఈ వాతవరణంలో చదువుకోవడం పడదు. వయసు పెరిగి, శారీరక మార్పులు వచ్చేసరికి అమ్మ బడికి పంపటం మానేసింది. ఏడ్చాను తిండి మానేశాను. అయినా అమ్మ తనపట్టు విడవలేదు. మనకు చదువు లాభంలేదు, నువ్వు పై చదువులకి వెళ్ళినా సమాజంలో నీ గుర్తింపు మారదు. అందరూ ఆశగా కళ్ళతోనే విపరీతార్థాలు వచ్చేలా చూస్తారు. తర్వాత చేతులు వేస్తారు. సూటీపోటీ మాటలతో నీ మనస్సుకి తూట్లు పొడుస్తారు. అవి నువ్వు వినలేవు. మన జీవితాలు యింతే. ఈ వీధిలో అందరం అంగడి బొమ్మలమే. వయసు వున్నంతకాలం సాగుతుంది. ఆ తర్వాత అంతా భగవంతుడి దయ" అంది అమ్మ నేను మరింక మాట్లాడలేదు.

ఇంట్లోనే వుండి ఎన్నో పుస్తకాలు చదివాను. ఆ తర్వాత షరామామూలే. ఎంతోమంది పురుషులు స్త్రీని జనని, ధరిత్రితో పోలుస్తారు. అందుకే కాబోలు అంతమందిని భరించేశక్తిని యిచ్చాడు భగవంతుడు. ప్రతీమనిషి అవసరం తీరేవరకు రంభ, ఊర్వశి అని పొగిడేవారే. ఆ తర్వాత కనపడినా, మొహం చాటు చేసుకుని వెళ్ళిపోతారే కానీ పలకరించరు. మనం పలకరిస్తే అదేదో తప్పుగా భావించి మొహం చిట్లించి చూస్తారు. ఒకే వ్యక్తి నా జీవితంలో ప్రవేశించాడు. ఎంతో చెప్పాడు. ఆశపడ్డాను. చాలాకాలం కలిసివున్నాం. తన దగ్గర వున్నంతకాలం మనసా వాచా పతివ్రతలానే వున్నాను. అతనితో వుండగానే గర్భవతినయ్యాను, ఎన్నో కలలు కన్నాను ఇద్దరం కలిసి పాపతో

ఆడుకోవడం అల్లరి చేయటం, పాపని ఎత్తుకుని చేతులు మార్చుకుంటూ అలా నడుచుకుంటూ వెళ్ళటం ఎంత ఆనందంగా ఉంటుందోనని ఆశపడ్డాను. ఆ మనిషి ఒకరోజు కనపడకుండా పోయాడు. తిరిగి పక్షి గూటికి చేరిపోయింది.'' అని సుమతి చెపుతూ వుండగా ''అమ్మా'' అంటూ సుమతి కూతురు తడబడే వడివడి అడుగులతో వచ్చి సుమతి కుచ్చెళ్ళు పట్టుకుంది. బొద్దుగా వుంది. నవ్వుతోంది, వచ్చీరాని మాటలు పలుకుతోంది. పాపని చూడగానే సుధకి ముచ్చటేసింది. ఎత్తుకుని ముద్దాడింది.

''సుమతీ పాపని ఎలా పెంచుదామనుకుంటున్నావ్?'' అడిగింది సుధ

''సుధా! పాపని స్కూల్లో చేర్చగానే తండ్రి ఎవరని అడుగుతారు. ఎవరి పేరు రాయాలి? స్వార్ధ రహిత తల్లి పిల్లలకి తండ్రితో గుర్తింపు వుండాలని కోరుకుంటుంది. కానీ తండ్రి ఎంత స్వార్ధపరుడంటావ్? మా దగ్గర తన కోరిక తీరేవరకు నా పిల్లలంటాడు ఆ తర్వాత ఎవరి పిల్లలు అంటాడు. అదే పరిస్థితి నేను ఎదుర్కోబోతున్నాను.

పాప భవిష్యత్తు తలచుకుంటే అంతా అగమ్యగోచరం. నా తండ్రి ఎవరు అని అడిగితే ఏం చెప్పాలి. రేపు నా జీవితం ఏమిటో తెలిస్తే నా అసమర్ధతకి, చేసే వృత్తికి చూసే చూపు ఎంత ఏవగింపుగా వుంటుందో? ఆలోచిస్తూంటే మనసంతా కకావికలమైపోతూ వుంటుంది.''

''ఏం చేద్దామనుకుంటున్నావ్?''

''వయస్సు వున్నంతకాలం జరుగుతుంది. ఆ పైన భగవంతుడి దయ. ఎంతకాలం యిలా వుంటామో కూడా తెలియదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రస్తుతం వున్న జబ్బులు గురించి నీకు చెప్పనవసరంలేదు. పాపని ఈ పాపపంకిలంలోకి రాకుండా చేయడానికి శతవిధాల ప్రయత్నిస్తాను. అమ్మలా మాత్రం చెయ్యను'' అంది సుమతి స్థిరంగా.

''పాపని వదిలి ఉండగలవా?''

''అంటే''

''నాతో పంపిచేయి నేను స్వచ్ఛంద సేవా సంస్థలో పని చేస్తున్నానని చెప్పానుకదా! పాప భవిష్యత్తు బాధ్యత నేను వహిస్తాను. మాకు ఈ ఊళ్ళో అనాధ శరణాలయం వుంది. నీకు ఎప్పుడైనా చూడాలనిపిస్తే చూపిస్తాను. అంతవరకు నువ్వు రావద్దు'' అంది సుధ.

క్షణం మౌనం వహించింది సుమతి. ఆ క్షణంలోనే నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయానికి కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి. కొంగుతో తుడుచుకుంది. ఎదురుగా పాప చీర పట్టిలాగుతోంది ఎత్తుకోమంటూ చేతులు చాచింది. పాపని ఎత్తుకుని ''సుధా! నీ కూడా తీసుకుని వెళ్ళిపో. నాకు పిల్లలే లేరనుకుంటాను ఎప్పుడైనా దూరం నుంచి చూస్తానేమో కానీ, నా ఛాయ కూడా దానిమీద పడనివ్వను. కన్నతల్లిని అనే ఆలోచనే సమాధి చేస్తాను. నా కూతురి భవిష్యత్తుకంటే నాక్కావల్సింది ఏముంది? ఈ సమాజంలో నాకున్న విలువేమిటో నాకు తెలుసు. నా కూతురికి ఏ విధమైన గుర్తింపువుంటుందో నీకు చెప్పక్కర్లేదు. అందుకే నా కూతురని ఎవరికీ చెప్పకు. ''మనస్సులో ఎంత దుఃఖం వున్నా, మొహం మీద నవ్వుని అలంకరించుకుని వచ్చేవ్యక్తులతో గడపాలి. శారీరకంగా ఎన్ని బాధలు వున్నా, ఆ క్షణం ఓర్చుకుని అంగీకరించాలి తప్పదు. దానిముందు పాపని నీకప్ప చెప్పటం చాలా తేలికయిన విషయం. రేపు నేను జీవితం ముగించాక ఏ దరికి చేరతానో తెలియదు. నాకే కాదు ఎవరికీ తెలియదు. కానీ జీవితపు నీడలు భూమ్మీద వుంటాయి. ఆ నీడలు నా కూతురి మీద పడితే పరిస్థితి ఏమిటి? అందుకే దయచేసి నా గురించి తనకు చెప్పకు, నా ఛాయలో తన జీవితం వుండేదని ఏనాడూ బయట పెట్టక'' అంది.

''మాట్లాడినంత సులువుగా తల్లిగా బంధాన్ని వదులుకోగలవా? నిరంతరం నీ కళ్ళలో పాప మెదులుతూనే వుంటుందికదా, సుమతీ'' అంది సుధ.

''నువ్వు అడిగిన వెంటనే నీ మాటల్లో నాకు పాప భవిష్యత్తు కిరణం గోచరించింది. సుధా! ప్రేమ శాశ్వతం. హృదయానికి దగ్గరగా తీసుకుని మనసారా నీకు నేనున్నాను అనే వ్యక్తి నాకు జీవితంలో లభించలేదు. ఇక లభిస్తాడని ఆశించటం దురాశ. ఈ స్థితి నా కూతురికి రాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాను. పాపని తీసుకుని వెళ్ళిపో'' అంటూ పాపని సుధ చేతుల్లో పెట్టింది. చేతుల్లో పెట్టగానే మనస్సులో రేగుతున్న సంఘర్షణని ఆపుకోలేకపోయింది. రోదించటం మొదలుపెట్టింది. కొంత సమయానికి తేరుకుంది. ''ఆర్థికంగా పాప బాధ్యత నేను వహిస్తాను. సమాజంలో ఎదిగే బాధ్యత నువ్వు తీసుకో'' అంది.

''అవన్నీ నాకు వదిలేయి'' అంది సుధ.

సుమతి అద్దంలో తలదువ్వుకుంటూ చూసుకుంది. తెల్లవెంట్రుకలు కనపడ్డాయి. రంగేసుకోవాలి తప్పదు. ఇలా వుంటే వచ్చే విటులు కూడా రారు. వయస్సు పెరుగుతోంది. మరికొంత కాలంపోతే ఎలా బ్రతకాలి? ఆ ఆలోచన రాగానే భయం వేసింది. తన బాధ్యత వహించటానికి తోడు ఎవరూ లేరుకదా అనిపించింది. కూతురు గుర్తుకు వచ్చింది. ఎలా వుందో ఏమిటో? చూసి పన్నెండు సంవత్సరాలయిపోయింది. ఈ కాలంలో ఎంత చూడాలనిపించినా గుండె దిటవు చేసుకుని దూరంగానే వుంది. రాత్రిళ్ళు గుర్తుకు వచ్చినా, కన్నీళ్ళు తలగడమీద పడేవేకానీ మనస్సు రాయిలా చేసుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమాజంలో కూతురుకి ఒక స్థానాన్ని ఏర్పరచటానికి తను ఏమైనా ఫర్లేదు అని ఆలోచించింది. తనకి ఈ ఇల్లే స్వర్గం, నరకం. పైకి వెళ్ళిన తర్వాత చూస్తే తను ఏం సాధించింది అని చూసుకుంటే, మిగిలేది అసమర్థ జీవనానికి ఏ రోజుకి ఆ రోజు పడే ప్రాకులాట, చిరిగిన గుడ్డపీలికలాంటి జీవితం తనది. ఆలోచిస్తుండగా గుమ్మం దగ్గర అలికిడి అయినట్లు అనిపించి గుమ్మం వైపు చూసింది.

ఎదురుగా గుమ్మంలో సుధ కనపడింది.

''సుధా! ఈ సమయంలో అనుకోని అతిథిలా వచ్చావే. ఏమిటి విషయం?'' అంది.

''ఏం చేస్తున్నావు సుమతీ'' అంది సుధ.

''సాయంత్రం అవుతోంది కదా షరామామూలే అద్దంలో నా ముసలితనపు ఛాయలు చూసుకుంటూ భవిష్యత్తు గురించి ఆలోచిస్తూవుంటే పాప గుర్తుకు వచ్చింది. ఇంతలో నువ్వు వచ్చావు'' అంది.

''సుమతీ నీ కూతురిని వాగ్దేవి స్కూల్లో చదివిస్తున్నానని నీకు ఒక్కదానికే చెప్పాను. ఆ విషయం నువ్వు ఎవరికైనా చెప్పావా?''

''లేదే అయినా చెప్పాల్సిన అవసరం ఏముంది? దాని జీవితం బాగుపడితే నాకంతే చాలు. పదవతరగతి కాగానే ఇంటర్మీడియట్‌లో ఎక్కడ జాయిన్ చెయ్యాలో ఎలా చేస్తే బాగుంటుందో నువ్వే నిర్ణయించు. దానికి తల్లి, తండ్రి, మార్గదర్శివి నువ్వే.''

''బాగా ఆలోచించు. ఎందుకంటే నీ పాప ఎవరో స్కూలు యాజమాన్యానికి తెలిసిపోయింది. ప్రభుత్వంలో ప్రముఖ ఉద్యోగి, బహుశా ఆర్.డీ.ఓ అనుకుంటా, పాపలాంటి వాళ్ళు ఆ బడిలో వుంటే మిగిలిన పిల్లల మీద ఆ ప్రభావం పడుతుందని, అనాథలని జాయిన్ చేసుకునే ముందు సాధ్యమయినంత వరకు వారి చరిత్ర తెలుసుకోవాలని గట్టిగా చెప్పాడని నా అనుమానం'' అంది సుధ.

''ఏ డిపార్టుమెంటు అన్నావు'' అడిగింది సుమతి.

''ఆర్.డీ.ఓ'' అంది సుధ.

''గుర్తుకొస్తోంది. ఆరు నెలల క్రితం రాజారావు నా దగ్గరకు వచ్చాడు. నేను చెప్పాను గుర్తువుందో లేదో నేను వయస్సులో వుండేటప్పుడు నన్ను ఒక వ్యక్తి దగ్గరకు తీసాడు. తనతోపాటే వుండి మరెవరినీ దరిచేరకూడదని అన్నాడు. చాలా ఆశపడ్డాను. జీవితం స్థిరపడుతుందని నమ్మాను. ఆ సమయంలోనే గర్భవతినయ్యాను. ఆ తర్వాత కనపడలేదు. బదిలీ అయిపోయి వెళ్ళిపోయాడని తెలిసింది. అప్పట్లో డిప్యూటీ తహశీల్దారుగా చేస్తుండేవాడు. అతనే రాజారావు. ఆ తర్వాత ప్రమోషన్ వచ్చిందని తెలిసింది. ఆ క్రమంలో ఆర్డీవో

అయ్యాడేమో, ఈ ఊరికి రాగానే కలిసాడు. అతనితో ఉన్నప్పుడే గర్భవతినయ్యానని తనకి తెలుసు. అందుకే కొడుకా, కూతురా అని అడిగాడు. చెప్పాను.

ఏం చేస్తుందని అడిగాడు, తన కూతురే కదా అని అనుకున్నానేకానీ దాని భవిష్యత్తు ఇలా విషపూరితం చేస్తాడని అంత నీచ మనస్కుడని ఊహించలేదు'' అంది సుమతి.

''సరే ఆ విషయం నాకు వదిలేయి. పాప పరీక్షలు రాసేలా చూస్తాను. మరెవ్వరి దగ్గరా ఈ ప్రస్తక్తి తీసుకుని రాకు. అమ్మాయి బాగా చదువుతోంది. పదవతరగతి పరీక్షలయింతర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. యాజమాన్యంతో నేను మాట్లాడతాను. నువ్వు కంగారుపడకు'' అని సుధ వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా నిద్రలేక యిదే విషయం ఆలోచిస్తూ కుమిలిపోయింది సుమతి.

సాయంత్రం ఆరుగంటలవుతోంది. మలిసంధ్యలో వీచే గాలులతో వాతావరణం ఆహ్లాదంగా వుంది. స్కూలు మైదానంలో అలంకరించబడిన వేదిక ఆస్కూలు స్థాయిని ప్రతిబింబింపచేస్తోంది. సుమారు వెయ్యిమంది పిల్లలు వారి తల్లిదండ్రులతో మైదానంలో సుఖాసీనులైవున్నారు. పిల్లలంతా మూడు సంవత్సరాలనుండి పదిహేను సంవత్సరాలలోపు వయస్సుగలవారే. చిన్న పిల్లలు మైదానంలో కేరింతలు కొడుతూ ఆడుతూ వుంటే, కొంతమంది విద్యార్థులు వేదిక ప్రక్కగా తాము వేదికమీద చెయ్యబోయే కార్యక్రమాలు రిహార్సల్స్ చేసుకుంటున్నారు.

ఆ కుర్చీలలో మూలగా కూర్చుని వుంది సుమతి. జరగబోయే కార్యక్రమంలో తన కూతురికి కూడా పాత్రవుందని గర్వపడుతోంది. కానీ తన కూతురే అని ఎలుగెత్తి చెప్పుకోలేని స్థితిలో వుంది. ఆరునెలల క్రితం సుధరావడమూ, పాప గురించి అడగడమూ, రాజారావు చేసిన నీచమైన పని గుర్తుకు వచ్చింది. ఆ ఆలోచనల్లో వుండగా సుధ వచ్చింది.

''సుమతీ నీ కూతురు ఫలానీ అని తెలిసిపోయిన తర్వాత పదవతరగతి పరీక్షలయేంత వరకు పావని స్కూల్లోనే వుంచండి. మధ్యలో పంపించేస్తే ఆ పాప భవిష్యత్తు నాశనం చేసినవాళ్ళం అవుతాం. దయచేసి ఆ పరిస్థితి తీసుకుని రావద్దు అని చెప్పి ఒప్పించాను. ఈ విషయం మరెవ్వరికీ తెలియదు'' అని చెప్పి వెళ్ళిపోయింది.

ముఖ్య అతిథిగా ఆర్.డి.ఓ రాజారావుని, స్కూలు చైర్మన్ని స్కూల్ డైరెక్టర్ని వేదిక నలంకరించవలసినదిగా హెడ్మాస్టారు పిలిచారు.

స్కూల్ చైర్మన్ మాట్లాడుతూ ''కొన్ని సంఘటనలు జీవితంలో ఎలా ఎందుకు జరుగుతాయి? వాటి ప్రభావం ఎలా వుండబోతుంది? అనేది ఊహించలేము. కానీ మనం నిస్వార్థంగా చేసే పనులవల్ల ఒకొక్కసారి అనుకోకుండా సత్ఫలితాలు లభిస్తాయి. అలాంటి సంఘటన మన స్కూల్లో జరిగింది. సుధ, సాంఘిక సేవా కార్యకర్త, పన్నెండు సంవత్సరాల క్రితం అనాథంటూ పాపని తీసుకుని వచ్చి, స్కూల్లో జాయిన్ చేసుకోమని, ఆ పాప పూర్తి బాధ్యత తానే వహిస్తానని అడిగింది. మొదట్లో సందేహించినా పాపకి చదువు నేర్పటంలో మాకొచ్చే నష్టంలేదనుకుని, ఉచితంగా జాయిన్ చేసుకుని నేటి వరకు మా హాస్టల్లోనే వుంచుకున్నాం. ''మేము ఆ పాపకి చేసిన సహాయం కంటే నేడు ఆ పాప మేము గర్వపడేలా స్కూలుకి తీసుకొచ్చిన పేరు ప్రతిష్టలు ఎక్కువ. ఆ విధంగా ఆ పాప మా ఋణం తీర్చుకుంది'' అంతా సుధ వైపు చూసారు.

''సుధా! విద్యాభారతిని తీసుకురామ్మా'' అన్నాడు. సుధ విద్యాభారతిని వేదిక మీదకు తీసుకుని వచ్చింది. చైర్మన్ ఆ పాపని దగ్గరకు తీసుకుని ''ఈ పాప పదవతరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సంపాదించింది.'' అని మెడలో గోల్డ్మెడల్ వేసి

"మా స్కూలు యాజమాన్యం తరపున విద్యాభారతికి ఇంటర్మీడియట్ చదవడానికయ్యే ఖర్చు మేమే భరిస్తామనీ, ఈ పాపకి మంచి భవిష్యత్తు కలగాలనీ కోరుతూ, ఈ పాపని మా బడిలో చేర్చినందుకు సుధకు ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని కూర్చున్నాడు.

ప్రకటన వినేసరికి ఉద్వేగంతో సుమతి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. ప్రక్కన వాళ్ళందరూ సుమతి వంక చూడటం మొదలుపెట్టారు. తమాయించుకుని, కొంగుతో కన్నీటిని తుడుచుకుంది. ఆ కొంగు నిండా అక్కడక్కడా చేత్తో కొట్టిన చిరుగులు ఉన్నాయి.

వేదిక మీద ఆర్.డి.ఓ రాజారావు మాట్లాడుతూ "తల్లి గర్భం దాల్చి నవమోసాలు మోసి కన్న తర్వాత అనాధలా వదిలేయడానికి ఎన్నో కారణాలు - ఆర్థికంగా కానీ, వయస్సు ఆకర్షణకిలోనై సమాజానికి భయపడి కానీ, తనున్న వాతావరణంలో బిడ్డ భవిష్యత్తు ఏ విధంగా వుంటుందో అనే భయంవల్ల కానీ ఏదైనా కావచ్చు. ఆ సమయంలో తల్లిపడే వేదన, క్షోభ ఎలా వుంటుందనేది భారతంలో కుంతి కర్ణుడిని నీట వదిలేసిన సంఘటన "కుంతీ విలాపం" చదివితే తెలుస్తుంది. కర్ణుడికి దుర్యోధనుడి ఆసరా దొరికితే విద్యాభారతికి సుధ ఆసరా దొరికింది. ఈ పాప తనకున్న ప్రజ్ఞ, కృషి, పట్టుదల, ఆశయాలతో మైలురాళ్ళు సాధిస్తోంది. భవిష్యత్తులో మరెన్నో మెట్లు ఎక్కాలని, ఆశీర్వదిస్తూ తనకి చదువుకోవడానికి కావల్సిన సహాయ, సహకారాలు అందిస్తానని సభాముఖంగా తెలియజేస్తున్నాను." అన్నాడు.

ఆహుతుల కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

రాజారావు ప్రసంగం విన్న సుమతి విస్తుబోయింది. కన్నకూతుర్ని బడిలో నుంచి వెలివేయడానికి ప్రయత్నించినవాడు పరపతి కోసం చేసిన ప్రకటనలో ఎంత స్వార్థం వుందో గుర్తుంచింది. నిర్దాక్షిణ్యంగా బడిలో నుంచి పంపించి వెయ్యడానికి ప్రయత్నించిన వ్యక్తి, రాబోయే కాలంలో ఏం చేస్తాడోననే ఊహే భయం విహ్వారాలుని చేసింది. తన కూతురికోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదురీదాలని మనస్సులో స్థిరనిర్ణయం తీసుకుంది.

వినోద కార్యక్రమాలు పూర్తయేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. సుధ సుమతి దగ్గరకు వచ్చి "సుమతీ! పాపని తీసుకుని రానా! మాట్లాడతావా?" అంది.

"వద్దు. బాగా చదువుతోంది. వృద్ధిలోకి వస్తే నాకదే పదివేలు. వేదిక మీద చూశాను కదా అది చాలు. 'విద్యాభారతి' పేరు బాగా పెట్టావు. ఇదంతా నీ చలవే" అంటూ సుధ చేతులు తన చేతుల్లోకి తీసుకుని కళ్ళకద్దుకుంది.

సుమతి చీకట్లో యింటివైపు నడుస్తోంది. ప్రక్కనుంచి కారువెళ్ళి చీకట్లోనే రోడ్డు ప్రక్కగా ఆగింది. డోర్ తెరిచి రాజారావు క్రిందికి దిగి నిలబడ్డాడు. సుమతి దగ్గరకురాగానే "సుమతీ! నన్ను క్షమించు" అన్నాడు.

సుమతి మాట్లాడలేదు తలదించుకునే వుంది.

"కూతుర్ని దూరంగా వుంచి, సంవత్సరాల తరబడి చూడనైనా చూడకుండా వుండి, దాని భవిష్యత్తు కోసం నువ్వు తీసుకున్న ధృఢ నిర్ణయానికి మనసారా అభినందిస్తున్నా. ఎంతకాదనుకున్నా పాప మనిద్దరి పాప. నా ప్రతిష్టకి భంగం కలుగుతుందేమోనని యాజమాన్యంతో నేను మాట్లాడింది తప్పే. నా మాట మీద యాజమాన్యం పాపని వెలివేసి ఉంటే నిష్కారణంగా ఒక ఆడపిల్ల జీవితం నాశనం అయిపోయి ఉండేది. కానీ యాజమాన్యానికి పాపమీద ఉన్న నమ్మకానికి జోహార్లు. ఇకమీదట యిలాంటి సంఘటన జరగనివ్వను. నాకు యీనాటికీ పిల్లలు లేరు. పాప నా కూతురని చెప్పుకోగలిగే స్థితిలో నేను లేను. నువ్వు ఏనాటికైనా తల్లిని నేనని చెప్పుకోగలవేమో కానీ, సమాజానికి చెప్పగలిగే ధైర్యం నాకులేదు. క్షమించు. పాపకి చదువు విషయంలో ఎంత ఖర్చు అయినా సరే వెనుకాడక. నేను యిదివరకులా మాట్లాడటంలేదు. ఆనాటి బుద్ధివేరు, ఈనాటి బుద్ధి వేరు. ఈ రోజు జరిగిన సంఘటన నా కళ్ళు

తెరిపించింది. పాప జీవితం కోసం నువ్వు అనుభవించిన నరకయాతన నా మనస్సుని శూలంలా తాకింది. పాప జాగ్రత్త. ఈ మురికి కూపంలోంచి ఊరు వదిలి వెళ్ళిపో. అవసరమయితే సుధ సహాయం తీసుకో. ఆర్థిక విషయాలు నాకొదిలేయి. ఏదో ఒకరోజు జీవితం ముగిసే లోపల పాపని దగ్గరకు తీసుకుని నీ నాన్నని నేనే అని చెప్పి క్షమార్పణ కోరతాను" అంటూ సుమతి చేతులు పట్టుకున్నాడు" రాజారావు.

తల ఎత్తి సుమతి రాజారావు కళ్ళలోకి చూసింది. ఆ చూపులు నమ్మదగినవిగానే వున్నాయి. రాజారావు చేతులు గట్టిగా పట్టుకుంది. "ఈ జీవితానికి యిది చాలు" అన్నట్లుగా.

# కల విద్యార్థి

ధనా ధనా .. ధమా ధమా పరిగెత్తుకు వస్తున్న బూట్ల చప్పుడు. తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.

అలసి, అలసి, ఎదురుచూస్తున్న పెద్దావిడ కనురెప్పలు బరువుగా తెరుచుకున్నాయి. మంచం మీదనుండి కదల్లేకపోయారు. కనీసం తల కూడా తిప్పలేకపోయారు.

"మామ్మగారూ, మామ్మగారూ, స్కూల్ బెల్ కొట్టగానే పోటీ వేసుకుని పరిగెత్తుకొచ్చేసా. అందరి కంటే నా స్కూల్ బాగ్‌లో పుస్తకాలెక్కువ ఉంటాయి కదా, అందుకుని నా బాగ్ అందరి బాగ్‌లకన్నా బరువు ఎక్కువ కదా, అందుకని నేను గెలవలేదు. మెట్లు ఎక్కుతున్నప్పుడు స్కూల్ బాగ్ బరువు ఇంకా ఎక్కువ వుంటుంది గదా", అంటూ గుక్క తిప్పుకోకుండా చెప్పేసి ఆయాసం తీర్చుకుంటోంది చిలక.

మూడవ తరగతి చదువుతోంది చిలక. రోజూ స్కూలుకి వెళ్లేటప్పుడు ఆగి పెద్దావిడకి రెండు కబుర్లు చెపుతుంది. స్కూలునుంచి రావటం రావటమే కబుర్లు మొదలు పెడుతుంది. అదో పలుకుల చిలక, వలపుల గిలక. చెప్పే కబుర్లన్నిటికీ అభినయం కలుపుతుంది. ఎన్ని సార్లు వారించినా అరమరికలేకుండా ఇంటి విషయాలు, స్కూలు విషయాలూ, ఇంకా ఏమైనా సరే చెప్పుకుంటూ పోతుంది. తుర్రుపిట్ట లాగా ఇట్లా వస్తుంది, అట్లా వెళ్తుంది.

"ఏం, ఇవాళ అన్నమేమీ తినలేదా మీరు? మంచి నీళ్లు కూడా తాగలేదే? అసలు మంచం మీద నుంచి లేచి కూర్చున్నారా? ఈ టీపాయ్ మీద మీకు కావల్సినవి అన్నీ పెట్టి మంచానికి దగ్గరగా ఈ టీపాయ్‌ని జరిపి వెళ్లానుగా స్కూలుకి వెళ్లేటప్పుడు? అమ్మో, మిమ్మలని సాయంకాలం స్కూలునుంచి వచ్చేటప్పుడు ఎక్కువ విసింగచకుండా వెంటనే ఇంటికొచ్చేయమని చెప్పింది మా అమ్మ! ఇవాళ ముక్కోటి ఏకదశి, తొందరగా స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకోవాలని చెప్పింది. మళ్లీ కాసేపాగి వస్తా" అంటూ తుర్రుమంటూ వెళ్లింది.

తన పై అంతస్తు అపార్టుమెంటులో రెండు సంవత్సరాల క్రితం వచ్చిన కుటుంబం ఈ చిలక వాళ్లది. వచ్చినప్పటి నుంచి తనని రోజూ పలకరించేది ఈ చిలక ఒక్కటే.

వచ్చిన కొత్తలో, "ఏం, ఇంకా భోజనం ఎందుకు చెయ్యాలేదూ?" అని అడిగేది. సంవత్సరం క్రితం తనకి మంచం దిగే ఓపికలేకపోతే, తనే టిపాయ మంచం దగ్గరకి జరిపి, పళ్లెం, మంచి నీళ్లు అందేటట్లు పెట్టింది. మూడు నెలల క్రితం ఓపిక కూడ దీసుకుని బాత్రూంకి వెళ్లే తొందరలో తూలి శోష వచ్చి పడితే, ఎప్పుడు చూసిందో ఏమో, వాళ్ల అమ్మా నాన్నని పిలిచి ఆసుపత్రిలో చేర్పించింది. ఆ ఆసుపత్రి నుంచి వచ్చినప్పటి నుంచి మంచం మీద వెల్లకిలా పడుకుని పైన తిరుగుతున్న ఫ్యానునీ, ఇంటి కప్పునీ చూస్తూ బందీగా ఉండటమే అయ్యింది.

రెక్కలు వచ్చిన తన పిల్లలు ఒకరు అటు వైపు దేశానికి, ఇంకొకరు ఇటు ప్రక్క దేశానికి ఎగిరి వెళ్లారు. వాళ్లకి చదువులు చెప్పించి, ప్రయోజకులని చేసి, వాళ్లు ఆ దేశాలకి వెళితే సంతోషించింది తనే కదా? మంచి పిల్లలు, ఒకరి తరవాత ఒకళ్లు వచ్చి తనని ఆసుపత్రిలోనూ, ఇంటికి వచ్చిన తరువాతా ఎంతో బాగా చూసుకున్నారు. వాళ్ల వాళ్ల కుటుంబాలని చూసుకోవటానికి, వాళ్ల ఉద్యోగాల కోసం తిరిగి వెళ్లారు. ఎవరి జీవిత ధర్మం వాళ్లది.

తను మాత్రం తన అమ్మ నాన్నలను కానీ, అత్త మామలనికానీ ఎంత కాలం ఉండి చూసుకోగలిగింది? ఇదివరకటి కాలంలో తనూ, తన పెనిమిటితో కలసి సొంత ఊరు వదిలి ఉద్యోగ ధర్మమూ అంటూ వేరే పట్టణంలో కాపురం పెట్టారు. రోజులు మారి ఈ కాలానికి రెక్కలు వచ్చిన పిల్లలు పట్టణాలు కూడా వదిలి వేరే దేశాలలో కాపురాలు పెట్టారు. తమ పెద్దవాళ్ల పరిస్థితి ఆరోజులలో ఎంతో, ఈ రోజుకి తన పరిస్థితి కూడా అంతే. ముందు వాళ్లు, ఇప్పుడు తన వంతు.

ఇంతలో చిలక మళ్లీ వచ్చింది. "మామ్మగారూ, మా తాతయ్య వాళ్లు వచ్చారు. ఆయన సెల్ ఫోన్ తెచ్చుకున్నా, గేంస్ ఆడుకోవడానికి. మా తాత ... సర్లే సర్లే, 'మా తాతగారు' అని అంటా, కోప్పడమాకండే! మా తాతయ్య సెల్ ఫోన్లో అన్నీ భక్తి పాటలే, ఆయనకు ఈ ఫోన్ పూర్తిగా దండగ, ఎన్ని గేంస్ ఉంటాయో ఆడుకోటానికి. నిమిషానికి ఒకళ్లు ఆయనకి ఫోన్ చేస్తారు, అదేమో రింగ్ టోన్ బదులు ఏదో భక్తి పాట మోగుతుంది. వినీ, వినీ విసుగొచ్చేస్తుంది. మా అమ్మ ఇంకొంచెం సేపు ఆడుకుని రమ్మంది, ఫోన్ మోగగానే వెంటనే రమ్మంది"

ఫోన్ మోగింది. రింగ్ టోన్‌లోని పాట వినిపించసాగింది

"స్థాపకాయ చ ధర్మస్య,
సర్వ ధర్మ స్వరూపిణే,
అవతార వరిష్ఠాయ
రామక్రిష్ణాయ తె నమః"

"ఊ, అమ్మా, ఇప్పుడేగా నేను వచ్చింది, ఇంకొంచెం సేపు ఆగి, ఆడుకుని వస్తా. సర్లే, ఈ సారి పిలవగానే వస్తా. అలాగే, మామ్మగారిని విసిగించను" అని ఫోన్లో చెప్పింది చిలక.

"మామ్మగారూ ఫోన్లో వచ్చిందే, ఆ పాటకు అర్థం తెలీదుగానీ, నాకు ఆ పాట అంటే చాలా ఇష్టం. ఎవరో సుబ్బులక్ష్మి అంట పాడింది. అదేం పేరో? హి, హి, హి. ఇంటి పేరు ఎంఎస్ అంట. అలా అయితే బాగానే ఉంటుందిలే! మా తాత అయితే, సర్లే, సర్లే .. మా తాతగారు అయితే ఆవిడ గాత్రంలో దైవత్వం ఉంటుందంటాడు. అంటే ఏమిటో? నాకు అసలు అర్థం కాదు బాబూ!!! సర్లే, క్రిందకి వెళ్లి మా ఫ్రెండ్స్‌తో ఆడుకుని వస్తాను".

మామ్మగారికి కను రెప్పలు బరువెక్కి, మగతగా మూసుకున్నాయి. కళ్లలో తన పిల్లలు అదే వయసులో కనబడ్డారు. సంసారం అంతా ఒక్క గదిలో ఉండేది. అంతకంటే తాహతులేని రోజులు. ఒక వస్తువు తియ్యబోతే పది వస్తువులు సర్దాల్సి వచ్చేది. అక్కడే వంట, అక్కడే పడక. తన పిల్లలు అక్కడే ఒక మూల కూర్చుని చదువుకొనేవారు. తను ఎంత కఠినంగా వుండి చదివించిందీ??? పాపం పిల్లలు ఎలా భరించేవారో? ఆ పిల్లలే, తన ఒక్క దాని కోసం మూడు పడక గదుల అపార్టుమెంట్ కొని పెట్టారు. ఇప్పుడు ఇన్ని గదుల ఇంట్లో ఉండే తను, ఒక గదిలో బందీ. తన పిల్లలని చదువు, చదువూ అని ఆ రోజులలో అంత కఠినంగా ఉన్నందుకు, ఇప్పుడు గుండెలలో వేదన ఎంతో పెరిగిపోయింది మామ్మగారికి.

ఇంతలో చిలక తన స్నేహితులతో పరిగెత్తుకు వచ్చింది. ఒక్క సారిగా తన పిల్లలు తనకు ఇచ్చిన ఐపాడ్‌ను అందుకున్నారు. పిల్లలు అన్నిటిమీద చేతులు వేస్తూంటే తనకి మహా చిరాకు. అయితేనేం, ఈ చిలక లేకపోతే తనకి ఐపాడ్ వాడటం చేతకాదు.

"మామ్మగారు, మామ్మగారు, ఫేస్‌బుక్కులో మీ మనవరాలి కాలేజీ గ్రాడ్యుయేషన్ ఫోటోలంట, అందరూ ఉన్నారు చూడండి", మామ్మగారు బరువుగా కళ్లు తెరుచుకుని తన సంతానాన్ని అంతా మురిపెంగా చూసుకున్నారు. గబగబా ఫోటోలు మార్చి తన కొడుకు కుటుంబాన్ని, కూతురు కుటుంబాన్ని చూపించింది చిలక. మిగతా పిల్లలతో ఇప్పుడు మనం "కుక్క పిల్లల గురించి చూద్దాం" అని అన్నది.

ఇంతలో ఫోన్ మోగింది, రింగ్‌టోన్ పాట వినిపించసాగింది.

“భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే”

"ఆ అమ్మా, ఇంకొంచెం సేపు ఆడుకుని వస్తా, ఆ తొందరగానే వచ్చేస్తా" అని ఫోన్ పెట్టేసింది.

"మామ్మగారు, ఈ పాట నేర్చుకుంటే ఇంకా గ్రామరు చదువుకోవాల్సిన అవసరం లేదని మా మామయ్య చెప్పాడు. అమ్మేమో నేర్చుకోకపోతే ఊరుకోదు. ఇప్పుడే వస్తా" అంటూ తన స్నేహితులతో కలిసి తుర్రుమన్నది చిలక.

మామ్మగారికి కళ్లలో తన పిల్లల పసితనం గిర్రున తిరిగింది. అవును, బడికి వెళ్లే పిల్లలని తను ఎంత జాగ్రత్తగా కాపాడిందీ? తన భర్త ఉద్యోగ రీత్యా టూర్లలో తిరుగుతూవుంటే తనే ఒంటరిగా పిల్లలని చదివిస్తూ కాలం గడిపింది. దగ్గర కూర్చుని వాళ్లకి తెలుగు వ్యాకరణం నేర్పింది, లెక్కలు నేర్పింది అన్ని రకాల పాఠాలూ వీలయినంతవరకూ తను నేర్చుకుని వాళ్లకి నేర్పింది. ఒక్కొక్కసారి ఎంత కఠినంగా వ్యవహరించిందీ? పిల్లలని అంత హింసించటం అవసరమా? అది తలుచుకుంటే కళ్లలో బాధ తొంగిచూసింది. అయితేనేం, పిల్లలు ప్రయోజకులయ్యారు. తన క్రమశిక్షణ కొలిమిలిలో విద్యాబుద్ధులతో తీర్చిదిద్దిన ఉక్కు శిల్పాలు తన పిల్లలు. వాళ్ల ఎదుగుదల, సౌభాగ్యంతో తన మనసు నిండుగా ఉన్నది. ఇంతకంటే తల్లికి ఏమి కావాలి? గర్వ పడ్డారు మామ్మగారు.

ఇంతలోనే మళ్లీ వచ్చింది చిలక. "మామ్మగారూ, మామ్మగారూ, మన అపార్ట్‌మెంట్ క్రింద ఇస్త్రీ బండి వాచ్‌మాన్ ఉన్నాడే, ఆ వాచ్‌మాన్‌కి కుక్క ఉంటుందే, దానికి ఏడు పిల్లలు పుట్టాయి. మూడేమో నల్ల కుక్కపిల్లలు, వాటికి తెల్ల మచ్చలున్నాయి. మూడేమో తెల్ల కుక్కపిల్లలు, వాటికి నల్ల మచ్చలు. ఒకటేమో నలుపు మీద తెల్ల మచ్చలా, లేకపోతే తెలుపు మీద నల్ల మచ్చలో అర్థం కావటం లేదు. మీకు తీసుకొచ్చి చూపిస్తామంటే వాచ్‌మాన్ కోపడ్డాడు" అని బిక్క మొహం పెట్టింది చిలక.

ఇంతలో ఫోన్ రింగ్‌టోన్ మోగి పాట వినపడసాగింది.

"యావద్విత్తోపార్జన సక్తః
తావన్నిజ పరివారో రక్తః
పశ్చాజ్జీవతి జర్జర దేహే
వార్తాం కోపి న పృచ్ఛతి గేహే

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే”

"ఆ అమ్మా, వచ్చేస్తున్నా, గుర్తుంది, గుర్తుంది, ఇవాళ ముక్కోటి ఏకదశి పండగని. వచ్చేస్తున్నా, వచ్చేస్తున్నా, వచ్చి స్నానం చేస్తాలే" అని ఫోన్ పెట్టేసింది.

"మామ్మగారు, మామ్మగారు, మేము తిరుపతి వెళ్లినప్పుడు కోతి పిల్లలని కూడా చూశాం. బోలెడు కోతులున్నాయి. అవి అన్నీ భలే కలిసి ఉంటున్నాయిలే, అన్నీ చుట్టాలేమో! మొన్నటిసారి తిరుపతి వెళ్లినప్పుడు కాదు, మా అమ్మా నాన్నగారూ అప్పుడు వారం రోజులుగా మాట్లాడుకోలేదని చెప్పాను కదా, గుర్తుందా? అప్పుడు మా పెద పెద్దమ్మ వాళ్ల పెద్ద అక్కయ్య పెళ్లికి తరవాత అందరమూ కలిసి తిరుపతి వెళ్లామే, అప్పుడన్నమాట. మేము కూడా అందరం కలిసి వెళ్లాం కదా, భలే ఆడుకున్నాంలే! పిల్లలందరం రైలులో అస్సలంటే అస్సలు పొడుకోలేదు. ఈ బెర్త్ మీద నుంచి ఆ బెర్త్ మీదకీ ఎక్కుతూ దిగుతూ భలే ఆడుకున్నాంలే. మేము పిల్లలందరూ అలా ఆడుకుంటూ ఉంటే, సంబంధాల తాతగారేమో ఆయనని నిద్రపోనివ్వటంలేదని, మమ్మల్ని, అంటే పిల్లలందరినీ బోలెడు కోప్పడ్డారు. సంబంధాల తాతగారెవరంటే మా పెద పెద్దమ్మ వాళ్ల పెద్దక్కయ పెళ్లి ఫొటో ఆల్బం మీకు చూపించినప్పుడు, చివరిలో భోజనాల ఫొటోలలో నోరు బార్లా తెరిచి, నాలుక బయట పెట్టి పెద్ద పెద్ద ముద్దలు తింటున్నారే, ఆ తాతగారు అన్న మాట. ఇప్పుడేమో ఆయన మా పెద పెద్దమ్మ వాళ్ల చిన్నక్కయ ఫొటోలూ, చిన్న పెద్దమ్మ వాళ్ల పెద్దక్కయ్య ఫొటోలు పట్టుకు తిరుగుతూ ఉంటారు. నాకు ఆయనంటే చాలా కోపం. అయినాసరే, భలే ఆడుకున్నాం. సర్లే, మా అమ్మ ఇంకోసారి ఫోన్ చేసిందంటే తెగ కోప్పడుతుంది" అంటూ తుర్రుమంటూ వెళ్లింది చిలక.

మామ్మగారికి గతం మళ్లీ కళ్లలో కనబడింది. పిల్లలు హైస్కూలుకి వచ్చేటప్పటికి రెండు గదుల ఇంటిలోకి మారే స్తోమత వచ్చింది. దానికి సరిపడా బంధువులందరూ పట్టణంలో అవసరాలు తీర్చుకోవటం కోసం చేరటం మొదలుపెట్టారు. మళ్లీ అదే ఇరుకు. తన పిల్లలకు చేసిన కూరలు వేళకాని వేళకు వచ్చే బంధువులకు పెట్టటంతో సరిపోయేది. ఎప్పుడన్నా రూపాయి పొదుపుచేసి దాచుకోగలిగితే, తన పిల్లలకి ఖర్చు పెట్టే లోపల కష్టం చెప్పుకునే బంధువులు వచ్చేవారు. ఎంతమందిని ఆదుకోగలిగిందీ? ఆసుపత్రి అవసరాలకోసం వచ్చేవాళ్లూ, వ్యవసాయం పనిముట్లకి రూపాయి తగ్గింది తరువాత ఇస్తామని తీసుకున్నవాళ్లూ, వాళ్ల పిల్లలకి పుస్తకాలు కొనటానికి రుపాయి తక్కువయ్యిందనే వాళ్లూ, ఇలా ఎంత మంది అవసరాలు తీర్చింది తను?. ఏరి, ఏమయ్యారు వాళ్లందరూ? తన తోబుట్టువుల పిల్లలకి, ఆడపడుచుల పిల్లలకి చదువు చెప్పించింది తనే కదా? అయినా ఇంకొకరికి ఉపయోగపడ్డామని, వారు మనలని గుర్తుంచుకోవాలని అనుకోవటం ఎందుకు? వాళ్లు కూడా ఇంకొకరికి సాయం చేసినవాళ్లేనేమో? అవును, తన కుటుంబం వాళ్లకే కాదు, ఎంతమందికో తన చేతితో అన్నం వడ్డించింది, తన చేతితో ఓదార్చింది, ప్రతిఫలం ఆశించకుండా తన చేతితో సాయం అందించింది. కానీ తన చెయ్యి ఇంకొకరి చేతి క్రింద ఎప్పుడూ పెట్టలేదు. అదే సంతృప్తి, అదే ఒక సాఫల్యం.

ఇంతలో చిలక మళ్లీ వచ్చింది. "మామ్మగారూ, మామ్మగారూ, స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకుని మీకు చూపించుదామని వచ్చా. నెమలి ఫించం బట్టలు, బాగున్నాయా? అంటూ పట్టు పరికిణీని రెండు చేతులతో పైకి పట్టుకుని, తల ఆడిస్తూ మూడు సార్లు గిర గిరా తిరిగింది వలపులగిలక. మామ్మగారు అతి కష్టం మీద కళ్లు తెరిచి చూసారు. ఎంత అందమైన దృశ్యం, చక్కని చుక్క. మామ్మగారు రెప రెపలాడే కను రెప్పలతోనే గిర్రున తిరుగుతున్న ఆ వలపులగిలకని దీవించారు.

ఇంతలో ఫోన్ రింగ్‌టోన్‌లో మళ్లీ పాట వినబడ సాగింది.

సుర మందిర తరు మూల నివాసః
శయ్యా భూతలమజినం వాసః |
సర్వ పరిగ్రహ భోగ త్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే"

"ఆ, అమ్మా వచ్చేస్తున్నా. ఏంటీ? మామ్మగారు మధ్యాహ్నం అన్నమా? ఏమీ తినలేదు. అట్లాగే ఉంది. సర్లే, వచ్చి ప్రసాదం తీసుకువస్తా, సర్లే, సర్లే, చీకటి పడితే పడింది, నాకేమీ భయం లేదు" అని ఫోన్ పెట్టేసింది.

"మామ్మగారు, మామ్మగారూ, మా పెద పెద్దమ్మ వాళ్ల పెద్దక్కయ్యకు పెళ్లి అయ్యిందే, ఆ అక్కయ్య కట్టుకోను పొమ్మంటూ విసిరికొట్టిందని చెప్పానే, ఆ చీర చించి మా చిన్న పెద్దమ్మ వాళ్ల చిన్నక్కయ్యకూ, నాకూ కుట్టించింది మా అమ్మమ్మ. మా పెద్దక్కయ్య ఎందుకు విసిరికొట్టిందంటే, మీకు అంతకు ముందు చెప్పాను కదా, పెళ్లయిన తరువాత మా పెద్ద అక్కయ్య పొడుకునే మంచం మీద మా బావగారు పొడుకుంటే ఆ మంచం విరిగి పోయింది అని, అప్పుడన్నమాట. మంచం విరిగిపోయిన రెండు రోజుల తరువాత మా తాతగారు నన్ను తీసుకువెళితే మా పెద పెద్దమ్మ వాళ్లింటికి వెళ్లాను. అప్పుడు మా బావగారికి మా పెద పెద్దమ్మ నేతి గారెలు, లడ్డూలూ చేసి పెట్టింది. మా బావగారు నేతి గారెలు, లడ్డూలూ తింటూంటే మా చిన్నక్కయ్యేమో నన్ను పక్క గదిలో కూర్చోబెట్టి సంగీతంలో గీతం నేర్పుతానని చెప్పి, "లంబోదర లడ్డు మెక్కరా" అని గట్టిగా పాడించింది. అప్పుడేమో మా పెద పెద్దమ్మ వచ్చి మా చిన్నక్కయను చీపురు తిరగేసి కొడుతుంటే, చిన్నక్కయ్య పడి పడి నవ్వింది. నాకేమో మొట్టికాయలు పడ్డాయి. భోలెడు ఏడ్చేశాను. అప్పుడేమో పెద్దక్కయ్య చీర విసిరి కొట్టింది. నాకయితే అసలేమీ అర్థం కాలేదు. ఆ చీరే, చించి, కుట్టించారు. మా పెద పెద్దమ్మ నాకు ఒక్కటి కూడా నేతి గారె కానీ, లడ్డూ కానీ పెట్టలేదు. సర్లే, మా అమ్మ మళ్లీ పిలిచే లోపల వెళ్లి వస్తా" అంటూ తుర్రు మంది చిలక.

మామ్మగారికి మళ్లీ గతం కనబడింది. పిల్లలు కాలేజీ చదువుకొచ్చేటప్పటికి ఫీజులు కట్టలేకపోవటం గుర్తుకు వచ్చింది. అదే సమయంలో తమ పెద్ద వాళ్లకి వచ్చిన ఆరోగ్య సమస్యలు. ఈ ఖర్చులన్నీ తట్టుకోవటానికి భార్యా భర్తలిద్దరూ పడిన కష్టాలు ఒకటి అని చెప్పుకోవటానికీ, ఆ రోజులలో అది కష్టం అని తలుచుకునే సమయం కూడా లేకపోయింది. తమ కుటుంబంలో ఏ ఒక్కరికీ సరి అయిన బట్టలు వుండేవి కావు, పచ్చడి అన్నం తప్ప కూర అన్నం ఉండేది కాదు. కానీ భాధ్యతలు ఎప్పుడూ మరవలేదు, అన్నీ గుట్టుగా జరుపుకున్న సంసారం తనది. సుఖదుఃఖాలు అనేవి పూర్తిగా మన ఆలోచనా రీతులలోనే ఉంటాయేమో? జీవన స్రవంతిలోని ఒడిదుడుకులు తట్టుకుని ముందుకు సాగటమే సుఖం. అప్పుడే ఆ నాటి కష్టాలు నేటికి విజయాలుగా మారుతాయి. పూర్తిగా సంతృప్తి పడ్డారు మామ్మగారు.

ఇంతలో చిలక మళ్లీ వచ్చింది. "మామ్మగారూ, మామ్మగారూ, మీరేమీ మధ్యాహ్నం తినలేదని మా అమ్మ లెమన్ టీ, చక్కెర పొంగలి ఇచ్చింది. లెమన్ టీ ఏమో మా అమ్మ చేసింది. మా అమ్మవన్నీ టీవీ వంటలే. ఆ టీవీ వంటలు తింటుంటే బొజ్జ గోవిందమే!. మా అమ్మమ్మ చేసినవయితే చాలా బాగుంటాయి. ఇవాళ ముక్కోటి ఏకాదశి కదా, మా అమ్మమ్మ చక్కెర పొంగలి చేసి, తాతగారు అమ్మమ్మ గుళ్లో నైవేద్యం పెట్టి, మా ఇంటికి తీసుకుని వచ్చారు. మీకు కూడా పెట్టమని మా అమ్మ ఇచ్చింది. టీ ఇప్పుడు తాగుతారా, చల్ల బడిన తరువాత తాగుతారా? మీ తులసి మొక్కలోనుంచి మూడు ఆకులు వేస్తే తులసి టీ అవుతుందంట. వేస్తాను" అని గభాలున బాల్కనీలోకి పరిగెత్తి, మూడు తులసి ఆకులు కోసుకుని వచ్చి టీలో వేసింది. మామ్మగారు ఏమీ పలకలేదు.

"సర్లే, నేనే స్పూనుతో ఇస్తాను" అంటూ చక్కర పొంగలి ఒక స్పూనుతో తినిపించబోయింది. మామ్మగారు వణుకుతున్న పెదాలతో కొంచెం ప్రసాదం చప్పరించారు.

"మంచి నీళ్లు కావాలా? పోనీ, ఊది ఊది టీ ఇస్తానులే " అంటూ తులసి టీ మూడు స్పూనులు తాగించింది.

ఇంతలో మళ్లీ ఫోన్ రింగ్‌టోన్ మోగింది. "మామ్మగారు, మామ్మగారు, మీరేమీ మాట్లడకుండా ఇక్కడ వినండే, ఇక్కడ భలే పాడుతుంది "తస్య యమేవ న చర్చా" అంటూ, అంటే నాకేమీ అర్థం కాదు, కానీ భలే పాడుతుందిలే" అంటూ కళ్లు చారెడేసి చేసి, చేతులు పక్కకి పెట్టి, తల అటూ ఇటూ ఊపుతూ అభినయం చేసింది చిలక.

భగవద్గీతా కించిదధీత
గంగా జలలవ కణికాపీతా |
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమేవ న చర్చ

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే"

"ఆ అమ్మా, వచ్చేస్తున్నా, వచ్చేస్తున్నా. ఆ( .. హోంవర్క్ ఏమీ లేదులే. సర్లే వస్తున్నా" అంటూ తుర్రుమంది చిలక.

మామ్మగారికి ఆలోచనలు కొనసాగినవి. పిల్లలు పై చదువులకు వచ్చేనాటికి తన భర్త అనారోగ్యం, అస్తమయం. నిస్సహాయత, నిస్పృహలతో కూడిన ఆర్ధిక సమస్యలు. తన భర్త సాయం అందుకున్నవారెవరూ కనబడని రోజులు. ఊరు అనుకోవటానికి లేకుండా ఎక్కడో ఊరి పొలిమేరలలో అద్దె తక్కువని తీసుకున్న ఒంటరి ఇంటిలో ఉన్న రోజులు. రోహిణీ కార్తె ఎండలు. మధ్యాహ్నం తను మజ్జిగ అన్నం తినబోయే సమయానికి తలుపు బయట నుండి "దాహం దాహం" అంటూ పిలిచిన నీరసపు కేకలు. భయపడుతూనే తలుపు తీస్తే, ఎవరో ఒక బిచ్చగాడు, జంగం ఏమో? దాహం దాహం అంటూ మళ్లీ అడిగితే, మంచి నీళ్లు ఇస్తే, "భగవతీ, గంగా జలం పోసి దాహం తీర్చావు" అని అన్నాడు. ఆశ్చర్యం, ఆ రోజులలో తమ లేమితనాన్ని చూసి చులకన చేసినవాళ్లే కానీ, తనని ఒక మనిషిగా చూచి గౌరవించిన వాళ్లు ఎవరూ లేరు. తనకోసం ఉంచుకున్న కొంచం అన్నం మజ్జిగ నీళ్లు, ఆ జోగికి ఇచ్చింది. ఎండ తగ్గిన తరువాత ఆ జోగి వెళుతూ, "భగవతీ, ధైర్యలక్ష్మి నీ వెన్నంటే ఉండుగాక. ధైర్యలక్ష్మి ని నీవు నిలుపుకోగలిగితే, అన్ని లక్ష్ములు నీ ఇంట చేరుతాయి." అని చెప్పి వెళ్లాడు. తను చేసిన పని ఏమిటి? ఎవరో తెలియని మనిషికి కొంచెం దాహం తీర్చింది. నిష్కామ క్రియ. ఎక్కువ చదువుకోక పోయినా భగవద్గీత సారాంశం ఇదేనేమో? ఆ జోగి దీవించబట్టే తను ఎప్పటికీ ధైర్యం కోల్పోలేదేమో? జీవితంలో నాకు నేను సాధించాను అని అనుకోవటంకంటే, ఎందరివో దీవెనలు మనని వెన్నంటి నడిపించి గమ్యం చేర్చుతాయి. అందరూ గురువులే. అందరికీ మనస్సులోనే నమస్కరించింది.

ఇంతలో చిలక మళ్లీ వచ్చింది. "మామ్మగారూ, మామ్మగారూ, పైన అందరూ కలసి ఏదో ఏదో మాట్లాడుకుంటున్నారు. నేను ఏమిటో చెప్పమని అడిగితే, చిన్న పిల్లవు, నీకిన్ని ఆరాలెందుకు? ఇప్పుడు విసిగించమాకు, చిన్నపిల్లవు నీకు ఈ విషయాలన్నీ ఎందుకు అంటూ ఏమీ చెప్పరు. కానీ, నాకు అన్నీ తెలుసు. మామ్మగారికి రాత్రి భోజనానికి కొంత చారు అన్నము, పెరుగన్నమూ కలిపాను, ఇదిగో తీసుకు పో అని పంపించింది మా అమ్మ" అంటూ టీ పాయ మీద రెండు గిన్నెలు పెట్టింది చిలక.

"మామ్మగారూ, మామ్మగారూ, మా ఇంట్లోనేమో నన్ను మాట్లడనివ్వరు, స్కూలుకి వెళితేనేమో అక్కడ ఎంత సేపూ సైలెన్స్ సైలెన్స్ అంటూ టీచర్లు అరుస్తారు. మీరొక్కళే నన్ను మాట్లాడనిచ్చేది. మొన్న స్కూల్లో మా లెక్కల టీచరయితే నన్ను బాగా కోప్పడింది, ఎక్కువ మార్కులొచ్చినంత మాత్రాన సరిపోదు, క్లాసులో మాట్లడకూడదు అని. ఈ సంవత్సరం తరువాత రిటైరైయిపోతుందిలే. మేం పిల్లలమంతా ఆ టీచరుని గుర్ఖా టీచారని పిలుస్తాం. ఎందుకంటే, ఆవిడకి మధ్యాహ్నం క్లాసులేవి ఉండవు. మధ్యాహ్నం స్టాఫ్ రూంలో వాలు కుర్చీలో పొడుకుని గురక పెడుతుంది. నిద్రపోతూ నోటితో గాలి పీల్చేటప్పుడు గుర్‌ర్‌ర్ అంటుంది. గాలి వదిలేటప్పుడు మాత్రం ఒక్కసారిగా ఖా అంటుంది. అందుకే గుర్ఖా టీచరనమాట. మాకెవరికీ ఆ టీచరంటే ఇష్టం లేదు. మా క్లాస్ టీచరయితే ఎవరినీ కోప్పడదు, అందుకే మాకందరికీ ఇష్టం"

ఇంతలో ఫోన్ రింగ్‌టోన్ మళ్లీ మోగింది.

"గురుచరణాంబుజ నిర్భర భక్తః
సంసారాదచిరార్భవ ముక్తః |
సేంద్రియమానస నియమాదేవం
ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవం

భజగోవిందం భజగోవిందం

గోవిందం భజ మూఢమతే”

మామ్మగారికి తనకు కలుగుతున్న ఆలోచనల మీద ఆలోచన వచ్చింది. జరిగినది, కనపడినది తన లోచనములకా? లేక ఆ లోచనములను నియంత్రిస్తున్న మనసుకా? మరి ఏవి తన ఆలోచనలు, ఏవి తన అనుభూతులు? అన్నీ ఒక అనంతమైన కలలోని భాగాలేమో? మరి తనకున్న అనుబంధాలు, తన విజయాలూ అన్నీ కూడా ఈ అనంతమైన కలలోని భాగాలా? అనుబంధాలు లేకపోతే ఆలోచనలు కూడా ఉండావు, మరి ఈ అనుబంధాల పొగమంచు తొలగిన సత్యమేది?

గతం అంతా ఒక కల లాగా అనిపించింది. ఇది ఒక తియ్యటి కల. ఈ ఆలోచనలు కూడా జీవుడు చేస్తున్న సత్యాన్వేషణలో భాగమైన కలలేమో? మరి ఈ కలలలోని కష్టసుఖాలు అనంతములోని శీతోష్ణముల వంటివా?

మామ్మగారి ఆలోచనలు ఆగినవి. ఒక నిశ్వాసతో తనకు ఉన్న కోరికలూ, అనుబంధాలు విడిచిపెట్టారు. మనసులో వున్న సంకల్పాలు విడివడ్డాయి. అనంతములోని అంతులేని ఆనందంతో మనస్సు నిండింది. కైవల్యం.

ఇంతలో ఫోన్ రింగ్‌టోన్ మళ్లీ మోగింది.

“భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ ...................”
కలవరిస్తున్న మామ్మగారి పెదవులు వంత పాడాయి.

"ఆ అమ్మా, మామ్మగారు ఇంకా ఏమీ తినలేదు. మామ్మగారూ, మామ్మగారూ, ఈ చారన్నం కొంచెం తింటారా, లేకపోతే పెరుగన్నం తింటారా? నిద్రపోతున్నారా? ఇంత తొందరగా రాత్రివేళ నిద్ర పోరుగా మీరు? ఆ.., అమ్మా, మీరే క్రిందకు తొందరగా తొందరగా రండి. మామ్మగారు ఏమీ తినటంలేదూ, ఏదో కలవరించారు”, పలికింది చిలక.

## పువ్వులు — పోడూరి వెంకటరమణ శర్మ

విఐటి వెల్లూరు లో బి టెక్ ఫైనల్ పరీక్షలు రాసి సెలవలకి హైదరాబాద్ ఇంటికి వచ్చాను. ఇంటికి రాగానే అమ్మ చెప్పింది, రెండు రోజులలో రాజు మావయ్య వస్తున్నాడని. చాలా ఆనంద మేసింది. మా అమ్మ అయిదుగురు అప్ప చెల్లెళ్లకి రాజు మావయ్య తప్ప మిగతా అన్న దమ్ములు ఎవరూ లేరు. చిన్నప్పుడు, రాజు మావయ్య వస్తున్నాడంటే మా పిల్లలందరికీ చాలా ఉత్సాహం. పిల్ల లందరికీ ఏదో ఒక ప్రత్యేకమయిన స్వీట్ పట్టుకు వచ్చేవాడు. చిన్నప్పుడు వేసవి సెలవలకి తాతగారి ఊరు వీరవాసరం వెళ్ళడానికి పెద్ద అట్రాక్షన్ రాజు మావయ్యే. ఆయన కూడా పిల్లలతో సెలవలకి వీరవాసరం వచ్చేవాడు పిల్లలన్దరినీ చేరదీసి రకరకాల ఆటలు ఆడించే వాడు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కళ్ళని వెంటపెట్టుకుని తోటల్లోకి తీసుకు వెళ్ళేవాడు. కూడా వెళ్ళడానికి మేము ఒకళ్ళతో ఒకళ్ళం పోటీ పడుతూ ఉండేవాళ్ళం.

నాన్నగారికి తరుచు బదిలీలు ఉండడం, తాను ఢిల్లీ లో సెటిల్ అవడంతో మాకు జ్ఞాన మొచ్చిన తరువాత ఆయన తో ఎక్కువ రోజులు గడిపింది తక్కువే. చిన్నప్పుడు ఆయన ఏపని చెప్పినా చేయడానికి అందరం పోటీ పడుతూ ఉండేవాళ్ళం. మా చేత అలా పనులు చేయించడంలో ఆయన చిట్కా అప్పుడు మాకు తెలియదు.

నాన్నగారు నన్ను స్టేషన్ కి వెళ్ళమంటే నేను వెళ్లి రాజు మావయ్యని రిసీవ్ చేసుకున్నాను. ఆటో అతను చాలా రద్దీ గా ఉన్న ట్రాఫిక్ లోంచి సడన్ బ్రేకులు వేసి ఏ వెహికిల్ కీ గుద్దించ కుండా స్పీడ్ గా నడపడం మావయ్యకి చాలా ఆశ్చర్య మేసింది . ఇలాంటి స్కిల్ ఎక్కడా చూడం అని, ఆటో అతని తో కూడా మాట కలిపి అతన్ని అభినందించాడు. దారిలో ఏటీఎం దగ్గర ఒక సారీ, పుల్లారెడ్డి స్వీట్ షాప్ దగ్గర ఇంకోసారీ ఆటో ఆపి పనులు చేసుకున్నా ఆటో అతను ఏమీ విసుక్కోక పోవడం నాకు ఆశ్చర్యమే. ఇంటికి చేరిన తరువాత మావయ్య సూట్ కేసు ఆటో లోంచి తీస్తోంటే, ఆటో అతను అందుకొని లోపలిదాకా తీసుకు వచ్చి పెట్టాడు. హైదరాబాద్ లో ఆటో అతను ఆ పని చేయడం నాకు నిజంగా వింతే.

భోజనాలు అయిన తరువాత అమ్మతో కబుర్లలో పడ్డాడు మావయ్య. మయంలో నన్ను పిలిచీ " ఒరేయి ఎల్లుండికి నర్సాపూర్ ఎక్స్ప్రెస్ లో వీరవాసరానికి కి రెండు టిక్కెట్లు ఉన్నాయేమో చూడు, నువ్వు కూడా నాతో వద్దువు గాని" అన్నాడు అమ్మకేసి వాడు రావడం అభ్యన్తరం లేదుగా అన్నట్టు చూస్తూ

"వీరవాసరం వెళ్లాలా ?" అంది అమ్మ కుతూహలంగా

" అవునే, ఆ మధ్యన మన ఇంటి పక్కన ఉన్న స్థలం కొన్నాము కదా? దానిలో ఎవడో రాటలు పాతాడట. కోర్టు లో కేసు వెయ్యాలి అని చెప్పాడు మన పొలాలు చూసే రామభద్రం. ముందు అక్కడికి వెళ్లి చూసి భీమవరం లో కోర్టు లో వెయ్యాలి. భీమవరం లో రెండు రోజులు ఉండాలేమో" అన్నాడు మావయ్య ప్రయాణం కారణం చెబుతూ

" భీమవరం లో మన నరుసులు పిన్ని కొడుకు మాధవ ఉన్నాడు. వాళ్ళ ఇల్లు పెద్దదే. అక్కడ దిగు. వాడూ సంతోష పడతాడు" అంది అమ్మ.

" మామూలు గా దొరక్క పోతే తత్కాల్ అయినా చూడరా. లోయర్ బెర్తు పెట్టు. మోకాళ్ళ ప్రాబ్లెమ్ తో పైకి ఎక్క లేను " అన్నాడు కార్డు పర్సు లోంచి తీసి ఇచ్చి.

మావయ్య భయ పడ్డట్టే లోయర్ బెర్త్ దొరకలేదు. ఒకటి మిడిల్, ఒకటి అప్పర్ దొరికాయి.

★★★★

ట్రైన్ టైంకి కొంచం ముందుగానే స్టేషన్ చేరుకున్నాము. స్టేషన్ లో బండి పెట్టగానే, ఎక్కి సామాను సద్ది మా సీట్లలో కూర్చున్నాం. అప్పటికి మా సెక్షన్ లో ఉన్న ఆరు సీట్లకి, మేమిద్దరమే ఎక్కాము. "ఎవరినయినా లోయర్ బెర్త్ రేక్వెస్ట్ చేద్దామా మావయ్యా అన్నాను." " చూద్దాం లే, వచ్చిన వాళ్ళు మనకంటే వాళ్ళకే అవసరమయితే ఏమి అడుగుతాము?" అన్నాడు మావయ్య

కొద్దీ సేపటికి ఒక నడి వయసు వ్యక్తి, భార్య, ఇద్దరు పిల్లలతో వచ్చి మా ఎదురుగా కూర్చున్నారు. వాళ్ళకి కొంచం సామాను ఎక్కువగా ఉంది. ఆయన వాటిని సద్దుకోవడం లో సతమత మవుతోంటే, మావయ్య లేచి, మా సామాను కూడా జరిపి, వాళ్ళ సామాను సద్దడం లో సహాయం చేశాడు.

వాళ్ళ ఇద్దరు పిల్లలలో, అబ్బాయికి ఏడూ, అమ్మాయికి ఒకటో, ఒకటిన్నరో ఉంటాయి అనుకుంటా. అబ్బాయి కి కళ్ళజోడు. వాడు ఎదో బొమ్మల పుస్తకం చూసుకుంటున్నాడు. అమ్మాయి మాత్రం ఉండుండి ఏడుస్తోంది. ఎందుకు ఏడుస్తోందో ఆవిడకి అర్థం కాక సతమత మవుతోంది. కాసేపు పరిశీలించి, ఆ అమ్మాయిని ఇవ్వమని మావయ్య ఎత్తుకున్నాడు. మావయ్య చేతుల్లో కూడా ఊరు కొక పోతే, ఆ పిల్ల దృష్టి మరల్చడానికి రెండుచేతులతో పైకి ఎత్తినప్పుడు, ఆ పిల్ల కాలికి ఉన్న వెండి పెట్టా హుక్కు దగ్గర, రేకులాటిది ఆ పిల్లకి గుచ్చుకోవడం చూశాడు. అది ఆవిడకి చూపించి ఆపట్టా తీసేయిస్తే ఆ పిల్ల ఊరుకుంది.

ఆవిడ భోజనాలు కెరేయర్ లో సర్దుకు వచ్చింది. భర్తకీ పిల్లలకి పెట్ట బోతూ, మాకు కూడా ఆఫర్ చేసింది. " లేదండి తెచ్చుకున్నాము" అని మేము స్టేషన్లో కట్టించిన ప్యాకెట్లు విప్పాము

భోజనాలు అయిన తరువాత " పవర్ ఎక్కువగా ఉన్నట్టుందే! అబ్బాయికి ఎప్పటినుంచీ కళ్ళజోడు అవసరమైంది సార్ ? సైట్ ఉన్నట్టు ఎలా తెలిసింది?"మావయ్య ఆయనని అడిగాడు

" అవునండీ మైనెస్ అయిదు. కాన్వెంట్ వాళ్ళు అందరికీ మెడికల్ చకప్ చేయించినప్పుడు తెలిసింది" అన్నాడు ఆయన

" ఇంత చిన్న వయసులో వచ్చినప్పుడు రెండేళ్లకోమాటు జంప్ ఆయె అవకాశం ఉంది. పాండిచ్చేరి అరబిందో ఆశ్రమం వాళ్ళు ఒక ఎక్సర్సైజ్ చెప్పి, కిట్ ఇస్తారు. మా అబ్బాయిని తీసుకువెళ్లాను. కొద్దిగా ఉపయోగపడింది. ఇంకా చిన్నవయసులో అయితే ఎక్కువ ఉపయోగపడేది అన్నారు. మీవాడు చాలా చిన్నవాడు కాబట్టి ఒక మాటు తీసుకు వెళ్ళండి " అన్నాడు మావయ్య సలహా ఇస్తూ.

" తప్పకుండా తీసుకువెడతామండి" అంది ఆవిడ ఉత్సాహంగా. వాళ్ళని ఎలా కాంటాక్ట్ చేయాలో మావయ్య ఆయనకి వివరించాడు.

కాసేపు కబుర్లు అయిన తరువాత " మెల్లిగా పైకి ఎక్కుదాము రా, మోకాళ్ళు నెప్పులయినా, తప్పదు కదా?" అన్నాడు మావయ్య లేస్తూ

" క్రింద రెండు బెర్తులూ మావే. మీరు ఒకటి తీసుకోండి." అంది ఆవిడ మొహమాటానికి కాకుండా, సిన్సియర్ గానే

" మీకు ఇబ్బందేమో? " అన్నాడు మావయ్య సందేహిస్తూ

" లేదండి, పిల్లాడూ, ఆయన పైకి వెడతారు ఏమీ ఫరవాలేదు" అని భర్త కేసి చూసింది. ఆయన వెంటనే " ఏమీ ప్రోబ్లం లేదండి " అని అంగీకారం తెలపడంతో మావయ్య బెర్త్ ప్రోబ్లం సాల్వ్ అయింది.

నేను నా బెర్త్ మీదకి ఎక్కుతూ మావయ్య 'చిట్కా' గురించి నాకు కొంత అవగాహన కలుగుతోందేమో అనుకున్నాను.

★★★★

వీరవాసరం లో దిగి తాతయ్య గారి ఇంటికి చేరేటప్పటికి ఉదయం ఎనిమిదయింది. రామభద్రం ఇల్లు కాస్త శుభ్రం చేయించి ఉంచాడు. అమ్మమ్మ, తాత గారు పోయిన తరువాత, ఆ ఇంట్లో ఎవరూ ఉండటం లేదు. ఎప్పుడయినా భూములు చూసుకోవడానికి రాజు మావయ్య వస్తే ఉండడానికి వీలుగా కొద్దీ పాటి సామాను తో మూడు గదులు నివాసయోగ్యంగ చేశాడు రామభద్రం. మిగతా ఇల్లు అంతా చాలా పాడుపడి పోయింది. ఇల్లు మెయిన్ రోడ్డు మీద ఉండడంతో డెవెలప్ మెంట్ కి అడుగుతున్నారు. ఆ ఇంటి స్థలంతో కలిపి అమ్మితే ఎక్కువ రేటు వస్తుందని పక్క స్థలం కొన్నాడు మావయ్య. అనుకున్నట్టు గానే ఇప్పుడు రేట్లు బాగా పెరిగాయి. అందువల్లే అవతల పక్క మందుల షాపు వాడు కొంత స్థలం కలుపుకోవడానికి ఏదో లిటిగేషన్ పెట్టాడు.

రామభద్రం పంపించిన భోజనాలు చేసి ఒక కునుకు తీశాము . మధ్యాహ్నం, రామభద్రం ఎవరో మధ్యవర్తులని తీసుకు వచ్చాడు రాజీ కుదర్చడానికి. వెళ్ళిపోతూ వాళ్ళల్లో ఒకాయన రాజయ్య గారు వెనక్కి వచ్చి సలహా ఇచ్చాడు . ఆయనకి తాత గారు ఎప్పుడో చాలా సహాయం చేశారట. ఆయన అనేదేమిటంటే, రాజు మావయ్య ఢిల్లీ లో ఉండి లిటిగేషన్ నడపలేడనీ , కోర్టుల చుట్టూ తిరగలేడనీ మొత్తం ఇల్లు తో సహా స్థలాన్ని, కొంత కాలం లిటిగేషన్ నడిపి తక్కువ రేటుకి తానే కొనేద్దామనే ఉద్దేశ్యంతో పక్క మెడికల్ షాపు రోశయ్య ఇదంతా లేవదీశాడనీ చెప్పాడు. అందుచేత రాజీ ఏమి పడకుండా కోర్టులో వెయ్యమని చెప్పాడు. ఇక్కడ లాయర్ కాకుండా, భీమవరం లో ఉన్న ఎవరయినా మంచి లాయర్ని పెట్టి కేసు వేయమన్నాడు. తాను చేయవలసిన సహాయం చేస్తానన్నాడు.

ఆ సాయంత్రం భీమవరం మాధవ్ మావయ్య ఇంటికి బయలుదేరాము. దారిలో మావయ్య చెప్పాడు. చిన్నప్పుడు మాధవ్ మావయ్య వీరవాసరం లో తాతగారి ఇంట్లో ఉండి చదువుకున్నాడట. మావయ్య కంటే కొద్దిగా సీనియర్. చాలా విషయాలలో " ఒరేయి మాధవ ని చూసి నేర్చుకోరా" అని మావయ్యతో అనేదట అమ్మమ్మ . ప్రొద్దుటే లేవడం, తన పనులు తాను చేసుకోవడం, శ్రద్ధ గా చదువుకోవడం లాంటి అన్ని విషయాలలో మావయ్యకంటే మెరుగట. వాడు మిలిటరీ సర్వీస్ కి వెళ్లడం వల్ల చూసి చాలా చాలా రోజులయింది అన్నాడు.

భీమవరం లో ఒక పెద్ద అపార్ట్మెంట్ కాంప్లెక్ పక్కన ఒక చిన్న కాంపౌండ్ లో ఇండిపెండెంట్ హౌస్ వాళ్ళది. వీధివైపు వున్న రెండు కిటికీల షేడ్స్ మీద రెండేసి పూలకుండీలు, కిందకి వేళ్ళాడుతున్న పూల తీగలతో చాలా అందాన్నిచ్చాయి. కాంపౌండ్ వాల్ కీ ఇంటికీ మధ్య లోపలికి వెళ్ళే దారికి ఇరు పక్కలా గులాబీ మొక్కలు పూల తో నిండి ఉన్నాయి.

మాధవ్ మావయ్య చాలా ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు. ఆయన, అత్తయ్యా , ఇద్దరే ఉంటున్నారు. వాళ్ళ అమ్మాయి పెళ్లి అయి, దుబాయిలో ఉంటోందని తెలిసింది.

"ఎలా ఉన్నారు వదినగారు. ఎప్పుడో సుబ్బులు పిన్ని కూతురు రాజ్యం పెళ్ళిలో కలిశాము. మళ్ళీ ఇప్పుడు. నన్ను మరిచి పోయి ఉంటారు" అన్నాడు రాజు మావయ్య అత్తయ్యని పలకరిస్తూ. " మా పెద్దక్క కొడుకు చంద్రం " అని నన్ను పరిచయం చేశాడు . బాగా మారిపోయాననీ ఎప్పుడో చిన్నప్పుడు చూశానని చెప్పి లోపలికి వెళ్ళింది అత్తయ్య

హాలులో సోఫాలలో కూర్చున్నాము. " యూరప్ లో చాలా ఇళ్లల్లో కిటికీ షేడ్ల మీద పువ్వుల కుండీలు, కుండీలు కనపడకుండా తీగలు క్రిందకి వాలుతూ ఉంటాయి. అచ్చం అలాగే ఉన్నాయి మీ ఇంటి ముందు. చాలా బాగా పెంచావే" అన్నాడు రాజు మావయ్య మెచ్చుకుంటూ

" మనదేమీ లేదురా, అన్నీ మీ వదిన ఐడియాలే. సినిమాలలో చూసి చేసినవే. పువ్వులు కూడా కోయదు. గులాబీలు చూశావు కదా? అవి అక్కడే ఉండాలి అంటుంది" భార్య గురించి చెబుతుంటే ఆయన కళ్ళల్లో కొంచం గర్వం తొణికసలాడడం నేను గమనించాను

ఇంతలో అత్తయ్య కాఫీలు తెచ్చింది. అందరం మెల్లిగా తాగుతున్నాము. "నీ పూల మొక్కలనీ, కుండీలనీ మెచ్చుకుంటున్నాడు రాజు " అన్నాడు మావయ్య భార్యతో. ఆవిడ నవ్వి ఊరుకుంది

" అద్భుతం! ఇలాంటి ఫిల్టర్ కాఫీ ఈ మధ్యన తాగలేదు. ఎరా చంద్రం మీ వెల్లూర్ లో ఇలాంటిది ఎప్పుడయినా తాగావా? అన్నాడు రాజు మావయ్య నాకేసి చూసి

"కుంభకోణం డిగ్రీ కాఫీ అని ఫిల్టర్ కాఫీ ఉంటుంది కానీ. దానికంటే ఇది చాలా బాగుంది" అన్నాను అత్తయ్యకేసి మెచ్చుకోలు గా చూసి.

రాజు మావయ్య, మేము వచ్చిన పని చెప్పాడు మాధవ్ మావయ్యకి. తనకి తెలిసిన అడ్వొకేట్ ఉన్నాడనీ అతని దగ్గరకి ప్రొద్దుటే వెడదామని చెప్పాడు

డ్రాయింగ్ రూమ్ కి ఎడమవైపుగా ఉన్న బెడ్ రూమ్ మాకు ఉండడానికి ఏర్పాటు చేశారు. కొంచం ఉక్క గా ఉందని, ఇద్దరం స్నానాలు చేసి రెడీ అయ్యాము. రాజు మావయ్య ఎవరో చిన్నప్పటి క్లాస్ మేట్ ఉన్నాడని, అతనిని కలిసి వస్తాన్నని వెళ్ళాడు. నేను అత్తయ్య తో కబుర్లలో పడ్డాను.

రాత్రి ఎనిమిదింటికి రాజు మావయ్య తిరిగి రాగానే డైనింగ్ టేబుల్ దగ్గర ముగ్గురికీ వడ్డించింది. చాలా పదార్థాలు చేసింది అత్తయ్య.

కూర్చుంటూనే అన్నాడు రాజు మావయ్య " ఏమిటి ఇన్ని ఐటెమ్స్ చేశారు వదిన గారు". నవ్వుతూ "ఆ ఏమున్నాయి?మామూలుగా చేసేవే" అంది ఆవిడ

భోజనాలు చేస్తుంటే, ఏ ఐటెం ఎవరు తింటున్నారో చూసి అవి మళ్ళీ వడ్డించడానికి తేవడం లో ఆవిడ శ్రద్ధ నాకు బాగా నచ్చింది

కొబ్బరి కాయతోటి, శనగపప్పు తోటీ రెండు మూడు ఐటెంలు చేసింది ఆవిడ. అవి రుచి చూసి "ఇవి ఎప్పుడూ తిన లేదే, చాలా బాగున్నాయి" అన్నాడు మెచ్చుకుంటూ రాజు మావయ్య.

" ఆ రెండూ మీ వదిన స్పెషల్స్ రా ఎవరు తిన్నా రెసిపీ తెలుసుకుని వెడతారు" అన్నాడు కొంచం గర్వంగా మాధవ్ మావయ్య.

భోజనాలు అయిన తరువాత ఒక పళ్లెం లో పళ్ళ ముక్కలు, ఆ తరువాత వేరే పళ్లెంలో తమల పాలకులు, వక్క[పొడి, వలిచిన ఏలకులు నీట్ గా అమర్చడం-, ఇలా రాత్రి పడుకునే దాకా అత్తయ్య చేసిన వాటిని రాజుమావయ్య మెచ్చుకోవడం, దానికి మాధవ్ మావయ్య ఆనంద పడడం నాకు తెలుస్తూనే ఉంది.

మరునాడు ప్రొద్దుటే మమ్మలిని ఇద్దరినీ అడ్వకెట్ దగ్గరికి తీసుకు వెళ్ళాడు మాధవ్ మావయ్య. ఆయనకి మొత్తం అంతా చెప్పి, అవసరమయితే వీరవాసరంలో ఉన్న రాజయ్య సహాయం చేస్తాడని చెప్పాడు మావయ్య. కాగితాలు అన్నీ రెడీ చేసి వకాలత్ మీదా, మిగతా వాటి మీద సంతకం పెట్టించుకున్నాడు అడ్వొకేట్. మేము తిరిగి వస్తోంటే " మీరు ఎక్కడో ఢిల్లీ నుంచి తరచు రావడం కుదరదు కాబట్టి. ఇక్కడ ఎవరికయినా పవర్ ఇచ్చి. రాజయ్యని కూడా ఆ ఊళ్ళో వాళ్ళ సాక్ష్యం కోసం కలుపుకోవడం మంచిది అన్నాడు" అన్నాడు అడ్వొకేట్.

అలాగే ట్రై చేస్తానండి అని మావయ్య అనగానే " నా పేర పవర్ కి కాగితాలు తయారుచేయండి సార్,నేను ఇక్కడ ఉన్నాను కదా?, రాజయ్య నాకూ తెలుసు, అక్కడ వాళ్లందరితో నేను మాట్లాడుతా, చాలా అవసరమయినప్పుడే రాజుని పిలిపిద్దాము" అన్నాడు మాధవ్ మావయ్య

రాజు మావయ్య ఆయన చేతులు పట్టుకుని " చాలా థాంక్స్ రా. నీకు శ్రమ అవుతుందేమో" అన్నాడు కృతజ్ఞత ముఖం లో ప్రస్ఫుటమవుతుండగా

" భలేవాడివే ఆ మాత్రం మనకి మనం చేసుకోవడం లో ఏముంది? " అన్నాడు నవ్వుతూ. దానికి సంబంధించిన పేపర్స్ కూడా సంతకాలు అయిన తరువాత బయలు దేరి వచ్చేశాము.

రాత్రికి ట్రైన్ లో తినడానికి అత్తయ్య ఇచ్చిన ప్యాకెట్లు కూడా తీసుకుని స్టేషన్కి బయలు దేరాం. " ఈ మాటు వచ్చేటప్పుడు, మా చెచెల్లెలిని కూడా తీసు రా తప్పకుండా" అంది అత్తయ్య రాజు మావయ్యతో, సాగనంపడానికి గుమ్మం దాకా వచ్చి.

" తప్పు కుండా, మీ దగ్గర నేర్పించవలసినవి చాలా ఉన్నాయి" అన్నాడు నవ్వుతూ మాధవ్ మావయ్య కేసి చూస్తూ. ఆయన కూడా ఆనందంగ నవ్వేడు.

★★★

తిరుగు ప్రయాణం లో ఇద్దరికీ లోయర్ బెర్తులే రావడంతో ప్రాబ్లెమ్ లేకపోయింది. బ్యాగులు సద్ది సీట్లలో సెటిల్ అయిన తరువాత అప్పటి వరకూ నన్ను దొలుస్తున్న "మావయ్య చిట్కా" విషయం మనసులో పైకి వచ్చింది. హైదెరాబాద్ లో స్టేషన్ నుంచి తీసుకువచ్చిన ఆటో వాడి దగ్గరనుంచి, ట్రైన్లో బెర్త్ ఆఫర్ చేసిన కుటుంబం, భీమవరం లో మాధవ్ మావయ్య కోర్టు కేసు సహాయానికి ఆఫర్, అన్నీ ఒక్క మాటు గుర్తుకు వచ్చాయి. ఆటో వాడిని పొగడడం, ట్రైన్ లో వాళ్లకి సహాయం చేయడం, అత్తయ్యని పొగడడం ద్వారా మాధవ్ మావయ్యని ఆనంద పరచడం, ఇవన్నీ ఒక ఫలితాన్ని ఆశించి ప్లాన్ ప్రకారం జరిగాయా, లేక సహజంగా మావయ్య వ్యక్తిత్వం లో ఉన్న మంచితతనం వల్ల జరిగాయా అన్న విషయం నాకు సందేహంగానే మిగిలిపోయింది.

మనసులో పీక్కోవడం దేనికి? మావయ్యనే అడిగేద్దాం అనుకుని ఆయనతో నా మనసులో వచ్చిన ప్రశ్న గురించి చెప్పాను.

ఆయన " సహజంగా చెట్టుకు పూసిన మల్లెపూల నుంచి వచ్చే సువాసన ఆహ్లాద పరిచినట్టు, ఎంత అందంగా ఉన్నా ప్లాస్టిక్ పూలు ఆహ్లాద పరచవుకదరా " అన్నాడు నవ్వుతూ

మర్నాడు ప్రొద్దున్న హైదరాబాద్ రైట్ టైం కె చేరింది ట్రైన్. ఇంటికి వెళ్లి స్నానాలు చేసి, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాము. అమ్మ ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ సిప్ చేస్తూ అన్నాడు మవయ్య "అక్కయ్యా మన చంద్రం ఈ రెండురోజుల ట్రిప్ లో చాలా హెల్ప్ ఫుల్ గా ఉన్నాడు. నాకేమీ శ్రమ లేకుండా అన్నీ తా నే మానేజ్ చేశాడు" అన్నాడు నవ్వుతూ

" నాకు మల్లి పూల వాసన వేస్తోంది మావయ్యా " అన్నాను నవ్వుతూ. ఆయనకి అర్థ మయింది

"నేను ప్లాస్టిక్ పువ్వును కాదు కాదురా " అన్నాడు నవ్వుతూ

ఆ జవాబు కి నాకుకూడా పెద్దగా నవ్వు వచ్చింది

ఇద్దరం ఎందుకు నవ్వుకుంటున్నామో అర్థం కాక అమ్మ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయింది

# కథ కంచికి అమ్మాయి యింటికి

కొండగుంట వెంకటేష్

తన గదిలో కూర్చుని అప్పుడే భోజనం ముగించాడు చక్రపాణి. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ ఓబలేసు వచ్చి టేబుల్ శుభ్రం చేసి ప్లేటు తీసుకుని వెళ్ళిపోయాడు. సమయం పదిగంటలు కావస్తోంది. షెడ్యుల్ టైం ప్రకారం ఇంకో గంటలో హైదరాబాదు ప్యాసింజర్ రైలు రావాలి. కాని ఆ ట్రైన్ ఎప్పుడు టైంకు రాదు. ప్రతిరోజు ఒకటి రెండు గంటలు ఆలస్యంగా రావటం మాములే.

పావురాలపల్లి పెద్ద ఊరుకాదు. ఆ రూట్ లో పెద్దగా రష్ కూడా ఉండదు. ప్రతిరోడు ఆ ఊళ్ళో రెండు రైలు మాత్రమే ఆగుతాయి. ఒకటి పగలు వస్తుంది. అయిదునిమిషాలు మాత్రం ఆగుతుంది. రెండోది రాత్రి వచ్చే ప్యాసింజర్ ట్రైన్. పది నిమిషాలు ఆగుతుంది. ఈ మధ్యలో ఎన్నో రైళ్ళు వస్తాయి కాని ఏది పావురాలపల్లిలో ఆగవు. అందుకే స్టేషన్ మాస్టర్ గా చక్రపాణికి ఎక్కువగా పనిఉండదు. కాకపోతే అతని డ్యూటికి టైం అంటు ఉండదు. రాత్రి వచ్చే ప్యాసింజర్ రైలు ప్రతిరోజు ఆలస్యంగా రావటం వల్ల అతను చాల సేపు స్టేషన్ లో ఉండవలసివస్తుంది. ఆ రైలు వెళ్ళేంతవరకు కాచుకుని ఉండాలి. అది వెళ్ళిపోతే కాని అతని డ్యూటి పూర్తికాదు.

గదిలోంచి బయటకు వచ్చి చుట్టు చూశాడు చక్రపాణి. స్టేషన్ లో పెద్దగా ప్రయాణికులు లేరు. ముగ్గురు మాత్రం ఒక మూల కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. అప్పుడే వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చింది. ఆకాశం మేఘాలతో పూర్తిగా నిండిపోయింది. నల్లచీర కప్పుకున్నట్టు ఆకాశం పూర్తిగా కారుమబ్బులతో నిండిపోయింది. గాలివేగంగా వీస్తోంది. ఏ సమయంలోనే అయిన వర్షం వచ్చే సూచన కనిపిస్తుంది.

అతను ఊహించింది నిజమైంది. సన్నగా వర్షం మొదలైంది. అసలే ప్యాసింజర్ రైలు. ఏ రోజు టైంకు వచ్చిన పాపాన పోలేదు. ఇప్పుడు ఈ వర్షం కూడా తోడైతే ఇక చెప్పవలసిన పనిలేదు. రాత్రంతా జాగరణ చెయ్యవలసివస్తుంది. ఈ రకంగాఆలోచిస్తూ చక్రపాణి లోపలికి వెళ్ళబోతుంటే అప్పుడే ఒక అమ్మాయి అతనికి ఎదురుపడింది. చాల పెద్దింటి అమ్మాయిలా ఉంది. ఖరీదైన చీర జాకెట్టు వేసుకుంది. అది కాదు అతన్ని ఆశ్చర్యం పరుస్తుంది. ఒంటినిండా నగలు దిగేసుకుంది. సాధారణంగా రాత్రివేళ ప్రయాణం చేసేటప్పుడు ఎవరు ఇన్ని నగలు పెట్టుకుని ప్రయాణం చెయ్యరు.

"అంకుల్ హైదరాబాదు ప్యాసింజర్ ఎప్పుడు వస్తుంది?"అడిగింది.

"ఇంకో గంటలో రావాలి. కాని ఈ వాతావరణం చూస్తుంటే ఎప్పుడు వస్తుందో చెప్పలేను"అన్నాడు చక్రపాణి.

"వర్షం వస్తుంది లోపల కూర్చోవచ్చా?"అడిగింది ఆ అమ్మాయి.

"నిరభ్యంతరంగా వెళ్ళి కూర్చో. దీనికి పర్మిషన్ అవసరంలేదు"అన్నాడు చక్రపాణి.

ఆమె ఠీవిగా నడుస్తూ వెళ్ళి బెంచిమీద కూర్చుంది.

చక్రపాణి ఆమెకు ఎదురుగా కూర్చుని "ఎక్కడికి వెళ్ళాలి?"అని అడిగాడు.

"హైదరాబాదు."

"ఒక్కదానివే వెళుతున్నావా? తోడుగా ఎవరు లేరా?"

"నాతో మా బావ వస్తున్నాడు. తనకు ఏదో అర్జంట్ పనిపడింది. నన్ను ముందు వెళ్ళిటికెట్టు తీసుకోమని చెప్పి తరువాత తను వస్తానని చెప్పాడు."

"నీ పేరు ఏమిటమ్మా? ఇలా అడుగుతున్నందుకు ఏం అనుకోకు. నీ తండ్రిలాంటి వాడిని."

"ఫర్వాలేదు అంకుల్ నా పేరు స్వాతి."

ఆ పేరు వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు చక్రపాణి.

"ఆశ్చర్యంగా ఉంది. నా కూతురు పేరు కూడా స్వాతి."

"మీకు నా లాంటి కూతురు ఉందన్నమాట."

"ఉండేది కాని ప్రస్తుతం ఇక్కడ లేదు."

"ఎక్కడ ఉంది. సిటిలో చదువుకుంటుందా?"

"ఈ ప్రపంచం విడిచి వెళ్ళిపోయిందమ్మా" అన్నాడు విచారంగా చక్రపాణి.

"వెరిసారీ అంకుల్. మీ అమ్మాయిని గుర్తుచేసి అనవసరంగా మీకు బాధ కలిగించాను"అంది ఆ సానుభూతిగా

"ఇంతకి మీ అమ్మాయి ఎలా చనిపోయింది? జబ్బుచేసి చనిపోయిందా?"

"జబ్బుతో చనిపోయి ఉంటే ఇంత బాధపడేవాడిని కాను. నా ఖర్మ అనుకుని సరిపెట్టుకునేవాడిని. కాని ఒక నీచుడిని నమ్మి మోసపోయింది. వాడు నా కూతురిన ప్రేమించినట్టు ప్రేమించి కోరిక తీర్చుకుని పారిపోయాడు. ఆ అవమానం తట్టుకోలేక నా కూతురు మానసిక వేదనతో చనిపోయింది. నిన్నుచూస్తుంటే నా కూతురిని చూసినట్టుగా ఉంది. పైగా నీ పేరు కూడా స్వాతి కావటం ఇంకా ఆశ్చర్యం కలిగించింది. భగవంతుడే నా కూతురిని నీ రూపంలో చూపించాడని తోచింది. అందుకే పని గట్టుకుని నిన్ను పలకరించాను"అన్నాడు చక్రపాణి.

ఆ అమ్మాయి ఏదో మాట్లాడబోయింది. ఇప్పుడే వస్తానని చెప్పి చక్రపాణి వెళ్ళాడు. వర్షం యడతేరిపిలేకుండ ఇంకా కురుస్తునే ఉంది. అప్పుడప్పుడు ఢాం అంటు ఎక్కడో పిడుగుపడిన చప్పుడు చెవులను బద్దలు చేస్తోంది. దానికి తోడు కళ్ళు మిరమిట్లు గొలిపే మెరుపులు. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణం భీభీత్సంగా ఉంది. ఈ రోజు ప్యాసింజర్ రైలు పరిస్థితి ఇంతే. అది ఎప్పుడు వస్తుందో ఎవరు ఊహించలేరు. ఈ విషయం మాత్రం చక్రపాణి ఆ అమ్మాయితో చెప్పలేదు.

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను ఏం అనుకోరు కదా?"అంది ఆ అమ్మాయి.

"నిరభ్యంతరంగా అడుగు. ఏం అనుకోను " అన్నాడు చక్రపాణి.

"మీ అమ్మాయి చనిపోయిందని చెప్పారు కదా. ఎలా చనిపోయిందా తెలుసుకోవాలని ఉంది అంకుల్. మీకు ఇష్టమైతే ఆమె గురించి చెప్పండి".

"చెప్తాను విని తట్టుకోగలవా అని నా భయం. అంత దయనీయంగా ఉంటుంది నా స్వాతి కథ."

"ఫర్వాలేదు చెప్పండి"అని సర్దుకుని కూర్చుంది ఆ అమ్మాయి.

"స్వాతి నాకు ఒక్కగానొక్క కూతురు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. అప్పటినుంచి నేను తల్లి తండ్రిని అయి పెంచి పెద్ద చేశాను. ఏ కష్టం రాకుండ కంటికి రెప్పలా చూసుకున్నాను. తను ఏది కావాలని అడిగిన వెంటనే తెచ్చిఇచ్చేవాడిని. చిన్న విషయానికి కూడా ఆమెకు కష్టం రాకుండ చూసుకున్నాను. ఒక మాటలో చెప్పాలంటే ఒక మహారాణిలా పెంచాను. నాది స్టేషన్ మాస్టర్ ఉద్యోగం. ప్రతిరెండు సంవత్సరాలకు బదిలీలు తప్పనిసరి. ప్రభుత్వం నన్ను సిటి ఏరియాకు ట్రాన్స్ ఫర్ చెయ్యకుండ ప్రతి సారి పావురాలపల్లి లాంటి చిన్న ఊళ్ళకు బదిలీ చేసేది. అక్కడ చదువుకోవటానికి పెద్దగా వసతులు ఉండవు. మంచి స్కూల్స్ కాని కాలేజిలు కాని లేవు. అందుకే స్వాతిని సిటిలో హాస్టల్ లోఉంచి చదివించాను."

"నాకు స్వాతి తప్ప ఈ ప్రపంచంలో వేరేవరులేరు. ఆమెను సంవత్సరాలతరబడి విడిచి ఉండటం చాల కష్టంగా తోచేది. స్వాతి కూడా నాకు దూరంగా ఉండటం ఇష్టపడేది కాదు. కాని నా కూతురు భవిష్యత్తు బాగుండాలని ఆమె అభివృద్ధిలోకి రావాలని నా కోరిక జీవితాశం. అందుకే మనస్సులో ఎంత కష్టంగా ఉన్నా అన్ని దిగమింగుకుని స్వాతిని పంపించాను. ఆమె వెళ్ళిన తరవాత ఒంటరితనంతో నేను ఎంత బాధపడ్డానో ఆ దేవుడికే తెలుసు. ఒక్కొక్కోసారి పిచ్చిపటటినట్టుగా ఉండేది."

"స్కూల్ చదువు అయిన తరువాత స్వాతి కాలేజికి వచ్చింది. తను ఎప్పుడు చదువులో ముందుండేది. ప్రతి క్లాసులో మెరిట్ లో విజయం సాధించేది. ఆమెను బాగాచదివించి ఉన్నత శిఖరం మీద పెట్టాలి. ప్రతి నిమిషం ఇదే ఆలోచించేవాడిని. స్వాతి కూడా నా మనస్సు తెలుసుకుని

దానికి అనుగుణంగా నడుచుకునేది. రోజులు గడుస్తున్నాయి. స్వాతి డిగ్రి ఫైనల్ ఇయర్ కు వచ్చింది. డిగ్రి అయిన తరువాత ఆమెను ఐఏయస్ కు కూర్చోపెట్టాలని నిర్ణయించుకున్నాను. అందుకే ఆమె పరీక్షలు ఎప్పుడు పూర్తిఅవుతాయా ఎప్పుడు ఇంటికి వస్తుందా అని ఆత్రంగా ఎదురుచూసేవాడిని. "

"డిగ్రి చివరిసంతవత్సరం ఆఖరి సెమిస్టర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది నా కూతురు. నా సంతోషానికి అవధులు లేకుండ పోయింది. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనిచ్చి తరువాత ఐఏయస్ పరీక్ష గురించి మాట్లాడాలని అనుకున్నాను. ఒకరోజు నా స్నేహితుడు రాజగోపాల్ మా ఇంటికి వచ్చాడు. అతను నాకు ఎంతో ఆత్మీయుడు. ఇద్దరం చిన్నతనంలో ఒకే స్కూలులో చదివాం. తరువాత అతను కాలేజి చదవు చదవటానికి వేరే ఊరికి వెళ్ళాడు. నేను మా ఊళ్ళోనే లోకల్ కాలేజిలో చేరాను. "

"శారీరకంగా మేము దూరం అయిన తరుచు ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. అప్పుడప్పుడు ఫోన్ లో మాట్లాడుకునేవాళ్ళం. అప్పటిలో సెల్ ఫోన్స్ కాని లాండ్ లైన్ ఫోన్స్ కాని విరివిగా ఉండేవి కావు. అందుకే అతను పోస్ట్ ఆఫీసకు కాల్ చేసేవాడు. అతనికి నాకంటే రెండు సంవత్సరాలు ముందు పెళ్ళయింది. వాడికి ఒక్కడే కొడుకు. కంప్యూటర్ కోర్స్ లో పెద్ద డిగ్రీ తీసుకుని పెద్ద కంపెనిలో సాఫ్ట్ వేర్ ఇంజీనీర్ గా చేరాడు. మనిషి చూడటానికి చాల బాగుంటాడు. తనకు స్వాతిని కోడలిగా చేసుకోవాలని చెప్పాడు. "

" నాకు సంతోషంతో మాటలు రాలేదు. ఇది కలా నిజమా అన్న సందేహంలో పడిపోయాను. తరువాత సంతోషంతో ఊగిపోయాను. నిజానికి స్వాతికి ఇంతకంటే మంచి సంబంధం నేను తీసుకురాలేను.అదృష్టం కొద్ది ఒక గొప్ప సంబంధం నన్ను వెతుక్కుంటు వచ్చింది. పైగా రాజగోపాల్ కొడుకులో ఒంక పెట్టటానికి నాకు ఏం కనిపించేదు. నా స్థానంలో ఇంకేవరైన ఉంటే వెంటనే సరే అనేవారు. కాని నేను అలా అనలేకపోయాను. ఒకసారి స్వాతితో మాట్లాడి తరువాత నా నిర్ణయం చెప్తానని అన్నాను. రాజగోపాల్ ఏం అనుకోలేదు. చిరునవ్వుతో అలాగే అన్నాడు. "

"ఒకరోజు స్వాతి మంచి మూడ్ లో ఉండటం చూసి పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చాను. కాబోయే పెళ్ళికొడుకు ఫోటో కూడా చూపించాను. ఆ ఫోటో చూసి ఎగిరిగెంతెసి పెళ్ళికి ఒప్పుకుంటుందని భావించాను. సంతోషంతో ఆమె మొహం వెలిగిపోతుందని అనుకున్నాను. కాని అలాంటిది ఏం జరగలేదు. నేను అనుకున్నది ఒకటి జరిగింది ఇంకోకటి. పెళ్ళికొడుకు ఫోటో చూడగానే నా కూతరు మొహం సున్నం కొట్టినట్టు తెల్లగా పాలిపోయింది. ఒక్క క్షణం పాటు నాతో ఏం మాట్లాడలేకపోయింది. తరువాత మెల్లగా తేరుకుని అంది.

"నీ మాట కాదంటున్నందుకు ఏం అనుకోకు నాన్న. నాకు ఈ సంబంధం ఎంత మాత్రం ఇష్టంలేదు. నేను ఇదివరకే ఒక అబ్బాయిని ప్రేమించాను. అతను కూడా నన్ను ఎంతో ఇష్టపడ్డాడు. ఇద్దరం పెళ్ళిచేసుకోవాలని తీర్మానించుకున్నాం. ఈ విషయం నీకు చెప్పాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని ధైర్యం చెయ్యలేకపోయాను. ఇప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది కనుక చెప్పుతున్నాను అంది."

"ఇంతకి ఆ అబ్బాయి ఎవరు? "శాంతంగానే అడిగాను.

"లోకల్ యం.యల్ ఏ ఒక్కగానొక్క కొడుకు. ఇద్దరం ఒకే కాలేజిలో చదువుకుంటున్నాం. పైగా అతను నా క్లాస్ మెట్. నేనంటే చాల ఇష్టం తనకి. నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేడు. నువ్వు సరేనంటే అతన్ని పెళ్ళి చేసుకుంటాను"అంది చిన్నపిల్లలా.

వెంటనే నాకేం మాట్లాడాలో తోచలేదు. ఆ యం.యల్ ఏ గురించి నాకు బాగా తెలుసు. దాదాపు పది అవినీతి కేసులలో అతను ఇరుక్కుపోయాడు. అతని మీద సిబిఐ దర్యాప్తు కూడా మొదలైంది. ఈ విషయం అన్ని పేపర్స్ లోను ప్రముఖంగా వచ్చాయి. అయిన స్వాతికి ఈ విషయం ఎలా తెలియలేదా అని ఆశ్చర్యపోయాను. ఒక వేళ అబ్బాయి మంచివాడే కావచ్చు. నేను మనస్సు మార్చుకుని ఈ సంబంధానికి సరే అనవచ్చు. కాని యం.యల్. ఏ ఒప్పుకుంటాడా. అతని అంతస్థుకి నా అంతస్థుకి భూమికి ఆకాశానికి ఉన్నంత తేడాఉంది. ఒక సామాన్యమైన స్టేషన్ మాస్టర్ తో సంబంధం కలుపుకుంటాడా అతను.

అదే విషయం స్వాతికి చెప్పాను.

"తండ్రి చెడవాడే కావచ్చు. కాని అబ్బాయి చాల మంచివాడు నాన్న. ఒకవేళ అతని తండ్రి ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏం ఫర్వాలేదు. తండ్రిని ఎదిరించి ధైర్యంగా నన్ను పెళ్ళిచేసుకుంటాడు. అ నమ్మకం నాకుంది"అంది స్వాతి.

కాని నాకు మాత్రం ఏ మాత్రం నమ్మకం కలగలేదు. రాజకీయనాయకుల సంగతి నాకు బాగా తెలుసు. అందుకే స్వాతిని అతన్ని మరచిపోమని చెప్పాను. నేను తెచ్చిన సంబంధానకి ఒప్పుకోమని మెల్లగా చెప్పాను. కాని స్వాతి వినిపించుకోలేదు. తను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టుగా ప్రవర్తించింది. అతన్ని తప్ప ఇంకెవరిని పెళ్ళిచేసుకోనని ఖరాఖండిగా చెప్పింది.

ఇంత శాంతంగాచెప్పిన స్వాతి వినకపోయేసరికి నా సహనం పూర్తిగా పోయింది. కోపంతో ఊగిపోయాను. ఆరునూరైన నేను తెచ్చిన సంబంధం చేసుకోవాలని లేకపోతే నా చావు చూస్తావని బెదిరించాను. దాంతో స్వాతి ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళి గడియవేసుకుంది. ఆ రాత్రి ఆమె భోజనం కూడా చెయ్యలేదు. నేను చాలసార్లు తలుపు తట్టి పిలిచాను. కాని లోపలనుంచి ఎలాంటి జవాబు రాలేదు. నాకు కూడా ఆరోజు భోజనం చెయ్యాలనిపించలేదు. అలాగే ఖాళీ కడుపుతో పడుకున్నాను. "

"మరుసటి రోజు ఉదయం కొంచం ఆలస్యంగా నిద్రలేచాను. రాత్రి జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది. వెంటనే లేచి స్వాతి గదిలోకి వెళ్ళాను. తలుపులు బార్లా తెరిచిఉన్నాయి. లోపల స్వాతి లేదు. ఆమెతో పాటు ఆమెకు సంబంధించిన సామానులు లేవు. ఇల్లంతా వెతికాను. ఎక్కడ కనిపించలేదు. దాంతోనాకు అంతా అర్ధమైంది. నేను అనుకున్నంతపని చేస్తానని భయపడి నా కూతురు ఇంట్లోంచి పారిపోయింది. పచ్చిగా చెప్పాలంటే లేచిపోయింది. అది నిజమే అని నిరూపిస్తూ టిపాయ్ మీద ఆమె రాసిన ఉత్తరం కనిపించింది. అందులో రెండు వాక్యాలు మాత్రం ఉన్నాయి.

"నాన్నగారు నేను వెళ్ళిపోతున్నాను. నాకోసం వెతకొద్దు. పెళ్ళి చేసుకున్న తరువాత నా భర్తతో మీ ముందు ఉంటాను."

"ఉత్తరం పట్టుకుని నేలమీద కూలిపోయాను. ఆ షాక్ నుంచి తేరుకోవటానికి నాకు పది రోజులు పట్టింది. ఇన్ని రోజులు గడిచిన స్వాతి మాత్రం రాలేదు. బహుశా నా మీద కోపంగా ఉండిఉంటుంది. త్వరలోనే వస్తుందని సరిపెట్టుకున్నాను. కాని నెలరోజులు గడిచిన ఆమె జాడ లేదు. కనీసం నాకు కాల్ కూడా చెయ్యలేదు. నాకు చాల భయం వేసింది. పోలీస్ రిపోర్ట్ ఇచ్చాను."

"రోజులు గడిచిన స్వాతి జాడమాత్రం తెలియలేదు. ఎక్కడుందో ఏం చేస్తుందో అని ప్రతిక్షణం తల్లడిల్లిపోయాను. ఎలాగో మనస్సు కుదుటపరుచుకుని నా రొటిన్ జీవితంలో పడిపోయాను. ఆరునెలలు గడిచాయి. ఒకరోజు ఆఫీసునుంచి లేటుగా వచ్చాను. గుమ్మం దగ్గర ఒక ఆకారం కనిపించింది. చీకటిగా ఉండటం వల్ల ఆ ఆకారం మొహం కొంచం కూడా కనిపించలేదు. ఎవరమ్మా నువ్వు " అని అడిగాను.

"నేను నాన్న స్వాతిని "అని నా కూతురు గొంతు వినిపించింది.

ఆశ్చర్యం సంతోషం నన్ను ఒక్కసారిగా కుదిపేశాయి. ఆ సమయంలో ఆ బలం ఉత్సాహం ఎలా వచ్చాయో తెలియదు వేగంగా వెళ్ళి స్వాతిని దగ్గరకు తీసుకున్నాను. వెక్కివెక్కి ఏడుస్తూ నన్ను చుట్టుకుపోయింది. మెల్లగా నడిపించుకుంటు లోపలికి తీసుకువెళ్ళాను. లైటు వెలుగులో ఆమెను చూసిన నేను కర్రాయిలా బిగుసుకుపోయాను. నా మైండ్ బ్లాంక్ అయిపోయిన ఫీలింగ్ కలిగింది. నా స్వాతి వాలకం పూర్తిగా మారిపోయింది. అప్పుడు ఉన్న స్వాతికి ఇప్పుడు నా కళ్ళ ముందు ఉన్న స్వాతికి ఎంతో తేడా ఉంది. అప్పుడు అందంగా బార్బీడాల్ లా ఉండేది. ఇప్పుడు చిరిగి పోయిన మాములు బొమ్మాలా ఉంది. శరీరం మీద నల్లని మచ్చలు కొట్టోచ్చినట్టు కనిపిస్తున్నాయి. స్వాతి ఏదో జబ్బుతో బాధపడుతుందని నాకు అర్ధమైంది."

కొంచంసేపటితరువాత తేరుకుని అసలు కధ చెప్పింది స్వాతి.

"అతను నన్ను దారుణంగా మోసం చేశాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గొంతు కోశాడు. తన కోరికను తీర్చుకని నా జీవితాన్ని సర్వనాశనం చేశాడు. అంతటితో విడిచిపెట్టకుండ డబ్బుకోసం నన్ను ఒక బ్రోతల్ కంపెనికి అమ్మేశాడు. అక్కడనుంచి తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని వీలుకాలేదు. పైగా యజమానురాలితో చావు దెబ్బలు తిన్నాను. కుక్కను కొట్టినట్టు కొట్టింది. ఇంకోసారి తప్పించుకుంటే చంపేస్తానని బెదిరించింది. ఆ తరువాత నేను మళ్ళి తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు. నా ఖర్మ ఇంతే అని సరిపెట్టుకున్నాను. నీ మాటలు విననందుకు నాకు తగిన శాస్తీ జరిగిందని అనుకున్నాను. అందుకే మానసీకంగా శారీరకంగా అన్నిటికి సిద్దమైపోయాను. "

"కొన్ని రోజుల తరువాత నా అదృష్టం బాగుంది. ఒక యన్ జీ వో సంస్ద పోలీసుల సహయంతో మా బ్రోతల్ మీద దాడిచేసింది. యజమానురాలితో సహ ఆమె అనుచరులందరిన అరెస్ట్ చేసింది. అక్కడ నా లాంటి వాళ్ళు చాల మంది ఉన్నారు. వాళ్ళకు డబ్బు ఇచ్చి వాళ్ళవాళ్ళ ఊరికి పంపించేసింది. ఆ విధంగా నేను ఇక్కడికి చేరుకున్నాను. నన్ను క్షమించు నాన్న. ఆ రోజు నీ మాటలు విని ఉంటే నా జీవితం ఇలా

ఉండేది కాదు. నా మూర్ఖత్వం వల్ల నా పరువుతో పాటు మన ఇంటి పరువు కూడా మంటకలిపాను. సమాజం నిన్ను చీదరించుకునేలా చేశాను. అందుకు నన్ను క్షమిస్తావా నాన్న''అంది.

నా తండ్రి మనస్సు తల్లడిల్లిపోయింది. వెంటనే మరునాడు ఆమెను మంచి హాస్పటల్ లో చేర్చాను. రెండు రోజుల వరకు స్వాతి బాగానే ఉంది. ట్రీట్ మెంట్ కు రెస్పాండ్ అయింది. కాని మూడో రోజు ఏమైందో తెలియదు. పరిస్థితి విషమించింది. ఆమెను కాపాడటానికి డాక్టర్స్ ఎంతో ప్రయత్నించారు. కాని ఏం లాభం లేకుండ పోయింది. స్వాతి చనిపోయింది. ఉన్న ఒక్కగానొక్క కూతరు నన్ను శాశ్వతంగా విడిచి దూరతీరాలకు వెళ్ళిపోయింది. నా జీవితాన్ని నిస్సారంగా చేసి మరి వెళ్ళింది.''

"స్వాతి వెళ్ళి పోయిన తరువాత నాకు జీవితం మీద విరక్తికలిగింది. ఒక్కోక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చేది. కాని చావటానికి ధైర్యం చాలలేదు. జీవితం అనేది జీవించటానికి చావటానికి కాదు అన్న మాటలు గుర్తుకువచ్చి ఆగిపోయాను. ఆ క్షణం నుంచి స్వాతిని తలుచుకుంటు ఇలా బతుకుతున్నాను ఇది నా కథ "అని ముగించాడు చక్రపాణి.

అతని కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

"బాధపడకండి అంకుల్''అంది పేలవంగా ఆ అమ్మాయి.

ఈ కథతో సంబంధం లేకుండ బయట మాత్రం ఇంకా వర్షం కురుస్తునే ఉంది. ఇప్పుడిప్పుడే తగ్గేలా కనిపించటం లేదు.

"సార్ ఇంకో అరగంటలో రైలు వస్తుంది సార్''అన్నాడు కంగారుగా ఓబలేసు.

"రామ్మా టికెట్ ఇస్తాను''అని లేచి రిఫ్రెష్ రూమ్ లోకి వెళ్ళాడు చక్రపాణి. అతను శుభ్రంగా మొహం కడుక్కొని వచ్చేసరికి బెంచి మీద కూర్చున్న ఆ అమ్మాయి లేదు. ఆమె బ్యాగ్ కూడా లేదు.

"ఓబలేసు ఆ అమ్మాయి ఏమైంది?''అడిగాడు చక్రపాణి.

"వెళ్ళిపోయింది సార్ "అన్నాడు ఓబలేసు.

"ఒకసారి బయట ఉందేమో చూసి రా''అని ఓబలేసును పంపించాడు చక్రపాణి.

క్షణం తరువాత తిరిగివచ్చాడు ఓబలేసు.

"సార్ ఆ అమ్మాయి ఎక్కడ కనిపించలేదు''అనిచావు కబురు చల్లగా చెప్పాడు.

అంతవరకు ఉద్వేకంతో ఉన్న చక్రపాణి మొహంలో ఎంతో రిలీఫ్ కనిపించింది. గట్టిగా ఒకసారి లోపలికి గాలి పీల్చి పెద్దగా నవ్వాడు.

"ఎందుకు సార్ అలా నవ్వుతున్నారు?''అడిగాడు ఆశ్చర్యంగా ఓబలేసు.

"నా కథ రక్తికట్టినందుకు నవ్వుతున్నాను. నా నటన ఆస్కార్డ్ అవార్డ్ లెవల్ లో ఉన్నందుకు నవ్వుతున్నాను. నీకు తెలియని విషయం చెప్తాను విను. ఆ అమ్మాయి ఎవరో నాకు బాగా తెలుసు. ఈ ఊరి మోతుబరి రాజారావుగారి కూతురు. ఎవడో అనామకుడిని ప్రేమించినట్టుంది. ఆ విషయం తండ్రికి చెప్పటానికి భయపడింది. ఒకవేళ చెప్పిన తండ్రి తన ప్రేమను అంగీకరించడని గ్రహించింది. అందుకే ప్రియుడితో పారిపోవాలని పథకం వేసింది. ఆమెను ప్రేమించినవాడు ఒక లోఫర్. అందుకే నగలతో రమ్మని చెప్పి ఉంటాడు. ఈ అమ్మాయి అతని మాటలు నమ్మి ఇంట్లో ఉన్న నగలు వేసుకుని వచ్చింది. నాతో బావతోడు వస్తున్నాడని చెప్పింది. ఒకవేళ నిజంగా బావ ఉంటే అతను ఆమెను ఇలా రానిచ్చేవాడు కాదు. దాంతో నాకు అంతా అర్థమైంది. మాములుగా ఆమెకు నచ్చచెప్పి పంపించవచ్చు. ఇంత పెద్ద నాటకం ఆడవలసిన అవసరం లేదు. కాని ఈ కాలపు అమ్మాయిలు అబ్బాయిలకు మంచి మాటలు రుచించవు. సలహాలు అసలు పడవు. అందుకే సెంటిమెంట్ తో కొట్టాలని అనుకున్నాను. మనిషి దేనికైన లొంగకపోవచ్చు కాని సెంటిమెంట్ కు మాత్రం తప్పకుండ లొంగిపోతాడు. ముఖ్యంగా భారతీయులు తప్పకుండ లొంగిపోతారు. దానికి కారణం భారతీయుల జీవితాలు చాల వరకు సెంటిమెంట్స్ తో ముడిపడిఉంటాయి. అందుకే నాకు ఒక కూతురు ఉన్నట్టు తన పేరు స్వాతి అని ఒక కథ అల్లాను. ఆ కథకు దయనీయమైన సెంటిమెంట్ ను జోడించాను. దాంతో కథ రక్తికట్టింది. పిచ్చి అమ్మాయి నా మాటలు నిజమని నమ్మింది. తను ఎంత పెద్ద తప్పుచేస్తుందో గ్రహించింది. తన జీవితం కూడా నా కూతురి జీవితం లాగా అయిపోకుడదని తెలుసుకుంది. అందుకే నాతో చెప్పకుండ వెళ్ళిపోయింది. ఇప్పుడు నాకు చాల సంతోషంగా

ఉంది. నేను అనుకున్న పని విజయవంతంగా పూర్తిఅయింది. రాజారావు నాకు పెద్దగా స్నేహితుడు కాదు. కాని అతని గురించి బాగా తెలుసు. చాల మంచివాడు. సహృదయుడు. ఎంతో మర్యాదగా మాట్లాడతాడు. అతని ఒక్కగానొక్క కూతరి జీవితం నాశనం కాకుండ కాపాడగలిగాను. ఆ అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు చాల ఆనందంగా ఉంది"అని ముగించాడు చక్రపాణి.

తరువాత ఇద్దరు గదిలోంచి బయటకు వచ్చారు. అప్పుడే వర్షం వెలిసింది. ఓబలేసు పచ్చజెండపట్టుకుని ఊపాడు. క్షణం తరువాత రైలు మెల్లగా వచ్చి ప్లాట్ ఫారం మీద ఆగింది. అప్పుడే ఒక యువకుడు ఎవరి కోసమో వెతుకుతూ చక్రపాణి వైపు వచ్చాడు. అతనే స్వాతి ప్రియుడని ఆమె కోసమే వాడు వెతుకుతున్నాడని చక్రపాణికి అర్థమైంది. ఈ విషయం చక్రపాణి మాత్రం అతనికి చెప్పలేదు. చెప్పవలసిన అవసరం అతనికి లేదు. వాడే తెలుసుకుని నిరుత్సాహంతో వెళ్ళిపోతాడు

చక్రపాణి ఊహించినట్టుగానే జరిగింది. పదినిమిషాలు ఆ యువకుడు స్టేషన్ అంతా తిరిగాడు. చివరకు నీరసంగా స్టేషన్ లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

## ఊరంతా సందడి

### ఉదయలక్ష్మి ముప్పలనేని

**రఘురామయ్యగారి** మనవరాలికి పెళ్ళిచేయాలనుకుంటున్నారు. సంబంధాలు రెండు మూడు చూసి పెట్టుకున్నారు. నాయనమ్మ నాగరత్నమ్మగారు "ఏమండీ ఈ రోజు గురువారం శాస్త్రిగారి దగ్గరకు వెళ్ళి సంబంధాలు గురించి చెప్పి ఎప్పుడు మంచిరోజులో కనుక్కురండి" అన్నారు.

ఆయనతోపాటు చిన్నాడు పెరట్లో కాసిన గుమ్మడికాయ, చక్కెరకేళీ హస్తంతో బయలుదేరాడు.

"ఇంటికి చిన్న చిన్న మరమ్మత్తు పనులున్నాయి. వడ్డి కోటయ్యకు, అలాగే వడ్రంగి కోటేశ్వరావుకు కూడా కబురు చేయండి. ఆ తర్వాత సున్నాలు, రంగుల పనులు ఉండనే ఉన్నాయి. నాన్న రామారావుకి అన్నీ ఒక్కసారే అయితే ఇబ్బంది" అమ్మ అరుంధతమ్మ చెప్పింది.

ఊళ్ళోకి దూదేకుల బాబావలి సరంజామాతో దిగాడు. అల్లుడికి అమ్మాయికి బూరగదూది పరుపులు కుట్టించాలని అమ్మకోరిక. ఎండిన కాయనుండి దూది వడికి మెత్తటి ఇపరుపులు, దిళ్ళు తయారు చేశాడు బాబావలి. గుండెలనిండా దుమ్ము నింపుకుని పట్టు పరుపులు కుట్టి ఇచ్చిన ఆ కష్టజీవిని ఆ తర్వాత ఎంత ఎత్తు పరుపులమీద పడుకున్నా మరువగలమా!?

సంబంధం ఖాయం అయింది. లగ్నపత్రిక వ్రాసుకుని పసుపు కొట్టటంతో పెళ్ళిపనులు పరుగందుకున్నాయి. "పెళ్ళిపనులు మొదలు పెట్టారా?" అంటూ పచారీ కొట్టు లింగయ్యగారు తాతయ్యగారిని పలకరిస్తూ గేటు తీసుకుని వరండాలోకి వచ్చారు.

"రావయ్యా లింగయ్యా కూర్చో" అంటూ కుర్చీ చూపించారు తాతయ్యగారు.

"మా పెద్దాడు బాపట్లలో హోల్‌సేల్ షాపు పెట్టాడు. పెళ్ళికి పెద్ద ఎత్తున సరుకులు కావాలికదా. నాణ్యమైన సరుకులు మనకోసం ధరలు కూడా చూసి వేస్తాడు. మీతో చెప్దామని వచ్చాను" అన్నారు లింగయ్యగారు.

"అలాగే లేవయ్యా అక్కడే తెప్పిద్దాం" భరోసా ఇచ్చారు తాతయ్యగారు. కాసేపు ఆ సంగతులూ, ఈ సంగతులు మాట్లాడి కాఫీ త్రాగి వెళ్ళారు లింగయ్యగారు.

జాండ్ర పేట నుండి పేరయ్యగారు ఆయన తమ్ముడు వాళ్ళ మగ్గాల మీద నేసిన చీరలు, పంచెలు, పరికిణీలు బట్టల మూటలతో వచ్చారు. ఆ రోజు పెళ్ళింట్లో ఎంతెంత సందడో. ఎవరికి కావలసినవి వాళ్ళు ఎన్నుకోవటం, మళ్ళీ మళ్ళీ చూసుకోవటం. పెళ్ళిబట్టలు, తలంబ్రాల బట్టలు పెళ్ళికి నాలుగురోజుల ముందే నేయించి తీసుకొస్తానని సంతోషంగా బయలుదేరి వెళ్ళారు పేరయ్యగారు.

"రారా భద్రయ్యా నీకే కబురు చేయాలనుకుంటున్నాను. నీవే వచ్చావు" వాకిట్లో చూడగానే సంతోషంతో ఎదురు వచ్చి పలకరించి కూర్చోమన్నారు నాయనమ్మ. "భద్రయ్యా! మేనమామలు నలుగురు మేనకోడలిని ప్రధానం బుట్టలో తీసుకుని రావాలంటున్నారు. బుట్ట చక్కగా అందంగా అల్లించు. అలాగే కాలిగోళ్ళ దగ్గర వడ్లు పోయటం కోసం, వంటదగ్గర కావలసిన జల్లిబుట్టలు కూడా కావాలి అంటూ 'అబ్బాయ్ కావల్సినవి తెప్పించుకోవాలిగా భద్రయ్యకి డబ్బులు తెచ్చివ్వు ' అని చెప్పి" తిను భద్రయ్యా " అంటూ లడ్లు, బూందీ అరటిపళ్ళు తెచ్చిపెట్టారు.

గురువారం మంచిరోజని పందిళ్ళు వేసే సుబ్బారావు తండ్రీ, కొడుకులతో వచ్చి పందిరేసి భోజనాలు చేసి గౌరవంగా ఇంటికెళ్ళారు.

బజారంతా అత్తరు వాసనే. ఇంకేముందు అత్తరు సాయిబుగారు ఊళ్ళోకి వచ్చారు. ఆయన్ని చూడగానే అందరికీ ఒకటే హుషారు. "అత్తరుందా, పన్నీరుందా, ఏ సెంటు ఉంది?" ఎవరికి కావలసినవి వాళ్ళకు, పెళ్ళికి కావలసిన కర్పూరపు దండలు, పూల గుత్తులు, పెళ్ళిదండల ఆర్డరంతా ఆయనకే మరి.

గాజుల రామయ్య మలారం మోసుకుంటూ పచ్చని పందిట్లో కాలుమోపాడు. పండు ముత్తైదువుల నుండి పసిపిల్లలదాకా అందరికీ పండగే. ఎవరికి కావలసిన రంగురంగుల గాజులు వాళ్ళెన్నుకుని చేతులనిండా గాజులేయించుకున్నారు. పెద్దాళ్ళు గాజుల మలారానికి, పెళ్ళికూతురు, మిగతా వాళ్ళు రామయ్య కాళ్ళకు దండం పెట్టుకున్నారు. మనసు నిండిన తృప్తితో నిండుగా దీవించాడు రామయ్య.

చాకలి వెంకన్న, భార్య సరస్వతిని చేతి చలవ అంటూ పెళ్ళి పనుల్లో ముందుపెడుతున్నారు. వెంకన్న వేరే ఊళ్ళల్లో ఉన్న చుట్టాలందరికీ శుభలేఖలు పంచి వచ్చాడు. మగపిల్లాడి పెళ్ళయితే 'ప్రదానం' బాధ్యతంతా వాళ్ళదే మరి.

మంగలి మంగళవాయిద్యాలతో, పసుపు కుంకుమలు కానుకలతో గరిక బుడ్డికోసం బయలుదేరాడు. పెళ్ళిరోజు రానే వచ్చింది. మంగలి శ్రీరాములు వేకువ ఝామున సన్నాయి మేళంతో వచ్చి అందరినీ మేలుకొలుపుతో నిద్రలేపాడు. కుమ్మరి నాగన్న ఇంటికి మంగళవాయిద్యాలతో వెళ్ళి కానుకలిచ్చి గరికబుడ్డి తీసుకొచ్చారు. పెళ్ళి భోజనాలకి అన్నం వండి రాసిపోసి దీపారాధన చేసేది నాగన్న కుటుంబమే.

బాసికాలకు, మంగళసూత్రం, నల్లపూసల కోసం వీరాచారిగారింటికి మేళతాళాలతో, కానుకలతో వెళ్ళి తీసుకొచ్చారు.

కాలగోళ్ళ సమయంలో శ్రీరాములు భార్య వసంతదే పెత్తనమంతా. "నాకు ఎం.ఎల్.ఏ పంచెలు, వసంతకు సిల్క్ చీర తెచ్చారా?" అంటూ కోరికలు.

"మీకు తేకుండా ఉంటామా రాముడూ!" అంటూ నాయనమ్మ.

అంగరంగ వైభవంగా కళ్యాణం కమనీయంగా జరిగింది. సంక్రాంతి నెల పట్టారు. గుళ్ళో ధనుర్మాసం పూజలు, వేకువఝామునే వచ్చే హరిదాసులు. చిన్నారి తల్లి చిట్టి చిట్టి దోసిలిలో బియ్యం పోస్తుంటే వంగి పోయించుకుంటూ ఆయన ఇచ్చే దీవెనలు ఆ పసి మనసుకు జీవితం అంతా గుర్తుపెట్టుకుని ఉండే మంత్రాలే అవి.

బుడబుక్కల వాళ్ళు, గంగిరెద్దుల వాళ్ళు, లంబాడీలు అందరికీ వాకిట్లో నిలేసిన ధాన్యం ఒక బస్తా అయిపోగానే ఇంకోటి ముడి విప్పుతూ పంచిపెడుతున్నారు తాతయ్యగారు.

అవి..బంగారు రోజులు! పెళ్ళి అంటే ఒక సామూహిక సహజీవన సౌందర్యంగా వెలుగొందిన రోజులు..!! కాలచక్రం తిరిగితిరిగి మళ్ళీ ఎప్పటికైనా ఆ రోజులు తిరిగొస్తాయా!?